భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) స్థాపన పదవ వార్షికోత్సవ సంకలనం

# పార్టీ స్థాపనా వార్షికోత్సవాల సందర్భంగా
# కేంద్రకమిటీ ఇచ్చిన సందేశాలు
# (2005-2014)



కేంద్రకమిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# ముందుమాట

సిపిఐ (మావోయిస్టు) పదవ స్థాపనా వార్షికోత్సవాల సందర్భంగా అనేక విలువైన పార్టీ డాక్యుమెంట్లను సంకలితం చేసి తిరిగి ప్రచురించే కృషిలో భాగంగా సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ గత పదేండ్లలో పార్టీ స్థాపనా దినం వార్షికోత్సవాల సందర్భంగా విడుదల చేస్తూ వచ్చిన సందేశాలను ఇక్కడ సంకలితం చేసి పాఠకులకు అందిస్తున్నాం. సెప్టెంబర్ 21న నూతన పార్టీ ఏర్పడినప్పటి నుండి ఈ వార్షికోత్సవాలను ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 21 నుండి ఒక వారంపాటు జరుపుకుంటూ వస్తున్నాం. ఈ సంవత్సరం ఈ వార్షికోత్సవాలు నూతన పార్టీ పదేండ్ల వార్షికోత్సవాలుగా జరుపుకోవడం వల్లే కాక భారతదేశంలోని సిసలైన విప్లవ పార్టీల ఐక్యతను సంపూర్ణం చేస్తూ ఈ ఏడాది మే నెలలో సిపిఐ (మావోయిస్టు), సిపిఐ (ఎం.ఎల్.) నక్సల్బరీల విలీనం వల్ల కూడా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

దేశంలో నలుమూలలా మన పార్టీ యూనిట్లు ఉన్న ప్రతి ఒక్క ప్రాంతంలో పార్టీ స్థాపనా వార్షికోత్సవాలను జరుపుకోవడం అనేది ఒక విప్లవ సందర్భం, సంప్రదాయం. విశాల గ్రామీణ ప్రాంతాల్లోని గెరిల్లా జోన్లు, ఇతర ఉద్యమ ప్రాంతాల్లో గొప్ప విప్లవోత్సాహంతో, స్ఫూర్తితో పార్టీ, పిఎల్‌జిఎ కార్యకర్తలతో పాటు పెద్దెత్తున ప్రజల భాగస్వామ్యంతో దీన్ని జరుపుకోవడమే కాక కారాగారాల్లో ఎర్రజెండానెత్తిపట్టిన రాజకీయ ఖైదీలు కూడా దీన్ని జరుపుకుంటారు. తెల్లబీభత్సం పైచేయిగా వున్న ప్రాంతాల్లో (కొన్ని మైదానాలు, పట్టణ ప్రాంతాల్లోనూ, పార్టీ ఫ్రాక్షన్లు పని చేసే ప్రాంతాల్లోనూ) కూడా దీన్ని అత్యంత రహస్యంగా జరుపుకుంటున్నాం. అయితే ఎలా జరుపుకున్నా, ఎక్కడ జరుపుకున్నా దాని వెనక ఉండే విప్లవ స్ఫూర్తి ఒకటే. తక్షణ లక్ష్యమైన నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించే, అంతిమ లక్ష్యమైన కమ్యూనిజాన్ని స్థాపించే నిజమైన కార్మికవర్గ అగ్రగామిగా పార్టీని నిర్మించడం, అభివృద్ధి చేయడం అనే కర్తవ్యానికి పునరంకితం కావడమే ఈ వార్షికోత్సవాలను జరుపుకోవడం వెనుక ఉన్న ఆ విప్లవ స్ఫూర్తి. అగ్రగామి పార్టీ లేకుండా పీడిత ప్రజలు తమ విముక్తిని సాధించుకోలేరు అనే సందేశాన్ని ఈ సందర్భంగా అత్యంత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతుంది. ఈ సందర్భంగా వెలువరించే కేంద్రకమిటీ సందేశాలు కూడా ఇదే స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి, ఆ లక్ష్యాన్నే నెరవేరుస్తాయి.

ఈ సందేశాలు అవి వెలువడిన ఆయా సంవత్సరాల్లో తక్షణ ప్రాముఖ్యత కలిగి ఉండడమే కాక, వర్తమానంలో కూడా మనకు గొప్ప రాజకీయ, చారిత్రక ప్రాముఖ్యత కలిగి ఉన్నవే. వాటిని పార్టీ కార్యకర్తలను ఉద్దేశించే రాసినప్పటికీ, ఎల్లప్పుడూ కూడా అవి పిఎల్‌జిఎ కీ, విప్లవ ప్రజానీకానికీ కూడా సందేశాలుగానే ఉండినాయి. వాటిని ఎల్లప్పుడూ వారి వరకూ తీసుకెళ్లడం జరిగింది. ఈ

సందేశాలు - పీడిత ప్రజల విముక్తికై తమ ప్రాణాలను అర్పించిన భారత విప్లవ, ప్రపంచ సోషలిస్టు విప్లవ అమరులకు, ప్రత్యేకించి అంతకు ముందటి ఏడాదిలో అమరులైనవారికి అరుణారుణ నివాళిని అర్పిస్తాయి; ఆ ఏడాది కాలంలోని దేశీయ, అంతర్జాతీయ పరిస్థితిని విశ్లేషిస్తాయి, ముందుకొస్తున్న సాధారణ ధోరణులను కూడా గుర్తించి విశ్లేషిస్తాయి; ప్రధానంగా మనం నడుపుతున్న గెరిల్లా యుద్ధాన్ని కేంద్రంగా చేసుకుని ఉద్యమ పరిస్థితిని విశ్లేషిస్తాయి, ఉద్యమ పురోగమనంలోని ఆటుపోట్లను, మలుపులను, మెలికలను, ప్రజాపోరాటాలను, నూతన రాజకీయ అధికారాన్ని స్థాపించడంలో పురోగతిని, ఉద్యమ విస్తరణను, శత్రు నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రతిఘటనను విశ్లేషిస్తాయి; ఆ ఏడాదిలో మనం పొందిన ప్రధాన విజయాలను, వైఫల్యాలను ఎత్తిచూపుతాయి; చివరిగా ఈ విశ్లేషణలన్నిటిపై ఆధారపడి కేంద్ర కర్తవ్యాన్ని, ఇంకొన్ని ముఖ్యమైన కర్తవ్యాలను నెరవేర్చే దిశలో పురోగమించడానికి నెరవేర్చాల్సిన కొన్ని తక్షణ కర్తవ్యాలను రూపొందిస్తాయి.

మనం కొన్ని తీవ్రమైన నష్టాలను పొందినప్పటికీ, 2011 వరకు మన గెరిల్లా యుద్ధం అభివృద్ధి చెందింది, విస్తరించింది. మనం అనేక ప్రజాఉద్యమాలను నిర్మించాం, విస్తరించాం, సల్వాజుడుం, సేంద్ర వంటి అనేక శత్రు విప్లవ ప్రతీఘాతుక  హంతక క్యాంపెయిన్లను, దాడులను ఓడించాం, నూతన రాజకీయ అధికారాన్ని (గ్రామ స్థాయిలో, కొన్ని ప్రాంతాల్లో జిల్లా స్థాయి వరకూ కూడా) నిర్మించాం, స్థాపించాం, దేశవ్యాప్త బహుముఖ శత్రుదాడి అయిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ - 'ప్రజలపై యుద్ధా'న్ని భీషణంగా ప్రతిఘటించాం. అలాగే మన ప్రజాయుద్ధానికీ, ప్రజల ప్రతిఘటనకూ, ఆపరేషన్ గ్రీన్‌హంట్ పట్ల నిరసనలకూ దేశంలోనూ, ప్రపంచ స్థాయిలోనూ మద్దతు పెంపొందింది, సంఘటితపడింది. 2011 తర్వాత నుండి మన ఉద్యమం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికీ పార్టీ, పిఎల్‌జిఎ, ఐక్యసంఘటన రంగాల్లో కృషి చేస్తున్న కామ్రేడ్స్, విప్లవ ప్రజానీకం కూడా దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో చొరవను తిరిగి తమ చేతుల్లోకి తీసుకుని పైచేయి సాధించడానికి నిరంతరం కఠోరంగా శ్రమిస్తూ  విప్లవాన్ని పరిరక్షించడానికీ, శత్రుదాడిని తిప్పికొట్టడానికి కృషి చేస్తున్నారు. ఈ సందేశాలు ఈ పరిణామాలన్నిటినీ నమోదు చేసిన రాజకీయ, చారిత్రక పత్రాలు. ఇవి విషయాలను ఒక చారిత్రక దృష్టితో, ఒక గతితార్కిక క్రమంలో భాగంగా చూడడంలో, అర్థం చేసుకోవడంలో పార్టీ కార్యకర్తలకు, విప్లవ క్యాంపులోని వారికీ, అలాగే మొత్తంగా ప్రజలకూ కూడా దోహదపడతాయి. 'ఏం చేయాలి' అనేదాన్ని అర్థం చేసుకోవడంలో కూడా ఇవి మార్గదర్శకత్వాన్ని అందిస్తాయి.

మన దేశ నిర్దిష్ట పరిస్థితుల్లో నడుస్తున్న, అభివృద్ధి చెందుతున్న దీర్ఘకాలిక ప్రజాయుద్ధ

క్రమాన్ని అర్థం చేసుకోవడానికి ఈ సందేశాలను అధ్యయనం చేయాలని కోరుతున్నాం. దీన్ని నడపడంలో పార్టీ నిర్వహించే అగ్రగామి పాత్రకున్న ప్రాముఖ్యతనూ, అటువంటి పార్టీ లేకుండా మన విముక్తి ఎలా అసాధ్యం అనే విషయాన్నీ అర్థం చేసుకోవడానికి ఈ సందేశాలు దోహదపడితే, దానిలో చేరాలనే లేదా కనీసం దానితో కలిసి నడవాలనే ఉత్తేజాన్ని ఇవి కలిగించగలిగితే, ఈ సంకలనం తన ఉద్దేశాన్ని ఆ మేరకు పరిపూర్తి చేసినట్లేనని భావిస్తున్నాం.

మార్క్సిజం-లెనినిజం-మావోయిజంతో సాయుధమైన పార్టీని, ప్రజల ప్రయోజనాలకు తప్ప మరి దేనికీ ప్రాతినిధ్యం వహించని పార్టీని, ఆ విషయంలో ఎట్టి పరిస్థితిలోనూ రాజీపడని పార్టీని, తన తప్పులు, లోపాల పట్ల అత్యంత ఆత్మవిమర్శనాపూర్వకంగా వుండే పార్టీని ఓడించడం అంత సులభం కాదు. ఈ సందేశాలు పై వాస్తవాన్ని కొట్టొచ్చినట్టుగా ప్రతిబింబించే సాక్ష్యాలు.

భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో దశాబ్దాలపాటు సంస్కరణవాదం, రివిజనిజం రాజ్యమేలాకే ఒక విప్లవకర పార్టీ ఏర్పాటు అనేది మన దేశంలో సాధ్యమయ్యింది, అంటే నక్సల్బరీ వసంత మేఘగర్జన తర్వాతే అది సాధ్యమైంది. ఆ తర్వాత కూడా మన దేశంలోని నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించడానికి ఏకైక మార్గదర్శక కేంద్రం ఏర్పడ్డం అనేది ప్రధానంగా పూర్తయ్యినది 2004లోనే. వేలాదిమంది అమరుల త్యాగాల ఫలితంగా, సైద్ధాంతిక, రాజకీయ పోరాటాల ఫలితంగా, కోట్లాది ప్రజలు చిందించిన చెమట, నెత్తుర్ల ఫలితంగా ఏర్పడిన ఈ అగ్రగామి పార్టీని ఇప్పుడు పాలకవర్గాలు ఎలాగైనా సరే నాశనం చేయాలని కంకణం కట్టుకున్నాయి. తమ బానిస సంకెళ్లను పోగొట్టుకోవడానికి కార్మికవర్గం చేతిలో, పీడిత ప్రజానీకం చేతిలో ఉన్న అత్యంత శాస్త్రీయమైన, అత్యంత సంఘటితమైన, అత్యంత దృఢమైన ఆయుధం అయిన పార్టీని కాపాడుకోవల్సిన ఆవశ్యకతను గుర్తింపజేయడంలో ఈ సందేశాలు కూడా తమ వంతు పాత్రను నిర్వహిస్తాయని ఆశిస్తున్నాం.

***విప్లవాభినందనలతో,***

***కేంద్రకమిటీ,***

***సిపిఐ (మావోయిస్టు)***

*సెప్టెంబర్ 1, 2014*

# విషయసూచిక


| సంవత్సరం | | పేజీ నెం. |
|---|---|---|
| 2005 | ....... | 9 |
| 2006 | ....... | 17 |
| 2007 | ....... | 26 |
| 2008 | ....... | 36 |
| 2009 | ....... | 39 |
| 2010 | ....... | 48 |
| 2011 | ....... | 61 |
| 2012 | ....... | 80 |
| 2013 | ....... | 111 |
| 2014 | ....... | 142 |

# మన మహత్తర పార్టీ అరుణ పతాకాన్ని ఎత్తిపట్టండి!

*సెప్టెంబరు 21వ తేదీ నుంచీ 27వ తేదీ వరకూ*
*ఐక్య పార్టీ ప్రథమ వార్షికోత్సవాన్ని జరపండి!!*

★

**పొలిట్ బ్యూరో**

**భాకపా(మావోయిస్టు)**

**ప్రియమైన కామ్రేడ్స్!**

రానున్న సెప్టెంబరు 21వ తేదీ మన నూతన ఐక్య పార్టీ భాకపా (మావోయిస్టు) ప్రథమ వార్షికోత్సవ దినం. రెండు మావోయిస్టు విప్లవ పార్టీలైన ఎంసీసీఐ, భాకపా(ఎంఎల్)(పీడబ్ల్యు)ల చారిత్రాత్మక విలీనం పూర్తయిన సందర్భం. ప్రతీ సంవత్సరం సెప్టెంబరు 21వ తేదీన పార్టీ వ్యవస్థాపక దినం జరపాలని మన పార్టీ సీసీ(పీ) నిర్ణయించింది. ఈ సంవత్సరం ప్రథమ వార్షికోత్సవ గొప్ప ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని మన యావత్తు పార్టీ, పీఎల్‌జీఏ, విప్లవ ప్రజా సంఘాలూ నూతనంగా ఆవిర్భవిస్తున్న విప్లవ ప్రజా కమిటీలూ, దేశవ్యాప్తంగా విప్లవ ప్రజానీకం సెప్టెంబరు 21వ తేదీ నుంచీ 27వ తేదీ వరకూ వారం రోజుల పాటు విప్లవ స్ఫూర్తితో ఉత్సాహంతో జరపాలి. దేశవ్యాప్తంగా దీనిని పెద్ద సైద్ధాంతిక, రాజకీయ క్యాంపెయిన్‌గా నిర్వహించాలి.

మన పార్టీ ప్రథమ వార్షికోత్సవాల సందర్భంగా మనం మొట్టమొదట చారిత్రాత్మక నక్సల్బరీ సాయుధ వ్యవసాయ విప్లవ తిరుగుబాటుతో ప్రారంభించి, అమరులైన మన గొప్ప పార్టీ, ధైర్యవంతమైన, సాహసోపేతమైన పీఎల్‌జీఏ, విప్లవ ప్రజా సంఘాలు, విప్లవ ప్రజా కమిటీలూ, విప్లవ ప్రజానీకం మొదలయిన వేలాది మహనీయ వీరుల త్యాగాలను ఎత్తిపట్టాలి.

విప్లవ ఆశయం కోసం సంపూర్ణ అంకితత్వం, నిస్వార్థం, కమ్యూనిస్టు విలువలకూ సంస్కృతికీ కట్టుబడి ఉండడానికీ చెదరని పట్టుదల, స్థిరత్వం, ఆదర్శనీయమైన ధైర్యం, అలవాటులలో జీవన శైలిలో నిరాడంబరత, గాఢమైన ప్రేమ, గౌరవం, ప్రజలకు సేవ చేసే తత్వం, కష్టాలను భరించే నిశ్చయం, 'ఏటికి ఎదురీదడం', కఠిన శ్రమ మొదలయిన అద్వితీయ కమ్యూనిస్టు లక్షణాలకు ఈ ధైర్యవంతులైన అమరులందరూ నిదర్శనాలుగా నిలుస్తారు. ప్రతీ అమరవీరునికీ ఉన్న ఈ సాహసం, స్థిరత్వం, నిశ్చయాత్మకత, గట్టి సైద్ధాంతిక రాజకీయ నిబద్ధతా, పీడిత ప్రజల పట్లా పార్టీ పట్లా విప్లవం పట్లా విధేయతా వంటి ఆదర్శవంతమైన విప్లవ ఆదర్శాలను మనం ఎత్తిపట్టాలి. వాటిని కొనసాగిస్తామని ప్రతిన పూనాలి.

ఈ మహత్తర సందర్భంగా నూతన ప్రజస్వామ్యం, సోషలిజం, కమ్యూనిజాలు సాధించడం కోసం దీర్ఘకాలిక ప్రజాయుద్ధ కఠిన మార్గం గూండా సాగుతున్న మన ఐక్య పార్టీ చరిత్రను గుర్తు చేసుకుందాం. దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేద్దాం. రెండు మహా ప్రవంతుల ఐక్య పార్టీ భాకపా(ఎంఎల్), ఎంసీసీఐల ఐక్య పార్టీ చరిత్రను మనం 1960వ దశకంలో అనంత కాలంగా ఉన్న రివిజనిజంతో ఘర్షణ జరిగిన కల్లోల కాలంలో మన గొప్ప ప్రియతమ నాయకులు కామ్రేడ్స్ సీఎం, కేసీల నాయకత్వంలో అవి పుట్టిన నాటి నుంచీ పరిశీలించాలి. విలీనానికి ముందు 35 సంవత్సరాలుగా భారత విప్లవంలో ఈ రెండు మావోయిస్టు ప్రవంతులూ నక్సల్బరీ విప్లవ పంథాను ఎత్తిపట్టడమే కాకుండా, సిద్ధాంతాన్ని నిర్దిష్టంగా అన్వయించడం ద్వారానూ విప్లవోద్యమాన్ని పురోగమింపజేయడంలో పొందిన గొప్ప అనుభవం ద్వారానూ

ఎలా సుసంపన్నమయ్యాయో మనం వివరించాలి. ప్రారంభం నుంచీ ఈ రెండు మునుపటి పార్టీలూ భూమి, రాజకీయాధికారాలు గుంజుకోవడం కోసం ఎలా పోరాటం చేసాయో, పీఎల్‌జీఏ ఏర్పాటుకు, గెరిల్లా జోన్‌లు బేస్ ఏరియాలుగా మారే క్రమానికీ ఉన్న ప్రాధాన్యతను వివరించాలి.

సన్నిహిత పరిచయం, లోతైన చర్చా, అధ్యయనం, అపారమైన ఓపిక, పరిపక్వతల క్రమంలో సుదీర్ఘ కాలం తరువాత ఎంసీసీఐ, భాకపా(ఎంఎల్)(పీపుల్స్‌వార్)ల మధ్య ఐక్యత సాధించాం. ఈ క్రమంలో ఈ రెండు పార్టీల మధ్యా కొద్ది కాలం పాటు ఉన్న చెడిపోయిన సంబంధాల 'చీకటి అధ్యాయా'న్ని అధిగమించింది. కానీ ఎంఎల్ఎం పునాదిగా చేసుకున్న ప్రజలలో చేసుకున్న నిర్మొహమాట, నిజాయితీ స్వయం విమర్శ నిజమైన విప్లవకారుల ఐక్యతా కోరిక పరిపూర్తి కావడానికి మార్గం వేసింది. ఎంఎల్ఎం గైడెన్సు, వర్గ పోరాటంలో వేలాది మంది అమరుల నిస్వార్థ గెరిల్లా యోధులా పార్టీ శ్రేణులా కార్యకర్తలా వేలాది మంది ప్రజా సంఘాల నాయకులా సభ్యులా నెత్తురూ చెమటల ద్వారా సాధించిన త్యాగాల ద్వారా పొందిన సంపన్న విప్లవ అనుభవాన్ని సంశ్లేషణల పునాదిగా ఈ ఐక్యత సాధించాం.

ఈ ఐక్యతతో నిజమైన కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యతలో గుణాత్మక ముందంజ వచ్చింది. అలాగే నిజమైన విప్లవకారులకీ బూటకపు వాటికీ మధ్య స్పష్టమైన తేడాను ముందుకు తెచ్చింది. విప్లవ ప్రజానీకం, మన పార్టీలోనే కాక వివిధ ఎంఎల్ సంఘాల కేడర్ ఈ ఐక్యతను ఉత్సాహంగా ఎత్తిపట్టారు. గడచిన పది నెలలలో కొన్ని నిజమైన మావోయిస్టు శక్తులు వ్యక్తిగతంగా కానీ గ్రూపుగా గానీ ఐక్య పార్టీ భాకపా(మావోయిస్టు)లో చేరారు.

రెండు మావోయిస్టు పార్టీల ఐక్యత దేశంలో పీడిత ప్రజల మీదనూ వివిధ విప్లవ శక్తుల మీదనూ అపారమైన ప్రభావం వేసింది. ఇప్పుడు పార్టీ నిర్మాణం దేశంలో ఆ చివర తూర్పున అస్సాం నుంచీ పశ్చిమాన గుజరాత్ వరకూ, పంజాబ్ నుంచీ ఈ చివర దక్షిణాన కేరళ వరకూ వ్యాపించింది. కొన్ని రాష్ట్రాలలో బలహీనంగా ఉన్నప్పటికీ దాదాపు ప్రతీ రాష్ట్రంలోనూ మనం పని చేస్తున్నాం. రెండు పార్టీల విలీనం వల్ల ముఖ్యంగా జార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, చత్తీస్‌గఢ్, పంజాబ్, కేరళలలో మన నిర్మాణం బలపడింది.

విలీనం తరువాత సంవత్సరం మన ప్రజాయుద్ధంలో గొప్ప పరిణామాలు జరిగాయి. మన పీఎల్‌జీఏ, విప్లవ ప్రజానీకపు వీరోచిత సాయుధ ప్రతిఘటన దేశం మొత్తానికి వ్యాపించింది. బీహార్, జార్ఖండ్‌లలో ఈ సంవత్సరం ఫిబ్రవరిలో శాసనసభ ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌లో శత్రు బలగాల మీద సాయుధ గెరిల్లా దాడులు, 38 మంది సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసు సిబ్బందిని తుడిచిపెట్టి, 110 మందిని పైగా గాయపరిచిన డీకేలో 2005 ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో ఎత్తుగడల ప్రతిదాడి క్యాంపెయిన్, 19 మంది పోలీసులను తుడిచిపెట్టిన ఉత్తరప్రదేశ్ చందౌలీ ఆంబుష్, బీహార్‌లో మున్‌గైర్ జిల్లా ఎస్‌పీ నిర్మూలనా, దండకారణ్యం, జార్ఖండ్, బీహార్, ఏపీ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్‌లలో అనేక ఆంబుష్‌లు, రెయిడ్‌లూ రెండు పార్టీలా రెండు గెరిలా సైన్యాలా విలీనం తరువాత పెరిగిన పీఎల్‌జీఏ

పోరాట శక్తిని తెలియజేస్తున్నాయి.

మన ఐక్య పార్టీ నాయకత్వం కింద పీడిత ప్రజలు కొన్ని పోరాట ప్రాంతాలలోనూ నూతన ప్రాంతాలలోనూ పెద్ద ఎత్తున విప్లవోద్యమంలో చేరుతున్నారు. పార్టీ, ప్రజా సైన్యం, ప్రజా సంఘాలూ మరింత సంఘటితమయాయి. పాత సామాజిక వ్యవస్థ, ప్రతీఘాతక పాలక వర్గాలు, వారి క్రూర సాయుధ పోలీసు, పారా మిలిటరీ బలగాలకు వ్యతిరేకంగా విప్లవ గెరిల్లా యుద్ధం మరింత తీవ్రతరమయ్యింది. ప్రజా ప్రభుత్వ అంగాలు, బీజ రూపంలో ఉన్న విప్లవ ప్రజా కమిటీలూ గ్రామ స్థాయి నుంచీ ఏరియా స్థాయి వరకూ ఆవిర్భవిస్తున్నాయి. విప్లవ ప్రజలు తమ ప్రతినిధులను నేరుగా ఎన్నుకుంటున్నాయి. జీజెడ్‌లకు కేంద్ర అంశాలైన గెరిల్లా బేస్‌లు ఉనికిలోకి వస్తున్నాయి. వేలాది మంది పీడిత ప్రజలు సంఘటితమవుతున్నారు. ప్రజా మిలీషియా రూపంలో సాయుధమవుతున్నారు. జరుగుతున్న విప్లవ గెరిల్లా యుద్ధంలో వారి పాత్రా యుద్ధ ఆపరేషన్‌లూ పెరుగుతున్నాయి. పీఎల్‌జీఏలో ఉన్నత నిర్మాణాలు ఏర్పరుస్తున్నాం. వాటిని తీవ్రతరం చేసి మరింతగా విస్తరిస్తున్నాం.

మన పార్టీ శత్రువుకు వ్యతిరేకంగా రాజకీయ దాడి కూడా చేపట్టింది. బలమైన సామ్రాజ్యవాద, నిర్బంధ ఉద్యమాన్ని నిర్మించడానికి కృషి చేస్తున్నది. ఇప్పుడు మనం నిజంగా అఖిల భారత స్వభావం ఉన్న ప్రజా సంఘాలను నిర్మించే స్థితిలో ఉన్నాం. అఖిల భారత స్థాయిలో ఐక్య సంఘటన నిర్మించే దిశగా సాగుతున్నాం.

నూతన పార్టీ అంతర్గత భద్రతకూ దేశ ఐక్యతా సమైక్యతలకూ పెద్ద ప్రమాదం తీసుకువస్తుందనీ నేపాల్ నుంచీ దక్షిణాన కేరళ వరకూ వ్యాపించే ఎర్ర నడవ (రెడ్ కారిడార్)ను అణిచివేయడానికి అన్ని రకాలుగానూ చర్యలు తీసుకోవాలనీ పాలక వర్గాలు కాకి గోల చేస్తున్నాయి. విలీనం ప్రభావం వాటి మీద మరింత ఎక్కువగా ఉంది. కేంద్ర హోం శాఖ మంత్రి, హోం శాఖ కార్యదర్శి, ముఖ్య మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ ముఖ్యులు, పారా మిలిటరీ అధిపతులు, డీజీపీలు, 13 రాష్ట్రాల హోం, ముఖ్య కార్యదర్శులూ ఒక దాని తరువాత ఒక సమావేశం జరుపుతూ, భాకపా(మావోయిస్టు) నడుపుతున్న ప్రజాయుద్ధాన్ని అణిచివేయడానికి పథకాలు రూపొందిస్తున్నాయి.

**కామ్రేడ్స్!**

దేశంలో నేటి పరిస్థితి దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడానికి అనుకూలంగా ఉంది. ఏ రంగంలోనైనా తీవ్ర సంక్షోభం నుంచీ బయటపడడం సామ్రాజ్యవాదానికి సాధ్యం కావడం లేదు. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లకూ ఇతర దేశాలకూ వ్యతిరేకంగా క్రూర దురాక్రమణ చేసినందుకు అమెరికా సామ్రాజ్యవాదులు పపంచవ్యాప్తంగా పీడిత ప్రజల ఆగ్రహాన్ని సంపాదించుకున్నారు. ముఖ్యంగా ఆక్రమిత దేశాలలో ప్రజల నిరంతర వీరోచిత ప్రతిఘటన అమెరికా సామ్రాజ్యవాదులను కుదిపిస్తున్నది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్త క్యాంపెయిన్ పేరుతో అమెరికా సామ్రాజ్యవాదులు మావోయిస్టు విప్లవోద్యమాల మీదనూ జాతీయ విముక్తి ఉద్యమాల మీదనూ అన్ని సామ్రాజ్యవాద శక్తులకు

వ్యతిరేకంగానూ దాడులు ప్రారంభించారు. ప్రపంచవ్యాప్త సామ్రాజ్యవాద దాడిలో భాగంగా ఇటీవల బుష్ ప్రభుత్వం నూతనంగా ఏర్పడిన మన పార్టీనీ ఉల్ఫానూ ఉగ్రవాద సంస్థల పట్టికలో చేర్చింది.

భారతదేశంలో కూడా శత్రు దాడి పెరుగుతున్నది. మరింత క్రూరంగా తయారవుతున్నది. కాంగ్రెస్ నాయకత్వంలో యూపీఏ ప్రభుత్వం బహుముఖ దాడి ప్రకటించింది. భాకపా(మావోయిస్టు) ఏర్పాటు తరువాత దేశవ్యాప్తంగా సమన్వయంతో దాడిని తీవ్రతరం చేసింది. మనం శత్రు బలగాలను ఎదుర్కొంటూనే మన కార్యక్రమాలను కొనసాగించాలి. ప్రజలను రాజకీయంగా సమీకరించి విస్తృతంగా సృజనాత్మకంగా సంఘటితం చేయాలి. రహస్య పార్టీ, గెరిల్లా యుద్ధ పద్ధతులను అనుసరించాలి. ఉద్యమ నిర్మాణంలో మన బలగాలను పరిరక్షించుకోవడం చాలా ముఖ్యం, శత్రు బలగాలను విధ్వంసం చేయాలి. ఇతర కార్యక్రమాన్ని కొనసాగించాలి.

అన్ని ప్రధాన నగరాలలోనూ శత్రువుకు అత్యంత ఆధునిక నక్సల్ వ్యతిరేక విభాగాల వ్యవస్థ ఉన్నది. శత్రు ఇంటెలిజెన్స్ వ్యవస్థనూ ఇన్‌ఫార్మర్ల వ్యవస్థనూ నిరంతరం మెరుగుపరుస్తున్నారు. వివిధ రాష్ట్రాల స్పెషల్ నక్సల్ వ్యతిరేక పోలీసు బలగాలకూ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలకూ సమన్వయం మెరుగైంది. విప్లవ నాయకత్వాన్ని ధ్వంసం చేయడానికి పాలక వర్గాలు గట్టిగా కృషి చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక పథకాలు రూపొందిస్తున్నారు. మనం శత్రు ఎత్తుగడలనూ వనరులనూ సామర్థ్యాలనూ తక్కువ అంచనా వేయకూడదు. వాడి చర్యలన్నింటినీ తీవ్రంగా తీసుకోవాలి.

శత్రువు దాడినీ నిర్బంధాన్ని రెట్టింపు చేసాడు. మన యథాలాప వైఖరీ సాంకేతిక పొరపాటులు ఇందుకు తోడై మనం ఇటీవలి కాలంలో తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాం. శత్రు క్రూర స్వభావాన్నీ మనకు వ్యతిరేకంగా చేసే దాడిలో ప్రతీ అవకాశాన్నీ వినియోగించుకుంటారనే విషయాన్నీ మనం ఒక్క క్షణం కూడా మరువకూడదు. అందుకని మనం శత్రు దాడిని ఎదుర్కొనే ఎత్తుగడలనూ పని తీరునూ యంత్రాంగాన్నీ పెంపొందించుకోవాలి. మన పొరపాటులనూ లూజెనెస్‌నూ సరిదిద్దుకోవాలి.

**తక్షణ కర్తవ్యాలు**

**1.** శత్రు బలగాలను ధ్వంసం చేయండి - జరుగుతున్న ప్రజాయుద్ధం మీద శత్రువు దేశవ్యాప్తంగా సమన్వయంతో చేస్తున్న దాడిని ఓడించడానికి విశాల ప్రజానీకాన్ని వివిధ మార్గాలలో శత్రువుకు వ్యతిరేకంగా సమీకరించాలి. శత్రు బలగాలను ముక్కలు ముక్కలుగా ధ్వంసం చేయాలి. అనుకూల విప్లవ పరిస్థితిని సాయుధ పోరాట ప్రాంతాలను విస్తరించాలి. విప్లవ గెరిల్లా యుద్ధాన్ని దేశంలో నూతన ప్రాంతాలకు విస్తరించాలి. ఇది మన మొట్టమొదటి కర్తవ్యం. మనం ఈ కర్తవ్యాన్ని నిర్వహిస్తూనే మన బలాన్ని రక్షించుకోవాలి. పెంపొందించుకోవాలి. పీఎల్‌జీఏను పీఎల్ఏగా మార్చడానికీ వ్యూహాత్మక ప్రాంతాలలో బేస్ ఏరియాలను నెలకొల్పడానికీ కృషి చేయాలి.

**2.** ప్రజా వ్యతిరేక రాజ్య విధానాలకూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజా రాజకీయ ఉద్యమాలు నిర్మించాలి - ప్రతీ ప్రజా వ్యతిరేక రాజ్య విధానానికీ పాలక వర్గాల, సామ్రాజ్యవాద దోపిడీ పీడనలకూ

వ్యతిరేకంగా విశాల ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి. హిందుత్వ ఫాసిస్టు శక్తులకూ మొదలయిన వాటికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్మించాలి. ఇందుకోసం మనం మన ప్రజా సంఘాలను విస్తరించి సంఘటితం చేయడం ద్వారానూ బలమైన విశాలమైన అఖిల భారత ప్రజా ఉద్యమాన్ని నిర్మించడం ద్వారానూ ప్రజా పునాదిని పటిష్టం చేసి, విస్తరించాలి. ఈ పని చేస్తూ, ఐక్యం కాగలిగిన రాజకీయ, సామాజిక శక్తులను ఐక్యం చేయాలి. తద్వారా బలమైన ఐక్య సంఘటన నిర్మాణానికి బలమైన పునాది వేయాలి.

**3.** పార్టీ వ్యాప్తంగా ఆలోచనలలో పట్టుదలలోనూ ఆచరణలలో ఐక్యత సాధించండి - మునుపటి పార్టీల మౌలిక డాక్యుమెంటులూ విలీనం పూర్తి అయినప్పటికీ మూడు దశాబ్దాలు విడిగా ఉండడం వల్లనూ వేర్వేరుగా ఆచరణలో ఉండడం వల్లనూ కొన్ని సూత్రాలు, పదాల వాడుక, కొన్ని నిర్మాణ పద్ధతులూ మొదలయిన వాటిలో రెండు పార్టీల శ్రేణులలో కొద్దిపాటి తేడాలు ఉన్నాయి. అందుకని యావత్తు పార్టీలో వివిధ కమిటీలు, పీఎంలలో క్షుణ్ణమైన బోధనను చేపట్టి ఆలోచనా పట్టుదలా ఆచరణలలో ఐక్యత సాధించడం చాలా అవసరం. అలాగే పార్టీలో కార్మికవర్గేతర ధోరణులు, ఇతర బలహీనతలను మావోయిస్టు పద్ధతీ అవగాహనల పునాదిగా గుర్తించి సరిదిద్దుకోవడం అవసరం. మనం పార్టీ కమిటీలను పటిష్టం చేసి ప్రాథమిక స్థాయిలో పార్టీ యూనిట్లను విస్తృతంగా నిర్మించాలి.

**4.** బలహీనతలూ లోపాలను అధిగమించడం ద్వారా మన రహస్య యంత్రాంగాన్నీ పని తీరునూ పటిష్టం చేయండి - శత్రువు దేశ వ్యాప్తంగా చేపట్టిన దాడి, మన పార్టీని, ముఖ్యంగా నాయకత్వాన్ని ధ్వంసం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలూ దృష్టిలో ఉంచుకుని మనం తక్షణం మన టెక్ యంత్రాంగంలోనూ పని పద్ధతులలోనూ బలహీనతలను వదిలించుకోవడానికి అన్ని రకాల కృషి చేయాలి. రహస్య పార్టీ యంత్రాంగాన్ని పటిష్టం చేయాలి. నూతన పరిస్థితి అనుగుణంగా నూతన పద్ధతులను అవలంబించాలి.

### వారోత్సవాల నిర్దిష్ట కార్యక్రమం

**1.** ఎంఎల్ఎం, పార్టీ రాజకీయ సైద్ధాంతిక పంథా, విధానాలు, మన పార్టీ, విప్లవోద్యమ చారిత్రాత్మక మలుపులు, భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయాలను, అమరులు కలలు కన్న ఆశయాలు, లక్ష్యాలు, వారి అమూల్యమైన త్యాగాలు, వారి ఆదర్శవంతమైన జీవితాలు, పాటించిన ఉన్నత కమ్యూనిస్టు విలువలను ఎత్తిపడుతూ విస్తృతంగా ప్రచార క్యాంపెయిన్ చేపట్టండి. అందుబాటులో ఉన్న అన్ని మార్గాలనూ మనం వినియోగించాలి. పార్టీ ప్రథమ వార్షికోత్సవాల గురించి జిల్లా/జోనల్ స్థాయిలలో పత్రికా ప్రకటనలు ఇవ్వాలి. రాష్ట్ర స్థాయి కమిటీలు ఇంచర్వ్యూలు ఇవ్వవచ్చు. అయితే అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. కరపత్రాలు, పోస్టర్లు, గోడరాతలూ విస్తృతంగా చేపట్టాలి. మనకు బలం ఉన్న ప్రాంతాలలో బానర్లు పెట్టాలి. ఇతర ప్రాంతాలలో కూడా బానర్లు పెట్టాలి. కానీ కచ్చితంగా రహస్య పద్ధతులు పాటించాలి. అవకాశం ఉన్న చోటనల్లా బెలూన్లు పెట్టాలి.

**2.** మన ప్రకటనలూ, కరపత్రాలు, పోస్టర్లు, బానర్లు, ఇంటర్వ్యూలు, సభలు మొదలయిన

వాటన్నింటిలో మన పార్టీ వ్యవస్థాపక సభ్యులిద్దరి మీదనూ ప్రత్యేకంగా కేంద్రీకరించాలి. వారి జీవితాల గురించీ వారు చేసిన దోహదం గురించీ క్లుప్తంగా ఉపోద్ఘాతం ఇవ్వాలి. కామ్రేడ్స్ సీఎం, కేసీల ఫోటోలూ ప్రచారంలో అన్నింటిలోనూ చేర్చాలి. ఈ నాయకులు వేసిన మార్గంలో సాగమని ప్రజలకు పిలుపు ఇవ్వాలి.

**3.** సభలు రహస్యంగానూ బహిరంగంగానూ నిర్వహించాలి. సాధారణంగా మన సాయుధ పోరాటం జరుగుతున్న ప్రాంతాలలో ఇవి రహస్యంగా నిర్వహిస్తాం. కానీ మన సాయుధ పోరాటం ఇంకా ప్రారంభ దశలో ఉన్న పట్టణ, ఇతర ప్రాంతాలలో సాధ్యమయినంత వరకూ బహిరంగ సభలు నిర్వహించాలి. అవి బహిరంగం అయినా రహస్యం అయినా పోలీసులూ పారా మిలిటరీ బలగాలూ మన సభలు జరగకుండా ఆటంకపరచాలని ప్రయత్నిస్తే ఎదుర్కోవడానికి మనం సాయుధ మిలీషియానూ పీఎల్‌జీఏ బలగాలనూ సిద్ధం చేయాలి. పార్టీ ప్రథమ వార్షికోత్సవాల సందర్భంగా పోలీసులు, ప్రత్యేక బలగాలు, పారా మిలిటరీ బలగాలూ మన ఉత్సవాలను ఆటంకపరిచి నివారించడానికి కూంబింగు ఆపరేషన్‌లు నిర్వహించవచ్చు. మనలను ఆటంకపరచడానికీ నష్టం కలిగించడానికీ వచ్చే శత్రు బలగాలను ఆపడానికి మన పీఎల్‌జీఏ బలగాలలో కొంత భాగాన్ని నియమించాలి. బహిరంగ సభలకు సంబంధించినంత వరకూ శత్రు అణిచివేతను ప్రతిఘటించడానికి ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించాలి. మహిళలనూ పిల్లలనూ వృద్ధులనూ రాజ్య వ్యతిరేక ప్రదర్శనలలో అగ్రభాగంలో ఉంచాలి.

**4.** రహస్యంగానూ బహిరంగంగానూ ఊరేగింపులూ కాగడా ప్రదర్శనలూ ఇతర సృజనాత్మక రకాల ప్రజా సమావేశాలూ ప్రచార పద్ధతులూ చేపట్టాలి.

**5.** రాష్ట్ర/స్పెషల్ ఏరియా/స్పెషల్ జోనల్ స్థాయిలలో పుస్తకాలు ప్రచురించాలి. నక్సల్బరీ కాలం నుంచీ విప్లవోద్యమ చరిత్ర మీద విస్తృత సాహిత్యం ఉంది. ఇది మునుపటి భాకపా(ఎంఎల్)(పీడబ్ల్యు), ఎంసీసీఐల పుస్తకాల రూపంలో ఉంది. దీన్ని పుస్తకాలు, వ్యాసాల రూపంలో వివిధ భాషల పత్రికలలో ప్రచురించవచ్చు. వీటిలో కొన్నింటిని నూతన పార్టీ పేరు మీద పునర్ముద్రించవచ్చు. కొత్తగా రాసిన ఇతర పుస్తకాలు కూడా ప్రచురించవచ్చు.

ఆఖరి శ్వాస వరకూ కమ్యూనిజం ఆశయం కోసం పోరాడతామనీ మన అమరులు ప్రాణాలు ఇచ్చిన ఆశయాన్ని ఎత్తిపడతామనీ సంబంధిత యూనిట్లలో ప్రతిన పూనేందుకు మన పార్టీ సభ్యులు, సెల్స్, పీఎల్‌జీఏ, విప్లవ ప్రజా కమిటీలు ప్రజా సంఘాలను ప్రోత్సహించాలి. ప్రతిన పూనడం నూతన స్ఫూర్తిని ఇస్తుంది. శత్రు దాడిని గొప్ప ధైర్యంతో ఓడించి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేసి, ఆ తరువాత సోషలిజం, కమ్యూనిజాన్ని నిర్మించడానికి మన నిశ్చయాన్ని పటిష్టం చేస్తుంది.

**కామ్రేడ్స్,**

అందుకని పార్టీ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాలను జరిపేటప్పుడు మనం మన పనికి ఉన్న దీర్ఘకాలిక పర్స్‌పెక్టివ్‌ను, శత్రు దాడి తీవ్రతనూ నిర్దిష్ట స్థానిక పరిస్థితులనూ దృష్టిలో ఉంచుకోవాలి.

గొప్ప విప్లవ స్ఫూర్తితోనూ ఉత్తేజంతోనూ పార్టీ ప్రథమ వార్షికోత్సవాన్ని జరుపుకుందాం!

ప్రజాయుద్ధాన్ని మరింత తీవ్రతరం చేస్తామనీ విస్తరిస్తామనీ శత్రు బలగాలను గెరిల్లా యుద్ధం ద్వారా ముక్కలు ముక్కలుగా ధ్వంసం చేస్తామనీ పీఎల్‌జీఏను పీఎల్‌ఏగా ఎదిగిస్తామనీ బేస్ ఏరియాలను నెలకొల్పుతామనీ ప్రతిన పూనుదాం!

సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాలను మన దేశం నుంచీ ప్రపంచవ్యాప్తంగా ప్రతీఘాతకులందరినీ నిర్మూలించడం ద్వారా నిజమైన జనతా ప్రజాస్వామ్యం, సోషలిజం కమ్యూనిజాలను నెలకొల్పేందుకు అమరుల కన్న కలలను నెరవేర్చేందుకు చివరి వరకూ పోరాడతామనీ విప్లవ ప్రతిన పూనుదాం!

శత్రు దాడిని వీరోచితంగా ఎదుర్కోవడానికీ శత్రువుకు వ్యతిరేకంగా జరిగే ఈ బహుముఖ, రక్తపాత వర్గ యుద్ధంలో అన్ని కష్టాలనూ అధిగమించడానికీ యావత్తు పార్టీనీ ధైర్యవంతులయిన యోధులనూ పీఎల్‌జీఏ కమాండర్లు, విశాల ప్రజానీకాన్ని మలచడానికి పార్టీ ప్రథమ వార్షికోత్సవాన్ని సైద్ధాంతిక రాజకీయ బోధనగా విజయవంతంగా నిర్వహిద్దాం!

ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేసి, దేశవ్యాప్తంగా విస్తరించడం ద్వారానూ పీఎల్‌జీఏను పీఎల్‌ఏగా ఎదిగించడం ద్వారానూ బేస్ ఏరియాలను నెలకొల్పడం ద్వారానూ పార్టీ లక్ష్యాలను సాధించడానికి పార్టీని ఎత్తిపడదాం. కాపాడుకుందాం. ముందుకు సాగుదాం!

*** మార్క్సిజం లెనినిజం మావోయిజం వర్ధిల్లాలి!**

*** భాకపా(మావోయిస్టు) వర్ధిల్లాలి!**

*** ప్రియతమ అమరులు కామ్రేడ్స్ సీఎం, కేసీలకు ఎర్రదండాలు!**

*** మహత్తర ప్రపంచ కార్మికవర్గ విప్లవం వర్ధిల్లాలి!**

*** నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!**

*** విప్లవ ప్రజా కమిటీలు వర్ధిల్లాలి!**

*** పీఎల్‌జీఏను పీఎల్‌ఏగా పెంపొందించండి!**

*** గెరిల్లా జోన్‌లను బేస్ ఏరియాలుగా ఎదిగించండి!**

*** సకల దేశాల కార్మికులారా ఐక్యం కండి!**

*** సామ్రాజ్యవాదం నశించాలి!**

*** అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి!**

**జ అన్ని రకాల రివిజనిజం నశించాలి!**

**పొలిట్ బ్యూరో**

**2005 జూలై 20** **భాకపా(మావోయిస్టు)**



## పార్టీ ప్రతిష్ఠాత్మకమయిన ఎర్ర జెండాను ఎత్తిపడదాం విప్లవ ప్రజా ఉద్యమాన్నీ వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధాన్నీ వేగంగా పురోగమింపజేద్దాం!

*సెప్టెంబర్ 21 నుంచీ 27వ తేదీ వరకూ పార్టీ వ్యవస్థాపక*
*రెండో వార్షికోత్సవాన్ని జరుపుకుందాం*

★

**పొలిట్ బ్యూరో**
**భాకపా(మావోయిస్టు)**

# పార్టీ ప్రతిష్టాత్మకమయిన ఎర్ర జెండాను ఎత్తిపడదాం

# విప్లవ ప్రజా ఉద్యమాన్నీ, వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధాన్నీ వేగంగా పురోగమింపజేద్దాం!

## సెప్టెంబర్ 21 నుంచీ 27వ తేదీ వరకూ పార్టీ వ్యవస్థాపక రెండో వార్షికోత్సవాన్ని జరుపుకుందాం

**ప్రియమయిన కామ్రేడ్స్**

మరణశయ్య మీద ఉన్న ప్రపంచ సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ లోతయిన సంక్షోభంలో ఇరుక్కుపోయి, తీవ్రమయిన రాజకీయ కల్లోలం ఎదుర్కొంటున్న సమయంలో రెండు మునుపటి మావోయిస్టు పార్టీలూ, ప్రజా గెరిల్లా సైన్యాలూ 2004 సెప్టెంబరు 21వ తేదీన విలీనమై, భాకపా(మావోయిస్టు)గా ఆవిర్భవించడం, పీఎల్‌జీఏ ఏర్పాటు కావడం ఒక చరిత్రాత్మక ఘటన. మన పార్టీ మూడో వ్యవస్థాపక దినం రాబోతున్నది. ఈ రెండు సంవత్సరాల కాలంలో, వేగంగా మారుతున్న అంతర్జాతీయ, జాతీయ పరిస్థితిలో మన పార్టీ తనకంటూ ఒక ముఖ్యమయిన స్థానం సంపాదించుకుంది. ప్రపంచంలో దోపిడీకి గురవుతున్న పీడిత జాతులూ, ప్రజలకూ సామ్రాజ్యవాదంతో ఉన్న ప్రధాన వైరుధ్యంలో మన పార్టీ ప్రముఖ పాత్ర వహించాలి.

ఇవాళ, సామ్రాజ్యవాద ముఠా నాయకి - అమెరికా సామ్రాజ్యవాదం, ఇతర సామ్రాజ్యవాద శక్తులు, వారి వివిధ దళారీ రాజకీయ పార్టీలు, నిరంకుశత్వం, భూస్వామ్య శక్తులూ మనలను దేశంలో తమ ప్రయోజనాలకు అతి పెద్ద ముప్పుగా చూస్తాయి. ఇది ఆశ్చర్యకరమయినదా. లేదు. ఎంత మాత్రం కాదు. తమ దేశానికి ప్రమాదం ఉన్నదన్న పేరుతో ఏ దేశం మీదనైనా అహంకారంతో దాడి చేసే ఫాసిస్టు అమెరికా సామ్రాజ్యవాదం మన పార్టీని ఉగ్రవాద పట్టికలో చేర్చింది. జమ్మూ కాశ్మీర్ ఉద్యమం కంటే మనం దేశం భద్రతకు అతి పెద్ద సమస్య అని భారతదేశంలో యూనైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) నేతృత్వంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మనలను అణిచివేయడానికి అమెరికా సామ్రాజ్యవాదం భారత ప్రభుత్వానికి అన్ని రకాల రాజకీయ సైనిక మద్దతూ అందిస్తున్నది. వివిధ రకాల సంయుక్త సైనిక చర్యలు, భారత పోలీసు, సైనిక బలగాలకు విప్లవ గెరిల్లా యుద్ధాన్ని ఎదుర్కోవడానికి ప్రత్యేకించిన విప్లవ ప్రతీఘాతుక శిక్షణ ఇవ్వడం, ఢిల్లీలో ఎఫ్‌బీఐ (అమెరికా నిఘా యంత్రాంగం) కార్యాలయాన్ని ప్రారంభించడం, భారత్ - అమెరికా అణు ఒప్పందం మొదలయిన అనేక ఇతర ఒప్పందాలు - ఇవన్నీ నేటి పచ్చి వాస్తవాలు.

మన ప్రజా యుద్ధాన్ని అణిచిపెట్టడానికి కేంద్రం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలూ జాయింట్ ఆపరేషనల్ కమాండ్ (జేఓసీ) ఆధ్వర్యంలో ఒక సంయుక్త టాస్క్ ఫోర్స్ నెలకొల్పారు. మన

మీద వారి నిర్బంధ యంత్రాంగాన్ని పూర్తిగా ప్రయోగించారు. ఇటువంటి చర్యలెన్ని చేపట్టినప్పటికీ నిస్సహాయులై, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసు బలగాల బెటాలియన్‌లను, సీఆర్‌పీఎఫ్‌నూ పెద్ద ఎత్తున పెంచడానికి పథకాలు రూపొందిస్తున్నాయి. ఈ బలగాలకు ఆధునిక ఆయుధాలు, పేలుడు పదార్థాలు, లాంఛర్‌లూ, మైన్ ప్రూఫ్ వాహనాలు, మానవ రహిత విమానాలూ మొదలయినవి అందిస్తున్నారు. మావోయిస్టు ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి శత్రు నిఘా యంత్రాంగం గ్రామీణ ప్రాంతం నుంచీ నగరాలకు, రాష్ట్రాల రాజధానుల నుంచీ ఢిల్లీకీ అలాగే వాషింగ్టన్‌కూ విస్తరిస్తున్నది. పథకం ప్రకారం ఇన్‌ఫార్మర్ వ్యవస్థను విస్తరిస్తున్నారు. పార్టీలోనూ ఉద్యమంలోనూ కోవర్టు ఏజెంటులను ప్రోత్సహించి, నాయకత్వాన్ని నిర్మూలించాలనీ ఉద్యమాన్ని నాశనం చేయాలనీ చూస్తున్నారు.

ఈ రెండు సంవత్సరాలలో మన పార్టీలో ఇద్దరు పీబీ సభ్యులు - కామ్రేడ్ బరుణ్‌దా, విజయ్‌దాలు అరెస్టయారు. సీసీ సభ్యుడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ తపస్, మరి కొందరు రాష్ట్ర కమిటీ సభ్యులూ అరెస్టయారు. కొద్ది నెలల క్రితం ఒక ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పు ఇచ్చి, కామ్రేడ్ బరుణ్‌కు ఐదు సంవత్సరాలు ఖైదు శిక్ష, కామ్రేడ్స్ తపస్, ప్రతుల్‌లకు యావజ్జీవ కారాగార శిక్షా విధించింది. ఇలా పోలీసు, న్యాయ వ్యవస్థల దోపిడీ వర్గ స్వభావం తేటతెల్లమయింది. ఈ రెండు సంవత్సరాలలో మన పార్టీలో 500 మంది కామ్రేడ్స్ (గడచిన పది నెలలో 300 మందికి పైగా) అమరులయారు. వీరోచిత అమరులలో పీబీ సభ్యుడు కామ్రేడ్ షంషేర్ సింగ్ షేరి, కర్నాటక రాష్ట్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ సాకేత్ రాజన్, ఉత్తర బీహార్ - ఉత్తర ప్రదేశ్ - ఉత్తరాఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ కార్యదర్శి కామ్రేడ్ నయీముద్దీన్ (రవి), ఏపీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ మాధవ్, ఏపీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు కామ్రేడ్ రవి కుమార్ అలియాస్ శ్రీధర్, ఎన్‌టీఎస్‌జెడ్‌సీ సభ్యుడు కామ్రేడ్ యాదన్న, డీకేఎస్‌జెడ్‌సీ, ఎస్‌ఎంసీ సభ్యుడు కామ్రేడ్ మంగ్తు, వంటి అనుభవజ్ఞులయిన పార్టీ నాయకులు, అనేక మంది రీజినల్, జోనల్/డివిజనల్/జిల్లా, సబ్‌జోన్, ఏరియా పార్టీ కమిటీలు, పార్టీ సెల్‌ల సభ్యులు, పీఎల్‌జీఏలో కంపెనీలు, ప్లటూన్‌ల యోధులూ, ఎల్‌జీఎస్, ఎల్‌ఓఎస్, ప్రజా మిలీషియా యూనిట్‌ల సాహసవంతులయిన కమాండర్‌లు, విప్లవ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, విప్లవ ప్రజానీకం రాజ్య బలగాలు, ప్రతీఘాతుక బలగాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతూ తమ ప్రాణాలు ఇచ్చారు.

గడచిన సంవత్సర కాలంగా యూపీఏ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం, భాజపా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మన పార్టీకి వ్యతిరేకంగా దండకారణ్యంలో సల్వా జుడుం, లేదా శాంతి క్యాంపెయిన్ పేరుతో భారీ సాయుధ విప్లవ ప్రతీఘాతుక క్యాంపెయిన్ అమలు చేసాయి. కాంగ్రెస్‌కు చెందిన దళారీ భూస్వామ్య మహేంద్ర కర్మ ప్రత్యక్ష నేతృత్వంలో ఆదివాసులలో లంపెన్, ప్రతీఘాతుక శక్తులను సమీకరించి, సాయుధం చేసి, నాగా బలగం, సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ స్పెషల్ పోలీసు బలగం, ఏపీ గ్రేహౌండ్స్ ఈ క్యాంపెయిన్‌ను అమలు చేసాయి. ఈ సల్వా జుడుం గూండాలు దాదాపు 125 గ్రామాలు పూర్తిగా కాల్చివేసి, ధ్వంసం చేసారు. విప్లవ ప్రజా సంఘాలు, రాజకీయ అధికార అంగాలు, విప్లవోద్యమానికి సానుభూతిపరులను దాదాపు

150 మందిని హత్య చేసారు. 500 గ్రామాలను బలవంతంగా ఖాళీ చేయించి దాదాపు యాభై వేల మంది ఆదివాసులను నిరాశ్రయులను చేసి, పోలీసుల ఆధీనంలో ప్రత్యేక శిబిరాలలో ఉంచారు. ప్రసార సాధనాల మీద సెన్సార్ (ఆంక్షలు) విధించారు.

సల్వా జుడుంను మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసులు చేస్తున్న స్వతంత్ర తిరుగుబాటుగా చిత్రీకరించిన దోపిడీ పాలక వర్గాలు ఈ హత్యా, లూటీ భీభత్స క్యాంపెయిన్‌కు ప్రజాస్వామిక ముసుగు తొడగాలని చూస్తున్నారు. రాజ్యానికి ఇందులో పాత్ర లేదని చెప్పాలని చూస్తున్నారు. కానీ ఈ లక్ష్యాన్ని సాధించడంలో, ప్రజలను మోసం చేయడంలో వాళ్లు విఫలమయారు. మనం ఈ క్యాంపెయిన్‌ను రాజకీయంగా ఎండగట్టగలిగాం. సైనికంగా ఎదుర్కోగలిగాం. గడచిన సంవత్సర కాలంలో డీకేలో కనీసం 60 మంది పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బందీ నిర్మూలనమయారు. దాదాపు 200 మంది సల్వాజుడుం గూండాలు, నాయకులు, అనేక మంది స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్ (ఎస్‌పీఓలు) ప్రజా ఆగ్రహానికి బలయారు.

మన బలగాలు చేసిన విజయవంతమయిన రాజకీయ సైనిక క్యాంపెయిన్ సల్వాజుడుం పేరుతో రాజ్యం చేస్తున్న దాడిని తిప్పి కొట్టడమే కాక వివిధ పాలక వర్గ రాజకీయ పార్టీల మధ్య చీలికలు తీసుకువచ్చింది. మన ప్రతిఘటన సైనిక చర్యలు, ఎత్తుగడల ప్రతిదాడి చర్యలూ పార్టీ కేడర్‌లు, పీఎల్‌జీఏ యోధులనూ దండకారణ్యమే కాక యావత్తు దేశ ప్రజానీకాన్నీ ఉత్సాహపరిచింది. పీఎల్‌జీఏలో మూడు విభాగాలలోకి ప్రజలను రిక్రూట్ చేయగలిగాం. ప్రజాయుద్ధాన్ని మరింత పురోగమింపజేయగలిగాం. మన సాయుధ ప్రతిఘటననూ ఎత్తుగడల ప్రతి దాడులనూ పెంచడం ద్వారా మనం డీకేలో శత్రు క్రూర సాయుధ దాడిని కచ్చితంగా ఓడించగలుగుతాం.

ఈ కాలంలో పార్టీ నాయకత్వంలో దేశంలో ఇతర ప్రాంతాలలో కూడా పీఎల్‌జీఏ ఎత్తుగడల ఎదురు దాడి క్యాంపెయిన్ ప్రతిఘటన, సైనిక చర్యలూ గణనీయంగా పురోగమించాయి. మంచి రాజకీయ ప్రభావం వేసాయి. ఉత్తర బీహార్‌లో సాహసవంతమయిన మధుబన్ బహుళ దాడి, జెహానాబాద్‌లో చరిత్రాత్మక ఆపరేషన్ జేల్ బ్రేక్, ఒరిస్సాలో ఆర్.ఉదయగిరిలో భారీ దాడి, జైల్ బ్రేక్, 11 మంది పోలీసులను చంపి, దాదాపు 50 ఆయుధాలు స్వాధీనం చేసుకున్న మురికినార్‌లో స్పెషల్ పోలీసు క్యాంప్ మీద దాడి, 24 మంది సీఆర్‌పీఎఫ్ బలగాలను చంపిన పదేడ మైన్ ప్రూఫ్ వాహనం పేలుడు, డీకేలో అనేక ప్రాంతాలలో 10 మంది నాగా బెటాలియన్ జవానుల నిర్మూలన, పోలీసు, సీఆర్‌పీఎఫ్ బలగాల మీద దాడులు, ఆంబుష్‌లూ, జార్ఖండ్‌లో ఝుమ్రాలో సీఆర్‌పీఎఫ్ క్యాంపు మీద దాడి - ఇవన్నీ ప్రజాయుద్ధం ముందుకు సాగుతున్నదని తెలియజేస్తున్నాయి. రాజ్య భారీ అణిచివేత క్యాంపెయిన్ ఉన్నప్పటికీ మన బలగాలు చేపట్టిన ప్రతిదాడి గెరిల్లా ఎత్తుగడల ఆధిక్యతను తెలియజేస్తున్నది. మొత్తం మీద మనం 200 మంది రాజ్య పోలీసు సిబ్బందినీ, పారా మిలిటరీ బలగాలనూ నిర్మూలించాం. శత్రువు నుంచీ గణనీయమయిన స్థాయిలో ఆయుధాలు, మందుగుండూ, పేలుడు పదార్థాలూ స్వాధీనం చేసుకున్నాం.

ఈ కాలంలో పాలక వర్గాలు ఏపీలో, ముఖ్యంగా నల్లమల అటవీ డివిజన్‌లో పెద్ద ఎత్తున ప్రత్యేక శిక్షణ పొందిన గ్రేహౌండ్స్ వంటి పోలీసు బలగాలనూ కేంద్ర బలగాలనూ మొహరించి, అణిచివేత క్యాంపెయిన్‌ను పెంచారు. పార్టీ నాయకత్వాన్ని ప్రత్యేకంగా టార్గెట్ చేసి, ముఖ్యంగా విస్తారమయిన ఇన్‌ఫార్మర్ వ్యవస్థ ద్వారా మన పార్టీకి భారీ నష్టాలు కలిగించగలిగారు. కోబ్రాలు, టైగర్‌ల వంటి ప్రైవేటు ముఠాలను వినియోగించడం ద్వారా విప్లవ ప్రజా సంఘాల కార్యకర్తలూ నాయకుల మీదనూ ప్రజాస్వామిక మేధావుల మీదనూ దాడి చేసారు.

ప్రపంచ విప్లవంలో భారత విప్లవానికి గొప్ప ప్రాధాన్యత ఉంది. భారతదేశంలో విప్లవం విజయవంతం అయితే అది అర్ధ వలస, అర్ధ భూస్వామ్య దేశాలలో నూతన ప్రజాస్వామిక విప్లవాల మీదనే కాక సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలలో కార్మికవర్గ సోషలిస్టు విప్లవాల మీద కూడా భూమిని కుదిపివేసే ప్రభావం వేస్తాయి. అందుకనే ప్రపంచ వ్యాప్తంగా, అమెరికా సామ్రాజ్యవాదుల నాయకత్వంలో సామ్రాజ్యవాదులు, ప్రతీఘాతకులూ భారతీయ విప్లవానికి నాయకత్వం వహిస్తున్న మన పార్టీని అణిచివేసే కర్తవ్యాన్ని తీవ్రంగా చేపట్టాయి. ప్రపంచ కార్మికవర్గంలో భాగమయిన భారత కార్మికవర్గానికి అగ్రగామిగా మన పార్టీ కూడా అన్ని రకాల బూర్జువా రివిజనిస్టు భావాలు, రాజకీయ పంథాలు, కుట్రలూ, దాడులకు వ్యతిరేకంగా నిరంతరం సైద్ధాంతికంగా, రాజకీయంగా, ఆచరణాత్మకంగా పోరాడాలి. తుది విజయం వరకూ కార్మికవర్గేతర ధోరణులు, సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరాడాలి. వాటిని సరిదిద్దాలి.

మన దేశంలో నూతన ప్రజాస్వామిక దశ పూర్తయిన తరువాత సోషలిజం, కమ్యూనిజం నెలకొల్పడం కోసం అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేయడమే ఏకైక మార్గమని నమ్మి ప్రారంభం నుంచీ సాయుధ వ్యవసాయ విప్లవాన్నీ దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్నీ చేపట్టి, దానికి కచ్చితంగా కట్టుబడి ఉన్న మావోయిస్టు పార్టీలకు భాకపా(మావోయిస్టు) వారసత్వం పుచ్చుకుంది. ఈ పార్టీలు భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక సాయుధ వ్యవసాయ గెరిల్లా యుద్ధంలో నిమగ్నమయారు. ప్రారంభం నుంచీ విప్లవ ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తున్నారు. ప్రజల విశ్వాసం పొందారు. దోపిడీకి గురవుతున్న శ్రామిక వర్గాలు, జాతులూ దళితులూ ఇతర వెనుకబడ్డ కులాలు, ఆదివాసులు, పీడిత మహిళలు, మతపర అల్పసంఖ్యాకులు, మధ్య తరగతి మొదలయిన సెక్షన్‌ల మీద అమలు చేస్తున్న పీడన, అన్యాయం, అన్ని రకాల అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడడానికీ, వారు కోల్పోయిన సామాజిక రాజకీయ హక్కులను తిరిగి అందించడానికీ మన పార్టీ కృషి చేస్తున్నది. పైన చెప్పిన సెక్షన్‌లన్నింటినీ సంఘటితం చేయడం కోసం ఈ కర్తవ్యానికి మరింత ప్రాధాన్యత ఇచ్చి, మన కృషిని పెంపొందించాలి. నిరుద్యోగ యువతనూ కనీస జీవన అవసరాలకు నోచుకోని ప్రజలనూ సంఘటితం చేయడానికి మరింత కృషి చేయాలి.

ఇవాళ ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఉదారీకరణల రూపంలో సామ్రాజ్యవాద దాడి యావత్తు ప్రపంచ శ్రామిక ప్రజలు, ముఖ్యంగా అర్ధ వలస దేశాల ప్రజల మీద ప్రతికూల ప్రభావం వేస్తున్నది. అలాగే దాని అర్ధ వలస, అర్ధ భూస్వామ్య స్వభావం వల్ల మన దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలన్నీ ప్రభావితమవుతున్నాయి. మన ప్రజలలో

విశాల సెక్షన్‌లు ఈ సామ్రాజ్యవాద అనుకూల విధానాల పీడనా బరువు కింద అల్లాడుతున్నారు. పారిశ్రామిక, సేవా రంగాలలో లక్షలాది కార్మికులను తొలగించారు. కార్మికవర్గ వేతనాలు స్తంభించిపోయాయి. నూతన ఉపాధి లేక యువత పెద్ద ఎత్తున నిరుద్యోగులయారు. వేలాది రైతాంగం పేదలయి. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సామ్రాజ్యవాద సంస్కృతి అణిచివేత వల్ల మహిళలు సెక్స్ అమ్మకపు సరుకులయారు. అత్యధిక మహిళల జీవితం అత్యంత అభద్రంగా తయారయింది. ఆరోగ్య నిధికి భారీగా కోత విధించడంతో ఎన్నడూ ఎరుగని అరుదయిన వ్యాధులు సాధారణమయిపోయి, అంటువ్యాధుల మాదిరిగా వ్యాపిస్తున్నాయి. విద్యకు నిధులు భారీగా తగ్గించడంతో అది సంపన్నుల సౌకర్యంగా మారింది. ఎంఎన్‌సీల దాడి వల్ల దేశీయ, గృహపర పరిశ్రమ, చేనేత రంగం శిధిలమయింది. కార్మికులను ఆత్మహత్యలలోకి, నిరుద్యోగ రిజర్వు సైన్యంగా నెడుతున్నారు. పనిని సబ్‌కాంట్రాక్ట్‌కు ఇవ్వడంలో సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడికి ఎక్కువ లాభం ఉన్నది కాబట్టి, అసంఘటిత రంగం పెరిగింది. పెద్ద అభివృద్ధి ప్రాజెక్టులుగా చెబుతున్న వాటి కోసం లక్షలాది ఆదివాసులు, ఇతర రైతాంగసెక్షన్‌లను నిరాశ్రయులు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాలలో సాంకేతిక, వినోద స్థలాల కోసం, ప్రత్యేక ఆర్థిక జోన్‌ల కోసం, ఫైవ్ స్టార్ హోటళ్ల కోసం, మల్టీప్లెక్స్ కాంప్లెక్స్‌ల కోసం, షాపింగ్ మాల్‌ల కోసం, పెద్ద కార్పొరేషన్‌ల కోసం, మురికిపేటల విధ్వంసం పెద్ద ఎత్తున కొనసాగుతున్నది. ప్రజలను వారి జీవన్మరణ అంశాల మీద మిలిటెంటుగా సంఘటితం చేయడానికీ వారిని విప్లవం వైపుకు తీసుకురావడానికీ ఇదంతా అనుకూల పరిస్థితులను కలిగిస్తున్నది.

ఇటువంటి స్థితిలో దోపిడీ పాలక వర్గాలకు ప్రజల మీదనూ, పీడిత ప్రజలను మిలిటంటు విప్లవ పోరాటాలలోకి సంఘటితం చేసే శక్తి ఉన్న మన ఏకైక పార్టీ మీదనూ సాయుధ దాడి పెంచడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. ప్రజలకు కూడా మిలిటెంటు విప్లవ పోరాట పంథా తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. అందుకని భారత జనాభాలో విశాల అత్యధికులయిన పేద, పీడిత వర్గాలకు నాయకత్వం అందించడానికి మన పార్టీ సమయానికి ముందుకు వచ్చింది. అందుకని భాకపా(మావోయిస్టు) ఏర్పాటు, రెండు గెరిల్లా సైన్యాల ఐక్యతా శ్రామిక ప్రజలను ఉత్సాహపరిచింది. నూతనంగా ఐక్యమయిన మన పార్టీ తమకు నాయకత్వం అందిస్తుందని వారు ఆశిస్తున్నారు.

రోజువారీ డిమాండ్‌ల మీద విశాల ప్రజానీకానికి నాయకత్వం వహించేందుకు, భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను తీవ్రతరం చేసే, విస్తరించే బాధ్యతను మన పార్టీ భుజాలకు ఎత్తుకుంది. శత్రు బహుముఖ దాడిని ఓడించి, ప్రజా యుద్ధాన్ని మరింత ఉన్నత దశకు పురోగమింపజేయడానికి బాధ్యత వహిస్తున్నది. గెరిల్లా సైన్యాన్ని పీఎల్ఏగా మార్చడానికి వేలాది కార్మికవర్గ, రైతాంగ యువతను భర్తీ చేసుకునేందుకు మన పార్టీ బాధ్యత వహిస్తుంది. గెరిల్లా జోన్‌లను బేస్ ఏరియాలుగా, విప్లవ ప్రతిఘటనా జోన్‌లను గెరిల్లా జోన్‌లుగా మార్చడానికీ అనేక నూతన సాయుధ పోరాట జోన్‌లను సృష్టించడానికీ, పట్టణ ప్రాంతాలను కచ్చితమయిన అజ్ఞాత పార్టీ వ్యవస్థతో విప్లవ కార్యాచరణకు బలమయిన కోటలుగా తయారు చేయడానికీ తద్వారా దేశవ్యాప్తంగా ప్రజాయుద్ధాన్ని విస్తరింపజేయడానికీ పార్టీ బాధ్యత వహిస్తుంది.

ఈ చారిత్రక బాధ్యతను చేపట్టే స్థితిలో మనం ఉన్నామా? మహత్తర నక్సల్బరీ తిరుగుబాటు కాలం నాటి నుంచీ మన పార్టీ సుదీర్ఘ చరిత్ర చూసిన వారికెవరికైనా ఇందులో ఎంత మాత్రం సందేహం రాదు. మన గొప్ప నాయకులు, ఉపాధ్యాయులూ కామ్రేడ్స్ సీఎం, కేసీలు అన్ని రకాల రివిజనిజానికీ వ్యతిరేకంగా రాజీ లేకుండా పోరాడి, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథానూ, ప్రాంతాలవారీగా అధికారం స్వాధీనం చేసుకునే పంథానూ నెలకొల్పారు. చరిత్రలో అత్యంత కష్ట కాలంలో అంతర్గత, బాహిర్ పోరాటాలు నిర్వహించారు. గడచిన సుదీర్ఘ 37 సంవత్సరాల కాలంలో మన పార్టీ అనేక ఎగుడు దిగుడులు చవి చూసింది. ఏమీ లేని దగ్గర మొదలై, కొద్ది ప్రాంతాలలో సాయుధ వ్యవసాయ విప్లవ పోరాటాన్ని ప్రారంభించి, ఇప్పుడు అనేక రాష్ట్రాలకు విస్తరించింది. ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేసే క్రమంలో మన కామ్రేడ్స్ అనేక మంది ప్రాణాలు త్యాగం చేసారు. విప్లవోద్యమాన్ని ఎదుర్కోవడానికి మాలెమా సిద్ధాంతానికి దృఢంగా కట్టుబడి ఉండడం ద్వారానూ గతితార్కిక భౌతికవాద పద్ధతి అమలు చేయడం ద్వారానూ విప్లవ ప్రజా పంథాకూ దీర్ఘకాలిక ప్రజా పంథాకూ కట్టుబడి ఉండడం ద్వారానూ కామ్రేడ్స్ సీఎం, కేసీలు మొదలుకుని వేలాది మంది మన వీరోచిత నిస్వార్థ అమరుల ద్వారా ప్రేరణ పొందడం ద్వారానూ, గతంలో చేసిన పొరపాటులను నివారించడం ద్వారానూ మనం కచ్చితంగా భారత విప్లవ విభిన్న కర్తవ్యాలను పరిపూర్తి చేయగలం.

మన పార్టీ ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, మనం పార్టీ పంథానూ విప్లవ సందేశాన్నీ దేశం నలుమూలలకూ తీసుకువెళదాం. ఈ కింది తక్షణ కర్తవ్యాలను చేపడదాం-

**తక్షణ కర్తవ్యాలు -**

1. పీఎల్‌జీఏను పీఎల్ఏగానూ గెరిల్లాజోన్‌లను బేస్ ఏరియాలుగానూ మార్చడానికి మన కృషిని రెట్టింపు చేద్దాం - గెరిల్లా జోన్‌లను బేస్ ఏరియాలుగా మార్చడం, పీఎల్‌జీఏను పీఎల్ఏగా మార్చడం అన్న పనిని పూర్తి చేయడం మన మొట్టమొదటి కర్తవ్యం. ఇందుకోసం, మన స్వీయాత్మక శక్తులు విస్తరించడం మీద కేంద్రీకరించాలి. సీసీ, సీఎంసీ బేస్ ఏరియాలుగా అభివృద్ధి చేయడానికి గుర్తించిన వ్యూహాత్మక ప్రాంతాలలో పీఎల్‌జీఏలోకి విశాల సెక్షన్‌లను భర్తీ చేయాలి. పీఎల్‌జీఏలో అన్ని బలగాలకూ రాజకీయ సైనిక శిక్షణ గరపాలి. భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, రాజ్య వ్యతిరేక పోరాటాలను పెద్ద ఎత్తున ప్రారంభించాలి. శత్రు బలగాలను ధ్వంసం చేయాలి. ఇన్‌ఫార్మర్ వ్యవస్థను ధ్వంసం చేయాలి.

విప్లవ ప్రజా సంఘాలను, నూతన రాజకీయ అధికార అంగాలనూ, వాటి అన్ని శాఖలతో నెలకొల్పి, సంఘటితం చేయాలి. మనకు పట్టు ఉన్న ప్రాంతాలలో విప్లవ సంస్కరణలు అమలు చేయాలి.

2. సాయుధ వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధాన్ని క్రమబద్ధయిన పథకం ద్వారా నూతన రాష్ట్రాలకు విస్తరించాలి - ఈ లక్ష్యాన్ని సాధించడం కోసం, సంబంధిత రాష్ట్ర కమిటీలు రాజకీయ, నిర్మాణ, సైనిక రంగాలలో అనుభవం ఉన్న ఆర్గనైజర్‌లను చెప్పుకోతగ్గంత మందిని ఎంపిక చేసి వారిని ఎంపిక చేసిన ప్రాంతాలకు పంపించాలి. ప్రజలను చైతన్యవంతులను

చేయడంలో, సంఘటితం చేయడంలో సృజనాత్మక పద్ధతులలో తగిన సమయంలో సాయుధ పోరాటంలో నిమగ్నం చేయడంలో వారికి శిక్షణ ఇవ్వాలి. నూతన రంగాలలో కూడా వారిని పథకం ప్రకారం నిమగ్నం చేయాలి.

3. భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను తీవ్రతరం చేసి విస్తరింపచేయాలి - భూస్వామ్య బలగాలు బలంగా ఉండి, వారికి విశాల రైతాంగ ప్రజలతో వైరుధ్యం తీవ్రంగా ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకుని, భూస్వాముల భూమిని స్వాధీనం చేసుకోవడం కోసం వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, ఆర్థికేతర దోపిడీ రూపాలకు వ్యతిరేకంగా, మెరుగయిన వేతనాలు, పీడిత కులాల, మహిళల ఆత్మ గౌరవం మొదలయిన వాటి కోసం భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను సంఘటితం చేయాలి. భూస్వాముల నుంచీ గుంజుకున్న భూమిని క్రమబద్ధమయిన పద్ధతిలో ప్రజలకు పంపిణీ చేయాలి. ఈ భూములను అభివృద్ధి చేయడానికి రాజ్యంతో పోరాటాలు చేయాలి.

4. రాజకీయ ప్రజా ఉద్యమాలు నిర్మించాలి - రాజకీయ నిర్బంధం, సామ్రాజ్యవాద లూటీ, పీడనలకు వ్యతిరేకంగా, ముఖ్యంగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఉదారీకరణ విధానాలకు వ్యతిరేకంగా, భారత్ అమెరికా అణు, సైనిక ఒప్పందానికి వ్యతిరేకంగా, హిందూత్వ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా రాజ్య దోపిడీ పీడక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలి. ప్రజాస్వామిక శక్తులన్నింటినీ సమీకరించి రాష్ట్ర, అఖిల భారత స్థాయిలో విశాల ప్రాతిపదిక మీద ప్రజా రాజకీయ ఉద్యమాన్ని నిర్మించి ఉమ్మడి వేది మీదకు తీసుకురావాలి. బలమైన విప్లవ కార్మికవర్గ ఉద్యమాన్ని కూడా నిర్మించాలి.

5. విప్లవ శక్తులను ఐక్యం చేయడానికి కృషి చేయాలి - దేశంలో మిగిలిన చెల్లాచెదురయిన మావోయిస్టు విప్లవ శకుతలను ఐక్యం చేయడానికి కృషి చేయాలి.

6. మన టెక్ యంత్రాంగాన్ని పటిష్టం చేసుకోవాలి - శత్రువు చేస్తున్న దేశవ్యాప్త దాడి, మన పార్టీని, ముఖ్యంగా పార్టీ నాయకత్వాన్ని ధ్వంసం చేయడానికి శత్రు ప్రయత్నాల దృష్ట్యా మనం తక్షణమే టెక్ యంత్రాంగంలో, పని పద్ధతులలో మన బలహీనతలను వదిలించుకోవడానికి సమస్త కృషీ చేయాలి. రహస్య పార్టీ యంత్రాంగాన్ని పటిష్టం చేయాలి. నూతన పరిస్థితి ముందుకు తెస్తున్న అవసరాలను తీర్చడానికి నూతన పద్ధతులను అవలంబించాలి.

**పార్టీ వ్యవస్థాపక దినం వారోత్సవాల కార్యక్రమం -**

1. పార్టీ రాజకీయ సైద్ధాంతిక పంథా, విధానాల గురించీ, చారిత్రక మూల మలుపుల గురించీ, విప్లవోద్యమం, భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయాల గురించీ, అమరులు కలలు కన్న ఆశయాలు, లక్ష్యాల గురించీ, వారి అమూల్యమయిన త్యాగాల గురించీ వారి ఆదర్శవంతమయిన జీవితాల గురించీ వారు నిలబడ్డ ఉన్నత కమ్యూనిస్టు విలువల గురించీ విస్తృతమయిన ప్రచార క్యాంపెయిన్ చేపట్టాలి.

2. మాలెమా సిద్ధాంతాన్నీ, దాని చారిత్రక అభివృద్ధినీ ప్రచారం చేయాలి. రివిజనిజానికి వ్యతిరేక పోరాటం మీద నొక్కి చెప్పాలి.

3. కరపత్రాలు, పోస్టర్‌లు, గోడ రాతలను విస్తృతంగా చేపట్టాలి. సాధ్యమయిన చోటనల్లా బానర్‌లు పెట్టాలి. రహస్య, బహిరంగ గ్రూపు సభలు, బహిరంగ సభలు, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, ఊరేగింపులు, కాగడా ఊరేగింపులు ఇతర రకాల సృజనాత్మక సమావేశాలు, ప్రచార పద్ధతులను చేపట్టి ప్రజలకు పార్టీ పంథా గురించి బోధించాలి.

4. పార్టీలో పీఎల్‌జీఏలో చేరవలసిన అవసరం గురించి ప్రజలను జాగరూకులను చేయాలి.

5. భాకపా(మావోయిస్టు) ఏర్పాటు, పార్టీ పంథాల ప్రాముఖ్యతలను వివరించే పుస్తకాలు, కరపత్రాలు, పోస్టర్‌లూ మొదలయినవి ప్రచురించాలి.

6. సెల్‌లు, పీఎల్‌జీఏ, విప్లవ ప్రజా కమిటీలలో మన పార్టీ సభ్యులనూ ప్రజా సంఘాలనూ ప్రోత్సహించి సంబంధిత యూనిట్‌లలో తమ ఆఖరి శ్వాస వరకూ కమ్యూనిజం గొప్ప ఆశయం కోసం పోరాడతామనీ మన ప్రియతమ అమరులు ప్రాణాలు ఇచ్చిన ఆశయాన్ని ఎత్తిపడతామనీ ప్రతిన తీసుకునేందుకు ప్రోత్సహించాలి. ప్రతిన పూనడం వల్ల నూతన స్ఫూర్తి కలిగి, శత్రు దాడిని గొప్ప ధైర్యంతో ఓడించడానికి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేసి, ఆ తరువాత సోషలిజం, కమ్యూనిజాలలోకి సాగడం కోసం పురోగమించడానికి మన నిశ్చయాన్ని పటిష్టం చేస్తుంది.

**మార్క్సిజం లెనినిజం మావోయిజం వర్ధిల్లాలి!**
**భాకపా(మావోయిస్టు) వర్ధిల్లాలి!**
**మన పార్టీ ప్రియతమ వ్యవస్థాపక నాయకులు కామ్రేడ్ సీఎం, కేసీలు,**
**భారత విప్లవ వీరోచిత అమరులూ వర్ధిల్లాలి!**
**ప్రపంచ విప్లవ గొప్ప అమరులు వర్ధిల్లాలి!**
**పీఎల్‌జీఏను పీఎల్ఏగా ఎదిగించాలి!**
**గెరిల్లా జోన్‌లను బేస్ ఏరియాలుగా మార్చాలి!**
**నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!**
**సామ్రాజ్యవాదం నశించాలి!**
**అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి!**
**అన్ని రకాల రివిజనిజాన్నీ ధ్వంసం చేయాలి!**
**ప్రపంచ కార్మికులారా ఐక్యం కండి!**
**ప్రపంచ కార్మికవర్గ విప్లవం వర్ధిల్లాలి!**

పొలిట్‌బ్యూరో
భాకపా(మావోయిస్టు)
2006 ఆగస్టు 5

## పార్టీ మూడవ స్థాపనా వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం !

## పార్టీని బోల్షివీకరిద్దాం !
## స్థావర ప్రాంత నిర్మాణం కోసం గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం !

## అద్భుతమైన విప్లవ పరిస్థితిని ఉపయోగించుకొని ప్రజాయుద్ధాన్నీ, గెరిల్లా యుద్ధాన్నీ దేశవ్యాప్తంగా విస్తృతం చేద్దాం !

*పార్టీ 3వ స్థాపనా వార్షికోత్సవం సందర్భంగా పార్టీ సభ్యులకూ, పి.ఎల్.జి.ఎ. పోరాట యోధులకూ మరియు దేశ ప్రజలకూ కేంద్రకమిటీ పిలుపు*

కేంద్రకమిటీ,

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# పార్టీ మూడవ స్థాపనా వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం !

# పార్టీని బోల్షివీకరిద్దాం ! స్థావర ప్రాంత నిర్మాణం కోసం గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం !

# అద్భుతమైన విప్లవ పరిస్థితిని ఉపయోగించుకొని ప్రజాపునాదినీ, గెరిల్లా యుద్ధాన్నీ దేశవ్యాప్తంగా విస్తృతం చేద్దాం !

*పార్టీ 3వ స్థాపనా వార్షికోత్సవం సందర్భంగా పార్టీ సభ్యులకూ, పి.ఎల్.జి.ఎ. పోరాట యోధులకూ మరియు దేశ ప్రజలకూ కేంద్రకమిటీ పిలుపు*

ప్రియమైన కామ్రేడ్స్!

కొద్ది వారాల్లోనే మనం మన పార్టీ మూడవ స్థాపనా వార్షికోత్సవాన్ని జరుపుకోబోతున్నాం. 2006 సెప్టెంబర్‌లో రెండవ స్థాపనా వార్షికోత్సవాన్ని జరుపుకున్న తర్వాత వివిధ స్థాయిల్లోని మన పార్టీ కాన్ఫరెన్స్‌లను జయప్రదంగా జరుపుకొని అంతిమంగా 2007 జనవరిలో మన పార్టీ చారిత్రాత్మక ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌ని జయప్రదంగా జరుపుకున్నాం. మన పార్టీ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలనీ, గెరిల్లా యుద్ధం తీవ్రంగా జరుగుతున్న గెరిల్లాజోన్లలో స్థావర ప్రాంతాల నిర్మాణాన్ని త్వరితం చేయాలనీ, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేయాలనీ, పి.ఎల్.జి.ఎ.ను పి.ఎల్.ఎ.గా అభివృద్ధి చేయాలనీ, ప్రజాయుద్ధంలో లక్షలాదిగా ప్రజలు క్రియాశీలంగా పాల్గొనేలా తీర్చిదిద్దమనీ పిలుపునిచ్చింది. మన పార్టీలో కొనసాగుతున్న కార్మికవర్గేతర ధోరణులను తొలగించుకొని, దానిని పెంపొందుతున్న వర్గయుద్ధానికి నాయకత్వం వహించగలిగేటటువంటి బలమైన, క్రమశిక్షణాయుతమైన ఐక్య బోల్షివిక్ పార్టీగా అభివృద్ధి చేయాలనీ పిలుపిచ్చింది. మన పార్టీ 'కాంగ్రెస్' రాజకీయ పంథానీ మరియు సైనిక పంథానీ అన్ని స్థాయిలలోని పార్టీ సభ్యులూ సృజనాత్మకంగా అమలు జరిపే విధంగా అభివృద్ధి చేసింది.

గత సంవత్సర కాలంలో భారత విప్లవం పట్ల దృఢదీక్షతో కూడిన అచంచల విశ్వాసం కలిగిన దాదాపు 200 మంది అమూల్యమైన పార్టీ సభ్యులూ, పి.ఎల్.జి.ఎ. పోరాట యోధులూ, నాయకులూ ప్రాణత్యాగం చేశారు. వారిలో మన ప్రియతమ నాయకులు కామ్రేడ్స్

చంద్రమౌళి(బి.కె.@ నవీన్), రాజమౌళి (మురళి @ ప్రసాద్) మరియు అజయ్‌దా (పరిమళ్‌సేన్); రాష్ట్ర నాయకులైనటువంటి కామ్రేడ్స్ వికాస్, రాఘవులు, సుదర్శన్, సోమన్న, గౌతమ్; మరియు వివిధ జిల్లా కమిటీల నాయకులు, ఏరియా కమిటీ స్థాయి నాయకులూ, పి.ఎల్.జి.ఏ. యోధులూ, ప్రజారాజ్యాధికార అంగాల సభ్యులూ, విప్లవ ప్రజాసంఘాల సానుభూతిపరులూ మన ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేసే క్రమంలో అమరత్వాన్ని పొంది ఈ భూమిని మరింత ఎరుపెక్కించారు. బి-జె శాక్ కిందగల బాడ్‌శేఖ్‌పురా-నవాడా జోనల్ కమిటీ కార్యదర్శి, పాపులర్ నాయకుడైన కా. నాథున్‌జీ, ఉత్తర ఛత్తీస్‌గఢ్ జోనల్ కమిటీ సభ్యుడు కా. మానస్, జోనల్ కమిటీ సభ్యుడైన నరేష్, ఉత్తర తెలంగాణా ఆదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యుడైన కా. నరేష్, కర్నాటక లోని మల్నాడు ఏరియాకు చెందిన కామ్రేడ్స్ దినకర్, గౌతమ్, పరమేశ్వర్, రామేగౌడ మరియు సుబ్రహ్మణ్యం, మలేరియాతో చనిపోయిన హర్యానాకు చెందిన కా. రామ్‌మెహర్, పంజాబుకు చెందిన ప్రముఖ మేధావి కామ్రేడ్ హరీసింగ్ టర్క్ వీరిలో ఉన్నారు. ఏ.ఓ.బి.లో రీజనల్ కమిటీ స్థాయి కామ్రేడ్ మరియు సెంట్రల్ మిలటరీ ఇన్‌స్ట్రక్టర్ అయిన కా. బినోద్, సెక్షన్ కమాండరైన కా. నీలేష్ మరియు కామ్రేడ్ హరి అమరులయ్యారు. ప్రముఖ రాణిబోదిలి క్యాంపు మీద జరిగిన దాడిలో పశ్చిమ బస్తర్ కమాండ్ ఇన్‌ఛార్జ్ అయిన కా. మోహన్‌తో సహా ఆరుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఉర్పల్‌మెట్ట ఆంబుష్‌లో కా. దూలాల్ అమరత్వం చెందారు. ఝార్ఖండ్‌లోని బొకారో జిల్లాలోని ఖాస్‌మహల్ సి.ఐ.ఎస్.ఎఫ్. బ్యారక్ మీద జరిగిన దాడిలో శాక్ స్థాయి మిలటరీ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉన్న కా. ప్రదీప్, పి.ఎల్.జి.ఏ. యోధుడైన కా. నిర్మల్ అమరత్వం చెందారు. ఏ.పి., ఎన్.టి., మరియు ఏ.ఓ.బి.లలో మహిళా కామ్రేడ్స్ కరుణ, ప్రశాంతి, పద్మ, భవానీ, స్వర్ణ, అరుణ మరియు లలితలు; కర్నాటక నుండి కా. కావేరి అమరులయ్యారు. మహత్తర భారత విప్లవోద్యమ చరిత్రలో ప్రజల హృదయాలలో వీరు కలకాలం నిలిచే ఉంటారు.

వేలాది మంది కామ్రేడ్స్‌ను వివిధ రాష్ట్రాలలో అరెస్టులు చేసి చిత్రహింసలు పెట్టి జైళ్లలోకి నెట్టారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యులైన కామ్రేడ్స్ శోభాదీ, చింతన్‌జీ, మోహిత్‌జీ మరియు విజయ్‌లు ఉన్నారు. రాష్ట్ర కమిటీ స్థాయిలో బి.జె. శాక్ సభ్యుడైన కా. మదన్‌జీ, డి.కె.ఎస్.జడ్.సి. సభ్యుడైన కా. మర్కం గోపన్న, మహారాష్ట్ర రాష్ట్రకమిటీ సభ్యులైన కామ్రేడ్స్ మహేష్ మరియు అరుణ్ ఫెరేరా, తమిళనాడు నుండి కా. సుందరమూర్తి అరెస్టయిన వారిలో ఉన్నారు.

వివిధ స్థాయిల పార్టీ కమిటీల సభ్యులూ, పి.ఎల్.జి.ఏ. కమాండర్లు మరియు సభ్యులూ అత్యంత ధైర్యసాహసాలతో రాణిబోదిలి, జార, ఉర్పల్‌మెట్ట వంటి ఆంబుష్‌లలోనూ, బొకారో, రాజ్‌పూర్-బఘేలా (రోహతాస్ జిల్లా) ఔట్‌పోస్టులు, సీతామడి జిల్లాలోని రైఘా దాడులలో భారత ప్రభుత్వ కిరాయి బలగాలైన పారా మిలటరీ, రాష్ట్ర పోలీసులు, స్పెషల్ పోలీసులను నిర్మూలించి కిరాయి మూకల వెన్నులో చలి పుట్టించి ప్రజాయుద్ధ ప్రతిఘటనలో ఒక కొత్త నమూనా సృష్టించారు. అత్యంత సాహసంతో కూడిన విజయవంతమైన ఈ దాడులు బలమైన రాజ్యయంత్రాన్ని ఢీకొనటం ద్వారా మావోయిస్టు ప్రజాయుద్ధానికి ఓటమి లేదనే దానికి ఉదాహరణలుగా నిలుస్తాయి. సంఖ్యారీత్యా విప్లవశక్తులు బలహీనంగా ఉన్నప్పటికీ ఇటువంటి

దాడులు ప్రజలలో గొప్ప విశ్వాసాన్ని నింపాయి. శక్తివంతమైన శత్రువును దీర్ఘకాల ప్రజాయుద్ధ గెరిల్లా సూత్రాలను అన్వయించి ముక్కలు ముక్కలుగా నిర్మూలించటం ద్వారానే ఉద్యమం బలోపేతం అవుతుంది. దండకారణ్యంలోని విప్లవ ప్రజాప్రభుత్వ నాయకత్వం, బీహార్-ఝార్ఖండ్‌లోని విప్లవ ప్రజాసంఘాల నాయకత్వాలు శత్రుదాడిని ధైర్యంగా అడుగడుగునా ప్రతిఘటిస్తున్నారు. ఈ స్థితి సాయుధ వ్యవసాయిక విప్లవోద్యమం, ప్రజల ప్రజాస్వామ్యం రానున్న రోజుల్లో మరింత ముందుకే పోతాయనే విశ్వాసాన్ని కలిగిస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లోనే డి.కె., బి-జె, ఏ.ఓ.బి.లాంటి గెరిల్లాజోన్లలోనూ, దేశంలోని ఇతర పోరాట ప్రాంతాలలోనూ అనేక మంది మహిళా కామ్రేడ్స్‌పై వివిధ రకాల పోలీసు బలగాలు క్రూరంగా సామూహిక అత్యాచారాలు చేసి, హత్యలు చేశారు. వందలాది మందిని అరెస్టులు చేసి చిత్రహింసలు పెట్టి జైలు పాలు చేశారు.

ఈ విధంగా భారత విప్లవం కోసం తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన గొప్ప వీరయోధులు, వీర వనితలను ఒకసారి గుర్తు చేసుకుందాం.

## మొత్తం పార్టీని సైద్ధాంతికంగానూ, రాజకీయంగానూ విద్యగరిపి శిక్షణనిద్దాం :

గత సంవత్సర కాలంలో పార్టీ కాన్ఫరెన్స్‌లు మరియు కాంగ్రెస్‌కి తయారీలో భాగంగా మొత్తం పార్టీ అంతటా ఎడ్యుకేషన్ క్యాంపెయిన్‌ని తీసుకున్నాము. కాంగ్రెస్ అనంతరం కాంగ్రెస్‌లో సంశ్లేషణ చేయబడిన పార్టీ డాక్యుమెంట్లపై చాలా ప్రాంతాల్లో క్లాసులు నిర్వహించాము. కొన్ని రాష్ట్రాల్లో కొన్ని కారణాల వల్ల ఈ క్లాసుల క్యాంపెయిన్ పూర్తి కాలేదు. అందువల్ల పార్టీ కేడర్ మొత్తానికి మౌలిక డాక్యుమెంట్లపై విద్య గరిపే విషయానికి ప్రాధాన్యత నీయాలి. ఉద్యమావసరాల రీత్యా కాన్ఫరెన్స్‌లు జరుగుతున్న సందర్భంగా వివిధ రాష్ట్రాలలో చాలా మంది కామ్రేడ్స్‌ని ప్రమోట్ చేసి ఆ పైకమిటీలలోకి మరియు మిలటరీ కమాండ్స్‌లోకి తీసుకోవటం జరిగింది. అన్ని రాష్ట్రాలలో చాలామందికి పార్టీ సభ్యత్వం ఇవ్వటం, పార్ట్ టైమర్స్‌గానూ, పూర్తికాలం కార్యకర్తలుగానూ తీసుకోవటం జరిగింది. కొన్ని రాష్ట్రాల్లో మరియు కొన్ని ఏరియాల్లో పి.ఎల్.జి.ఏ. సభ్యత్వమూ, ప్రజాసంఘాల సభ్యత్వమూ పెరిగింది. కాబట్టి కొత్తగా ఉద్యమంలోకి మరియు కమిటీల్లోకి వచ్చిన కామ్రేడ్స్‌ని ఎం.ఎల్.ఎం. సిద్ధాంతంతోనూ, పార్టీ మౌలిక డాక్యుమెంట్లతోనూ , దీర్ఘకాల ప్రజాయుద్ధ ఎత్తుగడలను సృజనాత్మకంగా అన్వయించేలా వీరికి విద్య గరపాలి. మన కేంద్ర పి.ఓ.ఆర్.లో తక్షణ కర్తవ్యాల్లో ఒకదాన్ని గురించి ఈ విధంగా రాసుకున్నాం. "పార్టీ అంతటా సైద్ధాంతిక విద్యనూ, రాజకీయ విద్యనూ గరపాలి. కార్మికవర్గేతర ధోరణులను పార్టీ అన్ని స్థాయిల్లో నుండి తొలగించే పోరాటాన్ని తీవ్రతరం చేయాలి."

పార్టీలోని అన్ని స్థాయిల్లోని కేడర్‌కు గట్టి సైద్ధాంతిక, రాజకీయ పునాది మరియు నిర్మాణపరంగానూ,మిలటరీపరంగానూ స్థాయి లేకుండా శత్రువు యొక్క బహుముఖమైన ఎత్తుగడల మరియు వ్యూహాత్మక మిలటరీ దాడిని ఎదుర్కోవటం అంత తేలికైన విషయం కాదు. అటువంటి గట్టి పునాదిని కలిగి ఉన్నప్పుడు మాత్రమే మారుతున్న శత్రు ఎత్తుగడలనూ, రాజకీయ పరిస్థితుల్లో వచ్చే మార్పులకు అనుగుణంగా యుద్ధాన్ని విజయవంతంగా

నడపగలుగుతాము.

"దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మావోయిస్టు సూత్రాలను అధ్యయనం చేసి విదేశాల్లోని విప్లవోద్యమాలూ మరియు జాతి విముక్తి పోరాటాల అనుభవాలను జోడించి మన దేశంలోని నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించాలని" కాంగ్రెస్ నిర్ణయించింది.

దీర్ఘకాల ప్రజాయుద్ధ వ్యూహం-ఎత్తుగడల సిద్ధాంతమూ మరియు సూత్రాలను నిర్దిష్టంగా అధ్యయనం చేసి నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించటం ద్వారా వచ్చిన జ్ఞానంతో మన పార్టీ కమిటీలూ, కమాండ్లూ మంచి నాయకత్వంగా ఎదిగి తాము నాయకత్వం వహించే చోట శక్తివంతం కావటం ద్వారా మన పార్టీలోనూ, పి.ఎల్.జి.ఏ.లోనూ, సాధారణ ప్రజల్లోనూ విశ్వాసాన్ని ద్విగుణీకృతం చేయగలుగుతాం.

మన పార్టీ యూనిట్లు రోజువారీ రొటీన్ కార్యక్రమాల్లో మునగటం ద్వారా తప్పుడు ఆచరణకు, అనుభవవాదానికీ గురయ్యే అవకాశం ఉంది. ఇంతకు మునుపే మనం మన పార్టీలో వివిధ స్థాయిల్లో ఎటువంటి ధోరణులు కొనసాగుతున్నాయో సమీక్షించుకున్నాము. దీనిని నిరోధించటం కోసం పార్టీని దుర్బలపరిచే కార్మికవర్గేతర ధోరణులకు వ్యతిరేకంగా నిరంతరాయ, నిశ్చయాత్మక పోరాటం కొనసాగించాలి. పార్టీలో కొనసాగుతున్న కార్మికవర్గేతర ధోరణులు తలెత్తిన ప్రతి సందర్భంలోనూ వాటికి వ్యతిరేకంగా రాజీలేని దృఢనిశ్చయంతో కూడిన పోరాటాన్ని కొనసాగిస్తూ పార్టీలోని నాయకుల, కార్యకర్తల రాజకీయ చైతన్యాన్ని పెంచేందుకు నిరంతరం విద్యగరుపుట, శిక్షణనివ్వటాన్ని కొనసాగిస్తూ సరైన వర్గ దృక్పథాన్ని ఎత్తిపడుతూ పురోగమించాలి. మన పార్టీ మూడవ స్థాపనా వార్షికోత్సవం సందర్భంగా పార్టీలోని చెడుగును తొలగించి పార్టీని బోల్షివీకరిద్దామనీ, పార్టీని కార్మికవర్గం చేతిలో శక్తివంతమైన ఆయుధంగా మలిచేందుకు పార్టీలోని చెడుగులను తొలగించి, పార్టీని బోల్షివీకరిద్దామనీ ప్రతిజ్ఞ చేద్దాం. మన పార్టీలోని అన్ని కమిటీలూ రెక్టిఫికేషన్ క్యాంపెయిన్‌కు సమయాన్ని నిర్ధారించుకొని ఆ కార్యక్రమాన్ని కొనసాగించి వాటి ఫలితాల్ని సమీక్షించాలి.

## గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేసి విస్తరిద్దాం:

మన ఐక్యతా కాంగ్రెస్ ఈ విధమైన తక్షణ కేంద్ర ముఖ్య కర్తవ్యాన్ని తీసుకొంది. "విప్లవోద్యమ క్రమంలో మూడు అద్భుత ఆయుధాలను శక్తివంతం చేసే క్రమంలో ముఖ్య మరియు కేంద్ర కర్తవ్యాలైన గెరిల్లా యుద్ధాన్ని గుణాత్మకంగా ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లాలనే దానిలో భాగంగా గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగానూ, పి.ఎల్.జి.ఏ.ను పి.ఎల్.ఏ.గానూ అభివృద్ధి చేసి డి.కె. మరియు బి.జె.లలో స్థావర ప్రాంతాలను నిర్మాణం చేయాలని నిర్ధారించుకున్నాం. మిగతా ప్రాంతాలలో గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేసి గెరిల్లాజోన్లుగా మార్చటమూ, ఎర్రప్రతిఘటనా పోరాట ప్రాంతాలను గెరిల్లాజోన్లుగా మార్చేందుకు తయారీలను పూర్తి చేయాలి." (సి.సి. పి.ఓ.ఆర్.) దీనితో పాటు గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా మార్చేందుకూ, మరియు స్థావర ప్రాంతాల నిర్మాణం చేసేందుకు ఆరు ప్రత్యేక మిలటరీ కర్తవ్యాలను మన కాంగ్రెస్ నిర్దేశించింది.

కాంగ్రెస్ తదనంతరం గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేసేదానిలో భాగంగా అన్ని గెరిల్లాజోన్లలో మిలటరీపరంగా మనం కొన్ని విజయాల్ని సాధించాం. డి.కె.లో రెయిడ్, ఆంబుష్ అనే రూపాల్ని సృజనాత్మకంగా రాణిబోదిలి, జారఘాటి, జార మరియు ఉర్పల్‌మెట్ట లాంటి దాడులలో ఆంబుష్‌లలో అమలు జరిపి శత్రువును పూర్తిగా నిర్మూలించాం. ఈ దాడుల తీవ్రత వల్ల శత్రువు చాలా బెంబేలెత్తి పోయాడు. మన డి.కె. విప్లవోద్యమాన్ని నిర్మూలించేందుకు ఏయే చర్యలు చేపట్టాలో ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీలో 'రహస్యంగా' చర్చించారు. డి.కె. విప్లవోద్యమాన్ని అణచేందుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వానికి సలహాదారుగా నియమించబడిన భారత పాలకవర్గాలకు అత్యంత ప్రీతిపాత్రుడూ, పంజాబ్ ఉద్యమాన్ని అణచిన ఘనుడు సూపర్‌కాప్‌గా పేరుబడిన కె.పి.ఎస్.గిల్ కూడా ఇక్కడ వైఫల్యం చెంది ఇంటిదారి పట్టాడు. 2006 జూన్ నాటికే డి.కె.లో విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించాలనే పథకంలో భాగంగా ప్రారంభించిన ప్రభుత్వ ప్రాయోజిత విప్లవ ప్రతీఘాతుక సల్వాజుడుం పార్టీ, పి.ఎల్.జి.ఏ. మరియు ప్రజల వీరోచిత ప్రతిఘటనతో ఓడిపోయింది. నాగా బెటాలియన్ డి.కె. యుద్ధరంగంలో ప్రజల వీరోచిత ప్రతిఘటనతో తీవ్ర నష్టాలకు గురై, నాగాలాండ్‌లో ప్రజాస్వామిక వాదుల వ్యతిరేకతకు గురై చివరికి అంతిమంగా డి.కె.నుండి ఉపసంహరించుకుంది. ఈ విధంగా సెక్యూరిటీ బలగాల మనోస్థైర్యం బాగా దెబ్బతిన్నది. ఈ సందర్భంగా మరలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత పాట అయిన భారత సైన్యాన్ని మన ఉద్యమం మీదికి దించాలా వద్దా అనే చర్చ మొదలు పెట్టాయి. గత సంవత్సర కాలంగా దండకారణ్యంలో గెరిల్లా యుద్ధంలో ప్రజలు పెద్దయెత్తున క్రియాశీలంగా పాల్గొనటం ద్వారా ప్రభుత్వదాడిని ఎదుర్కోవటంలో పి.ఎల్.జి.ఏ. గుణాత్మకంగానే కొంత అభివృద్ధి చెందటం వల్ల ఇక్కడ గెరిల్లా యుద్ధం మొబైల్ యుద్ధంగా మారటానికి కొన్ని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

బీహార్, ఝార్ఖండ్‌లలో కూడా గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేసేదానిలో భాగంగా శత్రువు మీద కొన్ని ఎత్తుగడల ఎదురుదాడులను విజయవంతం చేశాం. ఏకకాలంలో జరిగిన ఖాస్‌మహల్, రోహతాస్ మరియు రైగా దాడులు, నాగరిక్ సురక్షా సమితి నాయకుడైన పార్లమెంట్ సభ్యుడు సునీల్ మహతో నిర్మూలన మరియు సెక్యూరిటీ బలగాల మీద గత సంవత్సర కాలంలో చేసిన అనేక దాడులు పాలకవర్గాల్ని నిద్రపోకుండా చేశాయి. ఏ.ఓ.బి.లో పెద్దయెత్తును శత్రు బలగాలు మోహరించినప్పటికీ గట్టి ప్రతిఘటనను ఇచ్చి మనం శత్రువును దెబ్బతీశాం. కర్నాటకలో మందుపాతర పేలుడులో ఎస్.టి.ఎఫ్. బలగాలు గాయపడ్డాయి.

ఎన్.ఎం.డి.సి. మీద మనం చేసిన వీరోచిత దాడి, బస్తర్‌లో ఎలక్ట్రిక్ టవర్లను పేల్చివేయడం, దంతెవాడలో ఎస్.ఆర్. స్టీల్ పైపులైన్ల మీద దాడులు, ఝార్ఖండ్‌లో బొగ్గుగనుల ఉత్పత్తి నిలుపుదల, శత్రు సాధన సంపత్తి కలిగిన స్థావరాల మీద దాడులు, మన పార్టీ విధించే ఆర్థిక దిగ్బంధనాల వంటి చర్యలు బహుళజాతి కార్పొరేషన్లకు భారీ నష్టాల్ని కలిగించాయి. మరియు దళారీ బూర్జువా వర్గ ప్రభుత్వానికి కూడా నష్టాన్ని కలిగించాయి. ఇటువంటి దాడులు నేటి ఈ యుద్ధంలో ఒక ప్రధాన రూపాన్ని సంతరించుకున్నాయి. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మరియు ఒరిస్సా రాష్ట్రాలలో ప్రకృతి వనరులను దోచుకునేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో ఎం.ఎన్.సి.లు, దళారీ బూర్జువా కంపెనీలు కుదుర్చుకున్న ఒప్పందాలకు

వ్యతిరేకంగా ప్రజాందోళనలు పెద్దయెత్తున చెలరేగాయి. ఈ ప్రజాందోళనలు ఒకవైపూ,మన పార్టీ నాయకత్వంలో పి.ఎల్.జి.ఏ. చేస్తున్న దాడులు మరోవైపూ శత్రు దోపిడీ ప్లానులను నిరోధించాయి.

ఇప్పటికే శత్రువు మీద చేసిన దాడులను ఇంకా తీవ్రతరం చేయటం ద్వారా మాత్రమే ఎల్.ఐ.సి. వ్యూహంలో భాగంగా గెరిల్లాజోన్లలోని ముఖ్యమైన పాయింట్లలో మోహరిస్తున్న శత్రు బలగాల మోహరింపులను దెబ్బతీయగలుగుతాము.

మన గెరిల్లా జోన్లలో మిలటరీ బేస్ క్యాంపుల్ని నిర్మాణం చేయటమూ, కార్పెట్ సెక్యూరిటీ వ్యవస్థను విస్తృతం చేయటమూ, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ని ఏర్పాటు చేసుకోవటమూ, కోవర్టులను, స్పాటర్లను ఏర్పాటు చేసుకోవటమూ, కౌన్సిలింగ్‌లు నిర్వహించటమూ, పునరావాస ప్యాకేజీలను ప్రకటించడమూ, కేంద్ర-రాష్ట్ర పార్టీ నాయకత్వాలకు మరియు పి.ఎల్.జి.ఏ.కు వ్యతిరేకంగా విషప్రచారాన్ని చేయటమూ, ప్రజల హృదయాల్ని గెలుచుకొనే పేరుతో కొన్ని సంస్కరణలను చేయటమూ, మన గెరిల్లాజోన్లలోని సరిహద్దు ప్రాంతాల్లో సమన్వయాన్ని మెరుగుపర్చుకోవటం వంటి చర్యలు శత్రువు చేపట్టాడు.

పెద్దయెత్తున ప్రజలు మన రాజకీయ, మిలటరీ కార్యకలాపాలలో పాల్గొనకుండా మనం గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయలేము. కొన్ని ప్రాంతాల్లో కొన్ని కారణాల వల్ల మనం దీనిని సాధించలేక పోయాము. ఈ పరిస్థితిని మన పార్టీ కాన్ఫరెన్స్‌లలోనూ, ఐక్యతా కాంగ్రెస్‌లోనూ సమీక్షించుకున్నాము. కొన్ని ప్రాంతాలలో గతంలో మనం మిలీషియాను నిర్మించి ప్రజాప్రతిఘటనను కొనసాగించిన ప్రాంతాలలో ప్రస్తుతం మనం దళ కార్యక్రమాలకే పరిమితమయ్యాం. కాబట్టి ఈ బలహీనతలను అధిగమించి ప్రజా మిలీషియాను నిర్మించటం ద్వారా ప్రజలను పెద్దయెత్తున యుద్ధంలో పాల్గొనే విధంగా తయారు చేయటం ద్వారా మనం దీని నుండి బయటపడగలుగుతాం.

ఈ ప్రత్యేక పరిస్థితిలో పార్టీలోని అన్ని స్థాయిల కార్యకర్తలనూ మరియు పి.ఎల్.జి.ఏ.నూ పైన చెప్పబడిన బలహీనతల నుండి బయటపడేసేందుకు పార్టీ నాయకత్వం కేంద్రీకరించి మోటివేట్ చేయాలి. గెరిల్లాయుద్ధ సూత్రాలను సృజనాత్మకంగా అన్వయించి మన గెరిల్లాజోన్లలోనూ, గెరిల్లా జోన్ల బయటి ప్రాంతాలలోనూ శత్రువువు దెబ్బతీయాలి. ఎక్కడైతే మనం తాత్కాలిక సెట్‌బ్యాక్‌కు గురైనామో ఆ ప్రాంతాల్లో రాజకీయంగా, మిలటరీపరంగా, సంస్థాపరంగా గట్టి ప్రయత్నాలు చేసి మళ్ళీ చొరవను సాధించాలి. ఎక్కడైతే మనకు ప్రజాపునాది బలహీనంగా ఉందో ఆ ప్రాంతాల్లో తీవ్రంగా ప్రయత్నాలు చేసి ప్రజాపోరాటాలను, ప్రజాసంఘాలను, పార్టీ యూనిట్లను నిర్మించాలి. అదే సందర్భంలో ప్రజాపోటారాలను సాయుధ ప్రతిఘటనతో జోడించి ఎర్రప్రతిఘటనా ప్రాంతాలను నిర్మించాలి. మన ప్రజాపునాదిని బలోపేతం చేసుకోవటమూ, ప్రజా మిలీషియాను నిర్మించటమూ, పి.ఎల్.జి.ఏ.ని విస్తృతం చేయటమూ, కంబాట్ స్కిల్స్‌ని అభివృద్ధి చేసుకోవటమూ, ఫైర్ పవర్‌ని పెంపొందించుకోవటమూ, ఆపరేషన్లలో చురుకుగా సమన్వయాన్ని సాధించటం వంటి మన యుద్ధతయారీలను త్వరితం చేయటం ద్వారా పి.ఎల్.జి.ఏ.ను పి.ఎల్.ఏ.గానూ, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగానూ మార్చాలి.

**మన ప్రజాపునాదిని మరింత లోతుగానూ, మరింత విస్తృతంగానూ బలపర్చుకుందాం:**

మన పార్టీ ఐక్యతా కాంగ్రెస్ ఇచ్చిన తక్షణ కర్తవ్యాల్లో భాగంగా "వ్యూహాత్మక మరియు ఎత్తుగడల ఐక్యసంఘటనలను బలోపేతం చేయాలని" పిలుపిచ్చింది. అందువల్ల మన పార్టీ కమిటీలన్నీ ఈ కర్తవ్యానికి ప్రాధాన్యతనిచ్చి మన గెరిల్లాజోన్లలోనూ, గెరిల్లా బేస్‌లలోనూ నాలుగు వర్గాల ఐక్యసంఘటనకు ప్రాధాన్యత నివ్వాలి. ఇది భవిష్యత్తులో దేశవ్యాప్త విప్లవ ఐక్యసంఘటనకు ప్రాతిపదికగా ఉంటుంది.

మన పార్టీ కాంగ్రెస్ "సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడే శక్తులతోనూ, గ్లోబలైజేషన్ విధానాల్ని వ్యతిరేకించే శక్తులతోనూ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల దేశద్రోహకర లిబరలైజేషన్, ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకించే శక్తులతోనూ ఐక్యతను సాధించాల్సిందిగా" పిలుపిచ్చింది. దేశవ్యాప్తంగా ఇటీవలి కాలంలో సహజ వనరుల మీద, గనులు మరియు ప్రభుత్వరంగ పరిశ్రమల మీద ఎం.ఎన్.సి.ల మరియు సి.బి.బి.ల పట్టు బిగుస్తోంది. ఎస్.ఈ.జడ్.లు మరియు మైనింగ్ పేరుతో నిస్సిగ్గుగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల హెక్టార్ల భూమిని కేటాయిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా రైతాంగ ఉద్యమాలు పెల్లుబుకుతున్నాయి. ముఖ్యంగా కళింగనగర్, సింగూరు, నందిగ్రాం, హరినగర్ మరియు ఇతర ప్రాంతాలలో రైతాంగం ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాల్లోకి దూకుతోంది. ముఖ్యంగా సోషల్ ఫాసిస్టు సి.పి.ఎం. అధికారంలో ఉన్న పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రాం అనేది విస్థాపనకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు వేగుచుక్కగా ఉంది.

అన్ని పార్టీ కమిటీలూ మరియు సభ్యులూ ప్రజాపోరాటాలను దేశవ్యాప్తంగా విస్తృతం చేయటానికి తీవ్రమైన ప్రయత్నాలు చేయాలి. మన వ్యూహాత్మక ప్రాంతాలలో జరుగుతున్న పోరాటాలనూ, బయట జరుగుతున్న పోరాటాలనూ ఒక ఉమ్మడి వేదిక పైకి తీసుకురావాలి. ఈ పోరాటాలు నిస్సందేహంగా, యాదృచ్ఛికంగా మొదలయ్యేవి మరియు చాలా ప్రాంతాల్లో ప్రతిపక్ష బూర్జువా పార్టీలూ, పెటీబూర్జువా పార్టీలూ, మేధావులూ వీటిని ఉపయోగించుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇటువంటి పోరాటాల్లో పాల్గొనని మన సెక్టేరియన్ ధోరణి కారణంగా మన పాత్ర పాసివ్‌గా ఉంది. ప్రజల న్యాయమైన డిమాండ్లతో కూడిన ఇటువంటి పోరాటాలలో మనం తప్పనిసరిగా పాల్గొని, ఆ పోరాటాలకు నాయకత్వం వహించేందుకు తీవ్ర ప్రయత్నం చేసే దిశగా మన అవగాహన, వైఖరి ఉండాలి. జోనల్ కమిటీ/డివిసి నుండి పైస్థాయి లీడింగ్ కమిటీలన్నీ ఇటువంటి పోరాటాలకు చురుకుగా నాయకత్వం అందించేందుకు తప్పనిసరిగా క్యాడర్‌ని కేటాయించుకోవాలి. ఏదైనా ప్రజాఉద్యమాన్ని నిర్మించటంలో ప్రభుత్వ అణచివేత ఒక ఆటంకంగా మారినప్పుడు సంబంధిత ఉన్నత నాయకత్వ కమిటీలు ఆ సమస్య నుంచి బయటపడేందుకు గల మార్గాలను అధ్యయనం చేసేందుకు వాటిపై కేంద్రీకరించాలి.

కాబట్టి మనం ఈ స్థాపనా దినోత్సవం సందర్భంగా మన గెరిల్లాజోన్లలోనూ, గెరిల్లా బేసుల్లోనూ, ఇతర ప్రాంతాల్లోనూ మన విప్లవ ప్రజాసంఘాలను బలోపేతం చేసి బలమైన ఐక్యసంఘటనను నిర్మిద్దామని ప్రతిజ్ఞ చేద్దాం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా లక్షలాది పీడిత ప్రజలను ఐక్యం చేసి మిలిటెంట్ పోరాటాలను నిర్మించాలి. మరియు సామ్రాజ్యవాద, రాజ్య

దాడికి వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన పోరాటాల్ని నిర్మించి నాయకత్వం వహించేందుకు చొరవ చేయాలి.

## పార్టీ రహస్య పని విధానంలోని బలహీనతలను సరిదిద్దుకొని అన్ని స్థాయిలలో రహస్య పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేసుకోవాలి :

విప్లవోద్యమాన్ని నిర్మూలించే దానిలో భాగంగా వివిధ రకాలైన గూఢచార ఏజెన్సీలు మరియు ప్రత్యేక బలగాల్ని ఏర్పరచి పార్టీ నాయకత్వాన్ని అరెస్టు చేయటానికీ, చంపేందుకూ శత్రువు వేగిర పడుతున్నాడు. మన పార్టీ కాంగ్రెస్ తర్వాత ముఖ్యమైన నాయకులు అమరులు గావడమూ, కొంతమంది నాయకులు, కేడర్ అరెస్టు గావటమూ ప్రత్యేకంగా సంబంధిత రాష్ట్రాలను, మొత్తం పార్టీనీ తీవ్రంగా ప్రభావితం చేసింది. పార్టీ నాయకత్వాన్ని నిర్మూలించే ఉద్దేశ్యంతోనే ఎస్.టి.ఎఫ్., ఎస్.ఓ.జి., ఎస్.ఐ.బి. మరియు ఇతర ఇంటెలిజెన్స్ సంస్థలను నిర్మాణం చేశారు. నామమాత్ర పూర్తికాలతత్వాన్ని కలిగి ఉండే కొన్నిపాతకాలపు బలహీనతలు పార్టీ రహస్య పని విధానపు కొనసాగింపుకు ఆటంకం కలిగించి నష్టాలకు దారితీస్తున్నాయి.

ఈ బలహీనతలు, పొరపాట్లను సరిదిద్దుకొని తదుపరి నష్టాలకు గురికాకుండా మన నాయకత్వాన్ని రక్షించుకోవాలి. ఉత్తర తెలంగాణా, ఏ.పి., ఏ.ఓ.బి., ఉత్తర ఛత్తీస్‌గఢ్, తమిళనాడు మరియు మహారాష్ట్రలలో కాంగ్రెస్‌కు ముందే తీవ్ర నష్టాలు జరిగి కాంగ్రెస్ జరిగిన తర్వాత కూడా కొనసాగాయి. బీహార్, ఝార్ఖండ్‌లలో శాక్ నుండి ఏ.సి. వరకు వివిధ స్థాయిల కామ్రేడ్స్ వివిధ ప్రాంతాల్లో అరెస్టయ్యారు.

పార్టీ నాయకత్వం కేంద్రీకరించి పార్టీ పని విధానంలో ఉన్న బలహీనతలను, పొరపాట్లను నిర్దిష్టంగా గుర్తించి మన పని విధానాన్ని వెంటనే మార్చుకోవటం ద్వారా మాత్రమే ఇతరత్రా నష్టాల్ని నివారించగలుగుతాం. కమిటీ సమావేశాల్లో నిర్దిష్టంగా ఈ పొరపాట్లను, బలహీనతలను ఖచ్చితంగా చర్చించాలి. సమావేశాల్లోనూ, వ్యక్తిగతంగానూ ఆయా కామ్రేడ్స్ తప్పులపై ఎటువంటి తటపటాయింపులు లేకుండా విమర్శించి, వారు ఆ తప్పుల నుండి బయటపడేందుకు సహాయపడాలి. తప్పులను, పొరపాట్లను నిర్దిష్టంగా గుర్తించి చర్చించకపోతే నష్టాలను నివారించేందుకు తగిన పద్ధతులను రూపొందించుకోలేము. కాబట్టి మరొకసారి మన పార్టీ రహస్య పని విధానంలో కొనసాగుతున్న తప్పుడు ధోరణులపై నిర్దాక్షిణ్యంగా పోరాడి వాటి నుంచి బయటపడి పార్టీ రహస్య యంత్రాంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రతిజ్ఞ చేద్దాం.

**కామ్రేడ్స్,**

సామ్రాజ్యవాదులు మరియు భారత పాలకవర్గాలు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత భారత ప్రభుత్వ విదేశీ పాలసీలను సామ్రాజ్యవాదులు, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదులే నిర్ణయిస్తున్నారు. ఆర్థిక సహాయం పేరుతో ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్.లు అప్పులను తిరిగి రాబట్టుకునేందుకు భరించలేని షరతులను విధించి వినాశనాన్ని సృష్టిస్తున్నారు. మన్‌మోహన్ ప్రభుత్వం అనుసరించిన న్యూక్లియర్ పాలసీ అనేది అమెరికా సామ్రాజ్యవాదులకు పూర్తి లొంగుబాటుకు సంకేతమే. కొన్ని సామ్రాజ్యవాద దళారీ కంపెనీలకు దేశ సంపదలనూ, ప్రకృతి సంపదలనూ, ఎస్.ఈ.జడ్. పాలసీల ద్వారా అప్పజెప్పేందుకు పూనుకున్నారు.

రైతాంగం ఆత్మహత్యలు సర్వసాధారణమయ్యాయి. చాలా పరిశ్రమల్లో నుండి కార్మికవర్గాన్ని అకారణంగా తొలగిస్తున్నారు. దేశంలో విస్థాపన సమస్య ప్రమాదకర స్థాయికి చేరింది.

యు.పి.ఏ. ప్రభుత్వమైనా, ఎన్.డి.ఏ. ప్రభుత్వమైనా ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్. సంస్థలు రూపొందించిన పాలసీలు, ఎం.ఎన్.సి., సి.బి.బి. మరియు ఫ్యూడల్ శక్తుల ప్రయోజనాలనే కాపాడుతున్నాయి.

దేశంలో పెంపొందుతున్న విప్లవ పరిస్థితిని ఉపయోగించుకొని లక్షలాది ప్రజలను రాజకీయంగా సంఘటితపరిచి ప్రజాసంఘాల నిర్మాణం చేద్దామనీ, మిలీషియాను, పార్టీ సెల్స్‌ని నిర్మాణం చేద్దామనీ మరియు ఇతర రూపాల్లో కూడా వారిని సంఘటితపరుద్దామని మన పార్టీ 3వ స్థాపనా వార్షికోత్సవం సందర్భంగా మరోసారి ప్రతిజ్ఞ చేద్దాం.

విప్లవ రాజకీయాలను ప్రజల్లో విస్తారంగా ప్రచారం చేయటానికి ఇదే సరైన సమయం.

నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకుపోయే క్రమంలో తీవ్రమైన పోరాటం ద్వారా ఏర్పడిన మన పార్టీ పంథాని కాంగ్రెస్‌లో మరింత ఉన్నతీకరించబడిన మన పంథాని ముందుకు తీసుకుపోదామని ప్రతిజ్ఞ చేద్దాం.

పార్టీ స్థాపనా దినోత్సవం సందర్భంగా తీసుకోబోయే ఇతర కర్తవ్యాలతో బాటు పార్టీ సభ్యత్వ క్యాంపెయిన్‌ని తీసుకుందాం. పాత సభ్యత్వాన్ని రిన్యువల్ చేసి రాబోయే సంవత్సర ప్లానుకు అనుగుణంగా కొత్త సభ్యత్వాన్ని ఇవ్వాలి. ఆయా రాష్ట్ర కమిటీలు ఈ పార్టీ సభ్యత్వ క్యాంపెయిన్‌ని జయప్రదం చేయటానికి దిశానిర్దేశాన్ని ఇవ్వాలి.

ప్రజల్ని రాజకీయ పోరాటాల్లోకి, పాక్షిక పోరాటాల్లోకి, విప్లవ యుద్ధంలోకి, విప్లవ ప్రచారంలోకి తీసుకొచ్చే విధంగా మొత్తం పార్టీ సభ్యులందర్నీ తయారుచేద్దాం.

పి.ఎల్.జి.ఏ.ను పి.ఎల్.ఏ.గానూ, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగానూ మారుద్దాం.

క్రింది స్థాయిలో పార్టీ పంథాని అవిశ్రాంతంగా అమలుపరుస్తున్న వేలాది మంది పార్టీ సభ్యులను రిక్రూటు చేసుకుందాం.

విప్లవ పోరాట అవసరాలకు అనుగుణంగా వారికి శిక్షణనిద్దాం.

కుళ్లిపోతున్న సామ్రాజ్యవాద సంస్కృతికీ, ఫ్యూడల్ సంస్కృతికీ, దివాలాకోరు ప్రతీఘాతుక సామ్రాజ్యవాద ప్రభావాలపైనా రాజీలేని పోరాటం చేద్దాం.

మన పార్టీ నిర్మాతలైన చారు మజుందార్ మరియు కన్హయ్ చటర్జీలు రూపొందించిన మార్గంలో దృఢంగా ముందుకు పోదామని ప్రతిజ్ఞ చేద్దాం.

విప్లవాభివందనాలతో
కేంద్ర కమిటీ,

**25-8-2007** సి.పి.ఐ. (మావోయిస్టు)

# అంతర్జాతీయ విప్లవకర కార్మికవర్గ ఎర్రజెండాను సమున్నతంగా ఎత్తిపడదాం!

# దిద్దుబాటు క్యాంపెయిన్‌ను విజయవంతం చేయడం ద్వారా అన్యవర్గ ధోరణులను తొలగించుకొని పార్టీని బోల్షివీకరిద్దాం, మన శక్తులను కాపాడుకుందాం!

# శత్రు నూతన విప్లవ ప్రతీఘాతుక దాడిని ఓడిద్దాం, ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేద్దాం!

*భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) 5వ స్థాపనా దినం సందర్భంగా పార్టీ సభ్యులకూ, పి.ఎల్.జి.ఎ. బలగాలకూ, దేశ ప్రజలకూ కేంద్రకమిటీ పిలుపు*

★

కేంద్ర కమిటీ,

సి.పి.ఐ. (మావోయిస్టు)

## అంతర్జాతీయ విప్లవకర కార్మికవర్గ ఎర్రజెండాను సమున్నతంగా ఎత్తిపడదాం!

## దిద్దుబాటు క్యాంపెయిన్‌ను విజయవంతం చేయడం ద్వారా అన్యవర్గ ధోరణులను తొలగించుకొని పార్టీని బోల్షివీకరిద్దాం, మన శక్తులను కాపాడుకుందాం! శత్రు నూతన విప్లవ ప్రతీఘాతుక దాడిని ఓడిద్దాం, ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేద్దాం!

*భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) 5వ స్థాపనా దినం సందర్భంగా పార్టీ సభ్యులకూ, పి.ఎల్.జి.ఎ. బలగాలకూ, దేశ ప్రజలకూ కేంద్రకమిటీ పిలుపు*

1. మన స్వీయాత్మక శక్తులను ప్రత్యేకించి మన నాయకత్వాన్ని కాపాడుకోవడం కోసం, మన పార్టీ నాయకత్వాన్ని కేడర్లను నిర్మూలించే శత్రు కుటిల పథకాన్ని, ఎల్.ఐ.సి. ఎత్తుగడలను ఓడించడానికి చైతన్యపూర్వకంగా, పట్టుదలతో కృషి చేద్దాం. అన్ని స్థాయిలలో రహస్య యంత్రాంగాన్ని పటిష్టపరుద్దాం !
2. పాలకవర్గాల నూతన విప్లవ ప్రతీఘాతుక దాడిని ఓడించడానికి మొత్తం పార్టీనీ, పి.ఎల్.జి.ఎ.నూ, ప్రజల్నీ కదిలించి దేశవ్యాప్తంగా అన్ని రంగాలలో బలమైన ఉద్యమాన్ని నిర్మిద్దాం !
3. విశాల ప్రజారాశులను సంఘటితపర్చి, వారికి నాయకత్వం వహించే దిశగా అభివృద్ధి చెందుదాం. విప్లవకర ప్రజా పునాదిని విస్తరిద్దాం, మరింత బలోపేతం చేద్దాం. కొనసాగుతున్న దీర్ఘకాలిక ప్రజాయుద్ధ అవసరాలను తీర్చే విధంగా మన మొత్తం పనినీ, పార్టీనీ తీర్చిదిద్దుదాం !
4. గెరిల్లా జోన్లను స్థావర ప్రాంతాలుగా అభివృద్ధిపరిచే, ప్రజాయుద్ధాన్ని దేశవ్యాప్తంగా విస్తరించే లక్ష్యంతో పి.ఎల్.జి.ఎ.ను పి.ఎల్.ఎ.గా, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చెందించడానికి గట్టిగా కృషి చేద్దాం !
5. స్థావర ప్రాంతాల స్థాపనకూ, వాటిని విస్తరించడానికీ, సంఘటితపర్చడానికీ, వాటిని రక్షించడానికీ గానూ గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేసేందుకు, ప్రజాపునాదిని బలోపేతం చేసుకునేందుకు దృఢంగా కృషి చేద్దాం !
6. పార్టీని రాజకీయంగా, సైద్ధాంతికంగా, సైనికంగా, నిర్మాణపరంగా పటిష్టం చేయడం కోసం మొత్తం మన పార్టీని మన మౌలిక పంథాపై భావజాలపరంగా శిక్షణ గరుపుదాం!

7. పీడిత వర్గాల ఉత్తమ శక్తులను పెద్దయెత్తున రిక్రూట్ చేసుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేద్దాం !

8. వివిధ స్థాయిలలో విప్లవ ప్రజా కమిటీలను స్థాపించడానికీ, గెరిల్లాజోన్లను స్థావర ప్రాంతాలుగా అభివృద్ధి చెందించడానికీ మన కృషిని తీవ్రతరం చేద్దాం !

9. మన గొప్ప ఉపాధ్యాయులు, ప్రియమైన నాయకులు, అమరవీరులు కామ్రేడ్ సి.ఎం., కామ్రేడ్ కె.సి.లతో పాటు భారత విప్లవాన్ని పురోగమింపజేయడం కోసం తమ ప్రాణాల్ని ధారపోసిన వేలాదిమంది అమరులందరి గొప్ప ఆదర్శాలను ఎత్తిపడదాం !

**కమ్యూనిస్టు అభినందనలతో,**

**కేంద్ర కమిటీ,**

**సి.పి.ఐ. (మావోయిస్టు)**

15 సెప్టెంబర్ 2008



# సెప్టెంబర్ 21ని పార్టీ స్థాపనా దినం
# ఐదవ వార్షికోత్సవంగా జరుపుకుందాం !

ప్రజల్లో లోతుగా వేళ్లూనుకున్న

బోల్షివిక్ తరహా పార్టీ నిర్మాణానికై ప్రతిన పూనుదాం !

అద్భుతమైన విప్లవ పరిస్థితిని వినియోగించుకుంటూ

ప్రజాయుద్ధంలోకి విశాలమైన ప్రజానీకాన్ని సమీకరిద్దాం !

★

పొలిట్ బ్యూరో

భాకపా(మావోయిస్టు)

# సెప్టెంబర్ 21ని పార్టీ స్థాపనా దినం ఐదవ వార్షికోత్సవంగా జరుపుకుందాం !

## ప్రజల్లో లోతుగా వేళ్లూనుకున్న బోల్షివిక్ తరహా పార్టీ నిర్మాణానికై ప్రతిన పూనుదాం !

## అద్భుతమైన విప్లవ పరిస్థితిని వినియోగించుకుంటూ ప్రజాయుద్ధంలోకి విశాలమైన ప్రజానీకాన్ని సమీకరిద్దాం !

మన పార్టీ పుట్టిన 2004 సంవత్సరంనుండి మొదలై ఈ సంవత్సరం మన పార్టీ స్థాపనా దినం ఐదవ వార్షికోత్సవాన్ని మనం జరుపుకోబోతున్నాం. ఈ ఐదేళ్లలో పార్టీ, పిఎల్‌జిఎ గొప్ప ముందడుగులు వేశాయి. అయినప్పటికీ ప్రస్తుత వ్యవస్థను ధ్వంసం చేసి, నూతన ప్రజాస్వామిక సమాజాన్ని నిర్మించడానికి పురోగమించే క్రమంలో అది సీరియస్ సవాళ్లను ఎదుర్కుంటోంది. విలీనం అయినప్పటినుండీ, ప్రత్యేకించి గత ఏడాదిగా, తీవ్రమైన పోలీసు చర్యను ఎదుర్కుంటూ యుద్ధరంగంలో మనం సాధించిన విజయాలు పీడిత ప్రజల్లో గొప్ప ఆశల్ని రేకెత్తించగా, పాలకవర్గాల్లో, వారి తైనాతీల్లో భయాందోళనల్ని రేకెత్తించాయి. ప్రత్యేకించి, దండకారణ్యంలో ప్రజా ప్రభుత్వ ప్రాథమిక రూపంలో ఎదుగుతున్న ప్రజా రాజ్యాధికారంతో ప్రజల ప్రజాస్వామిక అధికారం మరింత సంఘటితపడడం దేశంలోని యావత్ ప్రజానీకం ముందు ప్రస్తుత అన్యాయమైన వ్యవస్థకు ఒక నిర్దిష్టమైన ప్రత్యామ్నాయాన్ని వుంచింది. దానికి తోడుగా, పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రాంలో, ప్రత్యేకించి లాల్‌గఢ్‌లో జరిగిన చారిత్రక ప్రజా తిరుగుబాట్లు, సోషల్ ఫాసిస్టు సిపిఎం ను సంపూర్ణంగా బహిర్గతం చేయడంతో పాటు అనేక నూతన, సమరశీల ప్రజాపోరాట రూపాల్ని ముందుకు తెచ్చాయి. మనకూ అన్ని రకాల సంస్కరణవాదులకూ, రివిజనిస్టులకూ మధ్య స్పష్టమైన విభజన రేఖల్ని మరింత స్పష్టంగా గీయడానికి దోహదపడ్డాయి. మరింత ప్రత్యేకంగా, రాజ్యాన్ని ఏడు నెలల పాటు ఆ ప్రాంతంలోకి అడుగుపెట్టకుండా సాయుధ ప్రజావెల్లువ దిగ్బంధనం చేయడంతో ఒక నూతన పోరాటరూపం ముందుకు వచ్చింది. దేశవ్యాప్తంగా లాల్‌గఢ్‌లను నిర్మించాలి అనే పిలుపు ముందుకొచ్చింది.

అయితే, భారతదేశంలాంటి విశాల దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం

అనే కర్తవ్యం ఎంత బృహత్తరమైనదో చూసినప్పుడు, పార్టీ అనేక భారీ సవాళ్లను ఎదుర్కొంటోంది అని తెలుస్తుంది. అన్ని స్థాయిల పార్టీ నాయకత్వ కామ్రేడ్స్‌ని కోల్పోవడం వల్ల కలుగుతున్న సీరియస్ నష్టం, దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజాపునాది బలహీనంగా వుండడం అనేవి ఈ సవాళ్లను మరింత తీవ్రమైనవిగా చేస్తున్నాయి. అయితే, ఈ కాలంలో పెట్టుబడిదారీ/సామ్రాజ్యవాద వ్యవస్థలో మున్నెన్నడూ లేనంత భారీ సంక్షోభం వల్ల, అంటే 1930ల నాటి 'మహామాంద్యం' తర్వాత ఇంత పెద్ద ఎత్తున బద్దలైన ఈ సంక్షోభం వల్ల, మనం పరిస్థితిని గ్రహించి, ప్రజలతో లోతుగా మమేకమై, వారిని ప్రజాయుద్ధంలోకి చేరేలా ప్రభావవంతంగా ఉత్తేజపరచగలిగితే మాత్రం గొప్ప అవకాశాలు మన ముందు పరుచుకుని ఉన్నాయి.

## తీవ్రతరమౌతున్న సంక్షోభం, గొప్ప అవకాశాలు

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాతి కాలంలో పెట్టుబడిదారీ/సామ్రాజ్యవాద వ్యవస్థ ఇంత సీరియస్ సంక్షోభాన్ని ఎదుర్కొన్నది లేదు. ఇటువంటి సంక్షోభాలు పెట్టుబడిదారీ వ్యవస్థ విలక్షణతే అయినప్పటకీ, 1930ల నాటి 'మహామాంద్యం' సమయంలో తప్ప అది ఇంత స్థాయిలో బద్దలవడం ఇప్పటిదాకా లేదు. అంతే కాదు, పెట్టుబడిదారీ/సామ్రాజ్యవాద వ్యవస్థకు గుండెకాయ అయిన అమెరికానే ఈ సంక్షోభానికి మూల కేంద్రంగా కూడా వుంది. ప్రపంచవ్యాప్తంగా పెంపొందుతున్న ఈ సంక్షోభం విశ్వవ్యాప్త ప్రభావాన్ని కలిగిస్తోంది, పెట్టుబడిదారీ దేశాల్లోనూ, అందులోనూ మరింత ప్రత్యేకంగా భారతదేశం వంటి అభివృద్ధి చెందని దేశాల్లోని విశాల ప్రజానీకపు జీవితాల్ని అది ప్రభావితం చేస్తోంది.

సంక్షోభ ఫలితంగా, 1. దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ విశాల ప్రజానీకం నమ్మశక్యం కానంతటి దారిద్ర్యానికీ, తీవ్రమైన దోపిడీకీ గురవుతోంది, 2. ప్రపంచవ్యాప్తంగా అన్ని వైరుధ్యాలూ, ప్రత్యేకించి సామ్రాజ్యవాదులకూ, పీడిత జాతులకూ, ప్రజలకూ మధ్య వైరుధ్యమూ, అలాగే సామ్రాజ్యవాదుల మధ్య గల వైరుధ్యమూ మరింత తీవ్రతరమౌతున్నాయి. ప్రజానీకాన్ని దీర్ఘకాల ప్రజాయుద్ధంలోకి ఆకర్షించడం ద్వారా ప్రజల్లో పెంపొందుతున్న అసంతృప్తిని విప్లవం వైపుకూ, కమ్యునిజం (మావోయిజం) వైపుకూ ప్రతిభావంతంగా మళ్లించగలిగితే కనక ఈ రెండు కారణాలూ విప్లవ శక్తులకు గొప్ప అవకాశాల్ని కల్పించగలవు. ఈ లోతైన సంక్షోభం రివిజనిస్టు, ఎన్‌జివో ప్రత్యామ్నాయాలను ఇప్పటికే బహిర్గతపరిచి, మార్క్సిజం పట్ల మళ్లీ ఆసక్తిని రేకెత్తించింది; సంక్షోభం పెరుగుతూ పోతూ, ప్రజలకు సోషలిజం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని స్పష్టంగా అర్థమౌతున్న కొలదీ, ఈ ధోరణి అనివార్యంగా మరింతగా వృద్ధి చెందుతుంది.

దీనికి తోడుగా, సామ్రాజ్యవాదుల మధ్య తీవ్రతరమౌతున్న వైరుధ్యాలు ప్రపంచవ్యాప్తంగా యుద్ధం లాంటి పరిస్థితులకు దారి తీస్తుంది. అమెరికా సామ్రాజ్యవాదలు తమ యుద్ధరంగాన్ని పశ్చిమ ఆసియా నుండి ఆఫ్ఘన్/పాక్ ప్రాంతానికి మార్చి, ఈ రంగంలో భారత పాలకవర్గాలను తమ పంజాగా (ఫ్రంట్

పా) ఉపయోగించుకుంటుండడంతో, ప్రత్యేకించి దక్షిణ ఆసియా ఉపఖండంలో ఇది ఇలాంటి పరిస్థితికి దారి తీస్తుంది. కానీ ఈ వైరుధ్యాలూ, సాయుధ ఘర్షణలూ తీవ్రతరమౌతున్న కొలదీ, ఇప్పటికే ఒక మేరకు అలా అవడం మనకు కనిపిస్తోంది. విప్లవ శక్తులు ఉద్యమంలో గెంతుల్ని సాధించే విధంగా తమ బలగాల్ని మోహరించడానికి దీన్ని ప్రతిభావంతంగా వినియోగించుకోవచ్చు.

కానీ, ఈ సంక్షోభమూ, యుద్ధం వంటి పరిస్థితులతో పాటు, అత్యంత దుర్మార్గమైన ఫాసిస్టు దాడులూ, జాతి నిర్మూలనా దాడులూ కూడా ముందుకొస్తాయి. ఇప్పటికే ఎల్‌టిటిఇ ని అణచివేయడంలోనూ, పాకిస్తాన్‌లోని స్వాత్ లోయలోని (సైనిక) చర్యల్లోనూ ఇది కనిపిస్తోంది. ఫాసిస్టు రాజ్యమూ (రాజ్యేతర శక్తులూ కూడా) సృష్టించే బీభత్సం రెండవ ప్రపంచం యుద్ధం తర్వాతి కాలంలో ఎన్నడూ ఎరగనంతటి స్థాయికి పెరిగిపోతుంది. భారతదేశంలో మావోయిస్టులను కొత్తగా ఎన్నికైన యుపిఎ ప్రభుత్వం టార్గెట్ చేస్తున్న పద్ధతిలోనే కాక, మిలటరీ, పారా మిలటరీ, పోలీసు, ఇంటలిజెన్స్ బలగాల్ని అది పెంచుకుంటున్న తీరులో కూడా ఇది ప్రతిఫలిస్తోంది. మన పార్టీ మీదా, పోరాట ప్రాంతాల మీదా బహుముఖ (ఆల్ రౌండ్) దాడిని వారు తీవ్రతరం చేశారు. మన పార్టీని నిషేధించారు. మన పార్టీని ప్రజలనుండి వేరుచేసి దాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని ప్రయత్నిస్తూ ఉన్నారు. విప్లవ, ప్రజాస్వామిక శక్తులు పెంపొందుతున్న ఈ గొప్ప అవకాశాల్ని వినియోగించుకోవాలంటే, వాళ్లు అన్నిటికంటే ముందుగా ఈ దాడులనుండి తమను తాము ఆత్మరక్షణ చేసుకుని, శతృవు పన్నిన వలలో పడకుండా దాడిని ప్రతిభావంతంగా ఎదుర్కోగల నిర్మాణ రూపాల్ని చేపట్టాలి.

ఈ పరిస్థితుల నేపథ్యంలో, మనం మన బలాన్నీ, పార్టీ ముందున్న గొప్ప సవాళ్లనూ, కర్తవ్యాలనూ అంచనా వేసుకోవాల్సి ఉన్నది.

## గత సంవత్సర కాలంలో సాధించిన ముందడుగులు

గెరిల్లా యుద్ధాన్ని చలన యుద్ధంగా, పిఎల్‌జిఎ ని పిఎల్ఎ గా అభివృద్ధి పరుస్తూ విముక్తి ప్రాంతాన్ని నిర్మించే కేంద్ర కర్తవ్యాన్ని నెరవేర్చడంలో భాగంగా, విప్లవ పోరాటాల్ని అణచివేయడానికి శతృవు చేసే యత్నాల్ని తిప్పి కొడుతూ, ప్రత్యేకించి యుద్ధరంగంలో మనం చెప్పుకోదగిన ముందడుగుల్ని సాధించాం. చారిత్రక నయాగఢ్ దాడి, ఎపి సరిహద్దుల వద్ద చిత్రకొండ (బలిమెల) డ్యామ్ లో 38 మంది గ్రేహౌండ్స్‌ను తుడిచిపెట్టిన ఘటనల తర్వాత శతృ బలగాల మీద చేసే దాడుల్లో ఈ సంవత్సరం మనం ఒక పరిమాణాత్మకమైన గెంతును (క్వాంటమ్ లీప్) సాధించాం. గత ఆరు నెలల్లో దాదాపు 170 రక్షణ బలగాల్ని మనం తుడిచిపెట్టాం. నూతన ప్రజాధికారాన్ని, ప్రత్యేకించి దండకారణ్యంలో, మరింత సంఘటితపరచుకున్నాం. సల్వాజుడూం శక్తుల పాశవికమైన దాడులు జరుగుతున్నప్పటికీ జనతనా సర్కార్ల రూపంలో ఎదుగుతున్న నూతన ప్రజాస్వామిక అధికారం దేశవ్యాప్తంగా ప్రజలకు గొప్ప ఉత్తేజాన్ని కలిగిస్తోంది.

గత సంవత్సర కాలాన్ని మనం చూస్తే కనక, ఈ ఏడాది కాలంలో మనం ప్రధానంగా ఐదు విజయాల్ని సాధించామని ఎత్తి చూపచ్చు.

1. మొదటిది, అన్నిటికంటే ముఖ్యమైనది - ఈ సంవత్సరం మనం చేసిన టిసిఓసి మరింత విజయవంతంగా జరగడం. ఇందులో కనీసం 15 పెద్ద యాక్షన్లు, డజన్ల కొలదీ చిన్న యాక్షన్లూ వుండినాయి. మన అత్యధిక ప్రాంతాల్లో యాక్షన్ల సంఖ్యలోనూ, శత్రువుకు కలిగించిన నష్టాల్లోనూ చెప్పుకోదగిన పెరుగుదల వుండింది. గత సంవత్సర కాలంలో మన వీరోచిత పిఎల్‌జిఎ, ప్రజా మిలీషియా, విప్లవ ప్రజానీకం కలిసి 300కు పైగా పోలీసు, కమాండో, కేంద్ర బలగాల్ని మట్టుబెట్టాయి.అంతకంటే ఎక్కువ సంఖ్యలో శత్రు బలగాలు మన దాడుల్లో గాయాలపాలైనాయి. ప్రజాయుద్ధం మొత్తం అభివృద్ధిలో ఇది ఒక ప్రముఖమైన అభివృద్ధి. 15వ లోక్‌సభ ఎన్నికల సమయం నుండి మన ప్రతిఘటన మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గత నాలుగు నెలల్లోనే దాదాపు 150 శత్రు బలగాల్ని మనం మట్టుబెట్టాం. శత్రు బలగాలపై ఈ ఆంబుష్‌లూ, రెయిడ్‌లూ, దాడుల సందర్భంగా మన బలగాలు గొప్ప సాహసాన్ని ప్రదర్శించాయి. కా.అశుతోష్ అరెస్టుకు వ్యతిరేకంగా, కా.వికాస్ బూటకపు ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా, లాల్‌గఢ్ పోరాటానికి మద్దతుగా ఇచ్చిన బంద్ పిలుపుల సందర్భంగా భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఉదాహరణకు, ఏప్రిల్ నుండి జూన్ వరకు కేవలం మూడు నెలల కాలంలో బి-జె ఏరియాలో దాదాపు 50 మంది శత్రు బలగాల్ని మనం మట్టుబెట్టాం,అంతే సంఖ్యలో గాయపరిచాం. డికెలో శత్రు బలగాల్ని వేధిస్తూ యాక్షన్లు నిరంతరాయంగా కొనసాగుతూనే వున్నాయి. గత ఆరు నెలల్లో శత్రువుకు నష్టం కలిగించకుండా ఒక్క వారం కూడా గడిచింది లేదు. ఇది వాడి శ్రేణుల్లో భయాందోళనల్ని కలిగిస్తోంది. ఇది శత్రుబలగాల మనోబలం మీద బ్రహ్మాండమైన ప్రభావాన్ని చూపింది. వారు మావోయిస్టు ప్రాంతాల్లో పని చేయాలంటేనే భయకంపితులౌతున్నారు.

2. రెండవది, విదేశాలకు చెందిన పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం రైతాంగం భూముల్ని లాక్కునే తన పథకాలను సిపిఎం వెనక్కి తీసుకునేలా నందిగ్రాం ప్రజలు సాగించిన సాయుధ ప్రజాపోరాటాలను మనం ఈ కాలంలో చూశాం. దీని తర్వాత లాల్‌గఢ్, ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో సిపిఎంకీ, రాజ్యానికీ వ్యతిరేకంగా చారిత్రక తిరుగుబాటు జరిగింది. ఈ సాయుధ ప్రజా వెల్లువ రాజ్యాన్నీ, పోలీసు బలగాల్నీ టార్గెట్ చేస్తూ జరిగిన ఇక నిఖార్సైన రాజకీయ చర్య. సంప్రదాయ ఆయుధాలతో సాయుధులైన వేలాది ప్రజానీకం బరి గీసి నిలిచి, దాదాపు ఏడు నెలల పాటు రాజ్య యంత్రాంగాన్ని తమ ప్రాంతంలోకి అడుగిడకుండా నిలువరించారు. అక్కడ అవలంబించిన పోరాట రూపాలు ఇవి: పోలీసులకు తిండి, నీరు ఇవ్వకుండా సాంఘిక బహిష్కరణ చేయడం, ఆ ప్రాంతంలోని పోలీసు స్టేషన్లనూ, క్యాంపులనూ ఘెరావ్ చేయడం, పోలీసు దాడుల్ని భౌతికంగా ఎదుర్కోవడం, వారిని తమ ప్రాంతంనుండి తరిమి కొట్టడం, రోడ్‌బ్లాకులు (రహదారుల పై అడ్డంకులు) సృష్టించడం. వేలాదిమంది ప్రజానీకం సాయుధంగా పాల్గొనే ఒక నూతన ప్రజా ప్రతిఘటనా రూపాన్ని ముందుకు తీసుకురావడంలోనే కాక, మూడు దశాబ్దాలుగా పశ్చిమ బెంగాల్లోని ప్రజలపై పెత్తనం చెలాయిస్తూ వచ్చి సిపిఎం సోషల్-ఫాసిస్టులను

బహిర్గతం చేయడంలో ప్రముఖ పాత్రను వహించడంలో కూడా ఈ పోరాటాలకు చారిత్రక ప్రాముఖ్యత వున్నది. అంతే కాక, శ్రమదానం పై ఆధారపడిన అభివృద్ధి కార్యక్రమాలూ, రోడ్ల నిర్మాణం, నీటిపారుదల పథకాలు, ఆరోగ్య కేంద్రాలు, ఆదివాసీ పిల్లలకు చదువు - వంటి వాటిని కూడా ఆ ప్రాంత ప్రజలు చేపట్టారు. ఇవన్నీ గత 30 ఏండ్లుగా అవినీతిపరులైన సిపిఎం బాసులు నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన పథకాలు. సింగూరు, నందిగ్రాం, మరీ ముఖ్యంగా లాల్‌గఢ్ లు, మూడు దశాబ్దాలుగా సోషల్-ఫాసిస్టుల గుప్పెటలో గిలగిల్లాడుతున్న పశ్చిమ బెంగాల్ రాజకీయతంత్ర (పాలిటీ) ముఖచిత్రాన్ని మార్చివేశాయి.

3. మూడవది, విప్లవ ప్రజానీకం చురుకైన మద్దతుతో మన పిఎల్‌జిఎ బలగాలు బీహార్‌లోని లఖిసరాయి అనే జిల్లా కేంద్రంలో పట్టపగలు సాహసోపేతంగా, మంచి పథకంతో చేసిన ఒక దాడిలో మన ప్రియతమ నాయకుడు, పిబి సభ్యుడు కా.సునిర్మల్‌ను శతృ పంజానుండి విడిపించుకున్నాయి. వరసబెట్టి మన నాయకత్వానికి జరుగుతున్న నష్టాల నేపథ్యంలో ఈ వీరోచిత దాడి గొప్ప ప్రభావాన్ని కలిగించి, చిదంబరం ముఠాకు చెంపపెట్టులా అయ్యింది. జైళ్లలో వీరోచిత పోరాటాలు చేస్తూన్న వందలాది మంది ఖైదీల్లో ఇది ఆశల్ని రేకెత్తించింది. శతృశిబిరంలో భయాందోళనల్ని కలిగించింది. యావత్ పార్టీ శ్రేణుల్లోనూ, ప్రజానీకంలోనూ అది విశ్వాసాన్ని పెంచింది.

4. దేశ రాజకీయ చిత్రపటం పై ప్రముఖమైన ముద్ర వేసిన మరో అంశం, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పార్టీ సాగించిన విస్తృతమైన బహిష్కరణ కార్యక్రమం. మావోయిస్టు ప్రాబల్యం గల ప్రాంతాల్లో మూడు వారాల పాటు కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు భారీ ఎత్తున మోహరించబడినప్పటికీ, తుపాకులు చూపి బలవంతంగా ప్రజలతో ఓట్లు వేయించడానికి నానా పాట్లూ పడుతున్న శతృ బలగాల పై మన పార్టీ, పిఎల్‌జిఎ, విప్లవ ప్రజా అధికార అంగాలూ, ప్రజాసంఘాలూ అనేక ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్‌లు చేపట్టడమే కాక, ఒక విస్తృతమైన ప్రజా రాజకీయ ప్రచార క్యాంపెయిన్‌ను కూడా చేపట్టాయి. మన రాజకీయ ప్రచార క్యాంపెయిన్ ఎంత ప్రభావవంతంగా జరిగిదంటే యావత్ దండకారణ్యంలో, బీహార్, ఝార్ఖండ్‌లలోని అనేక ప్రాంతాల్లో, పశ్చిమ బెంగాల్‌లోని లాల్‌గఢ్‌లో దాదాపు మొత్తంగానూ, పశ్చిమ మిడ్నపుర్, పురులియా, బాంకురా జిల్లాల్లోనూ, ఒరిస్సాలోని మల్కాన్‌గిరి, కోరాపుట్, గజపతి, గంజాం, రాయగఢ ఇంకా ఇతర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారం అనే ఊసే లేకుండే పోయింది. అంతే కాక, దేశాన్నీ, ప్రజల్నీ లూటీ చేసేందుకుగానూ పాలకవర్గాలకు చట్టబద్ధతను కల్పించడానికి నిర్వహించే ఒక ఖరీదైన బూటకపు ప్రజాస్వామిక తంతు తప్ప మరేమీ కాదని బహిర్గతపరుస్తూ దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రముఖమైన ఎడ్యుకేషన్ క్యాంపెయిన్‌లను మనం చేపట్టాం.

5.ప్రముఖంగా ముద్ర వేసిన మరో అంశం ఒరిస్సాలోని కంధమాల్ జిల్లాలో ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు లక్ష్మణానంద హత్య. ఇది ముఖ్యంగా దేశంలోని మైనారిటీలకూ, దళితులకూ మంచి ఆశల్ని కలిగించింది. ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్ మొదలైన ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు గ్యాంగులు ముస్లింపై ఊచకోతను కోయడంలో

ప్రధాన పాత్ర వహించడమే కాక, క్రిస్టియన్ల పై కూడా పెద్దెత్తున దాడులు చేస్తూ, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజ్యం నేర భాగస్వామ్యంతో దళితులపై దాడులనూ, వివక్షనూ కూడా చురుగ్గా కొనసాగిస్తూ వస్తున్నాయి. లక్ష్మణానందనూ, మరి కొందరు శీర్ష ఆర్ఎస్ఎస్ నాయకుల్నీ చంపడం గొప్ప రాజకీయ ప్రభావాన్ని కలిగించింది. మైనారిటీల మీదా, దళితుల మీదా జరిగే వివక్షనూ, దాడుల్నీ ప్రతిఘటించడంలో మావోయిస్టులు ఎల్లప్పుడూ ముందు శ్రేణిలో నిలుస్తారనే ఆశను ఇది వారిలో రేకెత్తించింది.

6. చివరగా, బడా బూర్జువాలకు దాదాపు ఒక కోటి ఎకరాల భూమిని కట్టబెట్టడానికి ఉద్దేశించిన అనేక ప్రాజెక్టుల మూలంగా పెద్ద ఎత్తున పెరుగుతున్న నిర్వాసిత సమస్యకు వ్యతిరేకంగా, ఇతర ప్రగతిశీల శక్తులతో కలిసి మన పార్టీ నాయకత్వంలో విశాలమైన ప్రజా ఉద్యమాలు నడిచాయి. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రాం, సింగూర్లలోని ప్రజా వెల్లువలే కాక, ఎపి లోని విశాఖ ప్రాంతంలో బాక్సైట్ గనులకు వ్యతిరేకంగానూ, ఒరిస్సాలో పోస్కో , ఇతర ప్రాంతాల్లో పెడ్తున్న మైనింగ్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగానూ విస్తృతమైన పోరాటాలు జరిగాయి; చత్తీస్‌గఢ్‌లో లోహండిగూడలో టాటా ప్లాంట్‌ను పోరాటాల్లో ఎగసిన ప్రజానీకం ఆపివేయడమే కాక, ఉత్తర బస్తర్‌లో పెట్టడానికి ప్రయత్నించిన భారీ ప్రాజెక్టులను కూడా అడ్డుకున్నారు; అలాగే ఝార్ఖండ్‌లోనూ భారీ మైనింగ్ ప్రాజెక్టులను ప్రజలు ప్రతిఘటించారు. వీటితో పాటుగా దేశవ్యాప్తంగా సెజ్‌లూ, యుపిలో గంగా ఎక్స్‌ప్రెస్ హైవే వంటి ప్రాజెక్టుల ద్వారా సామ్రాజ్యవాదులకూ, సిబిబి కీ తమ భూమినీ, వనరుల్నీ, సంపదనూ అప్పగించడానికి వ్యతిరేకంగానూ, నిర్వాసిత సమస్యపైనా అనేక ఉద్యమాలు నడిచాయి.

ఈ ముఖ్యమైన ముందడుగులు ఉన్నప్పటికీ, మనం గత ఏడాది కాలంలో సీరియస్ నష్టాల్ని పొందాం. గత కొద్ది సంవత్సరాలుగా నాయకత్వ కామ్రేడ్స్‌ను కోల్పోయి మనం ఎదుర్కొంటున్న నష్టాల పరంపర ఈ సంవత్సరం కూడా కొనసాగి మన పార్టీ పైనా, ఉద్యమం పైనా సీరియస్ ప్రభావాన్ని చూపుతోంది. మన ప్రియతమ కామ్రేడ్, సిసి సభ్యుడు కా.వికాస్‌ను మనం కోల్పోయాం. అలాగే మరో ముఖ్యమైన సిసి సభ్యుడు కా.అశుతోష్ అరెస్టు అయ్యారు.

గత ఏడాది కాలంలో దేశంలోని మావోయిస్టు ఉద్యమ పురోగమనంలో సాధించిన ఈ ముఖ్యమైన ముందడుగులు ప్రజల్లో గొప్ప ఆశల్ని రేకెత్తించాయి. అయితే, మన దేశం ఎంతో విశాలమైనది కావడం, పట్టణ, మైదాన ప్రాంతాల్లో మన ప్రభావం స్వలంగా వుండడం వల్ల పార్టీ కేంద్ర కర్తవ్యాన్ని నెరవేర్చడానికి దేశవ్యాప్తంగా సాయుధ పోరాటాన్ని వ్యాపింపజేయడం పై కేంద్రీకరించి, అనేకానేక నూతన ప్రాంతాలకు ఉద్యమాన్ని విస్తరింపజేయడంలో మన పార్టీ సీరియస్ సవాళ్లను ఎదుర్కొంటోంది.

## సవాళ్లూ, కర్తవ్యాలు

పైన పేర్కొన్న పరిస్థితులు మన పార్టీ ముందు ఈ కింది సవాళ్లనూ, కర్తవ్యాలనూ ఉంచుతున్నాయి.

1. అ. అన్ని రకాల కార్మికవర్గేతర ధోరణులనూ వదిలించుకోవడం ద్వారా, ఆ. పనిలో, నాయకత్వంలో

మావోయిస్టు శైలిని అమలు చేయడం, పార్టీ ప్రజలతోనూ, నాయకత్వం కార్యకర్తలతోనూ లోతుగా మమేకం అవుతూ ప్రతి స్థాయిలో కమిటీ పని విధానం వుండేలా హామీ పడడం ద్వారా, ఇ. మన కార్యకలాపాలన్నిటిలోనూ సరైన వర్గ పంథానూ, ప్రజాపంథానూ అవలంబించడం ద్వారా పార్టీని బోల్షివీకరించడానికి సీరియస్ చర్యల్ని చేపట్టడం.

2. పార్టీలోకి పెద్ద ఎత్తున రిక్రూట్ చేసుకోవడం ద్వారా మన స్వీయాత్మక శక్తుల్ని పెంపొందించుకోవడానికి పెరుగుతున్న ఈ సంక్షోభ పరిస్థితులను మనం వినియోగించుకోవాలి. పార్టీ శక్తులన్నిటినీ సైద్ధాంతికంగా, రాజకీయంగా ఎదిగించుకోవాలి. కార్మికవర్గేతర ధోరణులు నిర్దిష్టంగా ఏ విధంగా ప్రతిఫలిస్తున్నాయో నిర్దిష్టంగా ఎత్తి చూపడం ద్వారా దిద్దుబాటు క్యాంపెయిన్‌ని ప్రభావవంతమైన తీరులో కొనసాగించాలి.

3. పెంపొందుతున్న అద్భుతమైన సంక్షోభ భరిత పరిస్థితిని ఉపయోగించుకుని సాయుధ పోరాట ప్రాంతాల్లో ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయాలి. ఇతర ప్రాంతాల్లో, దేశంలోని అనేకానేక నూతన ప్రాంతాలకు విప్లవ ప్రజా ఉద్యమాన్నీ, యుద్ధాన్నీ విస్తరింపజేసే లక్ష్యంతో ప్రజల్లో పార్టీని లోతుగా నిర్మించాలి.

4. పెరుగుతున్న పాలకవర్గాల బహుముఖ ఫాసిస్టు దాడిని ఎదుర్కోవడానికి పార్టీనీ, పిఎల్‌జిఎనీ, ప్రజలనూ సన్నద్ధం చేయాలి. ఎల్ఐసీ డాక్యుమెంటును లోతుగా అధ్యయనం చేయడం ద్వారా, ప్రత్యేకించి మనం పని చేస్తున్న ప్రాంతాల్లో శతృవు చేపడ్తున్న నిర్దిష్టమైన చర్యల్ని అధ్యయనం చేయడం ద్వారా శతృ పద్ధతులను కూలంకషంగా తెలుసుకోవడానికి ప్రత్యేకమైన ప్రయత్నాల్ని (కృషి) చేపట్టాలి.

5. నిర్దిష్ట సమస్యల మూలాల్లోకి వెళ్లడం ద్వారా అన్ని స్థాయిల్లో నాయకత్వ కామ్రేడ్స్‌ను కోల్పోవడాన్ని నివారించడానికి సీరియస్ చర్యల్ని చేపట్టాలి. అలాగే, పురోగమిస్తున్న విప్లవోద్యమాల క్రమంలో అన్ని స్థాయిల్లో నూతన నాయకత్వాన్ని సృష్టించడానికి సమయావధి గల (టైం బౌండ్) పథకాల్ని అభివృద్ధి చేయాలి.

6. మనల్ని ఒంటరివారిని చేయాలనే శతృవు ప్రయత్నాల్ని తిప్పికొడుతూ విప్లవ ప్రతీఘాతుక శక్తులకు వ్యతిరేకంగా అన్ని రకాల ప్రగతిశీల శక్తులతో, ప్రత్యేకించి జాతి పోరాట శక్తులతో విశాలమైన ఐక్య సంఘటనల్ని నిర్మించాలి.

7. పార్టీ రహస్య నిర్మాణాల్ని నిర్మించడం పైనా, వాటిని బలోపేతం చేయడం పైనా ప్రత్యేక శ్రద్ధ వహించి, విప్లవ ప్రజా ఆచరణ ద్వారా ఒక బలమైన, సంఘటిత, రాజకీయ, నిర్మాణయుతమైన ప్రజా పునాదిని నిర్మించాలి.

8. ప్రభావవంతమైన ఎత్తుగడల్ని రూపొందించడానికి మనం పని చేస్తున్న ప్రాంతాల్లో సంక్షోభం

వ్యక్తమయ్యే తీరుని నిర్దిష్టంగా అధ్యయనం చేయడం ద్వారా, ప్రపంచంలో పెంపొందుతున్న సంక్షోభ పరిస్థితినీ, మన దేశం పై దాని ప్రభావాన్నీ వినియోగించుకోవడానికి చొరవ చేయాలి. పెట్టుబడిదారీ వ్యవస్థలో మున్నెన్నడూ లేనంత స్థాయిలో సంక్షోభం బద్దలైన నేపథ్యంలో పెద్దెత్తున ప్రజా తిరుగుబాట్లు లేచే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రజల్ని తమ డిమాండ్ల పైనే కాక రాజకీయ పోరాటాల్లోకీ సమీకరించడానికీ, అలాగే అన్యాయమైన ప్రస్తుత వ్యవస్థకు వ్యతిరేకంగా చేసే యుద్ధంలోకి వారిని ఆకర్షించడానికీ సరైన సమయంలో, ప్రతిభావంతంగా జోక్యం చేసుకోవాలి.

9. దేశంలోని అన్ని రకాల సమస్యల విషయంలోనూ ప్రభావవంతమైన రాజకీయ జోక్యం ద్వారా దేశ రాజకీయ చిత్రపటంలో పార్టీని ఒక ప్రముఖమైన రాజకీయ శక్తిగా (ఎంటిటీ) స్థాపించాలి, ఈ రాజకీయ జోక్యంలో పెద్దెత్తున రాజకీయ ప్రచారం, ఆందోళనలూ, ప్రత్యేకంగా ఎంపిక చేయబడిన సైనిక చర్యలూ వుండాలి. ఆ సమస్యలపై విస్తృతంగా ప్రజల్ని కదిలించాలి.

కామ్రేడ్స్,

గొప్ప అవకాశాలు మన ముందు పరుచుకుంటున్నాయి. గెంతుల రూపంలో అన్ని ప్రాంతాల్లో మన ఉద్యమాన్ని పురోగమింపజేయడం ద్వారా, సాపేక్షికంగా బలహీనంగా ఉన్న మన స్వీయాత్మక శక్తుల్ని పెంపొందించుకోడానికి ఈ పెంపొందుతున్న సంక్షోభ పరిస్థితులను వినియోగించుకుందాం. శత్రువు అహంకారపూరిత విర్రవీగుడు వాడి బలానికి సంకేతం కాదు, అది వాడి లోతు లేని, బోలైన బలహీనతనే సూచిస్తుంది. అయినప్పటికీ మనం దాన్ని సీరియస్‌గా తీసుకోని వాడి దాడులకు బలైపోకుండా చూసుకోవాలి. కా.మావో, 'శత్రువును తెలుసుకో, నిన్ను నీవు తెలుసుకో, అప్పుడు మనం వంద యుద్ధాలనైనా గెలుస్తాం' అని అన్నారు.

సాయుధ పోరాట ప్రాంతాల్లో వేసిన గొప్ప ముందడుగుల్ని, ప్రత్యేకించి చత్తీస్‌గఢ్‌లో, బి-జెలో, లాల్‌గఢ్‌లో వేసిన ముఖ్యమైన ముందడుగుల్ని విస్తరింపజేద్దాం. వాటినుండి పాఠాల్ని తీసుకుందాం. దేశవ్యాప్తంగా వందలాది లాల్‌గఢ్‌లనూ, నూతన సాయుధ పోరాట ప్రాంతాలనూ నిర్మించడం ద్వారా దేశం నలుమూలలకూ విప్లవోద్యమాన్ని విస్తరింపజేద్దాం.

వర్గపోరాటాల్లో ముందుంటూ వాటికి నాయకత్వాన్ని వహించడానికి మన పార్టీ ఉజ్వలమైన వారసత్వాన్ని ముందుకు కొనిపోదాం. త్యాగాలకు నూతన నమూనాల్ని అందిద్దాం. నూతన సవాళ్లనూ, బాధ్యతలనూ భుజానికెత్తుకోవడానికి ప్రతి ఒక్కరం సన్నద్ధమవుదాం. మన బాట ఎంతో కష్టభూయిష్టమైనదనడంలో సందేహం లేదు. కానీ విజయానికి హామీ వుంది.

**పొలిట్‌బ్యూరో**

2009 **సి.పి.ఐ. (మావోయిస్టు)**

# పార్టీ 6వ వార్షికోత్సవాలకు విప్లవ జేజేలు!

**నాయకత్వానికీ, శ్రేణులకు కలుగుతున్న భారీ నష్టాలను నివారించడానికి**

**పార్టీని శత్రు దుర్భేద్యమైందిగా పటిష్టపరచుకుందాం!!**

**అద్భుత విప్లవ పరిస్థితికీ, ప్రజాయుద్ధ పురోభివృద్ధికీ తగినట్లు**

**సమర్థవంతంగా నాయకత్వాన్ని అందించడానికి**

**పార్టీని సంఘటితపరచుకుందాం!!!**

***2010 సెప్టెంబర్ 21 నుండి 27 వరకు పార్టీ 6వ వార్షికోత్సవాలను***

***సమరోత్సాహాలతో ఘనంగా జరపాలని పార్టీ శ్రేణులకు పొలిట్ బ్యూరో పిలుపు***

*

**పొలిట్‌బ్యూరో**

**కేంద్రకమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

## పార్టీ 6వ వార్షికోత్సవాలకు విప్లవ జేజేలు!

### నాయకత్వానికీ, శ్రేణులకు కలుగుతున్న భారీ నష్టాలను నివారించడానికి పార్టీని శత్రు దుర్భేద్యమైందిగా పటిష్టపరచుకుందాం!!

### అద్భుత విప్లవ పరిస్థితికీ, ప్రజాయుద్ధ పురోభివృద్ధికీ తగినట్లు సమర్థవంతంగా నాయకత్వాన్ని అందించడానికి పార్టీని సంఘటితపరచుకుందాం!!!

### 2010 సెప్టెంబర్ 21 నుండి 27 వరకు పార్టీ 6వ వార్షికోత్సవాలను సమరోత్సాహాలతో ఘనంగా జరపాలని పార్టీ శ్రేణులకు పొలిట్ బ్యూరో పిలుపు

ప్రియమైన కామ్రేడ్స్,

సెప్టెంబర్ 21, మన నూతన పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అవతరణ దినం సమీపించబోతున్నది. ఈ సెప్టెంబర్ 21తో మన నూతన పార్టీ ఏర్పడి ఆరు ఏండ్లు నిండుతాయి. శత్రువు మన పార్టీని నిర్మూలించడానికి మునుపెన్నడూ లేని విధంగా సాగిస్తున్న భారీ సైనిక దాడిని ధైర్యసాహసాలతో ఎదిరిస్తూ, ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకుపోతున్న మన పార్టీ, పిఎల్‌జిఎ, విప్లవ ప్రజా కమిటీలు, ఇతర ప్రజా నిర్మాణాలన్నింటిలోని కామ్రేడ్స్ అందరికీ, శత్రువు నెదిరిస్తూ అరెస్టయి చెరశాలలను విప్లవ శిబిరాలుగా మలుస్తున్న కామ్రేడ్స్ అందరికీ, విప్లవ ప్రజానీకానికందరికీ ఈ సందర్భంగా పొలిట్‌బ్యూరో హార్దిక విప్లవాభినందనలు తెలియజేస్తోంది.

సెప్టెంబర్ 21, పార్టీ అవతరణ దినం. పార్టీ 6వ వార్షికోత్సవం అనగానే ముందు మన స్మృతి పథాన కదిలేది మన పార్టీ వ్యవస్థాపకులు భారత విప్లవ మహా నాయకులు, ప్రియతమ కామ్రేడ్స్, అమరులు చారుమజుందార్, కన్హయ్ ఛటర్జీలతో పాటు కామ్రేడ్స్ సరోజ్‌దత్తా, అమూల్యసేన్, చంద్రశేఖర్‌దాస్, క్రిష్ణమూర్తి, సత్యం, కైలాసం, అప్పు, నిర్మల, ఐ.వి., శ్యాం, మహేష్, మురళి, అంజన్న, పద్మ, జ్యోతి, చిట్టెక్క, సుఖదేవ్ తదితర 10 వేలమంది జ్ఞాత, అజ్ఞాత వీరయోధులు. వెనువెంటనే మన స్మృతిలోకి వచ్చేది తమ చేతుల మీదుగా మన నూతన పార్టీని ఏర్పరచి, నాయకత్వాన్నందించి పోరాట క్రమంలో కర్కశమైన శత్రు చెరసాలల పాలయిన మన ప్రియతమ కామ్రేడ్స్ సుశీల్‌రాయ్, నారాయణ సాన్యాల్, జనార్ధన్, శోభా, కోబాడ్‌గాంధీ, ఆశుతోష్ తదితరులు, అమరులైన స్ఫూర్తి ప్రదాతలు కామ్రేడ్స్ కరంసింగ్, రాజ్‌కుమార్ తదితరులందరితో పాటు పార్టీ అవతరణ వుత్సవ ఊరేగింపులో పార్టీ, ప్రజా విముక్తి గెరిల్లా సేన జండాలను చేబూని సమరోత్సాహంతో భూమ్యాకాశాలు ప్రతిధ్వనించేలా నినదిస్తూ సాగిపోతున్న కామ్రేడ్స్ కళ్లముందు కదలాడుతారు. గత 6 సంవత్సరాలలో ప్రజాయుద్ధ మార్గంలో సాగిపోతూ అడుగడునా రక్తతర్పణ చేస్తూనే పార్టీకి ఎన్నో విజయాలను, గొప్ప అనుభవాలను

అందించిన 15 వందల మంది మన ప్రియతమ కామ్రేడ్స్ చంద్రమౌళి, రాజమౌళి, అనురాధా గాంధి, అజయ్‌దా, సుధాకరరెడ్డి, అప్పారావు, మైముద్దీన్ (రవి), మాధవ్, శ్రీధర్, మంగ్తూ, రణదేవ్, సూర్యం, కరుణ, రింకీ, డేవిడ్, లాల్‌మోహన్ టుడు, అభిషేక్ ముఖర్జీ, ఉమాకాంత్ మహతో, సిద్ధూసోరేన్, క్రిష్ణ యాదవ్, అభయ్, కొండల్‌రెడ్డి, మస్తాన్‌రావు, రాంచందర్, సుకాంతో, వినయ్, వికాస్, దయ, మంగేష్, సింగన్న, ఆంధ్రు, లాల్‌మోహన్ టుడు, బందు, శంకర్, రమేష్, సంపత్, శారద, గిరిజ (స్వర్ణ), కమల, రాంబత్తి, రుక్మతి, సుచిత్ర ముర్ము తదితరులు మన స్మృతిలో మెదిలిన వుద్విగ్న క్షణాలు గుండెలను బరువెక్కిస్తాయి. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా శత్రు బలగాలపై తుఫాను వేగంతో దాడి చేసి విజయాలు సాధించిపెట్టిన సమర్థులైన మన కమాండర్లకూ, సాహసిక యోధులందరికీ విప్లవ జేజేలు. ఈ యుద్ధంలో తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమర కామ్రేడ్స్ అందరికీ వినమ్రంగా మన పొలిట్‌బ్యూరో జోహార్లు అర్పిస్తున్నది. వారి ఆదర్శవంతమైన జీవితాలను స్ఫూర్తిగా తీసుకుందాం.

గత 45 వసంతాల సుదీర్ఘ భారత నూతన ప్రజాస్వామిక విప్లవ చరిత్రలో నక్సల్‌బరి వసంత మేఘగర్జన; కామ్రేడ్ సిఎం నేతృత్వంలో 1969 ఏప్రిల్ 22న సి.పి.ఐ (ఎం-ఎల్), కామ్రేడ్ కెసి నాయకత్వంలో అదే సంవత్సరం అక్టోబర్ 20న ఎం.సి.సి. ఏర్పడిన చారిత్రాత్మక మహత్తర ఘటనలు; నక్సల్బరీ తరహా సాయుధ వ్యవసాయ విప్లవ పోరాటాలు దేశం నలుమూలలా వెల్లువెత్తడం; ప్రజాయుద్ధానికి వ్యతిరేకంగా దేశవ్యాపిత ఫాసిస్టు దమనకాండ-విప్లవోద్యమ సెట్‌బ్యాక్; సెట్‌బ్యాక్‌ను అధిగమిస్తూ నూతన విప్లవ తరంగంగా గయ-ఔరంగాబాద్-జహానాబాద్, కరీంనగర్-ఆదిలాబాద్ రైతాంగ విప్లవ పోరాటాలు, ఆంధ్ర-బీహార్ విప్లవోద్యమాలు పెల్లుబుకడం; దేశంలో విప్లవం పుంజుకుంటూ అప్రతిహతంగా పురోగమించడం; మితవాద, అతివాద అవకాశవాదులకు వ్యతిరేకంగా జరిగిన ఆంతరంగిక పోరాటాలు; చీకటి అధ్యాయం (బ్లాక్ చాప్టర్) లాంటి విషాదాలు; ఆశ్చర్యపరిచే ప్రజాయుద్ధ విజయాలు, అబ్బురపరిచే సాహసాలు, అమూల్యమైన త్యాగాలు; దేశంలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధం మలుపులు, మెలికల గుండా సాగుతూ 2004 సెప్టెంబర్ 21న మన మహత్తర నూతన పార్టీ అవతరణ మన కండ్ల ముందు నిలుస్తాయి. మరొకవైపు అంతర్జాతీయ రాజకీయ రంగాన గొప్ప రాజకీయ చర్చ (గ్రేట్ డిబేట్), చైనాలో సాంస్కృతిక మహా విప్లవం, మావో మరణానంతరం ప్రపంచ సోషలిస్టు విప్లవ చివరి స్థావరం పతనం కావడం, వివిధ దేశాల్లోని విప్లవాలపై దాని ప్రతికూల ప్రభావం, ప్రత్యేకంగా మన దేశ విప్లవంపై చూపిన ప్రభావం తదితర ప్రపంచాన్ని కుదిపివేసిన పరిణామాలు చాలా స్పష్టంగా మన ముందుకొస్తాయి. మన నూతన పార్టీ అవతరణ దినం సందర్భంగా అమరులు మన ప్రియతమ కామ్రేడ్స్ సిఎం, కెసి తదితర వేలాది వీర యోధులందరినీ స్మరించుకుని సగౌరవంగా తలవంచి అరుణారుణ జోహార్లు పలుకుదాం. అమరుల ఆశయ సాధనకు బిగిపిడికిళ్లతో ప్రతిన బూనుదాం!

కామ్రేడ్స్,

అత్యంత ఉత్సాహపూరితంగా పార్టీ ఐదవ వార్షికోత్సవాలు జరుపుకుని అప్పుడే సంవత్సరం కావస్తోంది.

ఈ కాలంలో విప్లవానికీ, విప్లవ ప్రతిఘాతుకానికీ నడమ అత్యంత తీవ్రంగా సంఘర్షణ కొనసాగింది. వ్యూహాత్మక దృష్టితో చూసినప్పుడు ఈ కాలంలో మన దేశంలోనూ, మన ప్రజాయుద్ధంలోనూ చాలా ప్రాధాన్యత కలిగిన పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ పరిణామాలు భారత విప్లవాన్ని చాలా కాలం వరకు ప్రభావితం చేస్తాయి.

ఒకటి – మన పార్టీ 5వ వార్షికోత్సవాలకు 4 నెలల ముందు నుండి ఈ సంవత్సరం జూలై మధ్య సాగిన 14 నెలల కాలంలో మన పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ప్రియతమ నాయకుడు కామ్రేడ్ ఆజాద్‌తో పాటు అగ్రశ్రేణికి చెందిన 8 మంది కామ్రేడ్స్‌నూ, 10 మంది రాష్ట్రకమిటీ సభ్యులనూ శత్రువు అరెస్టు చేయడం లేదా పట్టుకొని చంపడం చేశాడు. జిల్లా కమిటీల నుండి కింది వరకు గల చాలామంది పార్టీ నాయకత్వ కామ్రేడ్స్‌ని అరెస్టు చేశాడు లేదా పట్టుకొని చంపాడు. విప్లవ నాయకత్వాన్ని నిర్మూలించి విప్లవాన్ని ఓటమి పాలుచేసే ప్రతిఘాతుక వ్యూహంతోనే శత్రువు పథకం ప్రకారం దాడి చేస్తున్నాడు. ఈ పథకం కొత్తదేమీ కానప్పటికీ దీని ద్వారా ఈ కాలంలో శత్రువు మన నాయకత్వానికి కలిగించిన నష్టం చాలా తీవ్రమైంది.

నూతన పార్టీ ఏర్పడిన ఒక్క సంవత్సరం తర్వాత మొదలైన అగ్రశ్రేణి నాయకత్వపు నష్టాల కొనసాగింపుగా ఇటీవల జరిగిన ఈ నష్టం పార్టీనీ, ఉద్యమాన్ని చాలా తీవ్రంగా ప్రతికూలంగా ప్రభావితం చేసింది. ప్రత్యేకంగా కామ్రేడ్ ఆజాద్‌ను కోల్పోవడం ద్వారా మన పార్టీకి తీవ్రమైన నష్టం జరిగింది. పార్టీ అత్యున్నతస్థాయి కమిటీలో కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తూ, విప్లవోద్యమంలోని అనేక రంగాల్లో బహుముఖ సేవలను అత్యంత సమర్థవంతంగా అందించిన కామ్రేడ్ ఆజాద్ లేని లోటును సమీప భవిష్యత్తులో తీర్చుకోలేనిది.

నూతన పార్టీ సుసంపన్నమైన రాజకీయ, నిర్మాణ, సైనిక పంథాలను, బలమైన పార్టీని–నాయకత్వాన్ని, విశాలమైన పోరాట ప్రాంతాలను దేశ ప్రజల ముందుంచింది. పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసం మరింతగా పెరిగింది. దేశంలో విప్లవ పురోగమనానికి స్వీయాత్మకంగా చాలా అనుకూల పరిస్థితులు ఏర్పడినాయి. అనుకూలమైన స్వీయాత్మక పరిస్థితిలో అత్యంత కీలకమైనది బలమైన పార్టీ – బలమైన నాయకత్వం. ఇలాంటి గొప్ప విప్లవకర స్వీయాత్మక పరిస్థితిని చూసి భీతిల్లిన భారత పాలకవర్గాలు, సామ్రాజ్యవాదులు మన పార్టీ నాయకత్వాన్ని హత్య చేసి, సుదీర్ఘకాలం పాటు జైళ్లలో బంధించి పెట్టి పార్టీని బలహీనపరచి విప్లవాన్ని అణచివేయాలనే పథకం రూపొందించుకున్నారు. వీరు 2005, 2006లలో మన పార్టీ నాయకత్వానికి కలిగించిన నష్టాలు ఈ దుష్ట పథకం వల్ల జరిగాయి. అయినప్పటికీ పార్టీ ఏకతా కాంగ్రెస్ – 9వ కాంగ్రెస్ పార్టీ ఐక్యతను పటిష్టం చేసి, విప్లవ పురోగమనానికి ఒక సమగ్ర పథకాన్ని రూపొందించి, నాయకత్వాన్ని సుదృఢం చేసింది. ఆంధ్ర ఉద్యమం, ఉత్తర ఛత్తీస్‌గఢ్ ఉద్యమం సెట్‌బ్యాక్‌కు గురైనప్పటికీ, ఉత్తర ఒడిషా జిల్లాల్లో ఉద్యమానికి చాలా నష్టాలు కలిగినప్పటికీ, ఆచరణ క్రమంలో సాధించిన విజయాలు విప్లవ క్యాంపు ఆత్మ విశ్వాసాన్ని మరింతగా పెంచాయి.

ఏకతా కాంగ్రెస్‌ని విజయవంతంగా జరపడంతో పాటు తదనంతర కాలంలో మనం సాధించిన ఈ విజయాలు శత్రు క్యాంపుని చాలా తీవ్రంగా కలవరపరిచాయి. దీనితో విప్లవ నాయకత్వాన్ని నిర్మూలించడానికి శత్రువులు ముమ్మరంగా ప్రయత్నించారు. పార్టీ 5వ వార్షికోత్సవానికి కొద్ది నెలల ముందు నుండి మన నాయకత్వానికి కలిగించిన నష్టాలు మరింత తీవ్రమైనవి. అయితే అవెంత తీవ్రమైనవి అయినప్పటికీ నక్సల్బరీ విప్లవ తిరుగుబాటు తర్వాత గడచిన 45 ఏండ్లలో భారత విప్లవోద్యమం నూతన నాయకత్వాన్ని సృష్టించుకుంటూ వస్తూనే ఉన్నది.

రెండు – సోనియా–మన్మోహన్‌సింగ్‌ల నాయకత్వంలోని యు.పి.ఏ. ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి రాగానే విప్లవోద్యమంపై మునుపెన్నడూ లేనిస్థాయిలో ముమ్మరం చేసిన బహుముఖ దాడి వ్యూహానికి కేంద్ర హోంమంత్రి చిదంబరం నేతృత్వం వహిస్తున్నాడు. ఈ బహుముఖ దాడి వ్యూహానికి నిర్దిష్ట రూపంగా ఫాసిస్టు "ఆపరేషన్ గ్రీన్‌హంట్" క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. భారత విప్లవోద్యమాన్ని అణచివేసే లక్ష్యంతో గత 45 ఏండ్లల్లో పాలకవర్గాలు రూపొందించుకున్న దాడి వ్యూహాలలో 2009 మధ్య నుండి కొనసాగుతున్న ఈ దాడి వున్నతమైనది, విస్తృతమైనది, దేశవ్యాపితమైనది, తీవ్రమైనది, మోసపూరితమైనది, కేంద్రీకృతమైనది, దీర్ఘకాలికమైనది. పాలకవర్గాలు విప్లవోద్యమం నుండి ఎదురవుతున్న ప్రతి సవాలును, గమనంలో ఉంచుకుని దీనిలో అవసరమైన మార్పులు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే మన బలమైన గ్రామీణ ప్రాంతాలపై, గెరిల్లాజోన్లపై, ప్రత్యేకించి దండకారణ్యం, ఝార్ఖండ్, లాల్‌గఢ్, నారాయణపట్నాలపై కేంద్రీకరించి దాడి క్యాంపెయిన్‌ను కొనసాగిస్తున్నాయి. ఈ క్యాంపెయిన్ పూర్తిగా కౌంటర్ ఇన్‌సర్జెన్సీ, కౌంటర్ గెరిల్లా వార్‌ఫేర్ సిద్ధాంతంపై ఆధారపడి కేంద్రీకృత కమాండ్ కింద వ్యూహాత్మక బలగాలచే (స్ట్రాటజిక్ ఫోర్సెస్ – ప్రత్యేక పోలీసు, పారామిలటరి, ఎస్‌ఏఎఫ్ (కోబ్రా), మిలటరిలోని స్పెషల్ ఫోర్సెస్) అత్యంత క్రూరంగా, అత్యంత మోసపూరితంగా నిర్వహించబడుతున్నది. క్రమంగా వివిధ రకాల స్పెషల్ ఫోర్సెస్‌ని భారత సైన్యం నడిపే విధంగా పరిస్థితి మారుతున్నది. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో పాలకవర్గాలు అమలు చేస్తున్న దమనకాండ, హింసాకాండ 'ప్రజలపై ప్రభుత్వ యుద్ధం'గా బాగా బహిర్గతమైంది. ఈ ఫాసిస్టు దాడి సామాజిక వైరుధ్యాలను తీవ్రతరం చేసింది. గత 45 ఏండ్లలో ఎప్పుడూ ఏ నిర్బంధ క్యాంపెయిన్ ఇంత తీవ్రంగా ప్రజల నిరసనకు, ప్రతిఘటనకు గురికాలేదు.

మూడు – భారత రాజ్య యంత్రాంగం, న్యాయవవస్థ, పాలనా యంత్రాంగం, శాసనవ్యవస్థ, ప్రభుత్వ పాలసీలు కౌంటర్ ఇన్‌సర్జెన్సీ సిద్ధాంతాలతో పునర్నిర్మాణం అవుతున్నాయి. రాజకీయ పార్టీలు, వివిధ సామాజిక సంస్థలు, సంస్కృతి, మీడియా ఈ సిద్ధాంతంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా చాలా తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ఈ సిద్ధాంతాని కనుగుణంగా ఓవర్ట్ లేదా కోవర్ట్ పద్ధతుల్లో వివిధ సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మన నూతన పార్టీ ఏర్పడిన తర్వాత విప్లవోద్యమాన్ని అణచివేయడానికి పాలకవర్గాలు ఈ నూతన ధోరణిని ముందుకు తెచ్చినా, మన్మోహన్ సింగ్ ప్రభుత్వం

రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందులో గణనీయమైన మార్పు వచ్చింది. నేడు ఈ ధోరణి దేశవ్యాపితమైంది. దీనికి ప్రేరణ, రిమోట్ కంట్రోల్ అమెరికా సామ్రాజ్యవాదుల నేతృత్వంలో సామ్రాజ్యవాదులు రూపొందించి అమలు చేస్తున్న 'వార్ ఆన్ టెర్రర్' (టెర్రరిజంపై యుద్ధం). రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత కమ్యూనిస్టు విప్లవాలను, జాతి విముక్తి పోరాటాలను ఎదుర్కోవడానికి సామ్రాజ్యవాదులు రూపొందించుకున్న విప్లవ ప్రతిఘాతుక 'లో ఇంటెన్సిటి కాన్ఫ్లిక్ట్' (తక్కువ తీవ్రత కలిగిన యుద్ధం–ఎల్.ఐ.సి.) అనేది సామ్రాజ్యవాదుల, భారత పాలకుల 'వార్ ఆన్ టెర్రర్'కు మూలం. ఈ ప్రతీఘాతుక ఎల్ఐసీ విధానం వల్ల మన దేశంలోని సామాజిక వైరుధ్యాలు మరింతగా పదునుదేరాయి. సామ్రాజ్యవాదులు, భారత పాలకులు ఎల్ఐసి, కౌంటర్ ఇన్సర్జెన్సీ విధానాలకు అనుగుణంగా రాజ్యాన్నీ, న్యాయవవస్థనూ, పాలనా వ్యవస్థనూ, చట్ట సభలనూ, రాజకీయాలనూ, ఆర్థికాన్నీ సంస్కృతినీ, మీడియాను పునర్నిర్మాణం చేయడానికి ఎంత ప్రయత్నిస్తే, అంత ఎక్కువగా విశాల ప్రజల తీవ్ర నిరసనకు, ప్రతిఘటనకు గురికాకతప్పదు. ఇప్పటికే దేశవ్యాపితంగా ఇలాంటి ప్రతిఘటనను వారు చవి చూస్తున్నారు.

కామ్రేడ్స్,

గతంలో ఎన్నడూ లేని స్థాయిలో, విస్తృతిలో, అన్ని రంగాల్లోనూ విప్లవం విప్లవ ప్రతీఘాతుకాన్ని ఎదుర్కొంటున్నది. మన న్యాయబద్ధమైన ప్రతిఘటనా యుద్ధంలో మనం చాలా త్యాగాలు చేశాము. ఈ త్యాగాలు లేకుండా గత సంవత్సర కాలంలో వివిధ రంగాల్లో మనం సాధించిన ఏ ఒక్క విజయం సాధ్యమయ్యేది కాదు. యావత్తు పార్టీ, పిఎల్జిఏ, జనతన సర్కార్లు, ప్రజా నిర్మాణాలు, విప్లవ క్యాంపులో సమీకరించబడుతున్న వారంతా, ప్రజా పక్షం వహిస్తున్నవారంతా ఆపరేషన్ గ్రీన్హంట్కు వ్యతిరేకంగా జీవన్మరణ పోరాటమే చేశారు. ఈ సాహసిక వీరోచిత పోరాటం ద్వారానే గత సంవత్సర కాలంలో మనం కొన్ని గొప్ప విజయాలను, విలువైన అనుభవాలను సైతం సాధించుకున్నాం.

గత సంవత్సర కాలంలో మనం సాధించుకున్న విజయాలు ఇలా వున్నాయి.

ఒకటి – గెరిల్లా యుద్ధ విజయాలు. ఛత్తీస్గఢ్లోని సింగన్మడుగు, ముకరం (తాడిమెట్ల), కొంగెర; మహారాష్ట్రలోని లాహెరి; బెంగాల్లోని సాంక్రేల్, సిల్దా, ఝార్ఖండ్లోని గుమ్లా, విష్ణుపూర్, లతేహార్; బీహార్లోని సోనో, ప్రభుత్వ టోల్ ప్లాజా (గయా), టాండ్వా బాజార్; ఒరిస్సాలోని పొతకల్, బైఫర్గూడలలో శత్రు బలగాలపై చేసిన విజయవంతమైన దాడులు, ప్రత్యేకించి చారిత్రాత్మక ముకరం (తాడిమెట్ల) దాడి శత్రు బలగాల చొరవని దెబ్బతీశాయి. పిఎల్జిఏ చొరవని పెంపొందించాయి. ప్రజల ఆత్మవిశ్వాసం పెంచాయి. పిఎల్జిఏని మరింతగా సాయుధం చేసి, గెరిల్లా యుద్ధంలో నూతన అనుభవాలు అందించాయి. తాడిమెట్లలో మనం సాధించిన అనుభవం వాటిన్నింటిలోకి ఉన్నతమైనది. ఈ దాడులు ప్రజలను, ప్రజా నిర్మాణాలను, ప్రజా వ్యవసాయ, వుత్పత్తి–అభివృద్ధి–సంక్షేమ కార్యకలాపాలను రక్షించుకోవడానికీ, సజావుగా నడిపించుకోవడానికి ఎంతగానో తోడ్పడినాయి. ప్రజల క్రియాశీల

మద్దతే ప్రజాయుద్ధంలో మనం సాధించిన విజయాలకు పునాదిలా ఉపయోగపడింది. మనం ఇలాంటి చురుకైన ప్రతిఘటన కొనసాగించకపోయి వుంటే మనల్ని రూపుమాపడానికి తప్పకుండా శత్రువుకు సానుకూల పరిస్థితి ఏర్పడి వుండేది. మన ఈ ఆత్మరక్షణా యుద్ధం బలహీనంగా సాగితే మన విజయాలు చేజారి వుండేవి. మరింత పెద్దయెత్తు సన్నాహాలు చేసుకుని మరింత పెద్దదాడికి రాబోతున్న శత్రు బలగాలను ఎదుర్కోవడానికి ఈ గొప్ప అనుభవాలు తప్పకుండా మనకు ఎంతో బాగా తోడ్పడుతాయి.

రెండు – కళింగ నగర్, సింగూర్, నందిగ్రాం సమరశీల ప్రజా పోరాటాల ఒరవడిలో, అంతకంటే ఉన్నత, విస్తృత స్థాయిలో లాల్‌గఢ్, నారాయణపట్నం ప్రజా పోరాటాల ప్రభంజనాలు పెల్లుబికాయి. వాటికి మన పార్టీ నాయకత్వం వహించింది. ఇవి రెండూ రివిజనిజానికి లేదా మితవాద అవకాశవాదానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడినాయి. రెండూ రాజ్యానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడినాయి. రాజ్యహింసకు వ్యతిరేకంగా లాల్‌గఢ్, భూమి సమస్యపై నారాయణపట్న ప్రజలు పోరాటాలు ఆరంభించినా, అనతి కాలంలోనే అవి ప్రత్యామ్నాయ రాజ్య వ్యవస్థని ఆవిష్కరించాయి. ఇంతటి విశాల, సమరశీల, సుదీర్ఘకాలం జరిగిన ప్రజా విజృంభణలను గత పాతిక సంవత్సరాలలో మన దేశంలో చూసి ఎరగం. ఈ ప్రజా పోరాటాల ప్రాధాన్యత ఎంత ఉందంటే, దేశంలో ప్రజా యుద్ధ ప్రాంత విస్తరణకూ, పార్టీ, పిఎల్‌జిఏ, రాజ్యాధికార సంస్థల విస్తరణకు స్ఫూర్తిదాయకంగా, నూతన వనరులుగా ఇవి గొప్ప పాత్ర నిర్వహించాయి. మన దేశంలో ప్రజాయుద్ధం అభివృద్ధికి ఈ తిరుగుబాట్లు అందించిన పాఠాలు ఎంతో విలువైనవి. ఇవి దేశవిప్లవ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించాయి.

మూడు – లాల్‌గఢ్ విప్లవ రైతాంగ ఉద్యమం నేటి భారతదేశ సాయుధ పోరాట చిత్రపటంలో తనదైన ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఒకవైపు శత్రువు పెద్దెత్తున బలగాలను మోహరించి దేశవ్యాపితంగా రైతాంగ ఉద్యమాలను అణచివేస్తామంటున్న పరిస్థితులలో పెల్లుబికిన, విస్తరించిన, సంఘటితపడిన లాల్‌గఢ్ సాయుధ రైతాంగ విప్లవోద్యమానికి చాలా ప్రాధాన్యత వుంది.

నాలుగు – తూర్పు, మధ్య భారతదేశంలో ప్రకృతి సంపదలను కొల్లగొట్టడానికి బహుళ జాతి సంస్థలు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ సంస్థలు చేసిన తీవ్రమైన ప్రయత్నాలన్నింటినీ మన పార్టీ నాయకత్వం కింద విశాల ప్రజలు సమరశీలంగా ప్రతిఘటిస్తూ విఫలం చేస్తున్నారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో వేలాది, లక్షలాది సాయుధ బలగాల్ని దింపుతున్నా ప్రజలు వివిధ రూపాలలో వీరోచితంగా ప్రతిఘటిస్తున్నారు. 'జల్–జంగల్–జమీన్ హమారా హై, జల్–జంగల్–జమీన్ ఛోడాబొ నహీ' అని ఉద్యమిస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ పోరాటాల వ్యాప్తి, తీవ్రత, పరిణామాలు భారతదేశ రాజకీయాలను, అందులో భాగంగా ప్రజాయుద్ధాన్ని సానుకూలంగా బాగా ప్రభావితం చేస్తాయి. ఈ పోరాటలలో దృఢంగా నిలిచిన ప్రజానీకాన్ని, వివిధ ప్రగతిశీల సంస్థలను–వ్యక్తులను మన పిబి అభినందిస్తున్నది. వీరందరికి అండగా నిలుస్తుంది. మరింత సమైక్యంగా సమరశీలంగా, విస్తృతంగా ఈ ఉద్యమాలను నడపాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తు చేస్తున్నది. సామ్రాజ్యవాదుల, వారికి తొత్తులుగా పనిచేస్తున్న

దేశద్రోహుల ఆటలు సాగనివ్వమనీ, ఈ ఉద్యమాలలో ముందు పీఠీన మా పార్టీ నిలుస్తుందనీ పిబి బాహాటంగా ప్రకటిస్తున్నది.

ఐదు – శత్రు మానసిక యుద్ధానికి వ్యతిరేకంగా కామ్రేడ్ ఆజాద్ నాయకత్వంలో మన పార్టీ ప్రభావవంతంగా సిద్ధాంత, రాజకీయ ప్రచార యుద్ధాన్ని కొనసాగించింది. ప్రజలను మోసం చేసి ప్రజాయుద్ధానికి వ్యతిరేకంగా నిలబెట్టడానికి శత్రువు తలపెట్టిన మానసిక యుద్ధాన్ని దేశ – ప్రపంచ ప్రజల ముందు కామ్రేడ్ ఆజాద్ సమర్థవంతంగా బట్టబయలు చేశాడు. సిద్ధాంత, రాజకీయ రంగంలో శత్రువుకు వ్యతిరేకంగా కామ్రేడ్ ఆజాద్‌తో పాటు వివిధ స్థాయిల్లో యావత్తు పార్టీ పోరాడి ఉండకపోతే, పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధానికి ఇంత సాధికారత లభించేది కాదు. ప్రజాయుద్ధం ఇంతగా ప్రాధాన్యత సంతరించుకునేది కాదు. అమరుడు కామ్రేడ్ ఆజాద్ ఈ రంగంలో చేసిన సేవలు చాలా ప్రాధాన్యత గలవీ, శాశ్వతమైనవి. అమరుడు ఆజాద్ స్ఫూర్తితో ఈ రంగంలో పోరాటాన్ని మరింత దృఢంగా కొనసాగించాల్సిన అవసరం ఉంది.

ఈ ప్రధానమైన ఐదు విజయాలతో పాటు మన పార్టీ కొన్ని ప్రాంతాల్లో విస్తరించింది. పార్టీని, పిఎల్‌జిఏను మెరుగ్గా సంఘటితం చేసుకున్నాం. పార్టీకీ, సేనకూ రాజకీయ సైనిక శిక్షణ నందించాం. రాజకీయాధికార సంస్థలను సంఘటిత పరచుకోవడానికీ, నూతన ప్రాంతాలలో వాటిని ఏర్పరచడానికి కృషి చేశాం. సంవత్సర కాలంలో మనం సాధించిన ఈ సఫలతలే ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని చాలామంది విప్లవశక్తులు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, ప్రగతిశీలురు, దేశభక్త శక్తులు గట్టిగా వ్యతిరేకించడానికి ప్రేరణనందించాయి. ఈ సంవత్సర కాలంలో మనం రాజకీయంగా, ప్రజా ఉద్యమపరంగా, గెరిల్లా యుద్ధపరంగా చేసిన సమరశీల పోరాటాలే, సాధించిన సత్ఫలితాలే వారందరి మద్దతును కూడగట్టడానికి ప్రధాన కారణం.

కామ్రేడ్స్,

గత సంవత్సర కాలపు అనుభవాలను సంశ్లేషించుకున్నప్పుడు, స్వీయాత్మక శక్తుల విషయంలో మనం గణనీయమైన సంఖ్యలోనే కాకుండా, నాయకత్వపరంగా మనం భారీ నష్టాలు పొందాం. ఈ నష్టాలు పార్టీనీ, ఉద్యమాన్నీ చాలా ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయని స్పష్టంగా చెప్పగలం. మనం నష్టపోయిన కామ్రేడ్స్ లేని లోటును, ప్రత్యేకించి మన ప్రియతమ నేత కామ్రేడ్ ఆజాద్ లేని లోటును పూడ్చుకునే లక్ష్యంతో మన కేంద్ర కమిటీ నుండి కింది వరకూ అన్ని పార్టీ కమిటీలు, యావత్తు పార్టీ ప్రణాళికాబద్ధంగా వారి వారసులుగా నూతన శక్తులను విస్తృతంగా తయారు చేసుకోవడానికి తీవ్రంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఈ లక్ష్యంతో పార్టీ కమిటీలు అన్ని స్థాయిల్లో సిద్ధాంత అధ్యయనం, రాజకీయాల అధ్యయనం, నిర్దిష్ట పరిస్థితుల అధ్యయనం, సృజనాత్మక అన్వయింపు, అనుభవాల క్రోడీకరణ, నిజాయితీతో కూడిన విమర్శ–ఆత్మవిమర్శ, పని పద్ధతులలోనూ – పనిశైలినీ

మెరుగుపరచుకోవడానికి కృషి చేయాల్సిన అవసరం వుంది. చురుకైన ఆత్మరక్షణా యుద్ధ విధానాన్ని దృఢ సంకల్పంతో కొనసాగించాల్సిన అవసరం వుంది. వీటన్నిటి ద్వారా మన శక్తి సమర్థతలు పెంపొందించుకోవాల్సిన అవసరం వుంది. ఇది వరకే ఆరంభించిన దిద్దుబాటు క్యాంపెయిన్ సత్ఫలితాలు సాధించేలా ప్రభావవంతంగా కొనసాగించాల్సిన అవసరం ఉంది.

మనం పొందిన నష్టాల వల్ల కలిగిన లోటును పూడ్చుకోవడానికీ, పార్టీ శక్తి సమర్థతలను, స్థాయిని పెంపొందించుకోవడానికీ ఈ పద్ధతులన్నీ దృఢ సంకల్పంతో అమలు చేయాల్సినవే. కానీ అంతకంటే ప్రధానంగా మనం జరగబోయే నష్టాలను తప్పించడానికి గాను నష్టాలకు కారణాల గురించి, అందుకు దోహదం చేసిన పరిస్థితుల గురించి లోతైన పరిశీలన చేయాల్సిన, చర్చ నిర్వహించాల్సిన అవసరం వుంది. నష్టాలకు కారణాల్ని సరిగా అర్థం చేసుకోగలిగితే, వాటిని నివారించే మార్గం దొరుకుతుంది. కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీలు ఈ కర్తవ్యాన్ని చేపట్టాలి. మనం ఈ కర్తవ్యాన్ని సఫలీకృతంగా నిర్వహించగలిగితే భవిష్యత్తులో నష్టాలను తగ్గించుకోగలం. మనం ఇలా చేయగలిగితే సమీప భవిష్యత్తులో పార్టీ శత్రువుకు అభేద్యమైనదిగా ఎదుగగలుగుతుంది. ఈ విషయంలో మనం సాధించే ఫలితం ఎలాంటిదనే దానిపైనే భారత విప్లవం యొక్క భవిష్యత్తు చాలా వరకు ఆధారపడి ఉంటుంది. మన నష్టాలు మన విజయాలను ప్రభావరహితం చేస్తూ వస్తున్నాయనే సత్యాన్ని మనం ఒక హెచ్చరికగా తీసుకోవాలి. ఎంత అనుకూలమైన విప్లవకర భౌతిక పరిస్థితి ఉన్నా, తగినంత శక్తివంతమైన, సమర్థవంతమైన పార్టీ నాయకత్వం లేకుండా, అలాంటి శత్రు దుర్భేధ్యమైన పార్టీగా – నాయకత్వంగా సంఘటితం చేసుకోవడానికి కృషి చేయకుండా విప్లవ విజయం గురించి ఆలోచించడం ఊహాజనితమే అవుతుంది.

మన పార్టీ గత అనుభవాన్ని, ప్రత్యేకంగా కామ్రేడ్ చారుమజుందార్ అమరత్వం తర్వాత శ్రేణుల అభిమానం చూరగొన్న, సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడం భారత విప్లవం సెట్‌బ్యాక్‌కు గురయిపోవడానికి అత్యంత ముఖ్యమైన ఒక కారణం  అనేది మనందరికీ స్పష్టంగానే తెలుసు. పెరూ విప్లవం ఓడిపోవడానికీ, విచ్ఛిన్నం గావడానికి ప్రధాన కారణం దాదాపు నాయకత్వపు కోరంతా శత్రు చేజిక్కడం. ప్రస్తుతం మన దేశంలో కూడా నాయకత్వాన్ని నష్టపోవడం వల్ల చాలా ప్రాంతాలు స్థబ్దతకు గురయినాయి లేదా సెట్‌బ్యాక్‌లో పడిపోయినాయి. ఐతే గతంలో మనం నష్టాలకు కారణాల్ని సరిగా అర్థం చేసుకున్న తర్వాత వివిధ ప్రాంతాల్లో తిరిగి పార్టీనీ, ఉద్యమాన్ని నిర్మించగలిగాం. మనం ఈ సమస్యని పరిష్కరించడానికి మన అనుభవాల నుండి, సోదర పార్టీల అనుభవాల నుండి నేర్చుకోవవాల్సిన అవసరం ఉంది. నేడు మనం చాలా బలవంతుడైన, క్రూరుడైన శత్రువును ఎదుర్కొని విజయం సాధించాలంటే, శత్రువుకు దుర్భేధ్యమైన పార్టీగా మన పార్టీని మార్చుకోవాల్సిన అవసరం ఉంది.

ఇక ఆపరేషన్ గ్రీన్‌హంట్ గానీ, కౌంటర్ ఇన్‌సర్జెన్సీ సిద్ధాంతం గానీ, ఎల్ఐసి పాలసీ గానీ కాలం చెల్లిన వర్గాల సిద్ధాంతాలు, వ్యూహాలు. పాలకవర్గాలు, సామ్రాజ్యవాదులు భారత విప్లవాన్ని అడ్డుకోవడానికీ, అణచివేయడానికీ వీటిని అమలు చేయడం అనేది ఈ వర్గాల దివాళాకోరుతనాన్నే

తెలియజేస్తుంది. ఇప్పటికే ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా మన పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఏ, ప్రజలు, ప్రజాస్వామికవాదులు కొనసాగిస్తున్న ఆత్మరక్షణా యుద్ధాన్ని మరింత తీవ్రతరం, విస్తృతం చేయాలి. శత్రువు అనుసరిస్తున్న ఈ దివాళాకోరు వ్యూహం–పథకం ప్రజల్లో ఇప్పటికే చాలా బహిర్గతమైపోయి వుంది. మనం ప్రజలపై ఆధారపడి, పిఎల్‌జిఏని సరిగా మోహరించి పోరాడగలిగితే, మనం తప్పక గ్రీన్‌హంట్‌ను ఓడించగలుగుతాం. శత్రువు గ్రీన్‌హంట్‌ను ఎంత తీవ్రంగా, విస్తృతంగా కొనసాగిస్తే, చివరికి అది శత్రువుకే వినాశనాన్నే తెచ్చిపెట్టి తీరుతుంది.

సామ్రాజ్యవాదుల మద్దతుతో పాలకవర్గాలు ఎల్‌ఐసి విధానానికి అనుగుణంగా యావత్తు భారత రాజకీయ, సైనిక, ఆర్థిక, సాంస్కృతికాన్ని ప్రభావితం చేస్తూ పునర్నిర్మాణం ఏమేరకు చేస్తే సామాజిక వైరుధ్యాలు అంతగా తీవ్రతరం అవుతాయి. అంతగా భారత సమాజం సామ్రాజ్యవాదుల అదుపాజ్ఞలలోకి నెట్టివేయబడేలా చేస్తుంది. విప్లవానికీ, విప్లవ ప్రతిఘాతుకానికీ నడుమ, అంటే కొద్దిమంది ప్రతిఘాతుకులకూ, అసంఖ్యాక ప్రజలకూ నడమ అంతర్యుద్ధం మరింత తీవ్రతరం అవుతుంది. అంతిమంగా ప్రజాయుద్ధ పెనుజ్వాలల్లో విప్లవ ప్రతిఘాతుకత్వం భస్మీపటలం గాకతప్పదు. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా గానీ, భారత సమాజాన్ని కనీవినీ ఎరగని విపరిణామాలకు దారితీసేలా చేస్తున్న ఫాసిజీకరణకు వ్యతిరేకంగా గానీ మన పార్టీ దీర్ఘకాలిక దృష్టితో ఎంత సమర్థవంతంగా ప్రజలను కదలించి, ఎంత దృఢంగా, ఎంత తెగించి పోరాడుతుందనే దానిపై ఆధారపడి అంతిమ ఫలితం నిర్ణయించబడుతుంది. ఐతే చారిత్రకానుభవాలు తెలియజేసేదేమంటే, ప్రపంచంలో ఎక్కడా ప్రజలకు వ్యతిరేకంగా చేపట్టిన ఇలాంటి విధానాలు చరిత్రలో మట్టిగరవక తప్పలేదు.

కామ్రేడ్స్,

నాయకత్వపరంగా మనం తీవ్రంగా నష్టపోవడం వల్ల, పార్టీ పంథాని, విధానాలను నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించుకోలేకపోవడం వల్ల, సుదీర్ఘకాలంగా గెరిల్లాజోన్ స్థాయికి సైతం ఎదగని చాలా రాష్ట్రాల్లోని ఉద్యమాలు స్థబ్దతకు నెట్టబడినాయి లేదా సెట్‌బ్యాక్‌కు నెట్టబడినాయనే విషయం మనందరికి తెలిసిందే. పట్టణాలలోనూ ఉద్యమాలు చాలా బలహీనపడినాయి. మరో రకంగా చెప్పాలంటే గెరిల్లాజోన్లు ఒంటరి చేయబడుతున్నాయి. గెరిల్లాజోన్లలో సైతం బలమైన ప్రాంతాలను తుడిచిపెట్టడానికి శత్రువు మున్నెన్నడూ లేనిస్థాయిలో దాడి కొనసాగిస్తున్నాడు. గెరిల్లా జోన్లకు బయట పార్టీ నాయకత్వాన్ని తీవ్రంగా నష్టపర్చిన తర్వాత గెరిల్లాజోన్లలోనే దెబ్బకొట్టడానికి శత్రువు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాడు.

ఇలాంటి పరిస్థితులలో నేడు మనం దాదాపు పూర్తిగా మన బలమైన ప్రాంతాలపై ఆధారపడి ఏకతా కాంగ్రెస్ నిర్ధారిత కర్తవ్యాల సాఫల్యానికి కృషి చేయాలి. ఇక్కడ నాయకత్వ రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాలి. ప్రజాసైన్యాన్ని పటిష్టం చేసుకోవడానికి, వివిధ ప్రజా నిర్మాణాలను సంఘటితం చేసుకోవడానికి తీవ్రంగా కృషి చేయాలి. చురుకైన ఆత్మరక్షణా యుద్ధ విధానాన్ని కొనసాగించాలి.

గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయడం, విప్లవ ప్రజా కమిటీలను స్థాపించడాన్ని కేంద్రస్థానంలో ఉంచి పనిచేయాలి. శత్రు చుట్టివేత దాడిని వమ్ముచేయడానికి ఈ ప్రాంతాలపై ఆధారపడి ప్రజాయుద్ధ వ్యూహాత్మక కర్తవ్యాల సాధనకు ఉద్యమ ప్రాంతాలను విస్తరింపజేయాలి.

లాల్‌గఢ్ నుండి సూర్జాగఢ్ వరకూ, దేశవ్యాపితంగానూ, ప్రకృతి సంపదలు కొల్లగొట్టడానికి బహుళ జాతి సంస్థలు – బడా దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ సంస్థలు చేస్తున్న తీవ్రమైన దాడిని ఎదుర్కోవడానికి ప్రజలకు మార్గదర్శకత్వాన్ని అందించాలి. ప్రజాయుద్ధంలో ఒక ప్రధాన సమస్యగా ఉన్న ఈ సమస్యపై ప్రజలను చురుగ్గా కదలించగలిగితే, ప్రజాయుద్ధ అభివృద్ధికి కావలసిన భౌగోళిక, మానవ, పాదార్థిక, సాంకేతిక, నైతిక, న్యాయపర వనరులను సమీకరించుకోవచ్చు. ఈ కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించగలిగితే మన దేశంలో ప్రజాయుద్ధం మరో మెట్టుకు ఎదగడానికి చాలా అవకాశాలు వున్నాయి.

నేటి పరిస్థితులలో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు గోరీకట్టే కేంద్రస్థానాలు మన గెరిల్లాజోన్లే. గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా ప్రజాస్వామిక శక్తులను కూడగట్టడానికి, ఐక్యసంఘటనా కృషిని మెరుగుపరచుకోగలిగితే, పట్టణాల్లో, మైదానాల్లో సృజనాత్మక పద్ధతుల్లో కృషి చేయగలిగితే మనం నాయకత్వంలో ఒక పెద్ద భాగం దెబ్బతినిపోయి ఉన్న ఈ పరిస్థితుల్లో కూడా మంచి ఫలితాలు సాధించగలం. కళింగనగర్, సింగూర్, నందిగ్రాం, లాల్‌గఢ్, కందమాల్, నారాయణపట్నం అనుభవాలను మరింత సమగ్రంగా క్రోడీకరించగలిగితే, ఈ అనుభవాలపై ఆధారపడి ప్రజలను కదలించడానికి వాటిని సృజనాత్మకంగా అన్వయించుకోగలిగితే దేశంలో ప్రజా పోరాటాల నిర్వహణలో ఒక గుణాత్మక గెంతు సాధించగలం.

శత్రు మానసిక యుద్ధాన్ని ప్రభావవంతంగా తిప్పికొట్టడానికి సృజనాత్మక పద్ధతుల్లో నాయకత్వాన్నీ, ప్రచార యంత్రాంగాన్నీ, యావత్తు పార్టీనీ సరిగా కదిలించగలిగితే ఆజాద్ లేని లోటుని తీర్చుకోగలం. శత్రువు కొనసాగిస్తున్న బహుముఖ యుద్ధాన్ని ఓడించడానికే మానసిక యుద్ధాన్ని మనం ప్రభావవంతంగా కొనసాగించాలి.

ఉద్యమాలు స్తబ్ధతకు లేదా సెట్‌బ్యాక్‌కు గురికావడానికి కారణాల్ని తెలుసుకోవడానికి లోతైన అధ్యయనం, పరిశీలన అవసరం. ఇలాంటి రాష్ట్రాలలో మిగిలిన పార్టీ శక్తులలో పెంపొందే క్రియాశీలత లేమినీ, సృజనాత్మకత లేమినీ పారద్రోలాలి. స్థబ్దతకు కారణాలు తెలుసుకోవడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీయాత్మకతని దరిచేరనీయరాదు. గతితార్కిక చారిత్రక భౌతికవాదాన్ని, ప్రత్యేకంగా వైరుధ్య సూత్రాన్ని సృజనాత్మకంగా అన్వయించి పరిశోధన చేయాలి. సంక్లిష్టతను, ఇలాంటి కష్టభరితమైన, తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నప్పుడే వాటితో పాటు కారు చీకట్లు చెదిరిపోయి వెలుగు రేఖలు విచ్చుకునే పరిస్థితులుంటాయి. అదుగో గెరిల్లాజోన్లను చుట్టుముడుతున్న శత్రువుని మనం చుట్టుముట్టే, ఏకతా

కాంగ్రెస్ కర్తవ్యాలను నెరవేర్చి భారత విప్లవంలో ఒక నూతన గెంతును సాధించగలిగే పరిస్థితులు ఎంతో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అత్యంత సాహసోపేతంగా, చాకచక్యంగా ప్రజాయుద్ధాన్ని నడుప ద్విగుణీకృతోత్సాహంతో, దృఢ సంకల్పంతో సిద్ధం అవుదాం.

కామ్రేడ్స్,

పాలకవర్గాలు, సామ్రాజ్యవాదులు మనపై, మన విప్లవోద్యమంపై దాడిని తీవ్రతరం చేయడం అనేది వారు దినదినం ప్రజా వ్యతిరేక విధానాలను అమలుచేస్తూ, ప్రజలకు దూరం అవుతున్నారనే దానిని స్పష్టం చేస్తున్నది. వారు దేశంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని ఆరంభించినప్పటి నుండీ, రాజ్య వ్యవస్థను ఎల్‌ఐసి విధానాలతో పునర్వ్యవస్థీకరిస్తున్నప్పటి (రీస్ట్రక్చర్) నుండీ, మన నాయకత్వాన్ని పట్టుకొని క్రూరంగా హత్యలు చేయడంతో పాటు ప్రజలపై మహా విధ్వంసకాండ (మాపింగ్) చేపట్టినప్పటి నుండీ, దక్షిణాసియాలో భారత పాలకులు అమెరికా సామ్రాజ్యవాదులకు జూనియర్ పార్ట్‌నర్‌గా చేరినప్పటి నుండీ, వారెన్ని ఎత్తులు వేసినా దినదినం, దేశ ప్రజలకూ, దక్షిణాసియా ప్రజలకూ శత్రువులుగానే లేదా పీడకులుగానే మరింత బహిర్గతం అయిపోతున్నారు. భారత సమాజంలో అన్ని వైరుధ్యాలు తీవ్రతరం అవుతున్నాయి. దేశంలోనూ, దక్షిణాసియాలోనూ, ప్రపంచంలోనూ దినదినం విప్లవానికి భౌతిక పరిస్థితులు అద్భుతంగా పెంపొందుతున్నాయి. వివిధ ప్రజాస్వామిక, ప్రగతిశీల, దేశభక్త, పీడిత జాతుల, పీడిత సామాజిక ప్రజా సముదాయాలు తీవ్ర వివక్షకూ, అణచివేతకూ గురవుతున్నారు. ఆర్థిక అభివృద్ధి రేట్ల సూచికలు ఎంత గొప్పగా వున్నాయని చూపినా, అవన్నీ గుప్పెడు మంది టాటా, అంబానీ, బిర్లా, మహేంద్ర తదితర ఘరానా దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల అభివృద్ధి సూచికలే లేదా దేశాన్ని నిలువునా కొల్లగొట్టే బహుళ జాతి సంస్థల అభివృద్ధి సూచికలే. దేశ జనాభాలో అత్యధిక సంఖ్యాకులైన శ్రమజీవుల, పేద, మధ్యతరగతి ప్రజల బతుకులు అధఃపాతాళానికి వెళుతున్నాయి. పేదల – ధనికుల మధ్య గండి గతంలో కంటే చాలా ఎక్కువగా పెరిగిపోయింది. అంకెల గారడీ చేసి దళారీ ఆర్థికవేత్తలు వర్గవైరుధ్యాలను తారుమారు చేయలేరు. అందువల్లనే పాలకులు వివిధ ప్రాంతాల్లో పోరాడుతున్న ప్రజలపైకి ఫాసిస్టు కిరాయి బలగాలను తోలుతూ, ఈ వైరుధ్యాలను మరింత తీవ్రం చేస్తున్నారు. పోరాడే ప్రజలను సంఘటితం చేయడానికీ, వారి మధ్య సమైక్యత తీసుకువచ్చి, వారిపై మన నాయకత్వాన్ని నెలకొల్పడానికీ, ప్రజాయుద్ధాన్ని నూతన స్థాయిలోకి తీసికెళ్లడానికీ కావలసిన పరిస్థితులు పరిపక్వం అవుతున్నాయి. మన మహత్తర పార్టీ 6వ వార్షికోత్సవం సందర్భంగా ఈ అద్భుతమైన పరిస్థితులను అందుకొనేలా పార్టీని సుసంఘటితం చేయడానికి పూనుకుందాం. ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయడానికీ, అమరుల కలల సాఫల్యానికీ ప్రతిన బూనుదాం.

కామ్రేడ్స్,

మన పార్టీ 6వ వార్షికోత్సవాలు విప్లవోత్సాహం ఉట్టిపడేలా జరపండి. గత సంవత్సర కాలంలో చాలా తీవ్ర నిర్బంధంలో సైతం మనం సాధించిన విజయాలను గ్రామ గ్రామాన ప్రజల ముందుంచండి.

అమరుల ఆదర్శాలను ఎత్తిపట్టండి. వివిధ రూపాల్లో ప్రచార క్యాంపెయిన్లు నిర్వహించండి. అద్భుతమైన విప్లవ పరిస్థితి గురించీ, ఆ పరిస్థితిని అందుకోవటానికి పార్టీ చేయాల్సిన కృషి గురించీ చాలా స్పష్టంగా యావత్తు పార్టీలో చర్చించండి! విప్లవ క్రమంలో ఎంతటి కష్టాలు, నిర్బంధాలు ఎదురయినా మునుముందుకే సాగుతామనీ, అజేయమైన ప్రజాయుద్ధం ద్వారా విజయం సాధించగలుగుతామనే అచంచల విశ్వాసంతో అంతర్జాతీయ విప్లవకర కార్మికవర్గ అరుణపతాకను దృఢంగా సమున్నతంగా నిలిపి ప్రతిన చేద్దాం.

* నాయకత్వానికీ, శ్రేణులకు కలుగుతున్న భారీ నష్టాలను అధిగమించడానికి పార్టీని శత్రు దుర్భేద్యమైందిగా పటిష్టపరచుకుందాం!
* అద్భుత విప్లవ పరిస్థితికీ, ప్రజాయుద్ధ పురోభివృద్ధికీ తగినట్లు సమర్థవంతంగా నాయకత్వాన్నందించడానికి పార్టీని సుసంఘటితం చేద్దాం!
* మన ఉద్యమాన్ని అజేయమైన ప్రజాయుద్ధంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో విశాల ప్రజలను విస్తృతంగా క్రియాశీలంగా కదిలిద్దాం!
* 'ఆపరేషన్ గ్రీన్‌హంట్'ని ఓడించడానికి ప్రతి గెరిల్లాజోన్‌లో తాడిమెట్ల (ముకరం) ఒరవడిని కొనసాగిద్దాం!
* భారత పాలకవర్గాలను, సామ్రాజ్యవాదులను ప్రజాపోరు ప్రభంజనంలో ముంచెత్తడానికి ప్రతీ రాష్ట్రంలోనూ నందిగ్రాం, లాల్‌గఢ్, నారాయణపట్నం ఒరవడిని కొనసాగిద్దాం!
* 'ప్రజలపై ప్రభుత్వ యుద్ధానికి' వ్యతిరేకంగా కొనసాగిన నిరసనోద్యమాల ఒరవడితో దేశవ్యాపితంగా బద్దలవుతున్న ప్రజా ఉద్యమాలను అనుసంధానించి బలమైన ఐక్యసంఘటనకు పునాది వేద్దాం!
* గెరిల్లా యుద్ధం తీవ్రతరం చేస్తున్న ప్రాంతాలలో విముక్తి ప్రాంత లక్ష్యంతో 'విప్లవ ప్రజా కమిటీ'లను నెలకొల్పుదాం! సంఘటితపరుద్దాం! విస్తరిద్దాం!
* శత్రు మానసిక యుద్ధాన్ని ప్రభావవంతంగా తిప్పికొట్టడానికి కామ్రేడ్ ఆజాద్ నెలకొల్పిన ఒరవడితో విప్లవ రాజకీయ ప్రచార యుద్ధాన్ని వికసింపజేద్దాం!
* ప్రజాయుద్ధ బహుముఖ కర్తవ్యాల సాధనకు విశాల ప్రాంతాలకు విస్తరిద్దాం!

తేది : 20-8-2010

పొలిట్‌బ్యూరో,
కేంద్రకమిటీ,
సిపిఐ (మావోయిస్టు)



# మన మహత్తర నూతన పార్టీ 7వ వార్షికోత్సవాలకు విప్లవ జేజేలు !

అద్భుత భౌతిక పరిస్థితికీ, ఉద్యమ స్థాయికీ-విస్తృతికీ,
ఉద్యమ కర్తవ్యాల సాధనకూ తగినట్లు పార్టీని పటిష్టం, విస్తృతం చేద్దాం !

స్వీయశక్తులు పెంపొందించుకోవడానికీ, ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి
చేయడానికీ ప్రజాపునాదిని బలోపేతం, విస్తృతం చేద్దాం !

కేంద్ర కర్తవ్య సాధనకూ, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని ఓడించడానికీ,
గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం, విస్తృతం చేద్దాం !

*2011 సెప్టెంబర్ 21 నుండి 27 వరకు మన పార్టీ 7వ వార్షికోత్సవాలను విప్లవోత్సాహంతో ఘనంగా జరపాలని యావత్తు పార్టీకి కేంద్ర కమిటీ పిలుపు*

★

కేంద్రకమిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# మన మహత్తర నూతన పార్టీ 7వ వార్షికోత్సవాలకు విప్లవ జేజేలు !

## అద్భుత భౌతిక పరిస్థితికీ, ఉద్యమ స్థాయికీ-విస్తృతికీ, ఉద్యమ కర్తవ్యాల సాధనకూ తగినట్లు పార్టీని పటిష్టం, విస్తృతం చేద్దాం !

## స్వీయశక్తులు పెంపొందించుకోవడానికీ, ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయడానికీ ప్రజాపునాదిని బలోపేతం, విస్తృతం చేద్దాం !

## కేంద్ర కర్తవ్య సాధనకూ, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని ఓడించడానికీ, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం, విస్తృతం చేద్దాం !

***2011 సెప్టెంబర్ 21 నుండి 27 వరకు మన పార్టీ 7వ వార్షికోత్సవాలను విప్లవోత్సాహంతో ఘనంగా జరపాలని యావత్తు పార్టీకి కేంద్ర కమిటీ పిలుపు***

ప్రియమైన కామ్రేడ్స్ !

మనం ఈ సెప్టెంబర్ 21న మన మహత్తర నూతన పార్టీ 7వ వార్షికోత్సవాలను జరుపుకోబోతున్నాం. సెప్టెంబర్ 21వ తేదీ మన పార్టీకి అత్యంత ప్రాధాన్యత గల రోజు. ఈ రోజు చారిత్రాత్మకమైనది. పార్టీ 7వ వార్షికోత్సవాల సందర్భంగా, మన పార్టీ నిర్మాతలు, భారత విప్లవ మహానాయకులు, అమరులు, ప్రియతమ కామ్రేడ్స్ సి.ఎం., కె.సి.లకూ, నక్సల్బరీ నుండి నేటివరకు నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలో అమరులైన వేలాది మంది వీరయోధులను స్మరించుకుందాం. వీరందరికీ వినమ్రంగా జోహార్లు అర్పిద్దాం. పార్టీ 6వ వార్షికోత్సవాల తర్వాత గత సంవత్సర కాలమంతా విప్లవోద్యమ నిర్మూలనా లక్ష్యంతో విప్లవ ప్రతీఘాతుక భారత పాలక వర్గాలు అత్యంత క్రూరంగా అమలుచేసిన 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' (ప్రజలపై యుద్ధం)ని అత్యంత ధైర్యసాహసాలతో ఎదిరిస్తూ ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో డి.కె., బి.జె., బెంగాల్, ఒడీషా, ఏ.ఓ.బి., ఎన్.టి., ఏ.పి., మహారాష్ట్ర, యు.పి., సి.జి.-ఓ.ఎస్. బోర్డర్‌లో 229 మంది మన ప్రియతమ కామ్రేడ్స్ నేలకొరిగారు. ఈ సాహసిక యోధులను మనం పేరుపేరునా స్మరించుకొని అరుణారుణ జోహార్లు చెబుదాం. నూతన ప్రజాస్వామిక విప్లవంలో నేలకొరిగిన వేనవేల అమరవీరుల ఆశయ సాధనకు బిగిపిడికిళ్లతో ప్రతినబూనుదాం. ఈ అమరుల సాహసోపేతమైన, త్యాగపూరితమైన, ఉత్తేజకరమైన జీవితాలను ఆదర్శంగా తీసుకొని ప్రజాయుద్ధ మార్గంలో దృఢసంకల్పంతో మునుముందుకు సాగుదాం. ఈ సందర్భంగా మన పార్టీ, పి.ఎల్.జి.ఏ., విప్లవ ప్రజాకమిటీలు, ప్రజాసంఘాలలోని కామ్రేడ్స్ అందరికీ, దేశం నలుమూలలా చెరసాలలో శత్రువు నెదిరిస్తూ ఉన్న వందలాది మంది కామ్రేడ్స్‌కూ, విప్లవ ప్రజానీకానికీ పార్టీ 7వ వార్షికోత్సవాల సందర్భంగా మన

కేంద్రకమిటీ హార్ధిక విప్లవాభినందనలు తెలుపుతున్నది.

ఈ సందర్భంగా, పార్టీ 6వ వార్షికోత్సవాల తర్వాత దేశంలో ప్రజాయుద్ధ పురోగమన లక్ష్యంతో మన పార్టీ కొనసాగించిన కార్యాచరణను పునరావలోకన చేసుకొని తక్షణ కర్తవ్యాలు రూపొందించుకోవటానికి ఈ సంవత్సర కాలంలో నెలకొన్న రాజకీయ పరిస్థితిని పరిశీలిద్దాం.

## అంతర్జాతీయ పరిస్థితి

2008 చివరి నుండి సుడులు తిరుగుతూ కొనసాగిన ఆర్థిక సంక్షోభం అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని గుక్కతిప్పుకోకుండా చేసి ఇటీవల అది రుణ సంక్షోభం (డెట్ క్రైసిస్)గా బద్దలైంది. ఇ.యు. కూడా ఈ సంక్షోభంలో కూరుకొని పోయింది. పెట్టుబడిదారీ విధాన చరిత్రలో ఎన్నడూ ఎరుగని రుణభారంతో నేడది కుంగిపోతున్నది. ఈ రుణ సంక్షోభం సామ్రాజ్యవాద దేశాల ఎగుమతి దిగుమతులపై, పెట్టుబడులపై ఆధారపడి ఉన్న యావత్తు అర్ధవలస దేశాల ఆర్థిక వ్యవస్థల్ని కుదిపి వేస్తున్నది. ఈ సంక్షోభ కుదుపు ఎంత తీవ్రమైనదంటే ప్రపంచ స్టాక్ మార్కెట్లను ఒక్క కుదుపు కుదిపేసింది. రుణభారాన్ని తగ్గించుకోవడానికి ఒబామా ప్రభుత్వంతో పాటు ఇ.యు.లోని చాలా దేశాల ప్రభుత్వాలు వ్యయాన్ని బాగా తగ్గించుకునే, ఆదాయాలను పెంచుకొనే చర్యలు చేపట్టాయి. దీనివల్ల ఈ దేశాల ప్రభుత్వాలు ప్రజలకు ఇప్పటికే అంతంతమాత్రంగా అందించే సంక్షేమ కార్యక్రమాల్లో, పెన్షన్లలో పెద్దపెట్టున కోత విధించే చర్యలు తీసుకుంటున్నారు. ఈ సంక్షోభం పెట్టుబడిదారీ ప్రపంచంలోని కార్మికవర్గ, మధ్యతరగతి ప్రజల జీవన పరిస్థితిని దుర్భరం చేస్తున్నది. దీని ఫలితంగా ఇటీవలి కాలంలో అమెరికాతో పాటు అనేక ఇ.యు. దేశాల్లో వేలు-లక్షలాది కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, పెన్షన్‌దారులు పెద్దపెట్టున సమ్మెలకు, ఆందోళనకు దిగారు. లండన్‌తో పాటు బ్రిటన్‌లోని పలు నగరాల్లో నల్లజాతి ప్రజల, ఏసియా వాసుల అసంతృప్తి కట్టలు తెంచుకొని బ్రిటీష్ సామ్రాజ్యవాదుల్ని ఉక్కిరి బిక్కిరి చేసింది. అనేక వెనుకబడిన దేశాలలో ప్రజాఉద్యమాలు ముందుకు వచ్చాయి. ఈ రుణ సంక్షోభం సామ్రాజ్యవాద దేశాలలో కార్మికవర్గానికీ, పెట్టుబడిదారీ వర్గానికి మధ్య వైరుధ్యాన్ని మరింత తీవ్రతరం చేయడంతోపాటు ప్రపంచ మౌలిక వైరుధ్యాలు తీవ్రతరం కావడానికి దోహదం చేస్తుంది.

అరబ్ ప్రపంచంలోని ట్యునీషియా, ఈజిప్టు, ఎమెన్, లిబియా, సిరియా తదితర అనేక దేశాల్లో నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా వివిధ స్థాయిల్లో చెలరేగిన తిరుగుబాట్లు, ఆందోళనలు వారి పునాదులను కుదిపివేయడమే గాకుండా సామ్రాజ్యవాదులను భయకంపితులను చేశాయి. ట్యునీషియా, ఈజిప్టులలో తమ తొత్తు నియంతలను కాపాడడానికి చేసిన సామ్రాజ్యవాదుల ప్రయత్నాలు విఫలమైనాయి. అయితే వారు తమ తొత్తు నియంతల స్థానంలోకి అవే ప్రభుత్వాలలోని ఇతర నాయకులు, ఉద్యమంలోని మితవాద శక్తులు వచ్చేలా చూడడంలో తాత్కాలికంగా సఫలం కాగలిగారు. కతార్, సౌదీ అరేబియాల్లో తమ తొత్తు నియంతలకు అన్ని విధాలా సహాయం చేసి అక్కడి ప్రజా ఉద్యమాలను ఆరంభంలోనే అత్యంత క్రూరంగా అణచివేయించగలిగారు.

లిబియాలో కల్నల్ గఢాఫీని పదవి నుండి తొలగించటానికి ముందునుండే పావులు కదిపిన సామ్రాజ్యవాదులు, ప్రత్యేకంగా ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికా, ఇటలీ దేశాలు అతని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆరంభమైన ఉద్యమానికి 'మానవ హక్కుల పరిరక్షణ' పేరుతో అన్ని రకాల సైనిక, సైనికేతర మద్దతునిచ్చాయి. అరబ్‌లీగ్‌లోని తమ తొత్తులను గఢాఫీకి వ్యతిరేకంగా నిలబెట్టాయి. తమ 'రబ్బర్ స్టాంప్' ఐక్యరాజ్యసమితి పేరుతో అనేక ఆంక్షలు విధించడంతో పాటు 'నో ఫ్లైజోన్'ని ప్రకటించాయి. వెంటనే ఎడతెరిపి లేకుండా విమానాల ద్వారా బాంబుల వర్షం కురిపించి గఢాఫీ సైనిక నడుములు విరిచాయి. గఢాఫీ, అతని అనుయాయులు ట్రిపోలీని వదలక తప్పలేదు. లిబియాలో అతి విచిత్రంగా ప్రజల తిరుగుబాటు, సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధం కలగలిసిపోయాయి. చివరికి సామ్రాజ్యవాదులు ఆశించినట్లే లిబియా చమురు నిల్వలపై వారి పట్టు బిగుసుకునే పరిస్థితి ఏర్పడుతున్నది. వైమానిక దాడులతో విధ్వంసానికి గురైన లిబియా ఇక పునర్నిర్మాణం పేరుతో సామ్రాజ్యవాదుల అదుపులోకి వెళ్లే పరిస్థితి ఏర్పడుతున్నది. లిబియా తిరుగుబాటులో పెద్దెత్తున సాధారణ ప్రజలు పాల్గొన్నా, దీనికి పాలకవర్గాల్లోని గఢాఫీ వ్యతిరేక పాలకముఠాలు, వివిధ సామ్రాజ్యవాద దేశాల తొత్తులు నాయకత్వం వహించడం వల్ల తాము ఆశించిన మార్పు ఆచరణలో సాధ్యం కాదని తెలుసుకోవటానికి ప్రజలకు ఎంతోకాలం పట్టదు. సామ్రాజ్యవాదులు గతంలోలానే 'మానవహక్కుల పరిరక్షణ' పేరుతో ఐక్యరాజ్యసమితిని అడ్డుపెట్టుకొని లిబియా ప్రయోగాన్ని సిరియాలోనూ చేయటానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.

ట్యునీషియా, ఈజిప్టు దేశాలలో నియంతల స్థానంలో అధికారాన్ని చేపట్టిన నాయకులు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలను ఏర్పరచడమే తమ లక్ష్యమని ప్రకటించారు. కానీ ఉద్యమాలలో ప్రజలు ముందుకు తెచ్చిన డిమాండ్లను చాలా పాక్షికంగానే అంగీకరించారు. వీరు సామ్రాజ్యవాదుల విషయంలోనూ, ఇతర అనేక ముఖ్యమైన విషయాలలో గత ప్రభుత్వాల విధానాలను కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ విషయంలో వివిధ దేశాలకు కొన్ని తేడాలున్నాయి. అందువల్లనే ప్రజలు, వివిధ ఉద్యమ శక్తులు ప్రజాస్వామిక డిమాండ్లపై నూతన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా బలంగా పోరాడుతున్నారు. ఈ దేశాలలో పాలకులకూ ప్రజలకూ మధ్యా, పాలకుల్లోని వివిధ ముఠాల మధ్యా, ప్రజలకూ సామ్రాజ్యవాదులకూ మధ్యా వైరుధ్యాలు నూతన రూపాల్లో చాలా తీవ్రంగా కొనసాగుతున్నాయి. అరబ్ ప్రపంచంలో జరిగిన ఈ పరిణామాలు అమెరికా రష్యాల మధ్యా, అమెరికా చైనాల మధ్యా వైరుధ్యాలను మరింత తీవ్రతరం చేశాయి. ఈ ఉద్యమాలు ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలు పాక్షికంగానే నెరవేరడానికి తోడ్పడినప్పటికీ, అవి నిజమైన ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం సాధించే మార్గంలో ఒక మెట్టుగా తోడ్పడతాయి. తమ ఆకాంక్షలు నెరవేరే వరకు గత విధానాలను అమలుచేసే నూతన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తారని ఆశిద్దాం. ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను ఎంతటి నియంతలుగానీ, వారిని నడిపే సామ్రాజ్యవాదులు గానీ శాశ్వతంగా అణచి ఉంచలేరు, వారి భవితను నియంత్రించలేరు.

'వార్ ఆన్ టెర్రర్' పేరుతో అమెరికా సామ్రాజ్యవాదులు ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్

గ్రామీణ ప్రజలపై దాదాపు ప్రతిరోజూ డ్రోన్ దాడులు కొనసాగిస్తూ ముక్కుపచ్చలారని పసికందులతో సహా ఎంతో మంది మహిళలు, వృద్ధులతో పాటు సాధారణ ప్రజలను అమానుషంగా హత్య చేస్తున్నారు. వీరు ఆఫ్ఘన్, పాక్ ప్రజల తీవ్ర అసహ్యతకు, నిరసనకు గురవుతున్నారు. నేటికీ వీరిని ఆఫ్ఘాన్, ఇరాక్ ప్రతిఘటనా యుద్ధాలు నిద్రపోనివ్వడం లేదు. వీరు ఈ దేశాలను దురాక్రమించి వీటిపై తమ పెత్తనాన్ని నిలుపుకోవడానికి చేసిన వందల బిలియన్ల డాలర్ల వ్యయం వీరిని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయడానికి దోహదం చేసింది. వీరు కొనసాగించిన దురాక్రమణ యుద్ధాలు, నిత్యం కొనసాగిస్తున్న హత్యాకాండ తమ దేశాల ప్రజల తీవ్ర నిరసనకు గురి చేస్తున్నది. అమెరికా సామ్రాజ్యవాదులు బిన్ లాడెన్‌ని చంపివేసినా, ఆల్‌ఖాయిదా భూతం వీరిని వెన్నాడుతూనే ఉంది.

జపాన్‌లో వచ్చిన భూకంపం ఆర్థికంగా, రాజకీయంగా, పర్యావరణపరంగా అక్కడి ప్రజలకు చాలా తీవ్రమైన నష్టం కలిగించింది. అది జపాన్ సామ్రాజ్యవాదుల్ని కుదిపివేసింది. ఈ కర్మాగారం నుండి అత్యంత ప్రమాదకర పరిమాణంలో విడుదలైన, విడుదలవుతున్న అణుధార్మికత ఆ దేశవాసులకే గాకుండా పరిసర దేశాల్లోని ప్రజలకూ, సముద్ర ప్రాణులకు సుదీర్ఘకాలపు ప్రమాదాన్ని ముందుకు తెచ్చిపెట్టింది. ఈ ఘటన తర్వాత అణుకర్మాగారాలను మూసివేయాలనే నినాదంతో జపాన్‌లో పెద్దెత్తున ఆందోళన పెల్లుబికింది. ఇదే నినాదంతో జర్మనీ ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఆందోళనకు దిగారు. పెద్దెత్తున ఆందోళనకు దిగగానే ప్రభుత్వం తలవంచి ఏడింటిలో ఆరు సంవత్సరంలోగా మూసివేస్తానని ప్రకటించింది. పర్యావరణం విషయంలో జపాన్ సామ్రాజ్యవాదులతో పాటు యావత్తు ప్రపంచంలోని అన్ని దేశాల పాలకవర్గాలు అనుసరిస్తున్న అశాస్త్రీయ, దూరదృష్టిలేని, సంకుచిత, స్వార్థపూరిత, విచక్షణారహిత దివాలాకోరు విధానాలను ఫుకుషిమా అణువిద్యుత్ కర్మాగారం బట్టబయలు చేసింది.

ఫిలిప్పైన్స్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లో అమెరికన్ తొత్తు ఆక్వినో అధికారానికి రాగానే ప్రభుత్వం, ప్రజాయుద్ధాన్ని మూడు సంవత్సరాల్లో సమూలంగా అణచివేస్తామని ప్రకటించింది. ఇందుకు 'ఓప్లాన్ బయనిహాన్' అనే అణచివేత అభియాన్‌ని చేపట్టింది. ఫిలిప్పినో విప్లవాన్ని అణచివేయటానికి అమెరికన్ సామ్రాజ్యవాదులు బరితెగించి ఆక్వినో ప్రభుత్వానికి అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నారు. అయితే ఈ దివాలాకోరు అణచివేత క్యాంపెయిన్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో నూతన ప్రజాసైన్యం, పీడిత ప్రజానీకం కొనసాగిస్తున్న ప్రతిఘటనా యుద్ధంలో దెబ్బపైదెబ్బ తింటున్నది.

## దేశీయ పరిస్థితి

గత సంవత్సర కాలంలో అంతర్జాతీయంగా ఆర్థిక, రాజకీయ రంగాల్లో జరిగిన పరిణామాలు మన దేశ ఆర్థిక, రాజకీయ రంగాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఈ ప్రభావాన్ని మనం ఇంధనం, నిత్యావసర సరుకులు, ఆహార పదార్థాల ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరగడం; కుంభకోణాలు, అవినీతి పెచ్చుపెరగడం; స్టాక్ మార్కెట్ల కుదుపు; సంక్షేమ

కార్యక్రమాల కోత; నిరుద్యోగుల సంఖ్య పెరగడం తదితర రూపాల్లో స్పష్టంగా చూడవచ్చు. సోనియా, మన్‌మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీ, అహ్లువాలియా, రంగరాజన్‌ల ముఠా దేశ ఆర్థిక పరిస్థితి గురించీ, జాతీయ, తలసరి అభివృద్ధి సూచికల గురించీ చేసే ప్రచారం యొక్క బండారాన్ని తరిగి పోతున్న దేశ ప్రజల జీవన ప్రమాణాలు, పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం బట్టబయలు చేస్తున్నాయి. విదేశ పెట్టుబడులను ఆకర్షించటానికి బ్యాంకులు, భీమా, ఇంధనం, డిఫెన్స్ తదితర రంగాలన్నిటిలో మిగిలి ఉన్న రెస్ట్రిక్షన్స్‌ని ఎత్తివేస్తామని ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ నిస్సిగ్గుగా ప్రకటించగా, ఇందుకు శాంతియుత వాతావరణం నెలకొల్పటానికి మావోయిస్టులను ఉక్కుపాదంతో అణచివేస్తామని చిదంబరం బరితెగించి మాట్లాడాడు.

వివిధ గనులు; భారీ ప్రాజెక్టులు-పరిశ్రమలు, ఎస్.ఈ.జడ్.లు, విమానాశ్రయాలు, ఎక్స్‌ప్రెస్ హైవేలు తదితర ప్రాజెక్టులు; రియల్ ఎస్టేట్‌లు; ఉద్యానవనాలు, టైగర్ ప్రాజెక్టులు; పట్టణాలలోని పేదల బస్తీల తొలగింపు తదితరాల మూలంగా దేశవ్యాప్తంగా లక్షలాది రైతాంగం, ఆదివాసీ ప్రజానీకం, పేద మధ్యతరగతి ప్రజలు తమ భూముల నుండీ, జనావాసాల నుండీ విస్థాపనకు గురవుతున్నారు. ఒక పత్రికలో వచ్చిన సమాచారం ప్రకారం నేడు దేశంలో విస్థాపన సమస్యపై 17 రాష్ట్రాల్లోని 40 జిల్లాల్లో భూములను కోల్పోతున్న లక్షలాది ప్రజలు ఉద్యమిస్తున్నారు. వీరు పూర్తిగా విస్థాపితులైతే సుమారు నాలుగు లక్షల ఎకరాల పంట పొలాలను, లక్షలాది ఎకరాల అటవీ భూములను కోల్పోతారు. నేడు విస్థాపన సమస్య వల్ల సుమారు 10 కోట్ల మంది ప్రజలు ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభావితమవుతున్నారు. దాదాపు మిలిటెంట్‌గా జరిగిన ప్రతి పోరాటాన్ని పాలకులు కాల్పుల్లో ముంచెత్తుతున్నారు. ఈ సంవత్సర కాలంలో విస్థాపన సమస్యపై దేశంలోని ఒడీషా, మహారాష్ట్ర, యు.పి., ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో మిలిటెంట్‌గా జరిగిన పోరాటాలన్నిటిపై ప్రభుత్వాలు క్రూరమైన దమనకాండను అమలు జరిపాయి. ప్రజాస్వామిక శక్తులు ఈ ఉద్యమాలకు అండగా నిలిచి వివిధ రూపాల్లో మద్దతునిస్తున్నాయి. నేడు ప్రభుత్వం, ఎం.ఎన్.సి.లు, దేశ బడా కంపెనీలు, రాజకీయ నాయకులు, బిల్డర్లు, భూమాఫియాలు, కాంట్రాక్టర్లు తమ భూములు గుంజుకోవడానికి వ్యతిరేకంగా ప్రజలు కొనసాగిస్తున్న మిలిటెంట్ ఉద్యమాల ఫలితంగా పాలకవర్గాలు త్వరలో కొత్త 'భూఅధిగ్రహణ చట్టం' తేబోతున్నాయి. ఈ చట్టం కంటితుడుపుగా కొన్ని అంశాల్లో ప్రజలకు తోడ్పడినా, ప్రజల భూహక్కులను పరిరక్షిస్తామనే భ్రమాజనిత పదజాలం ఇందులో గుప్పించబడి ఉంటుంది. అయితే ఈ చట్టం ప్రధానంగా, ఇంతవరకు ఆదివాసులకున్న అన్ని చట్టాలను తుంగలో తొక్కేదిగా, రైతుల, పేదప్రజల భూయాజమాన్య హక్కులను నాశనం చేసేదిగా ఉంటుంది. ఇది సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల, ప్రభుత్వ పెట్టుబడి అవసరాలకనుగుణంగా దేశ భూయాజమాన్య స్థితిని చాలా తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇది వ్యవసాయ విప్లవానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడిన వ్యూహాత్మకదాడిగా ఉంటుంది. ఇది ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభం మన దేశ ప్రజలకందిస్తున్న ఒక విషఫలం. అయితే ఈ సమస్య సామాజిక వైరుధ్యాలన్నీ తీవ్రతరం కావటానికి దోహదం చేస్తుంది.

గత మేలో ఐదు రాష్ట్ర అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో బెంగాల్, తమిళనాడు, కేరళలలో అధికారంలో ఉన్న పార్టీల ప్రభుత్వాలు పడిపోయి, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అస్సాంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రాగా, పాండిచ్చేరిలో ముఖ్యమంత్రి పార్టీ మారి తిరిగి అధికారంలోకి వచ్చాడు. ఇన్‌కంబెన్సీ వల్ల తమిళనాడు, కేరళలలో డి.ఎం.కె, లెఫ్ట్‌ఫ్రంట్ పార్టీలు ఓడిపోయి, వాటి స్థానంలో ఏ.ఐ.డి.ఎం.కె., కాంగ్రెస్ పార్టీలు అధికారంలోకి వచ్చాయి.

మన ఉద్యమానికి సంబంధించినంతవరకు అస్సాం, బెంగాల్ ఎన్నికల ఫలితాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఎన్నికలకు ముందే అస్సాంలో ఉల్ఫా నాయకత్వం లొంగుబాటు బాట పట్టి ప్రభుత్వానికి అసెంబ్లీ ఎన్నికల్లో లోపాయికారీగా మద్దతునిచ్చింది. బోడో ఉద్యమంలోని ఒక సెక్షన్ కూడా గోగోయ్‌కి మద్దతునిచ్చింది. ఇవి గోగోయ్ గెలుపుకు తోడ్పడినాయి. ఉల్ఫా లొంగుబాటు ఈశాన్య జాతుల ఉద్యమాలపై ప్రతికూల ప్రభావం కలిగిస్తుంది.

బెంగాల్‌లో సి.పి.ఐ.(ఎం) సుదీర్ఘకాలం బూర్జువా పార్లమెంటరీ పంథాలో అధికారం చెలాయించి, చివరికి ఈ ఎన్నికల్లో ఆ అధికారాన్ని కోల్పోయింది. ఇందుకు ప్రధాన కారణం - సుదీర్ఘకాలం అధికారంలో ఉండి అనుసరించిన కాలం చెల్లిన ఆర్థిక, రాజకీయ విధానాలే. ఈ విధానాలు మధ్యతరగతి, రైతాంగ ప్రజలలో తీవ్ర అసంతృప్తి కలిగించాయి. మొదటినుండీ ఇది మావోయిస్టు పార్టీలను తన బద్ధశత్రువుగా పరిగణించి కేంద్రంతో మిలాఖతై ఎడతెరిపిలేని అణచివేత కొనసాగించింది. దీని నిరంకుశ సోషల్ ఫాసిస్టు పాలనను ప్రజాస్వామికవాదులు కూడా తీవ్రంగా నిరసించారు, పోరాడారు. ఈ పార్టీ కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో తీవ్రమైన అంతర్గత ముఠా తగవులలో తలమునకలవడంతో పాటు లెఫ్ట్ ఫ్రంట్ ఇదే పరిస్థితిని ఎదుర్కొంది. ఇలాంటి పరిస్థితిలోనే మమతా బెనర్జీ అధికారానికి రాగలిగింది. మమత కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామి కావడం ఆమెకు కలిసి వచ్చిన ఫాక్టర్. దీనికి తోడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు కూడా ఆమె గెలుపుకు తోడ్పడినాయి. ఇందులో మీడియా తన వంతు పాత్రని పోషించింది. మరింత సంక్షిప్తంగా చెప్పాలంటే, బెంగాల్‌లో సామాజిక వైరుధ్యాలు చాలా తీవ్రస్థాయిలో కొనసాగిన ఫలితంగా అధికారంలో ఉన్న ఒక పాలక ముఠా స్థానంలోకి మరో పాలక ముఠా వచ్చింది.

బెంగాల్ ఎన్నికల తర్వాత గణనీయ సంఖ్యలోనే అక్కడి ప్రజలు సోషల్ ఫాసిస్టు పాలనను కూల్చిన ఒక ఛాంపియన్‌గా త్రిణమూల్ పార్టీని, దాని నాయకురాలు మమతా బెనర్జీని చూసే అవకాశం ఉంది. త్రిణమూల్ పార్టీ నాయకత్వ వర్గ సంపుటినీ, దాని ఆర్థిక, రాజకీయ విధానాలనూ, కేంద్రంలో ఎన్.డి.ఏ. (బి.జె.పి.), యు.పి.ఏ. (కాంగ్రెస్) ప్రభుత్వాలలో అది నిర్వహించిన పాత్రనూ, రాష్ట్రంలో అధికారానికి వచ్చిన మరుక్షణం నుండి మమత మావోయిస్టు పార్టీ గురించి చిదంబరం గొంతుతో గొంతుకలిపి మావోయిస్టులు హింసను విడనాడి జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిస్తూ పునరావాస ప్యాకేజీ ఎరను విసరడం, లాల్‌గఢ్‌లో శాంతియుత వాతావరణం ఏర్పడిన తర్వాతే సంయుక్త బలగాలను అక్కడి నుండి పంపించివేస్తామని ప్రకటించడంనూ, వీటితోపాటు ఆ పార్టీ నిత్య కార్యాచరణను మార్క్సిస్టు దృక్కోణం నుండి పరిశీలించగలిగినప్పుడే ఎవరైనా దాని వర్గ స్వభావాన్నీ, వర్గ

ప్రాతినిధ్యాన్నీ, పార్లమెంటరీ రాజకీయ వ్యవస్థలో దాని స్థానాన్నీ, నేడు బెంగాల్‌లో అది నిర్వహించే పాత్రను సరిగా అర్థం చేసుకోగలుగుతారు.

ఎన్నికల తర్వాత బెంగాల్ రాజకీయ పరిస్థితిలో కొన్ని మార్పులు జరిగాయి. వీటిని గమనంలో ఉంచుకొని మనం ఏ మేరకు సరైన ఎత్తుగడలు రూపొందించుకొని ప్రజలను కదిలించగలుగుతామో ఆ మేరకు పార్టీని, ప్రజాపునాదిని, పోరాటశక్తిని పెంపొందించుకొని ప్రజాయుద్ధాన్ని మరింత అభివృద్ధి చేయటానికి కావలసిన పరిస్థితులను సృష్టించుకోగలుగుతాం.

వివిధ పాలకవర్గ పార్టీలు, వారి నాయకులు, ప్రభుత్వాధికారులు కుమ్మక్కై కొనసాగించిన వేల-లక్షల కోట్ల రూపాయల భారీ కుంభకోణాలు గత సంవత్సర కాలమంతా ఒకదాని వెంట మరొకటి బయటపడ్డాయి. పాలకవర్గ పార్టీలన్నీ ఎన్నడూ లేని స్థాయిలో పరస్పరం నిందించుకున్నాయి. పార్లమెంటరీ పార్టీలు, ప్రభుత్వ యంత్రాంగం అవినీతితో కుళ్ళిపోయాయనే విషయం మున్నెన్నటి కంటే ఎక్కువగా ప్రజల్లో బట్టబయలై పోయింది. దేశంలో అవినీతిపై మరోసారి ఆరంభమైన చర్చ ఊపందుకుంది. దినదినం తమ జీవన పరిస్థితులు దుర్భరమవడానికి అవినీతి కూడా ఒక ముఖ్యమైన కారణం కావడం వల్ల ప్రభుత్వాలపై అశేష ప్రజానీకం తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. ఈ సమస్యపై ప్రజల అసంతృప్తి కట్టలు తెంచుకునే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితిని ఆసరా చేసుకొని అన్నా హజారే, రామ్‌దేవ్ బాబా వగైరాలు రంగంలోకి దిగారు. పాలకవర్గాలు, వారి మీడియా వీరిని అవినీతికి వ్యతిరేకంగా పోరాడే ఛాంపియన్లుగా ఫోకస్ చేశాయి. ప్రజల అసంతృప్తి సంఘటిత రూపం తీసుకొని దేశవ్యాపిత సమరశీల ఉద్యమంగా అభివృద్ధి చెంది తమ పునాదులను కదిలించివేయకముందే, తమను కాపాడడానికి దిగివచ్చిన రక్షకుడిగా, సేఫ్టీవాల్వ్‌గా పాలకవర్గాలు అన్నాహజారేని పరిగణించాయి. అవినీతిపరులచే అవినీతిని రద్దు చేసే ఒక చట్టాన్ని చేయించడం, ఈ చట్టం వల్ల అవినీతి రద్దయిపోతుందని నమ్మించడం ఎంతటి మోసకారితనమో సత్యాగ్రహం చేసిన అన్నాహజారేకు, అతని సన్నిహిత అనుయాయులకు బాగానే తెలుసు. ఈ విషయం పాలకవర్గాలకూ తెలుసు. అవినీతికి మూలకారణం, దీనిని నిర్మూలించే పద్ధతి, దీనికి పరిష్కార మార్గం గురించి ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకోకుండా చేయడంలో అన్నాహజారే, పాలకవర్గాలు తాత్కాలికంగా కొంతవరకు సఫలమైనారనే చెప్పవచ్చు. వాస్తవానికి గత చట్టాల వలెనే నూతన చట్టం కూడా తననేమీ చేయలేదని పాలకవర్గాలకు స్పష్టంగా తెలుసు. అయినప్పటికీ తాము బహిరంగంగా అంగీకరించిన మేరకు కూడా లోక్‌పాల్ బిల్లు రూపొందించటానికి ఇవి సిద్ధంగా లేవు.

సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్లు, భూస్వాములచే దేశ ప్రజలు పీల్చి పిప్పి చేయబడుతూ, నిరంకుశ రాజ్యంచే క్రూరంగా అణచివేయబడుతూ, సామాజిక విప్లవ తుఫాను చెలరేగనున్న పరిస్థితులలో, మావోయిస్టు పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధం దినదినం దేశ ప్రజలకు ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితులలో అన్నాహజారే సత్యాగ్రహం ద్వారా, చట్టాలను సంస్కరించి అవినీతిని రూపుమాపడం అనే శాంతియుత పంథాని ముందుకు తేవడం అనేది యాదృచ్ఛికంగా జరిగిందేమీ కాదు. అందుకే అన్నా హజారే నేడు దేశంలో మావోయిస్టు పార్టీ నాయకత్వాన కొనసాగుతున్న

దీర్ఘకాల ప్రజాయుద్ధాన్నీ (సామాజిక విప్లవాన్ని), ప్రజల పోరాట చేవను నిర్వీర్యపరిచే ప్రత్యామ్నాయ మార్గంగా గాంధీవాద తరహా పోరాట పద్ధతిని ముందుకు తెచ్చాడు. నిలువెల్లా కుళ్లికంపుకొడుతున్న నేటి బూటకపు పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థ కాయకల్ప చికిత్స ద్వారా (చట్ట సంస్కరణల ద్వారా) బాగు చేయవచ్చునని భ్రమలు రేకెత్తించి నేటి వ్యవస్థకూ, సత్యాగ్రహ-శాంతియుత మార్గానికీ సాధికారికత కల్పించడమే అన్నా, బాబాల అసలు ఉద్దేశ్యం. అయితే, అవినీతికీ వ్యవస్థకూ, అవినీతికీ గ్లోబలైజేషన్‌కూ, అవినీతికీ ఎం.ఎన్.సి.ల, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల గుత్త లాభాలకూ గల సంబంధం గురించి పల్లెత్తు మాట పలకని వీరి బూటకపు సత్యాగ్రహాలు, చట్ట సంస్కరణలు ప్రజలను ఎంతోకాలం మభ్యపెట్టలేవు. దేశంలో అవినీతికి వ్యతిరేకంగానే గాకుండా వివిధ సమస్యలపై ముందుకు వస్తున్న సమరశీల ప్రజాఉద్యమాలకు సరైన పోరాటమార్గాన్నీ, శాశ్వత పరిష్కారాన్నీ చూపగలిగేది ప్రజాయుద్ధమే గానీ, గాంధీవాదుల సత్యాగ్రహాలు కావు. అవినీతి విషయంలో కేంద్రస్థాయిలోనే గాకుండా ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, ఒడీషా, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలో పాలకవర్గ పార్టీల మధ్య వైరుధ్యాలు చాలా తీవ్రతరమయ్యాయి.

ఇటీవల నేపాల్ రాజకీయాల్లో భారత విస్తరణవాదుల జోక్యం మరింత పెరిగిపోయింది; బంగ్లాదేశ్ హసీనా ప్రభుత్వంతో చాలా కీలకమైన ఒప్పందాలు చేసుకున్నారు. ఇందులో ఒక భాగమే ఉల్ఫా నాయకత్వాన్ని లొంగదీసి చర్చలకు తీసుకురాగలగడం అనేది. పాకిస్తాన్‌పై ఒత్తిడి పెంచారు. ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికాకు జూనియర్ పార్టనర్‌గా పనిచేస్తున్నారు. వీరు ఈశాన్య పీడిత జాతుల, కాశ్మీర్ ప్రజల ఉద్యమాలను తీవ్రంగా నష్టపరిచారు.

ఇటీవల భారత ప్రభుత్వం అమెరికాతో ఆంతరంగిక భద్రతకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకున్నది. వీటిలో భద్రతకు సంబంధించిన వివిధ అంశాలుంటాయి. వీటిలో భాగంగా పోలీసు, పారా మిలటరీ బలగాల ఆధునికీకరణకు, వాటి వినియోగానికి సంబంధించిన అంశాలు కూడా ఉంటాయి. ఇందులో భాగంగా వీటికి అవసరమైన శిక్షణ, టెక్నాలజీ, ఆయుధాలు, సమాచార మార్పిడి, సలహాలు వగైరా కూడా ఉంటాయి. ఈ ఒప్పందాల వల్ల ఎఫ్.బి.ఐ. చట్టబద్ధంగానే మన దేశంలో కూర్చొని చిదంబరాన్ని (హోంశాఖను) ఆడించవచ్చు. ప్రపంచ ఉద్యమాలను అణచటంలో గల దాని అనుభవాన్నీ, టెక్నాలజీ వగైరాలు మన దేశంలో మరింతగా వినియోగించబడేలా ప్రయత్నిస్తుంది. వీటన్నింటితో సామ్రాజ్యవాదానికి భారత ప్రజలకు మధ్యగల వైరుధ్యం మరింత తీవ్రమవుతుంది.

ప్రత్యేక తెలంగాణా ఉద్యమం వివిధ పాలకవర్గ పార్టీల మధ్యనే గాకుండా, కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల్లో కూడా అంతర్గత వైరుధ్యాల్ని ముందెన్నటి కంటే కూడా తీవ్రతరం చేసింది.

దేశాభివృద్ధి పేరుతో రైతాంగం, ఆదివాసుల, పేద మధ్యతరగతి ప్రజల భూములను స్వాధీనం చేసుకునే ప్రభుత్వ విధానాల వల్ల విస్థాపన, పర్యావరణం, మూలవాసుల సమస్యలపై పోరాటాలు దేశం నలుమూలలా చెలరేగుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ సమస్యలపై ప్రజా ఉద్యమాలు మరింత తీవ్రతరమౌతాయి. అధిక ధరలు, అవినీతి, ఆపరేషన్ గ్రీన్‌హంట్ తదితర సమస్యలపై దేశంలో పోరాటాలు పెంపొందుతున్నాయి. కాశ్మీర్, ఈశాన్య జాతుల

ఉద్యమాలు తాత్కాలికంగా వెనుకపట్టు పట్టాయి. అయినా ఈ జాతుల ఆకాంక్షలను భారత పాలకవర్గాల ఉక్కుపాదాలు, కుట్రలు కుహకాలు ఎంతోకాలం అణచిపెట్టి ఉంచలేవు. ఈ జాతుల సుదీర్ఘ పోరాట చరిత్ర ఈ సత్యాన్ని పదే పదే రుజువు చేస్తూ వచ్చింది. ఈ ఉద్యమాలు వెనుకపట్టు పట్టడం వల్ల పాలకవర్గాలు మన ప్రజాయుద్ధంపై పారా మిలటరీ బలగాలను మరింత ఎక్కువగా మోహరించటానికి సానుకూల పరిస్థితి ఏర్పడింది. దేశంలో తీవ్రతరమైన ప్రముఖ, మౌలిక వైరుధ్యాల ఫలితమే పెంపొందుతున్న ప్రజాఉద్యమాలు.

మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధంపై పాలకవర్గాలు మున్నెన్నడూ లేని స్థాయిలో దాడిని తీవ్రతరం చేశారు. ఈ అణచివేత కోసం ప్రతి సంవత్సరం వేలకోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. అన్ని ప్రభుత్వాలు ప్రతీ ఉద్యమంపై క్రూరంగా దాడి చేస్తూ నిరంకుశ పాలన కొనసాగిస్తున్నాయి.

## తీవ్రతరం, విస్తృతం అయిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ దమనకాండ

కేంద్రంలో యు.పి.ఏ-2 అధికారంలోకి వచ్చిన వెనువెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాయుద్ధాన్ని రూపుమాపే లక్ష్యంతో ఆరంభించిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ గత సంవత్సర కాలమంతా మరింత తీవ్రంగా, విస్తృతంగా కొనసాగించాయి. గత సంవత్సరకాలంలో ఇంటెలిజెన్స్ సంస్థలు అన్ని స్థాయిల్లో మన పార్టీ నాయకత్వ శక్తుల్ని ప్రత్యేకంగా కేంద్ర, రాష్ట్ర నాయకత్వశక్తులను దెబ్బతీయడం తమ ప్రధాన ప్రాధాన్యతగా పెట్టుకొని, ప్రత్యేక కేంద్రీకరణతో దాడి కొనసాగించాయి. మన సి.సి. సభ్యులు కామ్రేడ్స్ జగదీష్ మాస్టర్ (భూపేష్, పి.బి.ఎం.), పులేందుశేఖర్ ముఖర్జీ (సాహెబ్‌దా), వారణాసి సుబ్రహ్మణ్యం (శ్రీకాంత్), విజయకుమార్ ఆర్య (జశ్‌పాల్); బెంగాల్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కా. సుదీప్ చోంగ్‌దార్, పంజాబ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కా. పరంజీత్; బి.జె. ఎస్.ఏ.సి. సెక్రటేరియట్ సభ్యుడు కా. ఉమేష్ యాదవ్ (అభిమన్యు), మహారాష్ట్ర కమిటీ సభ్యురాలు కా. అంజలి; బెంగాల్, ఒడీషా, మహారాష్ట్రలకు చెందిన కొందరు రాష్ట్ర కమిటీ సభ్యులు, వివిధ రాష్ట్రాల్లో కొందరు ఇతర కామ్రేడ్స్ అరెస్టు అయినారు.

దేశంలోని విశాల ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లో కొనసాగుతున్న ప్రజాయుద్ధాన్ని అణచివేయటానికి పాలకవర్గాలు తమ సైన్యాన్ని రంగంలోకి దింపాయి. సైనిక బలగాలకు కౌంటర్ ఇన్‌సర్జెన్సీలో ప్రత్యేక శిక్షణనందించడానికి బస్తర్‌కు బ్రిగేడ్ స్థాయిలో బలగాలను పంపాయి. ఈ బలగాలు శిక్షణా కాలంలో ఆత్మరక్షణ నెపంతో ఎప్పుడైనా దాడికి పూనుకోవటానికి కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. బస్తర్, గడ్‌చిరోలిలలో యు.ఏ.వి.లను వినియోగిస్తున్నారు. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్స్ కోసం వినియోగించబడుతున్న 70 వేల మంది పారా మిలటరీ బలగాల వైద్య సదుపాయాల కోసం ప్రత్యేక శిక్షణ పొందిన 'విశేష్ హెలికాప్టర్ అంబులెన్స్ సేవ'ను త్వరలో ఆరంభించబోతున్నారు. ఈ అంబులెన్స్‌లు అవసరమైనప్పుడు కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్స్‌లో నిమగ్నమై ఉన్న పోలీసు బలగాలకు సైతం వైద్యసేవల నందిస్తాయి. బలగాల తరలింపు, గాయపడ్డవారిని తీసుకెళ్లడం, ఆయుధాలు, మందుగుండు సరఫరా, మందులు, సరుకుల రవాణా; కార్పెట్ సెక్యూరిటీలో భాగంగా బేస్‌క్యాంపుల నిర్మాణానికీ,

పోలీసు, పారా మిలటరీ ఉన్నతాధికారుల పర్యటనలకు వాయుసేన హెలికాప్టర్లతో పాటు లీజుకు తీసుకున్న అనేక హెలికాప్టర్లను విరివిగా వినియోగిస్తున్నారు. ఆత్మరక్షణ నెపంతో వాయుసేన ఎప్పుడైనా దాడికి పూనుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. పాలకవర్గాలు ప్రజలపై కొనసాగిస్తున్న యుద్ధంలో పదాతి, వాయుసేనలను ప్రత్యక్షంగా వినియోగించటానికి కావలసిన శిక్షణ, రిహార్సల్ వగైరా సన్నాహాలను వేగంగా పూర్తి చేస్తున్నారు.

ఇప్పటికే పాలకవర్గాలు దేశవ్యాప్తంగా మన ఉద్యమ అణచివేతకు లక్షలాది మంది పోలీసు, పారా మిలటరీ బలగాలను మోహరించి తీవ్రమైన దమనకాండను కొనసాగిస్తున్నాయి. కార్పెట్ సెక్యూరిటీని పటిష్టం, విస్తృతం చేయడానికీ, సెర్చ్ అండ్ డిస్ట్రాయ్ (వెతికి విధ్వంసం చేసే) ఆపరేషన్స్ తీవ్రతరం చేయడానికీ పోలీసు, పారా మిలటరీ బలగాలు సరిపోవటం లేదని వివిధ రాష్ట్రాల్లో వేలాది మంది రిటైర్డ్ సైనికుల్ని వినియోగిస్తున్నారు. ఈ బలగాలను మరింత ఎక్కువ మందిని వినియోగించుకుంటామని చిదంబరం ప్రకటించాడు. ఒక పత్రిక అంచనా ప్రకారం కేవలం బస్తర్‌లో నక్సల్స్‌ని అదుపు చేయడానికి ఒక లక్ష సెక్యూరిటీ బలగాలు కావాలి. కాని నేడు ఛత్తీస్‌గఢ్‌లో 40 వేల రాష్ట్ర పోలీసు బలగాలతో పాటు 5 వేలకు పైగా ఎస్.పి.ఓ.లు, అంతకు రెట్టింపుకు మించిన సంఖ్యలో గోపనీయ సైనికులు, హోంగార్డులు, నగర్ సురక్షా సైనికులుండగా 25 వేల కేంద్ర పారా మిలటరీ బలగాలున్నాయి. అంటే ఉద్యమ అణచివేతకు ఏ స్థాయిలో బలగాలను మోహరించాలని విప్లవ ప్రతీఘాతుక పాలకవర్గాలు ఆలోచిస్తున్నాయో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. పోలీసు, పారామిలటరీల్లోకి పెద్దెత్తున బలగాలను రిక్రూటు చేసుకుంటూ వీటికి కౌంటర్ ఇన్‌సర్జెన్సీలో శిక్షణ నివ్వటానికి వివిధ రాష్ట్రాల్లో పలు ప్రత్యేక శిక్షణా కేంద్రాలను ఏర్పరుస్తున్నారు. బలగాల ఆధునికీకరణకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఉద్యమ ప్రాంతాలను పోలీసు, పారామిలటరీల కంటోన్మెంటులుగా మార్చివేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగాలను సామ్రాజ్యవాద దేశాల తరహాలో ఆధునీకరిస్తున్నారు. ఇవి మన ఉద్యమాన్ని అణచివేయడానికి అత్యంత క్రూరంగా అమానుషమైన హత్యాకాండను, అత్యాచారాలను కొనసాగిస్తున్నాయి. వివిధ కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగాల మధ్య సమన్వయాన్ని మెరుగుపర్చుకుంటున్నారు. వీటికి తోడుగా ప్రతి రాష్ట్రంలో గ్రామ స్థాయి వరకు వివిధ పేర్లతో కోవర్టు ఆపరేషన్స్ నిర్వహించటానికీ, ఇంటెలిజెన్స్ యంత్రాంగాన్ని విస్తృతపర్చటానికి వేలాది మందిని ఓవర్టు కోవర్టు పద్ధతుల్లో భర్తీ చేసుకుంటున్నారు. గత సంవత్సర కాలంలో ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బెంగాల్, ఒడీషా, మహారాష్ట్రలలో ఎస్.పి.ఓ.లలోకి మరింత మందిని భర్తీ చేసుకున్నారు. దేశంలో ప్రస్తుతం ఉన్న 13500 ఎస్.పి.ఓల సంఖ్యను 25 వేలకు పెంచాలని నిర్ణయించుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఎస్.పి.ఓ.ల నియామకాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించినా, ఆచరణలో ఈ నిర్మాణం కొనసాగుతూనే ఉంది. ఎస్.పి.ఓ.ల నందరినీ యాగ్జిలరీ పోలీసు నిర్మాణంగా మార్చేందుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

డి.కె., బి.జె., ఒడీషా, బెంగాల్‌లలో కొనసాగుతున్న కార్పెట్ సెక్యూరిటీని వేగంగా పటిష్టం, విస్తృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తగా తొమ్మిది రాష్ట్రాలలో 400 ప్రత్యేక పోలీసు స్టేషన్లు నిర్మించాలని నిర్ణయించుకున్నారు. ఈ ప్రత్యేక పోలీసు స్టేషన్లకయ్యే

వ్యయంలో 80 శాతం కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. తొమ్మిది రాష్ట్రాల్లోని మన ఉద్యమ ప్రాంతాన్నంతటినీ కలిపి పోలీస్ కారిడార్‌గా (పోలీసు-పారా మిలటరీ-మిలటరీ) మార్చివేస్తున్నారు. ఈ విషయం ఛత్తీస్‌గఢ్ మాజీ డి.జి.పి. విశ్వరంజన్ బాహాటంగానే ప్రకటించాడు. ఇందులో భాగంగానే ఒడీషాలో కొత్తగా 140 కోట్ల రూపాయల వ్యయంతో 70 ప్రత్యేక పోలీసు స్టేషన్లను నిర్మిస్తున్నారు. ప్రతీ ప్రత్యేక పోలీసు స్టేషన్ సైనిక తరహాలో అటాక్ ప్రూఫ్‌గా ఉంటుంది. ఈ పోలీస్ స్టేషన్ మూడంతస్థుల భవనంలో ఉండి నలువైపులా కోటగోడ లాంటి ప్రహరీ ఉంటుంది. అందులోనే ఆధునిక జింఖానా కూడా ఉంటుంది. ఇవి నాజీ తరహా ఫాసిస్టు చిత్రహింసా శిబిరాలుగా పనిచేస్తాయి.

ఇప్పటికే మన ఉద్యమ ప్రాంతాల్లో సైనిక సబ్-ఏరియా కమాండ్లను నెలకొల్పారు. వీటికి సారథ్యం వహిస్తున్న బ్రిగేడియర్‌లు మన ఉద్యమ అణచివేతలో వ్యూహాత్మక పాత్ర నిర్వహిస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ నేతృత్వంలో ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడీషా, బెంగాల్ రాష్ట్రాలను కలిపి 'యూనిఫైడ్ కమాండ్ సెంటర్' ఏర్పరిచారు. ఈ కమాండ్‌కు ఉన్నత సైనికాధికారి సారథ్యం వహిస్తారు. ఈ కమాండ్, జాయింట్ ఆపరేషన్స్/క్యాంపెయిన్స్‌కు ప్లాను రూపొందించి, నాయకత్వం వహిస్తుంది. వివిధ సరిహద్దు రాష్ట్రాలు జాయింట్ కమాండ్ సారథ్యంలో ఆపరేషన్స్ నిర్వహిస్తాయి.

నీళ్లల్లో చేపల్లా ప్రజల నంటిపెట్టుకొని ఉండే మావోయిస్టులను ప్రజల నుండి వేరుచేసే దుష్టపన్నాగంతో ప్రజలపై కొనసాగిస్తున్న అంతులేని హింసాకాండని, అత్యాచారాలను, విధ్వంసాన్ని కప్పిపుచ్చుకోవడానికీ, ప్రజలను గందరగోళపరచి నయానా భయానా తమవైపు నిలబెట్టుకోవడానికి మానసిక యుద్ధంలో భాగంగా సైకలాజికల్ ఆపరేషన్స్‌తో పాటు సివిక్ యాక్షన్ ప్రోగ్రాంని ముమ్మరం చేశారు. అబద్ధాలు, వక్రీకరణలు, కట్టుకథలు, అంధత్వం, కుసంస్కృతి, దురాచారం, భయం, లొంగుబాటు, స్వార్థపరత్వం, కపటం, మోసం, ద్రోహం, నిరంకుశత్వం వగైరా కుళ్లికంపుగొట్టే అత్యంత విప్లవ ప్రతీఘాతుక భావనలన్నిటినీ, విలువలన్నిటినీ సరైనవిగా, సమాజ వికాసానికి తోడ్పడేవిగా, ప్రజాస్వామికమైనవిగా భ్రమింపజేస్తూ గోబెల్స్‌ని తలదన్నేలా సైకలాజికల్ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నారు. అలాగే నగిషీలు చెక్కిన పేర్లతో వివిధ పథకాలు రూపొందించి పారా మిలటరీ, పోలీసు, మిలటరీ బలగాలచే సివిక్ యాక్షన్ ప్రోగ్రాంను అమలు చేయిస్తున్నారు. వీటితోపాటు హంతకముఠాలచే విద్రోహకర కార్యకలాపాలు చేయిస్తున్నారు. ఉద్యమ ప్రాంతాల్లో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కామ్రేడ్స్ కుటుంబాలపై ఎడతెరిపి లేకుండా వివిధ రూపాల్లో దాడులు కొనసాగిస్తున్నారు.

దేశంలోని 15 రాష్ట్రాల జైళ్లలో కేంద్ర కమిటీ సభ్యుల నుండి ఉద్యమ ప్రజల వరకు వేలాది మంది కామ్రేడ్స్ అమానుషమైన పరిస్థితుల్లో మగ్గిపోతున్నారు. ప్రతి ఒక్కరిపై బూటకపు కేసులు బనాయించారు. ఈ సంవత్సర కాలంలో వివిధ కేసుల్లో పి.యు.సి.ఎల్. నాయకుడు, ప్రజాడాక్టర్ వినాయక్‌సేన్‌కూ, కేంద్రకమిటీ కామ్రేడ్స్ నారాయణ సన్యాల్, అమిత్ బాగ్చీలతో పాటు మరికొందరు కామ్రేడ్స్‌కు యావజ్జీవ శిక్షలు విధించారు. ఝార్ఖండ్‌లో విప్లవ సాంస్కృతిక సంస్థ (ఝార్ఖండ్ ఎబేన్) నాయకుడు కామ్రేడ్ జితేన్ మరాండితో పాటు మరో ముగ్గురు ప్రజాసంఘ యాక్టివిస్టులకు బూటకపు కేసులో ఉరిశిక్షలు విధించారు.

ఉద్యమ ప్రాంతాల్లో ప్రజాసంఘాల బహిరంగ కార్యకలాపాల్ని సైతం అత్యంత నిరంకుశంగా అణచివేస్తున్నారు. వీటిని చట్టవిరుద్ధ కార్యకలాపాలుగా నిషేధించారు.

## మన ఆత్మరక్షణాయుద్ధం

గత సంవత్సర కాలంలో విప్లవానికీ, విప్లవ ప్రతీఘాతుకానికీ నడుమ అంతర్యుద్ధం మరింత తీవ్రతరమైంది. ఈ యుద్ధం అన్ని రంగాల్లోనూ కొనసాగుతోంది. మన యావత్తు పార్టీ, పి.ఎల్.జి.ఎ., విప్లవ ప్రజాకమిటీలు, ప్రజా సంఘాలు, విప్లవ క్యాంపులోని వారంతా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కి వ్యతిరేకంగా తెగించి పోరాడారు. ఈ క్రమంలో చాలా త్యాగాలు చేశాం. మన ఈ ఆత్మరక్షణా యుద్ధమే ఉద్యమాన్ని కాపాడుకోవడంలో, ముందుకు తీసుకుపోవడంలో, విప్లవ క్యాంపు యొక్క మనోస్థైర్యాన్ని ఉన్నతంగా నిలబెట్టడంలో, దేశ ప్రజలను ప్రభావితం చేయడంలో నిర్ణయాత్మక పాత్ర పోషించింది. గత సంవత్సర కాలంలో మనం కొనసాగించిన ఆత్మరక్షణాయుద్ధాన్ని సంక్షిప్తీకరించి ఇలా వివరించవచ్చు.

మొత్తంగా చూసినప్పుడు గత సంవత్సర కాలంలో మనం ప్రజాయుద్ధాన్ని రక్షించుకోవటానికీ, పురోగమింపజేయటానికీ తీవ్రంగా కృషి చేశాం. శత్రువు ప్రజాయుద్ధాన్ని సమూలంగా తుడిచిపెట్టే లక్ష్యంతో అన్ని రంగాల్లో అత్యంత క్రూరంగా, విస్తృతంగా అణచివేతను కొనసాగించాడు. ఇందులో భాగంగానే కార్పెట్ సెక్యూరిటీని మరింత పటిష్టం విస్తృతం చేయడం వల్ల, సెర్చ్ అండ్ డిస్ట్రాయ్ ఆపరేషన్స్‌లో బలగాల సంఖ్యను గణనీయంగా పెంచి వినియోగిస్తుండడం వల్ల ఆత్మరక్షణాయుద్ధం వివిధ రూపాల్లో ప్రభావితమైంది. మన స్వీయ పొరపాట్ల వల్ల, శత్రు దమనకాండ వల్ల మనం గణనీయంగానే స్వీయాత్మకశక్తులను కోల్పోవడంతో పాటు ఇతర రంగాల్లో కొన్ని తీవ్రమైన నష్టాలు పొందాం. మన ఉద్యమ ప్రాంతాలకు సంబంధించిన పరిస్థితి ఇలా ఉంది - బలమైన గెరిల్లా ప్రాంతాలు, ఉద్యమం గణనీయంగా బలహీనపడిన లేదా సెట్‌బ్యాక్‌కి గురైన ప్రాంతాలు, కొత్తగా విస్తరించిన ప్రాంతాలు, ప్రభావిత ప్రాంతాలు.

బలమైన గెరిల్లా ప్రాంతాలలో మన పార్టీ కమిటీల నాయకత్వం కింద నేటికీ తరతమ తేడాలతో పార్టీ, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం, వివిధ ప్రజాసంఘాలు, వీటిలోని కొన్నింటిలో గెరిల్లా బేస్‌లు - విప్లవ ప్రజాకమిటీలు పనిచేస్తున్నాయి. ఈ ప్రాంతాలలో లక్షలాది మంది విశాల ప్రజానీకం ఉన్నారు.

ప్రజాయుద్ధానికి కీలక స్థానాలుగా ఉన్న మన బలమైన ప్రాంతాలపై శత్రువు నిరంతరం కొనసాగించిన దాడులను ఎదుర్కొంటూనే, మన స్వీయ శక్తుల్ని, నిర్మాణాన్ని సంఘటితపర్చుకోవటానికి రాజకీయ, నిర్మాణ కృషి చేశాం. పార్టీ కమిటీల పనిని మెరుగుపర్చుకోవటానికీ, పరిస్థితిలో వచ్చిన మార్పులను దృష్టిలో పెట్టుకొని ఎత్తుగడలు రూపొందించుకోవటానికి కృషి చేశాం. రాజకీయాధికారాన్ని పటిష్టం, విస్తృతం చేయటానికి కృషి చేశాం. కేంద్ర కర్తవ్య సాధన కోసం ప్రజావిముక్తి గెరిల్లా సైన్యాన్నీ, ప్రజలను క్రియాశీలంగా కదిలించడానికి కృషి చేశాం. నూతన అనుభవాలను క్రోడీకరించి ఆచరణను మెరుగుపర్చుకోవటానికి కృషి చేశాం.

ప్రధానంగా డి.కె., బి.జె.లోనూ, కొంతవరకు ఏ.ఓ.బి., ఒడీషా, బెంగాల్, మహారాష్ట్ర, ఎన్.టి.లోనూ మన పి.ఎల్.జి.ఏ. బలగాలు శత్రు బలగాలపై వీరోచితంగా ఎత్తుగడల ఎదురుదాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో 225 శత్రు బలగాలను తుడిచిపెట్టి, సుమారు 200 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. అలాగే విప్లవోద్యమంపై కత్తిగట్టిన వర్గశత్రువులలో, శత్రు ఏజెంట్లలో కొందరు ఎంపిక చేసిన వారిని శిక్షించాయి. బలమైన ప్రాంతాలలో ప్రజామిలీషియాను, ప్రజలను చురుగ్గా కదిలించాం. ఎక్కడైతే ప్రజాపునాది బలంగా ఉందో అక్కడ గెరిల్లా యుద్ధ చర్యల సఫలత గణనీయంగా ఉంది. గెరిల్లా జోన్స్‌లో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ప్రజల్ని కదిలించాం. వివిధ స్థాయిల్లో శత్రు సైకలాజికల్ వార్‌ని తిప్పికొట్టడానికి కృషి చేశాం. ఇలాంటి ప్రాంతాల్లో మనం సంపాదించిన ఉన్నతమైన అనుభవాలు దేశంలో ప్రజాయుద్ధ అభివృద్ధికి తోడ్పడతాయి.

మన స్వీయశక్తులు, ఉద్యమం బలహీనపడిన లేదా సెట్‌బ్యాక్‌కి గురైన ప్రాంతాల్లో నేటి పరిస్థితిని అధిగమించే లక్ష్యంతో ఎత్తుగడలు రూపొందించుకొని పనిచేస్తున్నాం. సంవత్సరకాలంలో ఈ ప్రాంతాలలో మనం గణనీయమైన విజయాలేవీ సాధించలేకపోయినప్పటికీ, అడుగడుగునా త్యాగాలు చేస్తూ ప్రజలలో విప్లవాకాంక్షలను పెంపొందింపజేయగలిగామని మాత్రం చెప్పుకోవచ్చు.

గత సంవత్సరకాలంలో మన పార్టీ, ప్రజా విముక్తి గెరిల్లా సేన విస్తరించిన ప్రతీచోటా మనల్ని ప్రజలు అత్యంత ఉత్సాహంతో ఆహ్వానించారు. వీరు ప్రజాయుద్ధ రాజకీయాలతో బాగా ప్రభావితమైనారు. ప్రజల స్పందన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కలవరపరిచింది. వెంటనే వారు యుద్ధ ప్రాతిపదికన దాడికి వ్యూహాత్మకంగా సన్నాహాలు చేసుకుంటూ పెద్ద సంఖ్యలో పారా మిలటరీ, పోలీసు బలగాలను ఈ నూతన ప్రాంతాలకు పంపారు. ఈ బలగాలు సెర్చ్ అండ్ డిస్ట్రాయ్ ఆపరేషన్స్ కొనసాగిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రజలు మేల్కొని సంఘటితపడితే, దేశంలో ప్రజాయుద్ధ పురోగమనాన్ని నిలువరించడం చాలా కష్టమని తలంచిన పాలకవర్గాలు ఇంత తీవ్రమైన దాడికి పూనుకున్నాయి. తూర్పు ఛత్తీస్‌గఢ్-పశ్చిమ ఒడీషా సరిహద్దు ప్రాంతంలో ఒక సంవత్సరకాలంలోనే ఏడుగురు కామ్రేడ్స్ శత్రుబలగాలు చేసిన దాడులను వీరోచితంగా తిప్పికొట్టే సమయంలో నేలకొరిగారు. శత్రువు నలుగురు రైతులను పట్టుకొని కాల్చి చంపాడు. ఈ ప్రాంతాలలో వ్యూహాత్మక దృష్టితో ఉద్యమం ఒక సంఘటితరూపం తీసుకునే తక్షణ లక్ష్యంతో ప్రజలను రాజకీయంగా చైతన్యపర్చడానికీ, సంఘటితం చేయడానికీ, శత్రుదాడులను తిప్పికొట్టడానికీ కృషి చేస్తున్నాం.

దేశంలో ప్రజాయుద్ధాన్ని నాశనం చేయటానికి సామ్రాజ్యవాదుల, ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి దన్నుతో పాలకవర్గాలు ప్రజలపై కొనసాగిస్తున్న అమానుష, అన్యాయపూరిత ఆపరేషన్ గ్రీన్‌హంట్ యుద్ధాన్ని దేశంలోని, ప్రపంచంలోని మావోయిస్టు శక్తులు, ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులు, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రజాయుద్ధాన్ని బలపరిచాయి. సంఘీభావ ఉద్యమాలు నిర్మించాయి.

మన ప్రభావిత ప్రాంతాలలోనూ, బయటా వివిధ రకాల మిత్రశక్తులున్నాయి. ఈ ప్రాంతాలలో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కి వ్యతిరేకంగా, విస్థాపన, అవినీతి, అధిక ధరలు,

రాజకీయ ఖైదీల విడుదల, పౌరహక్కులు తదితర సమస్యలపై మిత్ర శక్తులతో కలిసి పనిచేస్తున్నాం. ఈ ప్రాంతాలను ఉద్యమ ప్రాంతాలుగా అభివృద్ధి చేయడంతో పాటు వీటి తోడ్పాటుతో ప్రభావిత ప్రాంతాలను విస్తరింపజేసే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

లాల్‌గఢ్, నారాయణపట్న ఉద్యమాలను అణచివేయడానికి శత్రువు కొనసాగిస్తున్న తీవ్రమైన దమనకాండను ఎదిరిస్తూనే ఉన్నత కర్తవ్యాల సాధన కోసం కృషి చేస్తున్నాం. ఉద్యమ ప్రాంతాల్లో అనేకచోట్ల ముందుకు వచ్చిన విస్థాపన సమస్యపై ప్రజల్ని కదిలించి పోరాటాలు నిర్వహించాం. దేశంలో విస్థాపన సమస్యపై పోరాడుతున్న ప్రజానీకానికి వివిధ రూపాల్లో మద్దతునిచ్చాం. వీటికి సంఘీభావంగా ప్రజల్ని కదిలించాం. ప్రజలు దైనందిన సమస్యలపై ప్రజాసంఘాల, ఐక్యసంఘటనా వేదికల నాయకత్వాన పోరాడారు. ఉద్యమ ప్రాంతాలంతటా పార్టీ స్థాపన, పి.ఎల్.జి.ఎ. స్థాపన వార్షికోత్సవాలు, అమరుల సంస్మరణవారం, అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం తదితర కార్యక్రమాల సందర్భంగా ప్రజలను విస్తృతంగా కదిలిస్తున్నాం. వివిధ రూపాల్లో ప్రచార కార్యకలాపాలు కొనసాగించాం.

గత సంవత్సర కాలంలో మన కామ్రేడ్స్ శత్రుచెరసాలల్లో సైతం వివిధ రూపాల్లో పోరాటాలు కొనసాగించారు. వివిధ జైళ్లలో మన కామ్రేడ్స్ వేలాది సాధారణ ఖైదీలను మేల్కొల్పడానికి కృషి చేశారు. రాజకీయ ఖైదీల విడుదలకై, ఖైదీల హక్కులకై జైళ్లలోనూ, బయటా ఉద్యమాలు కొనసాగాయి. శత్రువు నిరంతర నిఘాని వమ్ము చేస్తూ ఈ సంవత్సర కాలంలో బీహార్, ఝార్ఖండ్‌లో కొంతమంది కామ్రేడ్స్ అత్యంత సాహసోపేతంగా జైళ్లను బద్దలు కొట్టుకొని ప్రత్యక్షంగా ప్రజాయుద్ధంలో చేరిపోయారు. వారికి మన కేంద్ర కమిటీ హార్ధిక విప్లవాభినందనలు తెలియజేస్తున్నది.

రహస్య పార్టీ నియమాలను, పని పద్ధతులను అమలుచేసే విషయంలో, శత్రు పరిస్థితిలో, మన పరిస్థితిలో వస్తున్న మార్పుల్ని సరిగా అంచనా వేసే విషయంలో, గెరిల్లా యుద్ధ నియమాలను అమలుచేసే విషయంలో, ప్రజా ఉద్యమాల నిర్మాణంలో, పార్టీ కన్సాలిడేషన్‌లో, రాజకీయ ప్రచారం కొనసాగించే విషయంలో లోపాల గురించి సి.సి. సమీక్షించింది, కర్తవ్యాలు రూపొందించింది. వీటిని యావత్తు పార్టీ ఖచ్చితంగా అమలు చేయాలి.

**కామ్రేడ్స్,**

సామ్రాజ్యవాద దేశాల్లో సుడులు తిరుగుతున్న సంక్షోభం రుణసంక్షోభంగా బద్దలైంది. ఈ సంక్షోభం యావత్తు ప్రపంచాన్ని తరతమ తేడాలతో కుదిపివేస్తున్నది. ప్రపంచంలోనూ, మన దేశంలోనూ మౌలిక వైరుధ్యాలతో పాటు వివిధ సామాజిక వైరుధ్యాలు తీవ్రతరం అవుతున్నాయి. వివిధ దేశాల్లో ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. అంతటా ప్రజలు పోరాడుతుంటే, ప్రతీఘాతుక పాలకులు వీటిపై అణచివేత కొనసాగిస్తున్నారు, జోకొట్టాలని చూస్తున్నారు. మొత్తంపై ప్రపంచంలో విప్లవ పరిస్థితి అనుకూలంగా ఉంది. ఇదీ ఈ సంవత్సర కాల దేశ, ప్రపంచ పరిస్థితి సారాంశం.

గత సంవత్సరకాలంలో మనం నాయకత్వపరంగా ఎక్కువ నష్టాలే పొందాం. ఈ కాలంలో మనం విప్లవ ప్రతీఘాతుక ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని వీరోచితంగా తిప్పికొట్టాం.

ఆత్మరక్షణా యుద్ధంలో నూతన విజయాలు సాధించాం. ఈ విజయాలు ప్రధానంగా బలమైన గెరిల్లాజోన్స్‌లో సంపాదించినవి. ఉద్యమ విస్తరణ ఒక గణనీయమైన పాజిటివ్ అంశం. శత్రువు అన్ని రంగాలపై ఎడతెరిపి లేకుండా చాలా తీవ్రంగా కొనసాగించిన నిర్బంధ పరిస్థితులలో పార్టీ సాధించిన ప్రతీ విజయం అది ఎంత చిన్నదైనా చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం, ప్రజా నిర్మాణాలు, ప్రజలు ఆత్మరక్షణా యుద్ధంలో సంపాదించిన అనుభవాలకు చాలా ప్రాధాన్యత ఉంది. మన పార్టీలో కొనసాగుతూ వచ్చిన బలహీనతలను తొలగించుకొని, చేసిన పొరపాట్లను - లోపాలను సరిదిద్దుకొని, పరిమితులనధిగమించడానికి దృఢసంకల్పంతో కృషి చేయగలిగితే, సాధించిన విజయాలపై - పాజిటివ్ అంశాలపై, మన స్వీయశక్తిపై, పీడిత ప్రజలపై ఆధారపడి దృఢసంకల్పంతో పనిచేయగల్గితే, నిర్దిష్ట పరిస్థితికి తగిన ఎత్తుగడలు-పని పద్ధతులు రూపొందించుకొని ప్రజలను - ప్రజా విముక్తి గెరిల్లా సైన్యాన్ని సమర్థవంతంగా కదిలించగలిగితే, అనుకూలమైన విప్లవ భౌతిక పరిస్థితుల్లో పార్టీ రాజకీయ పంథాను నేటి ప్రజాయుద్ధ నిర్దిష్ట పరిస్థితికి సృజనాత్మకంగా అన్వయించుకొని సమైక్యంగా, దృఢంగా పనిచేయగల్గితే, స్వీయశక్తులను రక్షించుకోవడం, ప్రజాపునాదిని పెంపొందించుకోవడం, స్వీయబలాన్ని పెంపొందించుకోవడం, ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేయడం ద్వారా ఐక్యతా కాంగ్రెస్ రూపొందించిన కేంద్ర కర్తవ్యం సాధించడం, తద్వారా భారత విప్లవోద్యమంలో మరో నూతన గెంతు సాధించడం సాధ్యమే.

నేడు మన పార్టీ ముందు ఒకవైపు సంక్లిష్ట సమస్యలు, సవాళ్లు, పెను ప్రమాదాలు ఉన్నాయి. మరొకవైపు స్వీయకృషితో సాధించిన విజయాలూ, గొప్ప అనుభవాలూ ఉన్నాయి. విజయాలు సాధించటానికి కావలసిన విప్లవ భౌతిక పరిస్థితీ ఉంది. రెంటిలోనూ నేటికీ విప్లవ పురోగమనానికి కావలసిన అంశమే ప్రధానమైనది. అయితే విజయ సాధనకు మార్గం తిన్నగా లేదు. మనం కంటకావృతమైన, ఎత్తుపల్లాలతో, మలుపులు మెలికలతో కూడిన మార్గం గుండా ఆటంకాలెన్ని ఎదురైనా తుదివిజయం సాధించేవరకు అనన్య త్యాగాలతో, అసమాన ధైర్యసాహసాలతో ముందుకేగాల్సే ఉంటుంది. మన పార్టీ 7వ వార్షికోత్సవాల సందర్భంగా, మనం మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వెలుగులో, నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికి దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో అకుంఠిత దీక్షతో, అంతులేని సాహసంతో ముందుకు సాగుదామని శపథం చేద్దాం. అంతిమ విజయం దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గాన సాగే మన పార్టీదే - ప్రజలదే. అంతిమ ఓటమి అన్ని రకాల విప్లవ ప్రతీఘాతకులదే.

కామ్రేడ్స్,

మన పార్టీ 7వ వార్షికోత్సవాలను గ్రామ గ్రామాన, పట్టణాల్లో, పార్టీ కామ్రేడ్స్ ఉన్న ప్రతిచోటా విప్లవోత్సాహం తొణికిసలాడేలా ఘనంగా జరపండి. ఈ వార్షికోత్సవాల గురించి సృజనాత్మక పద్ధతుల్లో ప్రచార క్యాంపెయిన్లు, సభలు, సమావేశాలు నిర్వహించండి. వీటిలో పార్టీ అరుణ పతాకాన్ని సమున్నతంగా ఎగురవేయండి. గత సంవత్సర కాలంలో ఆత్మరక్షణా యుద్ధంలోనూ, భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలోనూ నేలకొరిగిన వేనవేలవీరుల విప్లవాదర్శాలను ఎత్తిపట్టండి. మనం సాధించిన విజయాలను, సంపాదించిన విలువైన

అనుభవాలను స్పష్టంగా ముందుంచండి. ఆచరణ క్రమంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకొంటామని ప్రకటించండి. అద్భుతమైన విప్లవ పరిస్థితి గురించీ, ప్రజాయుద్ధాన్ని నిర్మూలించడానికి శత్రువు అమలుచేస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని ఓడించాల్సిన అవసరం గురించీ, సాధించాల్సిన ఉద్యమ కర్తవ్యాల గురించీ స్పష్టీకరించండి. ప్రజాస్వామిక, కమ్యూనిస్టు సంస్కృతినీ, విలువలనూ ఎత్తిపట్టండి. నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం కష్టాలు, కన్నీళ్లు, ఆటంకాలు ఎన్ని ఎదురైనా దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో దృఢ సంకల్పంతో మునుముందుకే సాగుతామని శపథం చేయండి.

## తక్షణ కర్తవ్యాలు

నేటి పరిస్థితుల్లో మనం ఈ కింది కర్తవ్యాలను చేపట్టాలి. ప్రజాపునాది పెంపొందించుకొనే, పార్టీని సంఘటితపర్చుకొనే, గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేసే, ఉద్యమ ప్రాంతాలను విస్తరించే ఓరియంటేషన్‌తో ఈ కర్తవ్యాలను వివిధ స్థాయిల్లో గల ఉద్యమ ప్రాంతాల్లో సృజనాత్మకంగా అమలుచేయాలి.

**1. అద్భుత భౌతిక పరిస్థితికీ, ఉద్యమ స్థాయికీ-విస్తృతికీ, ఉద్యమ కర్తవ్యాల సాధనకు తగినట్లు పార్టీని పటిష్టం, విస్తృతం చేసుకోవాలి.** స్వీయశక్తులను కాపాడుకోవడానికి రహస్య నిర్మాణ-పని పద్ధతులకు, గెరిల్లా యుద్ధ నియమాలకు కట్టుబడి పనిచేయడంలో, సరైన ఎత్తుగడలు రూపొందించుకోవడంలో, క్రమశిక్షణను దృఢంగా అమలుచేయడంలో జరుగుతున్న లోపాలను సరిదిద్దుకోవాలి; వ్యూహాత్మక దృష్టితో దేశ నిర్దిష్ట పరిస్థితికీ, వివిధ ప్రాంతాల నిర్దిష్ట పరిస్థితులకూ, ఉద్యమ ఆటుపోట్లకు తగిన ఎత్తుగడలు (పోరాట నిర్మాణ రూపాలు) రూపొందించుకోవడంలో, కేంద్రకర్తవ్యం చుట్టూతా ఇతర కర్తవ్యాలు రూపొందించుకోవడంలో, ఎత్తుగడలు అమలుచేసే నిర్మాణ కృషిలో కొనసాగుతున్న లోపాలను సరిదిద్దుకోవాలి; దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాని లోతుగా అర్థం చేసుకొని నేటి విప్లవ యుద్ధాన్ని సంపూర్ణయుద్ధంగా వికసింపజేయటానికి కృషి చేయాలి; అన్ని నాయకత్వ కమిటీల శక్తిసమర్థతలు పెంపొందించుకోవడానికీ, నూతన నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకోవడానికీ నిర్దిష్ట పరిస్థితుల అధ్యయనం, సిద్ధాంత అధ్యయనం, చరిత్ర అధ్యయనం, శిక్షణను మెరుగుపర్చుకోవడం చేయాలి; పార్టీ కార్మికవర్గ స్వభావాన్ని కాపాడుకోవడానికీ, పార్టీ సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, సైనిక పంథాకు దృఢంగా కట్టుబడి ఉండడానికి రెక్టిఫికేషన్ క్యాంపెయిన్‌ని సఫలం చేయడంతోపాటు మావో బోధించిన మూడు పనిశైలిల విధానాన్ని అమలు చేయాలి; వివిధ ప్రాంతాల నిర్దిష్ట పరిస్థితిపై ఆధారపడి పార్టీని సంఘటితం, విస్తృతం చేయడానికి నిర్దిష్ట కార్యక్రమాన్ని రూపొందించుకొని పూర్తి చేయాలి.

**2. స్వీయశక్తులు పెంపొందించుకోవడానికీ, ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయడానికీ ప్రజాపునాదిని బలోపేతం, విస్తృతం చేయాలి.** ప్రజలను ప్రజాయుద్ధంలో క్రియాశీలంగా, విస్తృతంగా కదిలించటానికి పార్టీ సాధారణ రాజకీయ పంథాను లోతుగా అర్థం చేసుకోవాలి; రాజకీయ ఉద్యమాలతో పాటు దైనందిన సమస్యలపై జరిగే పోరాటాలలోనూ ప్రజలను విస్తృతంగా, సమరశీలంగా కదిలించాలి; వివిధ ఉద్యమాలలో, విప్లవ కార్యకలాపాలలో

సమీకరించే ప్రజలను రాజకీయంగా విద్యావంతుల్ని చేస్తూ వివిధ ప్రజాసంఘాలలో సంఘటితపర్చాలి; ప్రధాన శత్రువుకు వ్యతిరేకంగా విశాల ప్రజలను సమైక్యపర్చడంలో, తగిన ఐక్యసంఘటన నిర్మాణాలను ఏర్పరచి పనిచేయించడంతో పాటు వాటిని సంఘటితపర్చడంలో, వాటిపై పార్టీ నాయకత్వాన్ని నెలకొల్పడంలో జరుగుతున్న లోపాలను సరిదిద్దుకోవాలి; పార్టీ ప్రజలతో బలంగా సమైక్యం కావడంలో, ప్రజాపంథాను అమలుజరపడంలో జరుగుతున్న లోపాలను సరిదిద్దుకోవాలి; ప్రజలు విప్లవోద్యమానికి దూరం కావడానికి శత్రువు నిరంతరం సాగిస్తున్న సైకలాజికల్ ఆపరేషన్స్‌ను బలంగా తిప్పికొట్టడంతో పాటు వాడు ముందుకు తెస్తున్న బూటకపు సంస్కరణల బండారాన్ని బట్టబయలు చేయాలి; ప్రజల విప్లవచేవను నీరుగార్చే దుష్టపథకంతో ముందుకు వస్తున్న గాంధీయిజం, సంస్కరణవాదం, ఆర్థికవాదం, పార్లమెంటరిజం, పోస్ట్ మోడర్నిజం తదితర తప్పుడు సిద్ధాంతాలను ప్రజల్లో ఎండగట్టాలి; నేటి నిర్దిష్ట పరిస్థితులలో విస్థాపన, ఎస్.ఈ.జడ్.లు, అవినీతి, అధిక ధరలు, రాజ్య నిర్బంధం, పౌరహక్కులు తదితర సమస్యలపై విస్తృతంగా ప్రజలను కదిలించాలి; వర్గపోరాటాలలో ప్రజలను సమరశీలంగా, విస్తృతంగా కదిలించి సంఘటితపర్చడానికీ, ప్రజాయుద్ధంలో వారి క్రియాశీల పాత్ర పెంపొందించడానికీ, స్వీయశక్తులు పెంపొందించుకోవటానికీ గల పరస్పర సంబంధాన్ని లోతుగా అర్థం చేసుకొని మన కార్యాచరణను మెరుగుపర్చుకోవాలి.

**3. కేంద్ర కర్తవ్య సాధనకూ, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని ఓడించడానికీ, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం, విస్తృతం చేయాలి.** ఈ కర్తవ్య సాధనకు మనం - దీర్ఘకాలిక ప్రజాయుద్ధానికి, దాని మౌలిక ఎత్తుగడలకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులచే రూపొందించబడిన విప్లవ ప్రతీఘాతుక ఎల్.ఐ.సి. విధానాన్నీ, దాని ఎత్తుగడలనూ, దాని అత్యంత మోసపూరిత స్వభావాన్నీ లోతుగా అర్థం చేసుకోవాలి; ప్రజాయుద్ధాన్ని అణచివేయడానికి శత్రువు వ్యూహాత్మక దృష్టితో నిర్మించిన ప్రత్యేక బలగాలను, ఇంటెల్ యంత్రాంగాన్ని, అన్ని రంగాలను కేంద్రీకరించి దాడి చేసే పద్ధతినీ, బూటకపు సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలను, సైకలాజికల్ ఆపరేషన్స్‌ను, ప్రజల్లో, పార్టీలో చీలికలు సృష్టించడానికి చేసే దుష్టపన్నాగాలను మనం స్పష్టంగా అర్థం చేసుకోవాలి; శత్రువు వ్యూహాత్మకదృష్టితో ప్రత్యేక బలగాలను మోహరించడం, కార్పెట్ సెక్యూరిటీని ఏర్పర్చడం, సైన్యం-వాయుసేనల మోహరించడం అనేవి ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం ప్రజా విముక్తి సైన్యంగా, గెరిల్లా యుద్ధం మొబైల్ యుద్ధంగా, గెరిల్లా ప్రాంతాలు విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చెందకుండా, దేశంలో ప్రజాయుద్ధం పెనుకార్చిచ్చులా అభివృద్ధిచెందకుండా నిరోధించి అణచివేయటానికేననీ స్పష్టంగా అర్థం చేసుకోవాలి; శత్రువు గ్రామీణ ప్రాంతంలో నిర్మిస్తున్న ఇంటెల్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడానికీ, కొనసాగిస్తున్న కోవర్టు ఆపరేషన్స్‌ను, హత్యాకాండను, అత్యాచారాలను, విధ్వంసాలను, పుకార్లను అరికట్టడానికీ, ప్రజలను క్రియాశీలంగా కదిలించాలి; శత్రు ప్రత్యేక బలగాలను, సైన్యాన్ని ఎదుర్కొనే ఎత్తుగడలపై ప్రజా విముక్తి గెరిల్లా సైన్యాన్ని సుశిక్షితం చేయాలి; కార్పెట్ సెక్యూరిటీని, శత్రు స్పెషల్ బలగాలను, ఉద్యమ ప్రాంతాల్లో మోహరించబడే సైన్యాన్నీ దెబ్బతీయటానికి కొనసాగించే ఎత్తుగడల ఎదురుదాడులు/క్యాంపెయిన్లలోనూ మన బలగాలను, ప్రజలను చురుగ్గా కదిలించి చొరవ నిలబెట్టుకోవాలి; చురుకైన ఆత్మరక్షణ,

స్వంత బలగాలను కాపాడుకోవడం-శత్రుబలగాలను నిర్మూలించడం, యుద్ధ క్రమంలో అనివార్యమైన త్యాగాలకు సిద్ధం కావడం అనే విధానానికి లోబడి, ఉద్యమ ప్రాంతాల నిర్దిష్ట పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని సరైన సైనిక ఎత్తుగడలు రూపొందించుకొని దృఢంగా అమలుచేయాలి; పి.ఎల్.జి.ఏ. దైనందిన జీవితంలోనూ, యుద్ధచర్యలలోనూ గెరిల్లా కార్యాచరణ సూత్రాలను తప్పనిసరిగా అమలుచేయాలి; వివిధ గెరిల్లా ప్రాంతాల మధ్య గల అంతః సంబంధాన్ని గమనంలో ఉంచుకొని పనిచేయాలి. గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం పెద్దెత్తున మోహరిస్తున్న అన్ని రకాల బలగాల ద్వారా చొచ్చుకువస్తున్న కుళ్లు సంస్కృతి ప్రజాసంస్కృతికి ఎనలేని హానిచేస్తున్నది. ఈ కుళ్లు సంస్కృతికి వ్యతిరేకంగా మనం ప్రజాస్వామిక, కమ్యూనిస్టు సాహితీ సాంస్కృతికోద్యమాలను నిర్మించాలి.

**4. వ్యూహాత్మక దృష్టితో ఉద్యమ ప్రాంతాలను విస్తరించి సంఘటితపర్చాలి.** విస్తరణ ప్రాంతాలు విముక్తి ప్రాంత స్థాపనా లక్ష్యంతో సంఘటితపడి, స్వతంత్రంగా పనిచేసే గెరిల్లా ప్రాంతాలుగా అభివృద్ధి చేయడానికి తోడ్పడే నిర్దిష్ట రాజకీయ, నిర్మాణ, పోరాట కర్తవ్యాలు రూపొందించుకోవాలి; ప్రజాపునాదిని పెంపొందించుకోవడానికి ప్రజలను రాజకీయంగా సమీకరించడంపై, ప్రజాసంఘాలను, ప్రజా మిలీషియాను, వివిధ ఐక్యసంఘటనా వేదికలను ఏర్పరచి, సంఘటితపర్చడంపై కేంద్రీకరించి పనిచేయాలి; నూతన ప్రాంతాలు స్వతంత్రంగా నిలదొక్కుకోవడానికి బలమైన ప్రాంతాలు తోడ్పాటునందించాలి, వీటిని సమన్వయపూర్వకంగా పనిచేయించాలి. ప్రజాపునాది తగినంత అభివృద్ధి కాని దశలోనే, మొదటినుండీ శత్రువు మనల్ని నిర్మూలించటానికి చేసే ప్రయత్నాలను వమ్ము చేయటానికి మనం సర్వదా పార్టీ రహస్య నిర్మాణ పద్ధతులను-పని పద్ధతులను, గెరిల్లా నియమాలను అమలుచేయడంతో పాటు వాడు చేసే దాడుల్ని ధైర్యంగా తిప్పికొట్టాలి; శత్రువు ఎడతెరిపి లేకుండా వివిధ పద్ధతుల్లో కొనసాగిస్తున్న సైకలాజికల్ ఆపరేషన్స్‌ని సృజనాత్మక పద్ధతుల్లో తిప్పికొట్టాలి; ప్రజాఉద్యమంలో ముందుపీఠిన నిలిచే శక్తులను సైద్ధాంతికంగా, రాజకీయంగా విద్యావంతుల్ని చేసి స్థానిక స్థాయిలో పార్టీ యూనిట్లను నిర్మించాలి; వీటిని పునాది చేసుకొని పార్టీని, ప్రజావిముక్తి గెరిల్లా సైన్యాన్ని బలోపేతం, విస్తృతం చేసుకోవాలి; వ్యూహాత్మక దృష్టితో తగినంత ప్రాంతానికి విస్తరించి, గెరిల్లా బలగాలను పెంపొందించుకుంటూ గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయడంతోపాటు విప్లవ ప్రజాకమిటీలను నిర్మించటానికి కృషి చేయాలి.

**5. రాజకీయ ఖైదీల విడుదలకు కృషిచేయాలి.** దేశవ్యాప్తంగా వివిధ జైళ్లలో ఉన్న కామ్రేడ్స్‌ని విడిపించడానికీ, వారి హక్కుల పరిరక్షణకూ వివిధ శక్తులను సమీకరించి బలమైన ఉద్యమాలు నిర్మించాలి, జైళ్లలో కొనసాగుతున్న ఉద్యమాలతో ఈ ఉద్యమాలను సమన్వయించాలి; జైళ్లలో ఉన్న కామ్రేడ్స్‌ని కోర్టుపరంగా విడిపించటానికి మనం తీవ్రంగా కృషి చేయాలి; జైళ్లలో ఉన్న కామ్రేడ్స్ కుటుంబాలకు అన్ని రకాల సహాయసహకారాలను అందించటానికి కృషి చేయాలి.

కేంద్రకమిటీ
సి.పి.ఐ.(మావోయిస్టు)

**25-8-2011**



# మన మహత్తర పార్టీ 8వ వార్షికోత్సవాలకు విప్లవ జేజేలు !

పార్టీని శత్రుదుర్భేద్యమైన, అత్యంత రహస్యమైన, పటిష్టమైన సమరశీల కార్మికవర్గ నాయకత్వసంస్థగా మలచుకుందాం !

విప్లవోద్యమంపై ఫాసిస్టు పాలకవర్గాలు కొనసాగిస్తున్న సైనికదాడిని దృఢసంకల్పంతో ధైర్యంగా తిప్పికొడదాం !!

అద్భుత భౌతిక పరిస్థితిని వినియోగించుకొని విప్లవోద్యమంలో విశాల ప్రజారాశులను విస్తృతంగా కదిలిద్దాం !!!

*2012 సెప్టెంబర్ 21 నుండి 27 వరకు మన పార్టీ 8వ వార్షికోత్సవాలను విప్లవోత్సాహంతో జరపాలని యావత్తు పార్టీకి కేంద్ర కమిటీ పిలుపు*

కేంద్రకమిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# మన మహత్తర పార్టీ 8వ వార్షికోత్సవాలకు విప్లవ జేజేలు !

## పార్టీని శత్రుదుర్భేద్యమైన, అత్యంత రహస్యమైన, పటిష్టమైన సమరశీల కార్మికవర్గ నాయకత్వసంస్థగా మలచుకుందాం !

## విప్లవోద్యమంపై ఫాసిస్టు పాలకవర్గాలు కొనసాగిస్తున్న సైనికదాడిని దృఢసంకల్పంతో ధైర్యంగా తిప్పికొడదాం !!

## అద్భుత భౌతిక పరిస్థితిని వినియోగించుకొని విప్లవోద్యమంలో విశాల ప్రజారాశులను విస్తృతంగా కదిలిద్దాం !!!

ప్రియమైన కామ్రేడ్స్ !

ఈ సెప్టెంబర్ 21న మన మహత్తర నూతన పార్టీ 8వ వార్షికోత్సవాలు జరుపుకోబోతున్నాము. 2004 సెప్టెంబర్ 21వ తేదీ మన పార్టీ చరిత్రలో మహత్తర దినం. ఈ రోజు మనకు అత్యంత ప్రాధాన్యత గలది. పార్టీ 8వ వార్షికోత్సవాల సందర్భంగా, మన మహత్తర పార్టీ నిర్మాతలు, భారత విప్లవ మహానాయకులు, అమరులు, ప్రియతమ కామ్రేడ్స్ సి.ఎం., కె.సి.లనూ, నక్సల్బరీ నుండి నేటివరకు నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలో అమరులైన వేలాది మంది వీరయోధులను గొప్ప గౌరవంతో స్మరించుకుందాం. వీరందరికీ వినమ్రంగా జోహార్లు అర్పిద్దాం. పార్టీ 7వ వార్షికోత్సవాల తర్వాత గత సంవత్సర కాలమంతా విప్లవోద్యమ నిర్మూలనా లక్ష్యంతో విప్లవ ప్రతీఘాతుక భారత పాలక వర్గాలు అత్యంత క్రూరంగా అమలుచేసిన 'ఆపరేషన్ గ్రీన్‌హంట్-2' (ప్రజలపై యుద్ధం)ని తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అత్యంత ధైర్యసాహసాలతో ఎదిరిస్తూ ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో భారత విప్లవోద్యమ నాయకుడు, ప్రజాయుద్ధ సేనాని, పోలిట్‌బ్యూరో సభ్యుడు, పీడిత ప్రజల ఆప్తుడు కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వర్లు (కిషన్‌జీ), ఉత్తర తెలంగాణా విప్లవోద్యమ నాయకుడు, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కా. గుండేటి శంకర్ (శేషన్న), దండకారణ్య ఉద్యమ నాయకుడు, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కా. హరక్ (శ్రీకాంత్), శ్రీకాకుళ రైతాంగ విప్లవ వయోవృద్ధ యోధ కామ్రేడ్ గోరు మాధవరావుతోపాటు డి.కె.(43) బి.జె.(32), ఉత్తర తెలంగాణా (6), అసోం (5) సి.ఓ.బి. (5), బెంగాల్(4), ఒడిశా (4), ఏ.ఓ.బి. (4), మహారాష్ట్ర (2), ఏ.పి.(2), సెంట్రల్ (3), మొత్తం 110 మంది మన ప్రియతమ కామ్రేడ్స్ నేలకొరిగారు. వీరిలో దాదాపు సగం మంది కామ్రేడ్స్ పార్టీ, పి.ఎల్.జి.ఏ.కు సంబంధించిన వివిధ స్థాయి కామ్రేడ్స్, మరో సగం మంది ప్రజా మిలీషియాతో పాటు ప్రజా నిర్మాణాల కామ్రేడ్స్. ఈ సాహసిక యోధులను మనం పేరుపేరునా స్మరించుకొని అరుణారుణ జోహార్లు చెబుదాం. నూతన ప్రజాస్వామిక విప్లవంలో నేలకొరిగిన వేనవేల అమరవీరుల ఆశయ సాధనకు బిగిపిడికిళ్లతో ప్రతినబూనుదాం. ఈ అమరుల సాహసోపేతమైన, త్యాగపూరితమైన,

ఉత్తేజకరమైన జీవితాలను ఆదర్శంగా తీసుకొని ప్రజాయుద్ధ మార్గంలో దృఢసంకల్పంతో మునుముందుకు సాగుదాం.

గత ఏడాది కాలంలో ఫిలిప్పైన్స్, టర్కీ, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో నూతన ప్రజాస్వామిక విప్లవాల క్రమంలో శత్రు బలగాలతో వీరోచితంగా పోరాడుతూ ఎందరో వీరయోధులు అమరులైనారు. సామ్రాజ్యవాద దేశాల్లో కార్మికవర్గంతో పాటు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో వర్గదోపిడీ పీడనల నుండి విముక్తి కోసం, జాతి విముక్తి కోసం, ప్రజాస్వామ్యం కోసం విప్లవ ప్రతీఘాతుకత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాల్లో వందలాదిమంది ఉద్యమకారులు, ప్రజలు తమ విలువైన ప్రాణాలనర్పించారు. వారందరికీ మన పార్టీ 8వ వార్షికోత్సవాల సందర్భంగా మన కేంద్రకమిటీ వినమ్రంగా జోహార్లు అర్పిస్తున్నది. వారి ఆకాంక్షల్ని నెరవేర్చటానికి ప్రతిన బూనుతున్నది.

భారత నూతన ప్రజాస్వామిక విప్లవ విజయ సాధనకై దృఢవిశ్వాసంతో, అకుంఠిత దీక్షతో, అత్యంత ధైర్య సాహసాలతో ప్రజాయుద్ధ కార్యాచరణలో నిమగ్నమైన దేశం నలుమూలలా గల మన యావత్తు పార్టీ, పి.ఎల్.జి.ఎ., విప్లవ ప్రజాకమిటీలు, ప్రజాసంఘాలలోని కామ్రేడ్స్ అందరికీ, దేశం నలుమూలలా చెరసాలలో శత్రువు నెదిరిస్తూ ఉన్న వందలాది మంది కామ్రేడ్స్‌కూ, విప్లవ శ్రేయోభిలాషులకూ, విప్లవ ప్రజానీకానికీ, కార్మికవర్గ అంతర్జాతీయ అరుణ పతాకాన్ని సమున్నతంగా ఎత్తిపట్టి భారత విప్లవోద్యమానికి అండగా నిలిచిన వివిధ దేశాలలోని మార్క్సిస్ట్-లెనినిస్ట్/మావోయిస్టు పార్టీలకూ పార్టీ 8వ వార్షికోత్సవాల సందర్భంగా కేంద్రకమిటీ హార్దిక విప్లవాభినందనలు తెలుపుతున్నది.

ఈ సందర్భంగా, పార్టీ 7వ వార్షికోత్సవాల తర్వాత గత సంవత్సర కాలంలో ప్రజాయుద్ధ పురోగమన లక్ష్యంతో మన పార్టీ కొనసాగించిన కార్యాచరణను పునరావలోకనం చేసుకొని తక్షణ కర్తవ్యాలు రూపొందించుకోవటానికి ఈ కాలంలో నెలకొన్న రాజకీయ పరిస్థితిని పరిశీలిద్దాం.

## అంతర్జాతీయ పరిస్థితి

2008లో అమెరికాలో ప్రారంభమైన ద్రవ్య, ఆర్థిక సంక్షోభం యూరప్, జపాన్‌ల మీదుగా భూమండలానికంతా విస్తరించి, నేడు యూరప్‌ను గజగజలాడిస్తున్నది. సామ్రాజ్యవాద దేశాల ద్రవ్య ఆర్థిక వ్యవస్థలు చాలా లోతైన మాంద్యంలో కూరుకొనిపోయి అది మరింత లోతుల్లోకి విస్తరిస్తున్నది. ఈ సంక్షోభం నుండి గట్టెక్కడానికి అమెరికాతో పాటు ఇతర సామ్రాజ్యవాద దేశాల ప్రభుత్వాలు అనుసరించిన భారీ 'బెయిలౌట్' పథకాల వలన పెద్ద బ్యాంకులు, అతిపెద్ద కార్పొరేషన్లు పెద్దయెత్తున సొమ్ము చేసుకున్నాయి. బెయిలౌట్ పథకాలతో పాటు ఈ గుత్తాధిపత్య సంస్థలకు, సంపన్నులకు పన్నుల్లో ఇచ్చే భారీ రాయితీల వల్లా, మార్కెట్ల పోటీ/ప్రపంచాధిపత్యం కోసం, ఆంతరంగికంగా నయాఫాసిస్టు తరహా నిరంకుశ పాలన కోసం మిలటరీ-పాలనా రంగాల్లో పెట్టే భారీ ఖర్చుల వల్లా ప్రభుత్వ రుణం, బడ్జెట్ లోటు పెద్దపెట్టున పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించే పేరుతో ప్రజలకు

అందించే సామాజిక సేవా పథకాలలో ప్రభుత్వాలు పెద్దపెట్టున కోత విధించి లేదా ఉపసంహరించుకొని కార్మికులపై, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక సంక్షోభ పెనుభారాన్ని మోపుతున్నాయి. కార్మికుల వేతనాలపై, పెన్షన్లపై కోత పెట్టడంతోపాటు పబ్లిక్ రంగ సంస్థల నుండి కార్మికులను తొలగిస్తున్నాయి. ప్రైవేట్ గుత్త సంస్థలు లక్షలాది కార్మికులను పని నుండి తొలగించాయి. కార్మికులపై, మధ్యతరగతి ప్రజలపై శ్రమదోపిడీని తీవ్రతరం చేసి గుత్తలాభాలు దండుకుంటున్నాయి. వీటి ఫలితంగా 1950ల నుండి ఎన్నడూ లేని స్థాయిలో పెరిగిన నిరుద్యోగంతో పాటు ఘోరంగా పడిపోయిన ప్రజల కొనుగోలు శక్తి ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ప్రజల అసంతృప్తిని, పోరాటాలను అరికట్టడానికి మరింత నిరంకుశ చట్టాలు చేస్తున్నాయి. దీనివల్ల ప్రపంచ పెట్టుబడిదారీ విధానం పరిష్కరించలేని ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభపు ఊబిలో కూరుకుపోతోంది. ఈ రకంగా అమెరికాలో, యూరప్ దేశాల్లో పెట్టుబడికి, శ్రమకు మధ్య వైరుధ్యం రోజురోజుకు తీవ్రతరమవుతున్నది.

ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఈ నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా గత సంవత్సరకాలంగా యూరప్‌లోని గ్రీస్, స్పెయిన్, ఇటలీ, పోర్చుగల్, బ్రిటన్, ఫ్రాన్స్, ఐర్లాండ్ తదితర దేశాల్లో కార్మికులు, నిరుద్యోగులు, యువతరం, విద్యార్థులు, మేధావులు, మహిళలు, మధ్యతరగతి ప్రజానీకం ఎడతెరిపి లేకుండా విస్తృతంగా, మిలిటెంట్‌గా ఆందోళనలు చేస్తున్నారు. చాలా పెట్టుబడిదారీ దేశాల్లో కార్మికవర్గ పార్టీలు, ప్రగతిశీల ప్రజాసంస్థలు తిరిగి బలం పుంజుకుంటున్నాయి. ఈ దేశాల్లోని కొన్నింటిలో ఎం.ఎల్./మావోయిస్టు పార్టీలు ప్రాచుర్యంలోకి వస్తున్నాయి/కొత్తగా ఏర్పడుతున్నాయి.

ఈ స్థితిలో సంక్షోభం నుండి గట్టెక్కడానికి ఒకవైపు తమ దేశాల్లో కార్మికుల పైన, మధ్యతరగతి ప్రజానీకం పైన దోపిడీని తీవ్రతరం చేయడమే కాకుండా వెనుకబడిన దేశాల్లోని వనరులను కొల్లగొట్టేందుకు, మార్కెట్లను పట్టుకునేందుకు సామ్రాజ్యవాదులు పోటీ పడుతున్నారు. ప్రస్తుత సామ్రాజ్యవాద దాడి అపార చమురు నిల్వలున్న దేశాలపై ముఖ్యంగా కేంద్రీకరించి సాగుతోంది. అందుకే పశ్చిమాసియా అగ్నిగుండంగా మండుతూనే ఉంది. పీడిత దేశాల, పీడిత జాతుల పాలకులు సామ్రాజ్యవాద దేశాలతో మిలాఖతై అమలుచేస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో రగిలి పోతున్నారు. ఈ దేశాల ప్రజలు సామ్రాజ్యవాదులకు, దళారీ పాలకులకు వ్యతిరేకంగా కొనసాగిస్తున్న పోరాటాలు తీవ్రతరమవుతున్నాయి.

ఇరాక్ గెరిల్లాలను అరికట్టే బాధ్యత స్థానిక భద్రతా బలగాలకు అప్పజెప్పడంగానీ, 2014 నాటికి ఆఫ్ఘనిస్తాన్ నుండి వైదొలగుతామని ప్రకటించడంగానీ అమెరికా తదితర సామ్రాజ్యవాదుల బలహీనతకు సూచికలే. మధ్య ఆసియా, ఉత్తర ఆఫ్రికా దేశాల్లో అమెరికా బలపరిచిన నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా చెలరేగిన ప్రజా ప్రభంజనంలో ఈజిప్టు, ఎమెన్, ట్యునీషియా నిరంకుశ ప్రభుత్వాలు కూలిపోయాయి. కాని ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర సామ్రాజ్యవాద దేశాలు బలపరిచిన ప్రతీఘాతుక శక్తులే అధికారానికి వచ్చాయి. ప్రజలు వీరికి వ్యతిరేకంగా కూడా పోరాడుతున్నారు.

ప్రపంచాధిపత్యాన్ని నిలబెట్టుకోవాలన్నా, తాము ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం నుండి బయటపడాలన్నా వనరుల దోపిడీ కోసం అమెరికా తదితర సామ్రాజ్యవాద దేశాలకు వెనుకబడిన దేశాలను దురాక్రమించడం, లేదా ఆ దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం తప్ప మరో ప్రత్యామ్నాయ మార్గం లేదు. లిబియాలో అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ తదితర సామ్రాజ్యవాద దేశాలు నాటో విమానాలతో బాంబుల వర్షం కురిపించి విధ్వంసం సృష్టించడంతో పాటు దేశాధ్యక్షుడు గఢాఫీని హత్య చేయించి తమ తొత్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయించారు. ఇవి వెనువెంటనే లిబియా ప్రయోగాన్ని రష్యా అనుకూల అస్సాద్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిరియాలో చేయజూస్తున్నాయి. లిబియాలోలా బాంబుల వర్షం తప్ప సిరియాలో నాటో బలగాలు అన్నీ చేస్తున్నాయి. నియంత అస్సాద్ ప్రభుత్వ వ్యతిరేక-తమ తొత్తులకు అన్నిరకాల సహాయాన్ని అందిస్తున్నాయి. అమెరికా, బ్రిటన్, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై దాడికి సన్నాహాలు చేస్తున్నాయి. మరోవైపు అమెరికా ఉత్తర కొరియాపై ఒత్తిడిని మరింత తీవ్రతరం చేసింది. అమెరికా, నాటోలు ఈ దేశాల సార్వభౌమత్వానికీ, స్వాతంత్ర్యానికే గాకుండా ప్రపంచ శాంతికి ప్రమాదకరంగా మారుతున్నాయి. వీటి ఫలితంగా సామ్రాజ్యవాదానికీ పీడిత జాతులకు, ప్రజలకు మధ్య మౌలిక వైరుధ్యం మరింత తీవ్రతరమైంది.

అమెరికా-నాటోల దురాక్రమణకూ, జోక్యానికీ గురైన అరబ్ దేశాలన్నింటా ఈ దురాక్రమణదారులకూ వారి తొత్తు నూతన నిరంకుశ పాలకులకూ వ్యతిరేకంగా ప్రజలు ప్రతిఘటన కొనసాగిస్తున్నారు. ఈ ధోరణి దినదినం పెంపొందుతున్నది. సిరియాలో నాటో జోక్యాన్నీ, ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను రష్యా, చైనాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. లిబియా దేశంలోలాగా సిరియాలో సైనిక జోక్యం చేసుకొంటే, ఇరాన్‌పై సైనిక చర్యలకు పూనుకుంటే తదనంతర పరిణామాలు చాలా ప్రమాదకరంగా ఉంటాయని రష్యా పదే పదే హెచ్చరించింది.

చైనాలో 'మార్కెట్ సోషలిజం' పేరుతో నిరంకుశ గుత్తపెట్టుబడిదారీ వర్గం దేశంలోని గుత్తపెట్టుబడిదార్లతో, సామ్రాజ్యవాద-బహుళజాతి కంపెనీలతో మిలాఖత్తై కొనసాగిస్తోన్న ప్రజా వ్యతిరేక ఆర్థిక, రాజకీయ, సామాజిక విధానాల వల్ల ఈ దేశంలో మౌలిక వైరుధ్యాలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. అంతులేని సంపదలను, అధికారాన్ని కలిగి విలాసాల్లో ఓలలాడుతున్న సంపన్నులకూ అట్టడుగున దుర్భర దారిద్ర్య పరిస్థితులలో మగ్గిపోతూ జీవనం సాగిస్తోన్న కోట్లాది మంది పేదలకూ మధ్య అంతరం చైనా సమాజంలో గతంలో ఎన్నడూ ఎరగని స్థాయికి చేరింది. నిరుద్యోగం, అవినీతి, నిర్వాసిత సమస్య, నిరాశ్రయత, సామాజిక సేవల కరువు, అధిక ధరలు, జీవన ప్రమాణాలు ఘోరంగా పడిపోవడం, ప్రజల అసంతృప్తినీ పోరాటాలనూ అరికట్టడానికి నిరంకుశ చట్టాలు రూపొందించి అమలుచేయడం అనే రుగ్మతలన్నీ నేడు చైనా సమాజంలో సాధారణమైనాయి.

ఈ రుగ్మతలకు కారణమైన ప్రభుత్వానికీ, ప్రభుత్వ-ప్రైవేట్ కంపెనీలకు, బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా కార్మికుల, రైతుల, విద్యార్థి యువజనుల, నిరుద్యోగుల, మేధావుల నిరసన ప్రదర్శనలు-ఉద్యమాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. చైనా హాన్ జాతి దురహంకార

ప్రభుత్వ పెత్తనానికి వ్యతిరేకంగా టిబెట్, సింకియాంగ్ ప్రజలు స్వయం నిర్ణయాధికారం కోసం ఉద్యమిస్తున్నారు.

'మానవ హక్కుల ఉల్లంఘన' పేరుతో అమెరికా సామ్రాజ్యవాదులు చైనా అంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సుదీర్ఘకాలం నుండి కొనసాగుతోన్న టిబెట్, సింకియాంగ్ ఉద్యమాలకూ, కమ్యూనిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతోన్న ప్రజాస్వామిక ఉద్యమాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతునిస్తూ వాటిని తమ ప్రయోజనాలకు వినియోగించుకోవటానికి వారు ప్రయత్నిస్తున్నారు. చైనాకు వ్యతిరేకంగా వారు తమ తొత్తు తైవాన్ ప్రభుత్వాన్ని రెచ్చగొడుతున్నారు. చైనాలో బూటకపు సోషలిజానికి వ్యతిరేకంగా నిజమైన మావోయిస్టు శక్తులు తలెత్తుతున్నాయి. చైనా ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక శక్తుల్లో ఒకటిగా మారి దాని ప్రభుత్వ-ప్రైవేట్ గుత్తపెట్టుబడులు అమెరికా, ఆఫ్రికా దేశాలతో పాటు ఇతర చాలా దేశాల్లో పెరిగిపోతున్నాయి. 'షాంఘై కోఆపరేషన్', 'బ్రిక్స్' దేశాల కూటముల్లో చైనా ప్రముఖ భూమిక నిర్వహిస్తున్నది. ఈ కూటములు ప్రధానంగా ఆర్థిక రంగంలో అమెరికా పెత్తనాన్ని సవాలు చేస్తున్నాయి. అమెరికా ఆర్థిక ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత గల ప్రాంతమైన ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో రోజురోజుకు బలమైన శక్తిగా ఎదుగుతున్న చైనాని చుట్టుముట్టే వ్యూహంతో అది ఈ ప్రాంతంలో తన సైనిక బలగాలను అపూర్వ స్థాయిలో కేంద్రీకరిస్తున్నది. అమెరికా, చైనాల మధ్య వైరుధ్యం రోజురోజుకు తీవ్రతరమౌతున్నప్పటికీ వాటి మధ్య పోటీ, కుమ్మక్కు రెండూ కొనసాగుతున్నాయి.

పుటిన్ పాలనలో రష్యా సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తర్వాతి పరిస్థితిని చాలావరకు అధిగమించి ఒక బలమైన సామ్రాజ్యవాద దేశంగా ప్రపంచ మార్కెట్లో, ప్రపంచ రాజకీయాల్లో ఒక ప్రముఖ భూమిక పోషిస్తున్నది. అది చమురు, ఖనిజాలు, రక్షణ ఉత్పత్తులు, స్పేస్ టెక్నాలజీ తదితర ఎగుమతులలో ప్రపంచ మార్కెట్లో ఇతర సామ్రాజ్యవాద దేశాలతో పోటీ పడుతున్నది. దాని దేశీయ, అంతర్జాతీయ ప్రయోజనాల కోసం మధ్య ఆసియా, ఉత్తర ఆఫ్రికా, ప్రత్యేకంగా నేడు లిబియా, సిరియా, ఇరాన్‌లలో అమెరికా-నాటోల జోక్యానికి వ్యతిరేకంగా చైనాతో కలిసి రాజకీయంగా చాలా తీవ్రంగా ఘర్షిస్తున్నది. అది షాంఘై కోఆపరేషన్, బ్రిక్స్ కూటముల్లో ఒక బలమైన శక్తిగా ఉంది. అంతరంగికంగా దేశంలో నిరంకుశ గుత్త పెట్టుబడిదారులు-ప్రైవేట్ గుత్తపెట్టుబడిదారులకూ కార్మికులకూ, పాలకవర్గాల మధ్యా, రష్యా పెద్దజాతి దురహంకారానికీ చెచెన్యా లాంటి పలు జాతులకు మధ్య మౌలిక వైరుధ్యాలు రోజురోజుకూ తీవ్రతరమవుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ల కోసం సామ్రాజ్యవాద గుత్త సంస్థల మధ్యా, సామ్రాజ్యవాద దేశాల మధ్యా తీవ్రమైన పోటీ కొనసాగుతున్నది. ఇటీవల చైనా, రష్యాల నాయకత్వంలో షాంఘై కోఆపరేషన్ కూటమి బలపడుతున్నది. వీటి నాయకత్వంలో ఏర్పడిన బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణ ఆఫ్రికా) కూటమి డాలర్ ఆధిపత్యాన్నీ, అమెరికా పెత్తనాన్నీ, ఇరాన్-సిరియాలపై అది విధించిన ఆంక్షల్నీ వ్యతిరేకిస్తున్నది. ఇటీవల జరిగిన బ్రిక్స్ సమావేశంలో ప్రపంచబ్యాంకుకు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్ స్థాయి బ్యాంకును ఏర్పాటు

చేయాలని నిర్ణయించుకున్నాయి. సిరియాలో రష్యా, చైనా అనుకూల ప్రభుత్వాన్ని కూలదోయడానికి చేస్తున్న జోక్యంగానీ, ఇరాన్‌పై దాడికి చేస్తున్న సన్నాహాలుగానీ, తైవాన్‌ను చైనాకు వ్యతిరేకంగా రెచ్చగొట్టడంగానీ, ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా దక్షిణ కొరియాను నిలబెట్టడంగానీ, చైనాకు వ్యతిరేకంగా జపాన్, ఆస్ట్రేలియాలను నిలబెట్టడంగానీ, ఇండియాను దక్షిణాసియాలో ప్రాంతీయ పెత్తందారుగా నిలబెట్టడంగానీ, దానికి పెద్దెత్తున ఆయుధాలు, విమానాలు, సైనిక టెక్నాలజీ ఎగుమతి చేయడంగానీ - అన్నీ చైనాను చుట్టుముట్టి దెబ్బతీయడానికే గాకుండా రష్యా ప్రయోజనాలను దెబ్బతీయడానికి అమెరికా అనుసరిస్తున్న వ్యూహాత్మక పథకంలోని చర్యలే. 'ప్రపంచాధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి అనుసరించాల్సిన నూతన వ్యూహం' పేరిట అమెరికా రక్షణశాఖ పెంటగాన్ ఈ మధ్యనే రూపొందించిన సిద్ధాంతం (డాక్ట్రిన్) చైనానే ప్రధాన ప్రత్యర్థిగా పేర్కొంది.

అమెరికా ఇప్పటికే 150 దేశాలలో తన మిలటరీ బేస్‌లను నెలకొల్పడం లేదా మిలటరీ సేవలకు వినియోగించుకోవడం చేస్తూ, ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో తన సైనిక బలగాలను మరింతగా కేంద్రీకరించే చర్యలు చేపట్టింది. ఈ రీజియన్‌లోని చాలా దేశాల ఆర్థిక, రాజకీయ, సైనిక, దౌత్య వ్యవహారాలలో జోక్యాన్ని అది పెంచింది. తాను ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక మాంద్యం నుండి బయటపడడానికీ, ప్రపంచంలోనే త్వరత్వరగా అభివృద్ధి చెందుతూ పెద్దసంఖ్యలో వినియోగదారులున్న పెద్ద మార్కెట్‌పై అదుపు సాధించడానికీ అమెరికా వ్యూహాత్మకంగా ఈ ప్రాంతంపై కేంద్రీకరిస్తున్నది. ఈ పరిణామాలన్నీ ప్రపంచ శాంతికి ప్రమాదకరంగా, సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాలకు దారితీసేవిగా, ప్రపంచ యుద్ధ ప్రమాదం పెరిగేందుకు దోహదం చేసేవిగా ఉన్నాయి. అయితే ఇక్కడ మనం గమనించాల్సిన ఒక ముఖ్యమైన విషయం ఏమంటే, అమెరికా నేటికీ ప్రపంచ ప్రజల నెంబర్ వన్ శత్రువే. కానీ దాని సైనికశక్తికి నేడు ఎదురులేకపోయినా, బలహీనపడిన దాని ఆర్థిక పరిస్థితీ, తీవ్ర సంక్షోభం వల్ల అది నాటో దేశాలతో కలవకుండా ఎక్కడా ఒంటరిగా దాడి చేయగలిగిన పరిస్థితిలో లేదు. ఇది దాని ప్రధాన బలహీనత. వీటన్నింటి ఫలితంగా అంతర్జాతీయ రంగంలోని మౌలిక వైరుధ్యాలు రోజురోజుకూ పదునెక్కుతూ విప్లవ పరిస్థితి మరింత అద్భుతంగా పెంపొందుతున్నది. సామ్రాజ్యవాద దేశాలలో ఆర్థిక-రాజకీయ-సామాజిక సంక్షోభం పెంపొందుతున్న కొద్దీ, అభివృద్ధి చెందుతున్న విప్లవ పరిస్థితులు-విప్లవ శక్తులతో పాటు ఫాసిస్టు శక్తులు, రేసిస్టు, క్రిస్టియన్ మత ఛాందసవాద, జాతీయ దురహంకార శక్తులు కూడా పెంపొందుతున్నాయి. ఈ దేశాల్లోని కార్మికవర్గ విప్లవ శక్తులు, ప్రగతిశీల ప్రజాస్వామిక శక్తులు, ప్రపంచవ్యాపితంగా గల సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు ఈ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలి.

యు.సి.పి.ఎన్.(ఎం) నాయకత్వం చేపట్టిన రివిజనిస్టు పంథా మూలంగా నేపాల్ విప్లవం గొప్ప వెనుకంజ(గ్రేట్ రివర్స్)లో పడిపోయింది. నేపాల్ విప్లవానికి ఆ పార్టీ నాయకత్వం చేసిన ద్రోహాన్నీ, అది అనుసరించిన తప్పుడు పంథాని ఆ పార్టీ నాయకత్వం లోని విప్లవ సెక్షన్‌తో పాటు గణనీయ సంఖ్యలోనే వివిధ స్థాయిల శ్రేణులు, వివిధ దేశాల్లోని మావోయిస్టు పార్టీలు నిరసించాయి. ప్రచండ-భట్టారాయ్ తదితర నాయకులు అనుసరించిన తప్పుడు

పంథాకు వ్యతిరేకంగా ఆ పార్టీలోని నిజమైన నాయకత్వశక్తులూ-శ్రేణులూ అంతరంగికంగా సైద్ధాంతిక-రాజకీయ పోరాటం కొనసాగించి, చివరికి ఇటీవల కామ్రేడ్ కిరణ్ తదితర కామ్రేడ్స్ నాయకత్వంలో విప్లవకర మావోయిస్టు పార్టీని నిర్మించుకున్నారు. దీనికి చాలా ముందే కొందరు నాయకత్వ కామ్రేడ్స్ ప్రచండ-భట్టారాయ్‌ల అవకాశవాద పంథాని తిరస్కరించి సి.పి.ఎన్.(మావోయిస్ట్)గా పనిచేస్తున్నారు. నేపాల్ విప్లవానికి ఎనలేని హాని చేసిన నాయకత్వాన్నీ, అవకాశవాద పంథానీ తిరస్కరించి విప్లవ పంథాలో ముందుకు సాగడానికి విప్లవ జెండా నెత్తిపట్టిన మావోయిస్టు గ్రూపులు, శక్తులు సమైక్యం కావడం అనేది నేడు తమ చారిత్రక కర్తవ్యంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికీ ప్రచండ-భట్టారాయ్‌ల నాయకత్వంలోని రివిజనిస్టు పార్టీ తగినంత శక్తికలిగి దేశ ప్రజలను ఇంకా గణనీయంగానే భ్రమల్లో ఉంచగలిగే పరిస్థితి ఉంది. ఆ పార్టీ కొనసాగిస్తున్న రివిజనిస్టు పంథాకూ, దాని అవకాశవాద ఎత్తుగడలకూ, ఆచరణకూ వ్యతిరేకంగా నూతన పార్టీ ఇంకా సైద్ధాంతికంగా, రాజకీయంగా నిశితమైన పోరాటం కొనసాగించాల్సిన అవసరం కూడా ఉంది. అదే సమయంలో నూతన పార్టీ విప్లవ లక్ష్య సాధనకు నూతన పంథాలో పార్టీని, ప్రజా నిర్మాణాలను, వాటి పనిపద్ధతులను విప్లవాత్మకంగా మలచుకోవడంతో పాటు ప్రజలను రాజకీయంగా సమీకరించాల్సిన అవసరం ఉంది. నేపాల్ దళారీ పాలక వర్గాలు అమెరికా సామ్రాజ్యవాదులతో, భారత విస్తరణవాదులతో చేతులు కలిపి కుట్రపూరితంగా దాడి చేయగల అవకాశాలను నూతన పార్టీ కొట్టివేయకుండా ముందుచూపుతో అత్యంత జాగరూకత వహించాల్సిన అవసరం ఉంది. నూతన పార్టీ ఈ విషయంలో ఏమేరకు సఫలమైతే ఆ మేరకు అవకాశవాదులు ప్రజల నుండి, శ్రేణుల నుండి ఒంటరైపోవడంతో పాటు విప్లవ సంరంభానికి సన్నాహంగా తోడ్పడుతుంది. సరైన సైద్ధాంతిక, రాజకీయ పంథా పునాదిగా నేపాల్ విప్లవ శక్తులు మరింతగా సమైక్యమై బలపడాలనీ, నూతన పరిస్థితులలో నేపాల్ విప్లవం జరగాలనీ, నేపాల్ ప్రజలు విముక్తి సాధించాలనీ ప్రపంచవ్యాప్తంగా నిజమైన విప్లవ సంస్థలు-పీడిత ప్రజానీకం మనస్ఫూర్తిగా కాంక్షిస్తున్నారు. ఇందుకు సి.పి.ఐ.(మావోయిస్టు), భారత విప్లవ ప్రజలు గతంలోలాగే సామ్రాజ్యవాదానికీ, ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్యవాదానికీ, భారత విస్తరణవాదానికీ, రెండు దేశాల్లోని పాలకవర్గాలకు వ్యతిరేకంగా నేపాల్ విప్లవ పార్టీతో-నేపాల్ ప్రజానీకంతో భుజం భుజం కలిపి పోరాడుతారని మా కేంద్రకమిటీ స్పష్టం చేస్తున్నది.

ఫిలిప్పైన్స్, ఇండియా, టర్కీ దేశాలలో మావోయిస్టు ప్రజాయుద్ధం అనేక అడ్డంకుల్నీ, ప్రతికూలతల్నీ అధిగమిస్తూ పురోగమిస్తున్నాయి. ఇంకా పెరూ, బంగ్లాదేశ్, భూటాన్ తదితర దేశాలలో మావోయిస్టు శక్తులు క్రియాశీలంగానే ఉన్నాయి. అనేక వెనుకబడిన దేశాలలో కార్మికవర్గ విప్లవ పార్టీలు ప్రజాయుద్ధానికి సన్నాహాలు చేస్తున్నాయి. యూరప్‌లోని పలు దేశాల్లో మావోయిస్టు సంస్థలు, సామ్రాజ్యవాద వ్యతిరేక సంస్థలు అభివృద్ధి చెందుతుండడం, మనదేశంలో సాగుతోన్న ప్రజాయుద్ధానికి సంఘీభావంగా అనేక కార్యక్రమాలు చేపట్టడం కూడా మరో సానుకూల పరిణామం.

ప్రపంచవ్యాపిత సంక్షోభ పరిస్థితులు సుదీర్ఘకాలం నుండి కొనసాగుతోన్న టర్కీ, ఫిలిప్పైన్స్, భారత్, పెరూ తదితర దేశాల్లోని జాతీయ విముక్తి సాయుధ ఉద్యమాలు పెంపొందటానికి

తోడ్పడుతున్నాయి. కొలంబియా, పాకిస్తాన్, ఇండోనేషియా, బర్మా, శ్రీలంక, చైనా తదితర దేశాలలో వివిధ రూపాలలో జాతీయ విముక్తి ఉద్యమాలు కొనసాగుతూనే ఉన్నాయి.

అనేక సంవత్సరాలుగా ఇరాక్, అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, ఎమెన్, లెబనాన్‌లలో ప్రజలు అమెరికా, నాటో సైన్యాలను, వారి తొత్తు ప్రభుత్వ సైన్యాలను ఎదిరిస్తూ పోరాడుతూనే ఉన్నారు. పాలస్తీనా ప్రజలు జియోనిస్టు ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. నేటి ప్రపంచ పరిస్థితి మరింత అస్థిరతకు, అనిశ్చితికి గురవుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూనే కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే అరబ్ దేశాల ప్రజా పోరాటాలు, అమెరికాలో వాల్‌స్ట్రీట్ ముట్టడి, యూరప్ దేశాల్లో ప్రజా ఉద్యమాలు, చాలా దేశాల్లో జాతీయ విముక్తి ఉద్యమాలు, పలుదేశాల్లో దీర్ఘకాలిక ప్రజాయుద్ధాలు కొనసాగుతుండడం, ప్రపంచవ్యాపితంగా కార్మికవర్గం, పీడిత జాతులు, పీడిత ప్రజలు సామ్రాజ్యవాదానికీ, అన్ని రకాల విప్లవ ప్రతీఘాతుకానికి వ్యతిరేకంగా కొనసాగిస్తోన్న ఎడతెరిపిలేని తీవ్ర ప్రతిఘటన మరింత అనుకూలంగా మారిన విప్లవ పరిస్థితిని తెలుపుతున్నాయి. ఈ అనుకూల పరిస్థితులు రానున్న ప్రపంచ విప్లవ వెల్లువకు ప్రారంభ సూచికలు. ఒక్కమాటలో చెప్పాలంటే, సంక్షోభం తరతమ తేడాలతో అన్ని ఖండాలకూ వ్యాపించి ప్రపంచ పరిస్థితి చాలా అస్థిరంగా, అల్లకల్లోలంగా ఉంది. అది సామ్రాజ్యవాదులనూ, వారి తైనాతీలను భయకంపితులను చేస్తున్నది; ప్రపంచం నలుమూలలా ఎడతెరిపి లేకుండా ప్రజా ఉద్యమాలు చెలరేగటానికి కారణమవుతున్నది. ఈ భౌతిక పరిస్థితుల నుండే, ప్రజా పోరాటాల నుండే విప్లవ శక్తులు పుట్టి, పెంపొంది బలపడి ఆ వెల్లువకు నాయకత్వం వహించి సామ్రాజ్యవాదాన్నీ, అన్ని రకాల ప్రతీఘాతుక శక్తులనూ నాశనం చేస్తాయి. ఇలాంటి పరిస్థితిలో విప్లవావకాశాలను చేజిక్కించుకొనే మార్క్సియన్ దూరదృష్టి, బోల్షివిక్ స్పిరిట్, సుదీర్ఘకాల కఠోర పరిస్థితులలో సైతం చెక్కుచెదరని విప్లవ దీక్ష, అసమాన ధైర్యసాహసాలు, అపార త్యాగనిరతి, విప్లవ చొరవ మన పార్టీతో పాటు ప్రపంచంలోని అన్ని విప్లవ పార్టీలు పెంపొందించుకొని సుసంఘటితం కావాల్సిన అవసరం ఉంది.

## దేశీయ పరిస్థితి

గత సంవత్సర కాలంలో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో, ప్రత్యేకంగా సామ్రాజ్యవాద దేశాల ద్రవ్య, ఆర్థిక వ్యవస్థల్లో కొనసాగిన తీవ్ర సంక్షోభం, రాజకీయ రంగంలో కొనసాగిన తీవ్ర వైరుధ్యాలు, పెల్లుబికిన ప్రజా ఉద్యమాలు మన దేశ ఆర్థిక, రాజకీయ, సైనిక, సాంస్కృతిక రంగాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. మన దేశంలో ఈ రంగాలన్నింటా సామ్రాజ్యవాదుల, ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్యవాదుల జోక్యం మున్నెన్నటి కంటే తీవ్రమైంది. అమెరికా సామ్రాజ్యవాదుల జోక్యం దేశ రక్షణ, ఆంతరంగిక భద్రతా వ్యవస్థల్లో మరింతగా పెరిగిపోయింది. మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వం దేశ విద్రోహకర, ప్రజావ్యతిరేక నయా ఉదారవాద ఆర్థిక విధానాలను అమలుచేయడం వల్ల దేశం 1947 తర్వాత ఎన్నడూ లేని స్థాయిలో దీర్ఘకాలికమైన సంక్షోభంలోకి కూరుకుపోతున్నది.

దేశ జాతీయ ఆర్థికాభివృద్ధి వెనుకపట్టు పట్టింది. ప్రభుత్వ రుణభారం, బడ్జెట్ లోటు,

ద్రవ్యోల్బణం పెరగడం, డాలర్‌తో రూపాయి మారకం విలువ ఘోరంగా పడిపోవడం, స్టాక్ మార్కెట్ల పతనం, బడా కార్పొరేట్ సంస్థలకు లక్షలాది కోట్ల రూపాయల పన్ను రాయితీలివ్వడం, పేద, మధ్యతరగతి ప్రజలపై అదనపు ప్రత్యక్ష-పరోక్ష పన్నుల భారం మోపడం, కార్మికుల, ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ వడ్డీ రేట్లు తగ్గించడం, బడ్జెట్‌లో సైనిక-పాలనా వ్యయం భారీగా పెంచడం, ప్రభుత్వరంగ సంస్థల వాటాలు దేశ-విదేశీ కార్పొరేట్ సంస్థలకు అమ్మడం, బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం, దేశ-విదేశీ బడా కార్పొరేషన్ల ప్రయోజనాల కనుగుణంగా మౌలిక సదుపాయాల రంగానికి ప్రాధాన్యత నివ్వడం, నిరంతరం రుణ సేకరణ బాండ్లు జారీ చేయడం తదితర దివాలాకోరు చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థను కుంగదీస్తున్నాయి. అధిక ధరలు, నిరుద్యోగం, వేతనాల స్థంభన-కోత, సామాజిక సేవానిధుల్లో కోత-రద్దు, నిజవేతనాలు పడిపోవడం, ఆకలి చావులు, పేదరికం, పేదలు-ధనికుల మధ్య అంతరం దేశ చరిత్రలో మున్నెన్నడూ లేని స్థాయికి చేరుకున్నాయి.

భారత పాలక వర్గాలు సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల షరతులకు తల ఒగ్గి వారి పెట్టుబడులను ఎలాంటి ఆంక్షలు లేకుండా అనుమతిస్తుండడం వల్ల దేశ ప్రకృతి వనరులపై, మార్కెట్‌పై, కీలక రంగాలపై వారి పట్టు మున్నెన్నడూ లేని స్థాయికి చేరుకుంది. బలవంతంగా భూములు గుంజుకొని లక్షలాది మంది రైతుల్ని, పట్టణ పేదల్ని పెద్దెత్తున నిర్వాసితుల్ని చేస్తున్నాయి; వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి; మాన్యుఫాక్చరింగ్ రంగాన్ని మాంద్యంలోకి ఈడ్చాయి; పర్యావరణాన్ని వినాశనం పాలు చేస్తున్నాయి. వీటన్నింటి వల్ల దేశ ఉత్పత్తి శక్తులు గణనీయంగా దెబ్బతింటున్నాయి. జి.డి.పి. అభివృద్ధి సూచికల గారడీ వెలవెలబోతున్నది. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ వడ్డీ రేట్ల, రెపోరేట్ల విషయంలో చేస్తున్న సర్కస్ ఫీట్లు నవ్వుల పాలవుతున్నాయి. పెద్దెత్తున విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ఆర్థిక రంగంలో మిగిలిన అరకొర ఆంక్షలను సైతం సంపూర్ణంగా ఎత్తివేయాలని ఐ.ఎం.ఎఫ్-ప్రపంచబ్యాంకుల అత్యంత నమ్మకమైన ఏజెంట్ల ముఠా అయిన ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ప్రతిపాదిస్తున్నది. దేశం మరింత పరాధీనం పాలవుతూ పతనమౌతున్నది. దేశ సార్వభౌమత్వం, స్వాతంత్ర్యం, జాతుల స్వయం నిర్ణయాధికారం అనే మాటలకు ఎలాంటి అర్థం లేకుండా పోయి పెనుముప్పును ఎదుర్కొంటున్నది.

పాలకవర్గాలు సూపర్ లాభాలు దండుకోవడానికి అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల, ప్రజా వ్యతిరేక, దేశద్రోహకర అభివృద్ధి నిరోధక విధానాల వల్ల కార్మికులు, రైతాంగం, పట్టణ మధ్యతరగతి, జాతీయ పెట్టుబడిదారులు అత్యంత దోపిడీ పీడనలకూ, దాస్యానికీ, అవమానం, అత్యాచారాలకూ గురౌతున్నారు. వీరు ఈ విధానాలను చాలా తీవ్రంగా వ్యతిరేకించి ఉద్యమిస్తున్నారు. పాలకవర్గాలు వీరిపై పోలీసు, పారా మిలటరీ, మిలటరీ బలగాలను ఎగదోలి క్రూరంగా అణచివేత కొనసాగిస్తున్నాయి. ఈ అణచివేతకు సాధికారత కల్పించడం కోసం నిరంకుశ చట్టాలను చేయడమే గాకుండా ఇంతవరకున్న ఇలాంటి చట్టాలను, అణచివేత యంత్రాంగాలను తలదన్నే నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్ (ఎన్.సి.టి.సి.)ని ముందుకు తెస్తున్నాయి. నిరుద్యోగ సమస్య పరిష్కారానికీ, పేదరిక నిర్మూలనకూ, సమాజంలోని

అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధికి విదేశీ పెట్టుబడులు, ప్రైవేట్ పెట్టుబడులు అనివార్యమౌతాయనీ, ఈ పెట్టుబడులపై ఎలాంటి ఆంక్షలుండకూడదనీ అదేపనిగా ప్రచారం చేస్తున్నాయి. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికీ, దేశాభివృద్ధి సాధనకూ కార్మికుల-ఉద్యోగుల కనీస వేతనాలు-తగిన పని పరిస్థితులు, ఉద్యోగ భద్రత, సామాజిక సేవల గురించీ, కార్మిక చట్టాల గురించీ ఆలోచించకూడదని ఎడతెరిపి లేకుండా ప్రచారం చేస్తున్నాయి. దేశ-విదేశీ బడా కార్పొరేషన్ల పెట్టుబడులకు, ప్రభుత్వ పెట్టుబడులకు అడ్డుతగులుతున్న మావోయిస్టులను, ప్రజలను ఉక్కుపాదంతో అణచివేయడానికే 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' నడుపుతున్నామనీ, సైన్యాన్ని మోహరిస్తున్నామనీ దేశద్రోహకర పాలకవర్గాలు మాట్లాడని రోజంటూ లేదు.

అర్ధవలస-అర్ధభూస్వామ్య సామాజిక పరిస్థితుల వల్లా, పాలకవర్గాలు అనుసరిస్తున్న దివాలాకోరు విధానాల వల్ల దేశంలో ఆర్థిక, రాజకీయ సంక్షోభం పెచ్చుపెరిగి పోతున్నది. దీనివల్ల ప్రధాన, మౌలిక, ప్రముఖ వైరుధ్యాలతో పాటు ఇతర వైరుధ్యాలన్నీ తీవ్రతరమవుతున్నాయి. రైతాంగం భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా, నిర్వాసిత సమస్యపై రాజ్యానికీ, దేశ విదేశీ బడా కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమిస్తున్నారు. మున్నెన్నడూ లేని విధంగా దేశంపై సామ్రాజ్యవాద ఆర్థిక, రాజకీయ దోపిడీ, పీడన, అదుపు పెరిగి పోవడం వల్ల సామ్రాజ్యవాదానికీ, భారత ప్రజలకూ మధ్య వైరుధ్యం తీవ్రతరమైంది. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా, వారితో మిలాఖతైన పాలకవర్గాలకు, వారి రాజ్యానికి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ఉద్యమాలు పెల్లుబుకుతున్నాయి. పాలకవర్గాల మధ్య - పాలక పార్టీల మధ్య, పాలకపార్టీలలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య - వైరుధ్యాలు 'ఎమర్జెన్సీ' తర్వాత ఎన్నడూ లేని స్థాయిలో ముందుకు వచ్చాయి. దీని ఫలితంగా వీరి మధ్య ఎటు చూసినా కుక్కల కొట్లాటలే. ఈ వైరుధ్యం పార్లమెంటు, అసెంబ్లీలలో సైతం బలంగానే వ్యక్తీకరించబడుతున్నది. రాజకీయ అస్థిరత, అల్లకల్లోలం నేటి దేశ ప్రధాన రాజకీయ ధోరణి.

పెచ్చరిల్లి పోయిన అవినీతి, భారీస్థాయి కుంభకోణాలు పాలకవర్గ ముఠాలను కుదిపివేస్తున్నాయి. ఒక ముఠాని మించి మరొక ముఠా ఎంతటి దగాకోరో అవి పరస్పరం చేసుకొనే ఆరోపణలు స్పష్టం చేస్తాయి. ఇటీవల 2-జి. స్కామ్‌ని తలదన్నే బొగ్గుగనుల అక్రమ లీజుల కుంభకోణం బయటపడి పార్లమెంటు లోపల, బయటా తీవ్ర ఆరోపణ-ప్రత్యారోపణలు చెలరేగడం, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ ప్రభుత్వాలు అంతర్గత కలహాల్లో మునిగి తేలుతూ తీవ్ర అనిశ్చిత పరిస్థితి ఏర్పడడం అనేవి ఇందులో ఒక భాగమే. మొత్తంపై పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ డొల్లతనం, రాజకీయ పార్టీల బండారం దేశ ప్రజలలో ఎన్నడూ లేని విధంగా బహిర్గతమై పోతున్నాయి.

సామాజిక వైరుధ్యాలు తీవ్రతరం కావడం వల్ల దేశవ్యాప్తంగా గత సంవత్సర కాలంలో గనులు, పరిశ్రమలు, నీటి ప్రాజెక్టులు, పవర్ ప్రాజెక్టులు, అణువిద్యుత్ కర్మాగారాలు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, ఎస్.ఈ.జడ్.లు, జాతీయ ఉద్యాన వనాలు, ప్రభుత్వ బలగాల కంటోన్మెంటులు, సైనిక-పారామిలటరీ శిక్షణా శిబిరాలు, విమానాశ్రయాలు, హెలిపాడ్లు వగైరాల నిర్మాణం కోసం లక్షలాది మంది రైతులు, పట్టణ పేదలు, మధ్యతరగతి ప్రజలు తమ భూముల

నుండి, అటవీ ప్రాంతాల నుండి నిర్వాసితులవుతుంటే, దేశ విదేశీ బడా కార్పొరేషన్లకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా చాలా మిలిటెంట్ ఉద్యమాలు పెల్లుబికాయి. అరుణాచల్ ప్రదేశ్ నుండి ఆంధ్రప్రదేశ్ వరకు, కేరళ నుండి రాజస్థాన్ వరకు, ఉత్తర ప్రదేశ్ నుండి తూర్పు పడమర ఉత్తర దక్షిణాలతో పాటు మధ్య భారతం ఎల్లెడలా ఈ ఉద్యమాలు సాగాయి. దేశవ్యాప్తంగా చాలాచోట్ల తీవ్ర నిర్బంధాన్ని సైతం ఎదుర్కొంటూ పరస్పర సంఘీభావం-సహాయసహకారాలందించుకుంటూ సాగిన ఈ ఉద్యమాలకు తాత్కాలికంగా వెరచి ప్రభుత్వం చాలాచోట్ల వీటిని నిలుపు చేసింది. విప్లవోద్యమం కొనసాగుతున్న చాలా రాష్ట్రాల్లో ఈ ఉద్యమంలో మావోయిస్టు పార్టీ, వివిధ విప్లవ-ప్రజాస్వామిక సంఘాలు క్రియాశీల పాత్ర నిర్వహించాయి. ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర సాధనోద్యమం అవకాశవాద నాయకత్వాన్ని ఎదిరిస్తూనే కొనసాగుతున్నది. ఈ ఉద్యమం ఆంధ్రప్రదేశ్‌లో పాలకవర్గాల మధ్య ఆరిపోని వైరుధ్యాలు రగిలిస్తోంది. అసోంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిగిలిన కొద్దిమంది ఉల్ఫా పోరాటవాదులను ఏరివేస్తున్నాయి. ఇదే సమయంలో బోడో ప్రజలకూ, పెద్ద సంఖ్యలో బయటి నుండి వచ్చి అక్కడ స్థిర నివాసాలు ఏర్పరచుకున్న ముస్లిం తదితర ప్రజలకూ మధ్య గల వైరుధ్యాలను కాంగ్రెస్, భా.జ.పా. పార్టీలు ఎగదోస్తూ పరస్పరం దాడులు జరగడానికి ఆజ్యం పోశాయి. ఈ సమస్యను మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల పాలక, ప్రతిపక్ష పార్టీలు రాజకీయంగా సొమ్ము చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాయి.

వ్యవసాయ సబ్సిడీల ఎత్తివేతకు, డీజిల్, కరెంటు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాల రేట్ల పెరుగుదలకు వ్యతిరేకంగా, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కల్తీకీ, కరెంటు కోతకు వ్యతిరేకంగా, పంటలకు గిట్టుబాటు ధరల కోసం రైతాంగం దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనకు దిగారు. గనులు, విమాన సేవలు, బ్యాంకులు, రేవులు, రవాణా, భీమా (ఇన్స్యూరెన్స్), విద్య, వైద్య తదితర రంగాలకు చెందిన లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు సమ్మెలు చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, జీతభత్యాల పెంపు, పని పరిస్థితుల మెరుగుదల కోసం, ఉద్యోగాల తొలగింపు, అవినీతి తదితర సమస్యలకు వ్యతిరేకంగా, కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారు. ప్రాథమిక స్కూళ్ల నుండి మొదలుకొని విశ్వవిద్యాలయాలలో ప్రైవేట్ పెట్టుబడి చొరబాటుకూ, ప్రైవేటీకరణకూ వ్యతిరేకంగా, విద్య, వైద్య సదుపాయాల కోసం కొనసాగుతున్న ఉద్యమాలలో మార్పు ఆరంభమైంది. చేతివృత్తుల వాళ్లు, మత్స్యకారులు, దళితులు, ఆదివాసులు, మహిళలు, మైనారిటీలు - వివిధ పీడిత సామాజిక సెక్షన్ల ప్రజలు - తమ జీవనాధారాలను కోల్పోవడానికి వ్యతిరేకంగా, భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా ఉద్యమించారు.

మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న సాయుధ వ్యవసాయిక విప్లవోద్యమంపై పాలకవర్గాలు దేశవ్యాప్తంగా మున్నెన్నడూ లేని స్థాయిలో ఫాసిస్టు బహుముఖ దాడిని (ఆపరేషన్ గ్రీన్‌హంట్) తీవ్రతరం చేశాయి. చివరికి సైన్యాన్ని కూడా రంగంలోకి దింపి మరింత పాశవికంగా ఈ దాడిని కొనసాగించడానికి యుద్ధప్రాతిపదికపై సన్నాహాలు చేస్తున్నాయి.

యావత్తు ప్రభుత్వ బలగాలను - సైన్యం, పారా మిలటరీ, పోలీసు, వాటి ఇంటెలిజెన్స్ తదితర విభాగాలను - ఆధునీకరిస్తున్నాయి. చట్టాలను మరింత నిరంకుశంగా మారుస్తున్నాయి. మన దేశంలో తమ సైన్యం తిష్టవేసి ఉందని అమెరికా ప్రభుత్వాధికారే బహిరంగపరిచాడు. భారత ప్రభుత్వం 2010 జులైలో అమెరికాతో కుదుర్చుకున్న "తీవ్రవాద వ్యతిరేక సహకార ఒడంబడిక" అత్యంత క్రూరమైనదీ, దేశద్రోహకరమైంది. ఈ ఒడంబడిక అమెరికా సామ్రాజ్యవాదులు మన దేశ అంతరంగిక వ్యవహారాలలో అధికారికంగానే జోక్యం కల్పించుకునే హక్కు కల్పించింది. అనేక సామ్రాజ్యవాద తదితర దేశాల సేనలతో కలిసి మిలటరీ అభ్యాసాలు (ఎక్సర్‌సైజులు) నిర్వహించడం, ఇందులో ఒక భాగంగా కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్స్‌లో కూడా అభ్యాసాలు నిర్వహించడం చేశాయి. దేశవ్యాప్తంగా వివిధ ప్రజాస్వామిక ఉద్యమాలను అదుపు చేయడానికి ఎడతెరిపి లేకుండా పాశవిక దమనకాండ కొనసాగిస్తూనే వీటి విస్తృతినీ, తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పాలకవర్గాలు మరింత పెద్దదాడికి సన్నద్ధమవుతున్నాయి. ఇందులో ఒక భాగమే ఇటీవల కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చిన అత్యంత ప్రమాదకరమైన ఫాసిస్టు 'నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్' ఏర్పాటు ప్రయత్నాలు.

1947లో దేశంలో లాంఛనప్రాయంగా జరిగిన అధికార మార్పిడికి ముందు వలస పాలకులూ, ఆ తర్వాత వారి తొత్తు పాలకులూ తమ దోపిడీ పీడనలకు, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజలను అణచివేయటానికి చాలా నిరంకుశ చట్టాలను, యంత్రాంగాలను రూపొందించారు. వీటన్నింటినీ తలదన్నే విధంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం 'జాతీయ ఉగ్రవాద వ్యతిరేక కేంద్రం' (నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్ - ఎన్.సి.టి.సి.)ని ఏర్పరచటానికి సన్నాహాలు తీవ్రతరం చేసింది. అమెరికాలోని ఎన్.సి.టి.సి. తరహాలో అమెరికా సామ్రాజ్యవాదుల కనుసన్నల్లోనే, వారి నాయకత్వాన గల అంతర్జాతీయ యాంటీ టెర్రరిజం కమ్యూనిటీలో భాగంగానే దేశంలో ఎన్.సి.టి.సి. ఏర్పాటు చేయతలపెట్టారు. ఇది మన దేశ సోకాల్డ్ సార్వభౌమత్వానికీ, స్వాతంత్ర్యానికీ సైతం ప్రమాదం కలిగిస్తుంది. ఇది ఏర్పడితే గనుక, ఈ దుష్ట వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడే ప్రజాసంస్థలను, ప్రజలను ఎటువంటి అడ్డూ అపూ లేకుండా అణగదొక్కడానికి ప్రభుత్వం దీనిని వినియోగిస్తుంది. దేశంలో సైనిక నియంతృత్వ, ఎమర్జెన్సీ తరహా పాలనను సైతం అమలుచేసే సాధనంగా దీనిని కేంద్ర ప్రభుత్వం ఉపయోగించుకొనే అవకాశం ఉంది. ఇప్పటికే అంతంతమాత్రంగా ఉన్న పౌరహక్కులు అనే మాటకే ఇక విలువ లేకుండా పోతుంది. సి.పి.ఐ.(మావోయిస్టు) నాయకత్వాన కొనసాగుతోన్న విప్లవోద్యమాన్ని నిర్మూలించటానికే గాకుండా తమ న్యాయబద్ధమైన డిమాండ్ల కోసం పోరాడే ప్రజలను-జాతి విముక్తి ఆకాంక్షలతో పోరాడుతున్న కాశ్మీర్, ఈశాన్య జాతుల ప్రజల ఉద్యమాలను, విస్థాపన వ్యతిరేక ఉద్యమాలను, పీడిత సామాజిక సెక్షన్ల ఉద్యమాలతో పాటు అన్ని ప్రజాస్వామిక ఉద్యమాలను ఎన్.సి.టి.సి.ని వినియోగించుకొని దారుణంగా అణచివేయడమే పాలకవర్గాల ప్రధాన ఉద్దేశ్యం. ఎన్.సి.టి.సి. చట్టబద్ధంగానే దేశ ఫెడరల్ నిర్మాణానికి గొడ్డలిపెట్టు లాంటిదే గాకుండా రాష్ట్రాల హక్కులను హరించి వేస్తుంది. భారత విస్తరణవాదులు రూపొందిస్తున్న ఎన్.సి.టి.సి. యావత్ దక్షిణాసియా దేశాలకూ, ఆఫ్ఘనిస్తాన్‌కూ ప్రమాదకరంగా పరిణమిస్తుంది. సామ్రాజ్యవాద పెట్టుబడితో మిలాఖతై వివిధ దేశాల్లో పెట్టుబడులు పెడుతున్న,

వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్న దేశ దళారీ బడా కార్పొరేషన్ల ప్రయోజనాల కోసం భారత పాలకవర్గాలు ఎన్.సి.టి.సి.ని వినియోగించుకొని ఆ దేశాలలో వివిధ రూపాల్లో జోక్యం చేసుకునే అవకాశం కలుగుతుంది. ఎన్.సి.టి.సి. ఇంటర్నేషనల్ యాంటీ టెర్రరిజం కమ్యూనిటీలో భాగం కావడం ద్వారా అంతర్జాతీయ రంగంలో అమెరికా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు తోడ్పడుతుంది.

## తీవ్రతరం, విస్తృతం అయిన ఆపరేషన్ గ్రీన్‌హంట్

సామ్రాజ్యవాద దేశాల ద్రవ్య-ఆర్థిక వ్యవస్థల్లో నెలకొని ఉన్న తీవ్ర మాంద్యం, ప్రపంచంలో రోజురోజుకు తీవ్రతరమవుతున్న మౌలిక వైరుధ్యాలు భారత సామాజిక వ్యవస్థలోని అన్ని రంగాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులూ, తమ పెట్టుబడులకూ, వనరుల దోపిడీకీ, మార్కెట్లకూ, ఆధిపత్యానికీ భంగం కలిగించే ఎటువంటి శక్తులనైనా అడ్డు తొలగించుకోవటానికి ఎక్కడైనాగాని క్రూరంగా దాడి చేస్తున్నారు. అలాగే సామ్రాజ్యవాదులకు దళారీలుగా పనిచేస్తున్న అర్ధవలస-అర్ధ భూస్వామ్య దేశాల పాలకులు తమ దోపిడీ, పీడనలకూ, దుర్మార్గ పాలనకూ వ్యతిరేకంగా పోరాడే ఎటువంటి శక్తులపైనైనా అత్యంత పాశవికంగా దాడి కొనసాగిస్తున్నాయి. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌ల దురాక్రమణ, లిబియాలో కొనసాగించిన ప్రత్యక్ష జోక్యం, పాకిస్తాన్, సిరియాలలో కొనసాగిస్తున్న జోక్యం, ఇరాన్, ఉత్తర కొరియాలను బెదిరించడం, ఫిలిప్పీన్స్, భారత దేశాల్లో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవాలను క్రూరంగా అణచివేయటానికి ఓప్లాన్ బయానిహాన్, ఆపరేషన్ గ్రీన్‌హంట్ వంటి దేశవ్యాప్త బహుముఖ అత్యంత విప్లవ ప్రతీఘాతుక ఆపరేషన్లు కొనసాగించడం అనేవన్నీ సామ్రాజ్యవాదుల, వారి తొత్తుల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసమే. దేశంలో అపార ఖనిజ, అటవీ, జల తదితర సంపదలకు నిలయమైన విశాల మధ్య, తూర్పు, ఈశాన్య ప్రాంతాలూ, అపార ప్రకృతి సంపదలతో పాటు అపార మానవ వనరులు, తీరప్రాంతాలు గల దక్షిణ, పశ్చిమ ప్రాంతాలు కూడా వీరికి ప్రత్యేక లక్ష్యాలుగా మారాయి. దేశవ్యాప్తంగా వీరు కొనసాగిస్తున్న దోపిడీ, పీడనలనూ, దమనకాండనూ అడ్డుకుంటున్న మన పార్టీనీ, విప్లవ, ప్రజాస్వామిక, దేశభక్తి శక్తులన్నింటినీ పాశవికంగా అణచివేయడానికి ఆపరేషన్ గ్రీన్‌హంట్ కొనసాగించడంతో పాటు సైన్యాన్ని రంగంలోకి దింపుతున్నారు.

పార్టీ 7వ వార్షికోత్సవాల తదనంతరం సంవత్సర కాలంలో విప్లవోద్యమ అణచివేతకు అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి దన్నుతో భారత పాలక వర్గాలు కొనసాగించిన విప్లవ ప్రతీఘాతుక దాడి (ఆపరేషన్ గ్రీన్‌హంట్-2) మరింత తీవ్రతరం, విస్తృతం అయింది. ప్రజాయుద్ధ అణచివేతకు ఈ సంవత్సర కాలంలో శత్రువు కొనసాగించిన ముఖ్యమైన దాడి ఎత్తుగడలు ఈ విధంగా ఉన్నాయి.

భారత విప్లవోద్యమానికి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో [దండకారణ్యం, ఝార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దు (ఏ.ఓ.బి.), ఉత్తర తెలంగాణా (ఎన్.టి.), ఒడిశా, ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు (సి.ఓ.బి.) తదితర] కీలక ప్రాంతాలుగా ఉన్న

గెరిల్లా బేస్‌లపై, వ్యూహాత్మక ప్రాంతాలపై, బలమైన లోతట్టు ప్రాంతాలపై గత సంవత్సర కాలంగా కేంద్ర, రాష్ట్ర బలగాలు పెద్దెత్తున దాడులు (కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్స్) కొనసాగించాయి. ప్రజాయుద్ధ వ్యూహాత్మక అవసరాల కోసం వివిధ రూపాల్లో గెరిల్లాబేస్‌లుగా ఉపయోగపడుతున్న ఈ ప్రాంతాలలోని మన నాయకత్వాన్ని దెబ్బతీసే, కీలక టెక్నికల్ యూనిట్లను నష్టపరిచే, ప్రధాన బలగాల పోరాట సామర్థ్యాన్ని దెబ్బతీసే, విప్లవ ప్రజా కమిటీలను ధ్వంసం చేసే లక్ష్యంతో ఈ దాడులు సాగాయి. ఈ ప్రాంతాలను గెరిల్లా బేస్‌లుగా మనం ఉపయోగించుకోకుండా చేసి, ఉపయోగించుకోలేని స్థితిని సృష్టించి ప్రజాయుద్ధ నిర్వహణలో మనకు అనేక ఆటంకాలు, ప్రతికూలతలు కల్పించి, మన పోరాట సామర్థ్యాన్ని దెబ్బతీసి ఓటమి పాల్జేసే వ్యూహంతోనే ఈ ఆపరేషన్స్ కొనసాగుతున్నాయి. అంటే గెరిల్లా బేస్‌లను విప్లవ ప్రతీఘాతుక బేస్‌లుగా మార్చేందుకై ప్రభుత్వం ఈ ఆపరేషన్స్ నిర్వహించింది. ప్రజాయుద్ధం విస్తరిస్తున్న నూతన వ్యూహాత్మక ప్రాంతాల్లో విప్లవ శక్తులు సంఘటితపడకుండా చేసే లక్ష్యంతో కార్పెట్ సెక్యూరిటీ క్యాంపింగ్ వ్యవస్థను విస్తరిస్తూ వీటిలో ప్రతీఘాతుక శక్తుల్ని కూడగట్టడంపై కేంద్రీకరించడంతో పాటు కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్స్ కూడా ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ఇంతవరకు విచ్చలవిడిగా సాగిన ఈ ఆపరేషన్స్ ప్రధానంగా గ్రామాల్లో సామూహిక అత్యాచారాలను, విధ్వంసకాండను, హత్యాకాండను సృష్టించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వారి ఫాసిస్టు బలగాలు దాడులకు గురైన గ్రామాల ప్రజల తీవ్ర అసహ్యానికీ, కోపాగ్నికీ, దేశ విదేశీ ప్రజాస్వామికవాదుల వ్యతిరేకతకు గురైనాయి. చాలాచోట్ల ప్రభుత్వ బలగాలు వివిధ రూపాల్లో ప్రజల-ప్రజా గెరిల్లా బలగాల ప్రతిఘటనతో తోకముడిచాయి.

'ఆపరేషన్ అనకొండా', 'ఆపరేషన్ ఆక్టోపస్', 'ఆపరేషన్ విజయ్', 'ఆపరేషన్ హాకా' లాంటి ఈ ఆపరేషన్స్‌లో బెటాలియన్ నుండి బ్రిగేడ్ స్థాయిలో శత్రు బలగాలు పాల్గొన్నాయి. ఇవన్నీ కేంద్ర కోబ్రా కమాండోలు - వివిధ పారా మిలటరీ బలగాలు, రాష్ట్ర పోలీసు-కమాండో బలగాలు, పోలీసు అనుబంధ బలగాలతో కూడిన జాయింట్ ఆపరేషన్స్ రూపంలో కొనసాగాయి. ఈ ఆపరేషన్స్ చాలా వాటిలో బలగాల, లాజిస్టిక్స్ తరలింపు కోసం విస్తృతంగా హెలికాప్టర్లను (వాయుసేన, బి.ఎస్.ఎఫ్., రాష్ట్ర పోలీసుల) ఉపయోగించారు. ఈ ఆపరేషన్స్ సందర్భంగా మన బలగాలను గుర్తించడానికి యు.ఏ.వి.లను ఉపయోగించారు. గతం నుండి ఉపయోగిస్తున్న వివిధ రకాల ఆధునిక ఆయుధాలకు తోడుగా ఈసారి రాకెట్ లాంచర్లను కూడా ఉపయోగించారు. ఆండ్రాయిడ్, జి.పి.ఎస్. లాంటి నేవిగేషన్ సిస్టం కలిగిన కమ్యూనికేషన్ పరికరాలను, సెటిలైట్ ఫోన్స్, మొబైల్ ఫోన్స్ వగైరాలను ఉపయోగించారు. వీటన్నింటి పథక రచనలోనే గాకుండా ఫీల్డులో ఉండి ఆపరేషన్స్‌ను గైడ్ చేయడంలో కేంద్ర, రాష్ట్ర పోలీసు డి.జి.పి. ఐ.జి. స్థాయి పోలీసు ఉన్నతాధికారులతో పాటు కేంద్ర, రాష్ట్ర ఉన్నత స్థాయి ఇంటెలిజెన్స్ అధికారులు కూడా పాల్గొన్నారు.

2007 నుండి 2010 వరకు మన పి.ఎల్.జి.ఏ. ప్రజల మద్దతుతో పారా మిలటరీ, రాష్ట్ర పోలీసు బలగాలపై సాగించిన ఎత్తుగడలపర ఎదురు దాడులతో తీవ్ర నష్టాల పాలై వాటి మోరేల్ గణనీయంగానే దెబ్బతిన్నది. దీనితో విప్లవోద్యమ అణచివేతకు భారత సైన్యాన్ని, వాయుసేనను దించాలని పాలకవర్గాలు 2010లోనే తుది నిర్ణయానికి వచ్చాయి. ఈ నిర్ణయాన్ని

అనుసరించి 2011 మార్చిలో సైన్యానికి చెందిన ఒక బ్రిగేడ్ దండకారణ్యంలోని కొండగాంకి చేరుకొంది. ఈ బలగాలు కొండగావ్ పరిసరాల్లోని ప్రాంతంలో జంగల్ వార్‌ఫేర్ శిక్షణ తొలిదశ కార్యక్రమాన్ని పూర్తిచేసుకొని వెళ్లాయి. ఆ తర్వాత మరో రెండు బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకొని వెళ్లాయి. ఇప్పుడు నాలుగో బ్యాచ్ రానుంది. శిక్షణా శిబిరం నెలకొల్పే పేరుతో మాడ్‌ని ఆక్రమించుకొని శాశ్వతంగా తిష్టవేసే లక్ష్యంతో భారత సైన్యం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. సైనిక శిక్షణా శిబిరాల పేరుతో, సైనిక అకాడమీ పేరుతో, సైనిక కమాండ్ హెడ్‌క్వార్టర్స్ పేరుతో సైన్యం నారాయణపూర్ నుండి సరాయిపల్లి వరకు అనేకచోట్ల క్యాంపుల్ని ఏర్పాటు చేసి ఛత్తీస్‌గఢ్‌ను సైనిక హబ్‌గా మారుస్తున్నది. సైనిక దాడులకు మద్దతుగా వాయుసేనతో దాడులు చేయడం కోసం ఛత్తీస్‌గడ్, విదర్భ, ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బీహార్, బెంగాల్, మధ్యప్రదేశ్ తదితర అనేక రాష్ట్రాలలో ఎయిర్‌బేస్‌లు, హెలిపాడ్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తున్నది. వీటి ఫలితంగా దండకారణ్యంలోని మాడ్‌తో పాటు దేశంలోని విప్లవోద్యమ ప్రాంతాలు సైనిక దాడులకు లక్ష్యాలవుతాయి.

దండకారణ్య, ఝార్ఖండ్‌లతో పాటు దేశవ్యాప్తంగా బలమైన ఉద్యమ వ్యూహాత్మక ప్రాంతాలంతటా మొత్తం టెర్రయిన్ సర్వేపై ఆధారపడి టోపోగ్రాఫికల్ మ్యాప్‌లను రూపొందించుకొని వాటి ఆధారంగా గ్రామాలను, గుట్టలను, అడవులను, నదులను, నీటితావులను, కాలి బాటలను, రోడ్లను, మైదానాలను, గనులను, పరిశ్రమల, పట్టణాల పరిసర ప్రాంతాలను గుర్తించే సాఫ్ట్‌వేర్‌ను తయారు చేస్తున్నారు. అడవుల్లోని మన క్యాంపులను, మన బలగాల కదలికలను, కీలక గ్రామాల కార్యకలాపాలను గుర్తించేలా డ్రోన్ సర్వైలెన్స్ సిస్టంను/ప్రోగ్రాంను అభివృద్ధి పరుస్తున్నారు. ఈ ప్రోగ్రాం/సాఫ్ట్‌వేర్ ఆధారంగా మన క్యాంపుల్ని, మన బలగాల్ని, స్థానిక నాయకత్వాన్ని గుర్తించి దాడులు చేస్తారు. పట్టణ, మైదాన ప్రాంతాలలోని నాయకత్వాన్ని దెబ్బతీసిన శత్రువు ఇన్‌ఫార్మర్ల ద్వారా, కోవర్టుల ద్వారా (హ్యూమన్ ఇంటెలిజెన్స్), టెక్నికల్ ఇంటెలిజెన్స్/కమ్యూనికేషన్ ఇంటెలిజెన్స్ ద్వారా అడవి ప్రాంతాలలో మనల్ని గుర్తించి మనపై డ్రోన్ దాడులు, కమాండో బలగాల దాడులు చేసే సన్నాహాలను యుద్ధ ప్రాతిపదికపై కొనసాగిస్తున్నాడు. యు.ఏ.వి.ల ద్వారా, ఇతర ఆధునిక టెక్నలాజికల్ వ్యవస్థల ద్వారా మన అన్ని రకాల రేడియో (ఫోన్లు-ల్యాండ్-మొబైల్, వాకీటాకీల) సిగ్నల్స్‌ను టాపింగ్ చేసి దాడులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

గత సంవత్సర కాలంలో దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల్లోని ఉద్యమ ప్రాంతాలలో ప్రత్యేకంగా బలమైన ప్రాంతాలలోనూ, ట్రైజంక్షన్స్‌లోనూ, రాష్ట్రాల సరిహద్దుల్లోనూ కార్పెట్ సెక్యూరిటీ క్యాంపుల్ని విస్తరింపజేయటానికి మరిన్ని కొత్త పోలీసు స్టేషన్లు, క్యాంపులు పెట్టారు. ఈ ప్రాంతాల్లో 400 ఎటాక్ ప్రూఫ్ పోలీసు స్టేషన్లు నిర్మిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం గుర్తించిన నాలుగు ట్రైజంక్షన్లు (మూడు రాష్ట్రాల కూడలులు) అయిన ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర, ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్-ఒడిశా, ఛత్తీస్‌గఢ్-ఝార్ఖండ్-ఒడిశా, ఒడిశా-పశ్చిమ బెంగాల్-ఝార్ఖండ్‌లలో జాయింట్ ఆపరేషన్లు తీవ్రతరం చేశారు. ఇలాంటి ఆపరేషన్లు ఝార్ఖండ్-బీహార్-బెంగాల్ ట్రైజంక్షన్లలోనూ, ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర-మధ్యప్రదేశ్ ట్రైజంక్షన్‌లోనూ, రెండేసి రాష్ట్రాల సరిహద్దులన్నింటిలోనూ తీవ్రతరం చేశారు. ఈ

ప్రాంతాలన్నింటా రానున్న రోజుల్లో ఏకకాలంలో ఇలాంటి ఆపరేషన్లను కొనసాగించటానికి కేంద్ర, రాష్ట్ర బలగాల్లోకి కొన్ని లక్షల మందిని భర్తీ చేసుకుంటున్నారు. ఉద్యమ రాష్ట్రాలన్నింటా ప్రత్యేక పోలీసు, పారా మిలటరీ బలగాల శిక్షణపై సైన్యం పలు ప్రత్యేక కేంద్రాలను నెలకొల్పడంతో పాటు తన శిక్షణా కేంద్రాలలో ఈ బలగాలకు శిక్షణనిస్తున్నది; రాష్ట్ర ప్రభుత్వాలన్నీ పెద్దసంఖ్యలో పోలీసు బలగాల ప్రత్యేక శిక్షణ కేంద్రాలను నిర్మిస్తున్నాయి. మన గెరిల్లా బేసులను, వ్యూహాత్మక ప్రాంతాలను ముక్కలుగా విడగొట్టి మన బలగాల ప్రతిఘటనా సామర్థ్యాన్ని తగ్గించివేసి, మన సమన్వయాన్ని దెబ్బతీసి పార్టీని-ఉద్యమాన్ని అణచివేసే లక్ష్యంతోనే ఇదంతా చేస్తున్నారు.

మన ఉద్యమ ప్రాంతాల్లో ప్రతీ గ్రామాన్ని కవర్ చేసేలా తన కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్టం చేసి విస్తరింపజేయటానికి పెద్దసంఖ్యలో నేడున్న కమ్యూనికేషన్స్ టవర్స్‌కు తోడు మరో 2200 టవర్స్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటి ద్వారా హ్యూమన్ ఇంటెలిజెన్స్‌లో ఒక పెద్ద మార్పు తీసుకొని వచ్చి మన నాయకత్వ కదలికలనే కాకుండా ప్రజా గెరిల్లా బలగాల, స్థానిక పార్టీ కార్యకర్తల కదలికల, కార్యకలాపాల సమాచారాన్ని సేకరించేందుకే శత్రువు ఈ పథక రచన చేశాడు. మన శక్తుల్లోకి కోవర్టులను చొప్పించడం ద్వారా, మన ప్రాంతాల్లో ఇన్‌ఫార్మర్ల నెట్‌వర్క్‌ను విస్తృతం చేయడం ద్వారా, మనకు వేర్వేరు రూపాల్లో సహకరించే వారిలో ఇన్‌ఫార్మర్లను తయారు చేసుకోవడం ద్వారా నాయకత్వ కదలికలను గుర్తించి దెబ్బతీయటానికి శత్రువు ప్రత్యేకంగా కేంద్రీకరించాడు.

దేశవ్యాప్తంగా ఉద్యమ ప్రభావిత 78 జిల్లాల్లో సమగ్ర కార్యాచరణ పథకం (ఐ.ఏ.పి.) కింద కేంద్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు 2010-11లో 25 కోట్ల రూపాయలు, 2011-12, 2012-13 సంవత్సరాలకు గాను ఏడాదికి 30 కోట్ల రూపాయల వంతున కేటాయించింది. 78 జిల్లాల్లో 60 జిల్లాలు ట్రైజంక్షన్స్‌లోనే ఉన్నాయి. ఈ జిల్లాల్లో రాజకీయ, పాలన (పోలీసు, రెవెన్యూ), న్యాయ, శాసన, మీడియా వ్యవస్థలు కలిసికట్టుగా 'రాజకీయ, అభివృద్ధి, భద్రత' కార్యక్రమాలను అమలు జరుపుతున్నాయి. విశాలమైన భూభాగాలు కలిగిన ఈ ప్రాంతాల్లో సుసంపన్నమైన ప్రకృతి వనరులు (అటవీ, ఖనిజాలు, నీరు) ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో - ప్రపంచ, దేశ గుత్త కార్పొరేషన్లు, ప్రభుత్వ గుత్త సంస్థలు - పోస్కో, వేదాంత, టాటా, మిత్తల్, జిందాల్, ఎస్సార్, ఎన్.ఎం.డి.సి. తదితరాలు - తమ కార్యకలాపాలను కేంద్రీకరించాయి. ఇవన్నీ ప్రజల తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంటున్నాయి. అందువల్లనే ఈ జిల్లాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐ.ఏ.పి.తో పాటు వివిధ రకాల 'అభివృద్ధి', 'సంక్షేమ' పథకాల అమలును తీవ్రతరం చేస్తున్నాయి. ఈ పథకాలకు కేంద్ర ప్రభుత్వం పెద్దెత్తున నిధుల్ని కేటాయిస్తున్నది. ఈ సంవత్సరమే ఈ పథకాల కోసం కేంద్ర ప్రభుత్వం 13,742 కోట్ల రూపాయలు కేటాయించింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూపొందించిన రెండు సంవత్సరాలలో పూర్తి చేయాల్సిన 'బస్తర్ డెవలప్‌మెంట్ గ్రూప్' అనే 2200 కోట్ల రూపాయల పథకం లాంటి పథకాలను వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్నాయి. ఈ వారంలోనే కేంద్ర ప్రభుత్వ ఐ.ఏ.పి. కింద మావోయిస్టు ఉద్యమానికి బలమైన వివిధ రాష్ట్రాల సరిహద్దుల్లో గల 34 జిల్లాల్లో రోడ్ల నిర్మాణానికి 7300 కోట్ల రూపాయలు కేటాయించింది.

కేంద్ర ప్రభుత్వ పథకాలలో ముఖ్యమైనవి - ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, నేషనల్ రూరల్ హెల్త్‌మిషన్ (జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం), ఆశ్రమ పాఠశాలల ఏర్పాటు, మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ పథకం (మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం - ఎం.ఎన్.ఆర్.జి.ఏ.-మన్‌రేగా), సర్వశిక్షా అభియాన్, నేషనల్ రూరల్ డ్రింకింగ్ వాటర్ ప్రోగ్రాం (జాతీయ గ్రామీణ తాగునీటి పథకం), రాజీవ్‌గాంధీ గ్రామీణ్ విద్యుదీకరణ్ యోజన, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్(సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం), ఇందిరా ఆవాస్ యోజన, అటవీ హక్కుల గుర్తింపు చట్టం (2006), పేసా చట్టం.

ఈ సంస్కరణల్లో ఎన్.జి.ఓ.ల భాగస్వామ్యానికి చట్టబద్ధత కల్పించారు. ఫలితంగా రామకృష్ణ ఆశ్రం, సెర్చ్ లాంటి వివిధ ఎన్.జి.ఓ. సంస్థలు ప్రభుత్వ నిధులతో ప్రభుత్వ పథకాలను అమలుచేయడంలో క్రియాశీల పాత్రను పోషిస్తున్నాయి. చిన్న రకపు అటవీ ఉత్పత్తులపై ఆదివాసులకు హక్కును కల్పిస్తున్నామనే పేరుతో లేఖా-మేండా (గడ్‌చిరోలి, మహారాష్ట్ర) మోడల్‌ను దేశవ్యాప్తంగా ఆదివాసీ ప్రాంతాల్లో అమలుచేస్తామని ఊదరగొడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం ఈ 78 జిల్లాల్లో 30 జిల్లాలను మావోయిస్టు ఉద్యమానికి అత్యంత బలమైనవిగా, తనకు అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించింది. వీటిలో సరండపై ముందు కేంద్రీకరించి 'సరండ స్పెషల్ యాక్షన్ ప్రోగ్రాం' అనే అత్యంత విప్లవ ప్రతీఘాతుక పథకాన్ని ఆరంభించింది. ఈ పథకాన్ని సామ్రాజ్యవాదుల- భారత పాలకవర్గాల నమ్మినబంటు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి జైరామ్ రమేష్ 'సరండ మోడల్'గా అభివర్ణించాడు. ఈ స్పెషల్ ప్రోగ్రాంలో భాగంగా సరండ వ్యాప్తంగా ఒకేసారి వేలాది పారా మిలటరీ, పోలీసు బలగాలను మోహరించి క్యాంపులు పెట్టి విధ్వంసం, అత్యాచారాలు, హత్యలు, లూటీ కొనసాగించడం; దీని వెనువెంటనే ఈ బలగాలు కేంద్ర, రాష్ట్ర పాలనా యంత్రాంగంతో కలిసి 'సివిక్ యాక్షన్' ప్రోగ్రాంనీ, ఇతర ప్రత్యేక 'అభివృద్ధి-సంక్షేమ' పథకాలను ఆరంభించడం; వీటితో పాటు పాలకవర్గ మల్టీమీడియాను రంగంలోకి దింపి ప్రచారాన్ని హోరెత్తించడం; రాజకీయ పార్టీలను, వివిధ ఎన్.జి.ఓ. సంస్థలను రంగంలోకి దింపడం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా 'అవసరమైన మోతాదులో బలప్రయోగం' చేయడానికి పెద్దెత్తున ప్రత్యేక బలగాలను మోహరించడం, ప్రజల్లో ఒక సెక్షన్‌ని చీలదీసి వారి 'మనసులను గెలుచుకోవడం' ఉంటాయి. ఇది విప్లవోద్యమాలను ఎదుర్కొనేందుకు బ్రిటీష్, అమెరికా సామ్రాజ్యవాదులు రూపొందించిన అత్యంత విప్లవ ప్రతీఘాతుక ఎల్.ఐ.సి. పాలసీ ప్రాయోజిత పథకం-మోడల్ తప్ప మరొకటి కాదు. ఈ హాస్యాస్పదమైన దగాకోరు పాలసీని చిదంబరం, జైరాం రమేష్‌ల మాటల్లో చెప్పాలంటే "క్లియర్, హోల్డ్ అండ్ బిల్డ్" పాలసీ అంటున్నారు. దీనిని సుక్మా, మాడ్, మల్కనగిరి, లాల్‌గఢ్‌లలో అమలుచేయాలని నిర్ణయించారు. తర్వాత ఈ కార్యక్రమాన్ని మరో 20 జిల్లాలకు విస్తరించాలని నిర్ణయించారు.

వీటన్నింటి ద్వారా రాజకీయ నాయకుల, అధికారుల, కాంట్రాక్టర్ల, భూస్వాముల, పెత్తందార్ల, తెగపెద్దల, ధనిక-మధ్యతరగతి రైతాంగంలోని ఒక సెక్షన్‌కు ఆర్థిక, రాజకీయ,

సామాజిక లాభాలు చేకూర్చి వారిని తమకు సామాజిక పునాదిగా ఉపయోగించుకుంటున్నారు. ఆశ్రమ పాఠశాలల ఏర్పాటు, రాజీవ్‌గాంధీ సర్వశిక్షా అభియాన్ లాంటి పథకాల ద్వారా లోతట్టు గ్రామాలకు సుదూరంగా శత్రు శిబిరాల సమీప ప్రాంతాల్లో ఎడ్యుకేషన్ హబ్స్ (విద్యా కేంద్రాలు) ఏర్పాటు చేస్తున్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన పేరుతో పెద్దెత్తున పోలీసు, పారా మిలటరీ, మిలటరీ బలగాల్లో భర్తీ చేసుకుంటూ వారు విప్లవోద్యమానికి వనరుగా మారకుండా చూడడమే గాకుండా తమ కంటిని తామే పొడుచుకునేలా ప్రజలపై యుద్ధంలో బలిపశువుల్ని చేయజూస్తున్నారు. భూమిపై హక్కు కల్పించే పేరుతో, తరతరాలుగా ఆదివాసీ ప్రజలు సేద్యం చేసుకుంటున్న భూముల్లో కొన్నింటికి మాత్రమే పట్టాలు ఇస్తున్నారు. ఆదివాసీ-రైతాంగ యువకుల్లో కొందర్ని కాంట్రాక్టర్లుగా మారుస్తున్నారు. 250 మంది ప్రజలున్న (50 ఇండ్లు ఉన్న) గ్రామాలను రోడ్ల ద్వారా పట్టణాలతో లింకు చేసి శత్రు బలగాల కేంద్రాలతో, దేశవిదేశీ కార్పొరేట్ సంస్థల మార్కెట్‌తో జోడిస్తున్నారు. మరోవైపు ఈ రోడ్ల ద్వారా అటవీ ప్రాంతాల్లో ఉన్న అటవీ, ఖనిజ, జల సంపదలను కొల్లగొట్టుకుపోవడానికి వీలుగా మౌలిక సదుపాయాల పేరుతో వేల కోట్ల రూపాయలు కేటాయించి రోడ్లు, వంతెనలు, విద్యుత్తు, కమ్యూనికేషన్లు యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో విద్యావ్యాప్తి పేరుతో దేశ విదేశీ కార్పొరేట్ సంస్థలకు అవసరమైన నిరుద్యోగ సైన్యాన్ని తయారు చేస్తున్నారు. ఆదివాసుల-రైతాంగ ప్రజల స్వయం పోషక ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేస్తూ పరాధీన (మార్కెట్ ఆధారిత) ఆర్థిక వ్యవస్థను పెంపొందిస్తున్నారు. వీటన్నింటి ద్వారా ప్రజల నుండి విప్లవశక్తులను ఒంటరి చేసి దెబ్బతీసే లక్ష్యంతో విప్లవ సామాజిక పునాదిని బలహీనపరచజూస్తున్నారు.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ ఆరంభించినప్పటి నుండి ఏడేండ్లలో విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలిస్తామనీ, లక్షలాది సైన్యం కలిగిన ప్రభుత్వంతో మావోయిస్టు పార్టీ పోరాడి విజయం సాధించలేదనీ, మావోయిస్టు ఉద్యమానికి ఓటమి తప్పదనీ, అందువల్ల పార్టీని, పి.ఎల్.జి.ఏ.ని, ప్రజా నిర్మాణాలను వదిలిపెట్టి ప్రభుత్వ బలగాల్లో చేరండనీ, పోలీసు ఇన్‌ఫార్మర్లుగా మారండనీ శత్రువు సిగ్గూ ఎగ్గూ లేకుండా ఎడతెరిపి లేకుండా బాహాటంగా ప్రచారం చేస్తున్నాడు. పార్టీలో విభేదాలున్నాయని గోరంతని కొండంత చేసి ప్రచారం చేస్తున్నాడు. పార్టీలో స్థానికతత్వాన్ని రేకెత్తించి స్థానిక-స్థానికేతర విభజన సృష్టించటానికి అభూతకల్పనలతో ప్రచారం చేస్తున్నారు. సైకలాజికల్ ఆపరేషన్స్‌ని కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్స్‌తో జోడిస్తూ మున్నెన్నడూ లేని విధంగా ప్రతీఘాతుక మల్టీమీడియా ద్వారా ప్రచారం కొనసాగిస్తున్నారు.

అసోం పీడిత జాతి విముక్తికై, పీడిత ప్రజల విముక్తికై సి.పి.ఐ.(మావోయిస్టు) భారత విస్తరణవాదులకు, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా తన సరైన కార్మికవర్గ విప్లవ పంథాను ప్రజల ముందుంచి వారిని సమీకరించేందుకు ఈ సంవత్సరం మరోసారి ప్రయత్నించింది. అసోం పీడిత జాతి మావోయిజంతో మేల్కొనడం ఆరంభించగానే ఢిల్లీ పాలకులు, వీరి తోడుదొంగ ప్రతిపక్ష పార్టీలు, వీరి కిరాయి సైనిక, పారా మిలటరీ, పోలీసు బలగాలు భయకంపితులైనారు. మావోయిస్టులు ఈశాన్య పీడిత జాతులన్నింటిలోకి చొచ్చుకు పోతున్నారని

ప్రచారానికి లంకించుకొని సైనిక దాడుల్ని ఆరంభించారు. అసోం పీడిత ప్రజల ప్రియతమ బిడ్డలు నలుగురు - కామ్రేడ్స్ సిద్ధార్థ బర్గోహైన్, రాజీవ్ గోగోయ్, అరుప్ చేటియా, కమ్లా గోగోయ్‌లను పట్టుకొని అత్యంత క్రూరంగా హింసించి కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కట్టుకథను ప్రచారంలో పెట్టారు. ప్రభుత్వ బలగాలపై మావోయిస్టు గెరిల్లాలు జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడిన కా. పావెల్ వీరమరణం పొందాడు. అసోం పీడిత జాతిలో మావోయిస్టు పార్టీ వేళ్లూనుకోవడాన్ని శాశ్వతంగా నిరోధించగలమని భారత విస్తరణవాదులు పిచ్చి కలలు కంటున్నారు.

గత సంవత్సర కాలంలో కర్నాటకలోని మల్నాడ్ (పశ్చిమ కనుమలు) ప్రాంతంలో విప్లవోద్యమ అణచివేతకు ప్రభుత్వ ప్రత్యేక బలగాలు దాడులను తీవ్రతరం చేశాయి. తమిళనాడు, కేరళలోని విశాలమైన పశ్చిమ కనుమల అటవీ ప్రాంత గ్రామాలలోకి మావోయిస్టులు చొచ్చుకొని వస్తున్నారనే భయంతో ప్రభుత్వ బలగాలు కూంబింగ్ ఆపరేషన్స్ నిర్వహించడంతో పాటు బూటకపు సంస్కరణ కార్యక్రమాలనూ, దుష్రచారాన్నీ ఆరంభించాయి. ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, ఢిల్లీ నగరంలో విప్లవోద్యమానికి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ప్రభుత్వాలు నిర్బంధం కొనసాగిస్తున్నాయి.

ఇంతకు ముందు దేశవ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగించినట్లే ఈ సంవత్సరం కూడా బూటకపు ఎన్‌కౌంటర్లు చేశాయి; చాలా విస్తృతంగా ప్రజా నిర్మాణాల సభ్యులను, ప్రజలను అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టి కొందరితో బలవంతపు ఒప్పుకోళ్లతో పాటు ఎస్.పి.ఓ.లుగా, ఇన్‌ఫార్మర్లుగా చేర్చుకొని, చాలా మందిపై ఫాసిస్టు చట్టాలైన యు.ఎ.పి.ఎ., రాష్ట్ర ప్రత్యేక చట్టాల కింద కేసులు పెట్టి (వందలాది మందిని బూటకపు కేసులతో) జైళ్లలో పెట్టాయి. మహిళలపై సామూహిక అత్యాచారాలు, గ్రామ దహనాలు-విధ్వంసం-లూటీ, హత్యాకాండలు మరింత విస్తృతం చేశాయి. విప్లవ ద్రోహులను, పోలీసు అధికారులను ప్రోత్సహించడానికి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవకారుల తలలకు వెలలు పెంచాయి; విప్లవోద్యమంచే శిక్షలకు గురైన ప్రజాశత్రువుల-విప్లవ ద్రోహుల కుటుంబాలకు, పోలీసు-పారా మిలటరీ బలగాలకు ఇచ్చే నష్టపరిహారాన్ని లక్షల్లో పెంచివేశాయి; హంతకముఠాల విధ్వంసక కార్యకలాపాలను విస్తృతం చేయించాయి.

వివిధ జైళ్లలో చాలా సంవత్సరాలుగా బెయిల్స్ లభించకుండా నిర్బంధించబడిన చాలామంది కేంద్ర, రాష్ట్ర నాయకత్వ కామ్రేడ్స్‌పై వివిధ ఫాసిస్టు చట్టాల కింద యావజ్జీవ కఠిన కారాగారవాస శిక్షలు విధించారు. ప్రజా సాంస్కృతిక సంస్థ(ఝార్ఖండ్ ఎభేన్) నాయకుడు కా. జీతన్ మరాండితో పాటు నలుగురికి సెషన్స్ కోర్టు ఉరిశిక్ష తీర్పునిచ్చింది (తర్వాత ఈ తీర్పు హైకోర్టులో రద్దు చేయబడింది). నేటికీ దేశవ్యాప్తంగా కొన్ని వేల మంది మావోయిస్టు నాయకులు-కార్యకర్తలతో పాటు ప్రజా నిర్మాణాల కార్యకర్తలు, విప్లవోద్యమ ప్రాంతాల ప్రజలు జైళ్లల్లో నిర్బంధించబడి ఉన్నారు. దేశవ్యాప్తంగా చట్టబద్ధంగా పనిచేసే ప్రజాసంఘాలపై సైతం పాలకవర్గాలు వివిధ రూపాల్లో నిర్బంధాన్ని అమలుచేస్తూ వాటి కార్యకలాపాలను అడుగడుగునా అడ్డుకుంటున్నాయి.

## మన ప్రతిఘటనా యుద్ధం

గత సంవత్సర కాలంలో మనం రాజకీయ రంగం, గెరిల్లా యుద్ధం, పార్టీ కన్సాలిడేషన్, విప్లవ ప్రజా కమిటీల కన్సాలిడేషన్-విస్తరణ, ఉద్యమ విస్తరణలో కొన్ని పాజిటివ్ ఫలితాలు సాధించాం. పాలకవర్గాలు అమలుచేసిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను మన పార్టీ, పి.ఎల్.జి.ఎ., ప్రజా నిర్మాణాలు, ప్రజలు దృఢంగా, వీరోచితంగా ప్రతిఘటించడం ద్వారానే వీటిని సాధించగలిగాం.

భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదులతో, ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్యవాదులతో కుమ్మక్కై ఆపరేషన్ గ్రీన్‌హంట్ కొనసాగించటానికీ, వివిధ ప్రజాఉద్యమాలపై అవి పాశవికంగా నిర్బంధాన్ని అమలుచేయటానికీ గల కారణాలను సైద్ధాంతికంగా, రాజకీయంగా ప్రజల ముందుంచి వారిని ఈ దాడికి వ్యతిరేకంగా గణనీయంగానే సమీకరించాం. వివిధ ప్రాంతాలలో గల ఉద్యమ స్థితిని బట్టి ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కి వ్యతిరేకంగా ప్రజా సమీకరణలో తేడాలున్నప్పటికీ, ఈనాడు దీనిని ఓడించడమే దేశ ప్రజల రాజకీయ కర్తవ్యమనీ స్పష్టం చేయగలిగాం. అపారమైన ప్రకృతి సంపదలను కొల్లగొడుతూ, తమ దోపిడీ, పీడనలు నిరాటంకంగా కొనసాగించదలచిన సామ్రాజ్యవాదులకు, వారి తొత్తులకు వ్యతిరేకంగా ప్రజలను రాజకీయంగా సమీకరించి ఉద్యమాలు నిర్మిస్తున్నందుకే, ఈ దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా దాని గర్భంలోనే తలెత్తుతూ దేశ ప్రజలకు సరైన ప్రత్యామ్నాయ మార్గం చూపుతున్న నూతన రాజకీయాధికార వ్యవస్థను రూపుమాపడానికే మావోయిస్టు పార్టీపై, ప్రజలపై ఈ దాడి కొనసాగుతున్నదని స్పష్టం చేయగలిగాం. ఈ దుస్థితిని సమూలంగా మార్చటానికి దీర్ఘకాలిక ప్రజాయుద్ధమే ఏకైక మార్గమని స్పష్టంగా దేశ ప్రజల ముందుంచగలిగాం. ఫిలిప్పీన్స్, టర్కీ, ఇటలీ, గ్రీస్, బ్రిటన్, బెల్జియం, జర్మనీ, అమెరికా, కెనడా, బ్రెజిల్ తదితర దేశాలలోని విప్లవ పార్టీలు-శక్తులు, సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజాసంఘాలు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగానూ, భారత విప్లవోద్యమానికి సంఘీభావంగానూ సాలిడారిటీ క్యాంపెయిన్లు నడిపాయి. ఇది భారత విప్లవోద్యమానికి సంబంధించినంతవరకు చాలా ప్రాధాన్యత గల విషయం.

వేలాది కోబ్రా, గ్రేహౌండ్స్, ఎస్.ఓ.జి., ఎస్.టి.ఎఫ్., క్రాక్‌ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, సి-60, హాక్‌ఫోర్స్ లాంటి కేంద్ర-రాష్ట్ర కమెండో బలగాలతో పాటు లక్షలాది మంది పారా మిలటరీ, పోలీసు బలగాలను మోహరించి గెరిల్లాబేస్‌లు - వ్యూహాత్మక ప్రాంతాలపై కేంద్రీకరించి మావోయిస్టు పార్టీని, దాని నాయకత్వాన్ని, గెరిల్లా బలగాలను, ప్రజా నిర్మాణాలను, కార్యకర్తలను నిర్మూలించాలని కొనసాగించిన కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్స్‌ను ఎదుర్కోవడానికి పార్టీ నాయకత్వంలో పి.ఎల్.జి.ఎ. బలగాలు, ప్రజా నిర్మాణాలు, ప్రజలు ఎంతో ధైర్యంగా ప్రతిఘటించారు. పి.ఎల్.జి.ఎ. బలగాలు కొనసాగించిన సాయుధ ప్రతిఘటనా చర్యలూ, టి.సి.ఓ.సి.లూ, వివిధ రూపాల్లో ప్రజలు కొనసాగించిన ప్రతిఘటనా, ప్రజాస్వామిక శక్తులు కొనసాగించిన నిరసనోద్యమాలూ శత్రు బలగాల దూకుడును కొంతవరకు నిలువరించాయి. శత్రు బలగాలు కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్స్ పేరుతో కొనసాగించిన క్రూర విధ్వంసకాండ,

అత్యాచారాలు, హత్యాకాండ శత్రువును ఈ ప్రాంతాలలోనే గాకుండా దేశవ్యాప్తంగా అభాసుపాలు చేసింది. ఈ ప్రాంతాల్లో కొనసాగిన ప్రతిఘటనా యుద్ధానికి ప్రజా ఉద్యమానికి మరింత సాధికారిత లభించింది. మనం బలహీనంగా ఉన్న ప్రాంతాలలో, మనం సాయుధంగా ప్రతిఘటించడానికి చొరవ చేయని చోట మన స్వీయ శక్తులకు నష్టం కలగడమే కాకుండా మన ప్రజాపునాది కూడా బలహీనపడింది. మనం దండకారణ్యం, ఝూర్ఖండ్, బీహార్, ఏ.ఓ.బి.లలో శత్రు బలగాలను సాపేక్షికంగా చురుగ్గా ప్రతిఘటించగలిగాం. లాల్‌గఢ్‌లో సాయుధ ప్రతిఘటన బలహీనపడింది. ఒడిశా, ఉత్తర తెలంగాణా, మహారాష్ట్ర, సి.ఓ.బి. తదితర కొన్ని ప్రాంతాలలో ప్రతిఘటన చాలా పరిమితంగానే చేయగలిగాం. శత్రువు నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో పి.ఎల్.జి.ఏ.ని సాయుధం చేసుకోగలిగాం. శత్రువుతో జరిగిన సాయుధ ఘర్షణలలో అత్యంత వీరోచితంగా పోరాడుతూ కామ్రేడ్ రణిత (దండకారణ్యం- ఏరియా విప్లవ ప్రజా కమిటీ అధ్యక్ష్)లాంటి వీరయోధులు కొందరు దేశంలోని వివిధ ప్రాంతాలలో అమరులైనారు. మొత్తంపై చూసినప్పుడు ఉద్యమ బహుముఖ కర్తవ్యాలను నిర్వర్తిస్తూ, ఇందులో భాగంగా గెరిల్లా యుద్ధంలో కొంతవరకు పాజిటివ్ అనుభవం సంపాదించగలిగాం.

రక్తపిపాసులైన భారత పారా మిలటరీ, పోలీసు ఇంటెలిజెన్స్ విభాగాల అధికారులు మన పార్టీ అగ్రశ్రేణి నాయకులలో ఒకరైన కా. కిషన్‌జీని పట్టుకొని అత్యంత క్రూరంగా హింసించి ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారు. పార్టీ 6వ వార్షికోత్సవాల తర్వాత పొందిన నష్టాలతో పోల్చి చూసినప్పుడు గత సంవత్సర కాలంలో తక్కువ నష్టాలే జరిగినప్పటికీ కా. కిషన్‌జీని కోల్పోవడం అనేది మన పార్టీకి అపారమైన నష్టం. శత్రువు కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక దాడి మధ్య ఉద్యమ బహుముఖ కర్తవ్యాల నిర్వహణలో భాగంగా పార్టీని, పి.ఎల్.జి.ఏ. బలగాలను, ప్రజా నిర్మాణాలను సైద్ధాంతికంగా, రాజకీయంగా, సైనికంగా, నిర్మాణపరంగా సంఘటితపర్చుకోవడానికి కొంతవరకు శిక్షణ నందించాము. కొన్ని రాష్ట్రాలలో పైనుండి కింది వరకు ఉద్యమాన్ని సమీక్షించి సరైన పాఠాలు తీసుకోవటానికి, తగిన నాయకత్వాన్ని ఎన్నుకోవటానికి ప్లీనాలు, విస్తృత సమావేశాలు నిర్వహించాం.

బలమైన ఉద్యమ ప్రాంతాలను ఒంటరిచేసి దెబ్బతీయటానికి వాటిపై కేంద్రీకరించి దాడి చేస్తూనే అవి విస్తరించకుండా అరికట్టే లక్ష్యంతో శత్రువు మనం విస్తరిస్తున్న నూతన ప్రాంతాల్లో కార్పెట్ సెక్యూరిటీని ఏర్పరచి మనం బలపడకుండా చూస్తున్నాడు. నూతన ప్రాంతాల్లో శత్రువుతో పోరాడుతూనే ప్రజాపునాదిని పెంపొందించుకోవడానికి కృషి చేస్తూ కొన్ని ప్రాంతాల్లో సాపేక్షికంగా కన్సాలిడేట్ కాగలిగాం.

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అది విప్లవోద్యమాన్ని అణచటానికి కేంద్రప్రభుత్వంతో మిలాఖత్తై అమలుచేసిన మోసపు ఎత్తుగడలను సరిగా అర్థం చేసుకొని ఆత్మరక్షణాయుద్ధంలో ప్రజలను క్రియాశీలంగా, విస్తృతంగా కదిలించడంలో, నాయకత్వాన్ని కాపాడుకోవడంలో విఫలమైన ఫలితంగానే చారిత్రాత్మక లాల్‌గఢ్ ప్రజా తిరుగుబాటు వెనుకపట్టు పట్టింది. లాల్‌గఢ్ ఉద్యమం వెనుకపట్టు పట్టినా, దాని నిర్మాత

కామ్రేడ్ కిషన్‌జీ, మరికొంతమంది నాయకులు అమరులైనా ఆ మహోద్యమం అందించిన గొప్ప అనుభవాలు భారత విప్లవోద్యమానికి ఎంతో తోడ్పడతాయి. వాటిని సృజనాత్మకంగా అన్వయించుకోవడం ద్వారా దేశంలో అలాంటి ఎన్నో ఉద్యమాలను సృష్టించటానికి కావలసిన భౌతిక పరిస్థితులన్నీ నేడు నెలకొని ఉన్నాయి. చిరస్మరణీయమైన లాల్‌గఢ్‌కూ, కిషన్‌జీ తదితర అమరులకు ఎప్పటికీ మరణం లేదు.

నారాయణపట్న ఉద్యమం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోన్న తీవ్రమైన నిర్బంధ కాండను ఎదుర్కొంటూనే కొనసాగుతోంది. దేశంలోని విశాల ఆదివాసీ ప్రాంతాల్లో నిర్వాసిత సమస్యపై చురుగ్గా ప్రజలను కదిలించి పోరాటాలను నిర్వహించాము. వ్యవసాయ విప్లవ సంస్కరణలు అమలుచేయడంలో భాగంగా దండకారణ్యంలో పేద రైతుల భూములు సాగుయోగ్యం చేసి ఉత్పాదకత పెంచడానికి 'భూమి చదును' క్యాంపెయిన్ నిర్వహించాం. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ ప్రజాసమస్యలపై ప్రచార, ఆందోళనలు కొనసాగించాం. వీటన్నింటి ద్వారా ప్రజాపునాది పెంపొందించుకొనే కృషి చేశాం. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కి వ్యతిరేకంగా కొనసాగిన నిరసనోద్యమం ఇందులో ఒక విడదీయరాని భాగమే.

దేశంలోని వివిధ జైళ్లలో వేలాది మంది రాజకీయ ఖైదీలు కొనసాగించిన పోరాటాలకు మద్దతుగా బయట వివిధ రాష్ట్రాలలో ఉద్యమం నిర్మించటానికి కృషి చేశాం. ఈ ఉద్యమానికి పరిమితి ఉన్నా దీనిని సంఘటితపర్చుకుంటూ ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉంది. ప్రజాపునాదిని బలోపేతం చేసుకోవడానికి అనేక రాజకీయ క్యాంపెయిన్స్ నిర్వహించాము. శత్రువు మన ప్రజాపునాదిని ధ్వంసం చేయటానికి నిరంతరం ప్రజలపై కొనసాగించిన దాడులకు నిరసనగా బలమైన ప్రాంతాలలో ప్రజలను కదిలించగలిగాం. శత్రువు విప్లవోద్యమానికి వ్యతిరేకంగా ఎడతెరిపి లేకుండా కొనసాగించిన సైకలాజికల్ ఆపరేషన్స్‌నీ, బూటకపు సంస్కరణలను బహిర్గతపర్చటానికి ప్రయత్నించాం. మొత్తంపై చూసినప్పుడు గత సంవత్సర కాలంలో విప్లవ బహుముఖ కర్తవ్యాలను పరిపూర్తి చేయటానికి ప్రయత్నించి సాధించిన విజయాలకు పరిమితి ఉన్నప్పటికీ ఈ విజయాలకు చాలా ప్రాధాన్యత ఉంది. మన లోపాలను, మన బలహీనతలను అధిగమించాల్సి ఉంది. తద్వారా మన నష్టాలను తగ్గించుకొని, స్వీయ శక్తులను సంఘటితపర్చుకొని, ప్రజాపునాదిని పెంపొందించుకుంటూ సాయుధ ప్రతిఘటనను పెంపొందిస్తూ ప్రజాయుద్ధాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాల్సిన కర్తవ్యాలను మన కేంద్ర కమిటీ యావత్తు పార్టీ ముందుంచుతున్నది. ఇందుకు మన యావత్తు పార్టీ సమైక్యంగా కదలాల్సిన అవసరం ఎంతో ఉంది.

**కామ్రేడ్స్,**

మన పార్టీ 8వ వార్షికోత్సవాలను గ్రామగ్రామాన, వాడవాడలా పార్టీ యూనిట్లు-సభ్యులు ఉన్న ప్రతిచోటా విప్లవోత్సాహం తొణికిసలాడేలా జరపండి. ఈ వార్షికోత్సవాల గురించి సృజనాత్మక పద్ధతుల్లో ప్రచార కేంపెయిన్లు, సభలు, సమావేశాలు నిర్వహించండి. వీటిలో పార్టీ అరుణపతాకాన్ని సమున్నతంగా ఎగురవేయండి. ఇంతవరకు భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో నేలకొరిగిన వేనవేల వీరులకు, గత సంవత్సర కాలంలో తమ విలువైన

ప్రాణాలనర్పించిన 110 మంది అమరులకు నివాళులర్పించండి. ఈ మన అమరుల విప్లవాదర్శాలనూ, వివిధ దేశాల విప్లవోద్యమాలలో అసువులు బాసిన కామ్రేడ్సందరి విప్లవాదర్శాలనూ ఎత్తిపట్టండి. మనం సాధించిన విజయాల నుండి సంపాదించిన విలువైన అనుభవాల నుండి నేర్చుకోండి. ఆచరణక్రమంలో పార్టీ చేసిన పొరపాట్లను సరిదిద్దుకొని వాటిని పునరావృతం కాకుండా చూసుకుంటామని ప్రకటించండి. అద్భుతమైన విప్లవ పరిస్థితి గురించీ, సాధించాల్సిన ఉద్యమ కర్తవ్యాల గురించీ స్పష్టీకరించండి. భారత విప్లవోద్యమం గతంలోనూ, గత సంవత్సరకాలంలోనూ సాధించిన విజయాలను, నూతన అనుభవాలను యావత్తు పార్టీ, పి.ఎల్.జి.ఎ., ప్రజా నిర్మాణాలు, ప్రజల్లోకి తీసుకెళ్లండి. దేశభవితను తమ చేతుల్లోకి తీసుకోవడానికి యువతీయువకులు పెద్దెత్తున పార్టీలో చేరి క్రియాశీల భూమిక నిర్వహించాలని ఆహ్వానించండి. ప్రజాస్వామిక, కమ్యూనిస్టు సంస్కృతినీ, విలువలనూ ఆచరించండి. నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం కష్టాలు, కన్నీళ్లు, త్యాగాలు, ఆటంకాలు, మలుపులు-మెలికలు ఎన్ని ఎదురైనా దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో దృఢసంకల్పంతో మునుముందుకే సాగుతామని శపథం చేయండి. అమరుల ఆశయ సాధనకు, విప్లవోద్యమ విజయ సాధనకు పునరంకితమయ్యే ఉత్తేజకరమైన దినంగా పార్టీ స్థాపనాదినాన్ని జరపండి.

## ప్రస్తుత కర్తవ్యాలు

నేటి ప్రపంచ-దేశ ఆర్థిక రాజకీయ పరిస్థితులను, శత్రువు మన ఉద్యమంపై, వివిధ ప్రజాస్వామిక ఉద్యమాలపై కొనసాగిస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ తీవ్రతనీ విస్తృతినీ, ఈ దాడిలో ఒక గెంతు తీసుకురావటానికి పెద్ద సంఖ్యలో సైనిక బలగాలకు మావోయిస్టు కౌంటర్ ఇన్‌సర్జెన్సీలో ప్రత్యేక శిక్షణనిస్తూ రంగంలోకి దింపుతున్న పరిస్థితినీ, గత సంవత్సర కాలంలో ప్రజాయుద్ధంలో మనం సాధించిన విజయాలను, ఆచరణ క్రమంలో జరిగిన లోపాలను, ఉద్యమ బలహీనతలను స్థూలంగా పరిశీలించుకున్నాం. ఇలాంటి పరిస్థితిలో మనం స్వీయ శక్తులను రక్షించుకుంటూ, పెంపొందించుకుంటూ క్రమంగా ఉద్యమ ప్రాంత విస్తృతిలో, గెరిల్లా యుద్ధ తీవ్రతలో, విస్తృతిలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఇలాంటి పరిస్థితులలో మనం పార్టీని శక్తివంతం చేసుకొనే, ఆపరేషన్ గ్రీన్‌హంట్-భారత సైనిక దాడిని తిప్పికొట్టి విఫలం చేసే, ప్రజాపునాదిని పెంపొందించుకొనే తక్షణ కర్తవ్యాలను చేపట్టి, సృజనాత్మకంగా అమలుచేయాల్సిన అవసరం ఉంది. అమరుల కలల సాఫల్యానికీ, మన ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌లో నిర్ణయించుకున్న లక్ష్యాల సాధనకూ మన యావత్తు పార్టీ, పి.ఎల్.జి.ఎ., ప్రజా నిర్మాణాలు సమైక్యంగా నిలిచి విప్లవ దీక్షతో ధైర్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

1. **పార్టీని శత్రుదుర్భేద్యమైన, అత్యంత రహస్యమైన, పటిష్టమైన, సమరశీల, కార్మికవర్గ నాయకత్వ సంస్థగా మలచుకోవాలి :** నేడు భారత విప్లవోద్యమంలో మన పార్టీ సంక్లిష్టమైన సమస్యలను ఎదుర్కొంటున్నది. ఈ సమస్యలను సరిగా పరిష్కరించి విప్లవోద్యమాన్ని విజయవంతంగా పురోగమింపజేయటానికి పార్టీ సైద్ధాంతిక, రాజకీయ,

నిర్మాణపర సంఘటితీకరణ అత్యంత కీలకమైన కర్తవ్యంగా ఉంటుంది. పార్టీ తనను తాను శక్తివంతం చేసుకోవడంతో పాటు పి.ఎల్.జి.ఎ.ను శక్తివంతం చేయాలి; ప్రజల్ని వివిధ నిర్మాణాలలో సుసంఘటితం చేయాలి. పార్టీ సమర్ధవంతమైన నాయకత్వ సంస్థగా అభివృద్ధి కావడానికి సడలని దీక్షతో నిరంతర సైద్ధాంతిక-రాజకీయ అధ్యయనం-శిక్షణ కృషిలో, నిర్మాణ పనిలో నిమగ్నం కావాల్సిన అవసరం ఎంతో ఉంది. పార్టీలో తగినంత శిక్షణ లేకపోవడం వల్ల పార్టీ విధానాలను అమలుచేయడం, విప్లవ కర్తవ్యాలు నిర్వహించడం, క్రమశిక్షణను అమలు జరపడం, శత్రుదాడి స్వభావాన్ని అర్థం చేసుకోవడం, పరిస్థితులలో కలిగే మార్పులను విశ్లేషించుకొని ఎత్తుగడలు రూపొందించుకోవడం తదితర విషయాలలో చాలా లోపాలు జరుగుతున్నాయి. దీనివల్ల పార్టీ స్థాయి తగినంత పెరగడం లేదు. పార్టీ ఉన్నత స్థాయి నాయకత్వంతో పాటు వివిధ స్థాయిల్లో నష్టాలు పొందిన నేటి పరిస్థితులలో నూతన నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకోవడానికీ, నూతన శక్తులను పార్టీలోకి తీసుకురావటానికీ మన అధ్యయనం-శిక్షణను చాలా పట్టుదలతో మరింత ప్రణాళికాబద్ధంగా కొనసాగించాలి.

మంచి నిర్మాణం లేకుండా మంచి పని విధానాన్ని అమలుచేయలేం, ప్రజా ఉద్యమాన్ని అభివృద్ధి చేయలేం, పార్టీ విధానాలను అమలుచేయలేం. మన పార్టీ నిర్మాణం పటిష్టంగా లేకపోతే విప్లవ పరిస్థితులను అందుకొనే విధంగా ప్రజారాశులను కార్యాచరణలో కదిలించలేము, అభివృద్ధిని సాధించలేం. ఉద్యమానికి అనుకూలమైన అవకాశాలను కూడా పోగొట్టుకుంటాం. ఇది మనం ఎదుర్కొంటున్న ముఖ్యమైన నిర్మాణపర సమస్యలలో ఒకటి. చిన్న పార్టీ పెద్ద పార్టీగా మారాలంటే ఉద్యమంలో ప్రజలను రాజకీయంగా భాగస్వాములను చేయాలి. యువతీయువకులతో కూడిన చక్కని నిర్మాణం ఉన్నప్పుడే పార్టీ బలంగా ఉంటుంది. క్రమశిక్షణా లోపం, నిర్మాణ పనిలో ఖచ్చితత్వలేమి, ఆలస్యంగా కదలడం వల్ల ఏ పనినైనా సఫలం చేయడం కష్టం. పార్టీలో బాధ్యతాయుత కామ్రేడ్ల సంఖ్యను, చురుకైన సభ్యుల సంఖ్యను పెంచుకోవాలి. నేటి పరిస్థితిలో మనం సంఖ్య కంటే పార్టీ క్వాలిటీని పెంచడానికి మొదటి ప్రాధాన్యతనివ్వాలి. ఇలాంటివారి నుండే నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకోవడానికీ, స్పెషలైజేషన్‌కూ కామ్రేడ్స్‌ని ఎంపిక చేసుకోవాలి. పార్టీ విధానాలను అమలుచేయడంలో యావత్తు కామ్రేడ్స్ కార్యాచరణలో తప్పనిసరిగా సమిష్టితత్వం ప్రతిబింబించాలి. పాత, కొత్త కేడర్ల మధ్య ఐక్యత పెంపొందించాలి. నాయకత్వానికీ-కేడర్లకూ, పార్టీకీ-ప్రజలకూ మధ్య సంబంధాలలో ఏర్పడిన గ్యాప్‌ను పూడ్చుకొని సజీవ సంబంధాలను పెంపొందిస్తూ పార్టీ ఐక్యతను పటిష్టం చేయాలి. పార్టీలో ప్రజాస్వామికాన్ని పెంపొందిస్తూ, కేంద్రీకృత ప్రజాస్వామికాన్ని ఖచ్చితంగా అమలుజరపడంతో పాటు మావో చెప్పిన మూడు అంశాల పనిశైలినీ, ప్రజల నుండి ప్రజల వద్దకు అనే ప్రజాపంథానీ అమలుచేయాలి. నాయకత్వం వివిధ స్థాయిల్లో కేడర్ల పనిని తనిఖీ చేసి వారి కార్యాచరణలోని లోపాలను సరిదిద్ది వారు అభివృద్ధి కావడానికి తోడ్పడాలి. పార్టీ ప్రజాసంఘాలలో తన ప్రభావాన్ని పెంపొందించుకుంటూ వాటిలో పార్టీ నిర్మాణాల్ని పెంపొందిస్తూ, పార్టీ

నాయకత్వంలో అవి విశాల ప్రజలను సమీకరించగలిగేలా తోడ్పడాలి.

శత్రుదాడి నుండి స్వీయశక్తులను రక్షించుకోవటానికి పార్టీ భద్రతను పటిష్టం చేయాలి. పార్టీని ప్రత్యేకంగా నాయకత్వాన్ని నిర్మూలించటానికి అమెరికా సామ్రాజ్యవాదుల ఇంటెలిజెన్స్ ఏజెన్సీల పూర్తి సహాయసహకారాలతో దేశ పోలీసు, పారా మిలటరీ, మిలటరీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు చాలా తీవ్రంగా కేంద్రీకరించి దాడి కొనసాగిస్తున్న పరిస్థితుల్లో మన స్వీయశక్తులను, ప్రత్యేకంగా నాయకత్వాన్ని పరిరక్షించుకోవడమనేది విప్లవ విజయానికి ఒక షరతుగానే ఉంటుంది. అందువల్ల పార్టీ రహస్య నియమాలను, పద్ధతుల్ని ఖచ్చితంగా అమలు చేయాలి. రహస్యం పాటించని పార్టీ శత్రువుకు వ్యతిరేకంగా కొనసాగించే పోరాటంలో అతి తేలికగా ఓడిపోతుంది. నష్టాలను గణనీయంగా నివారించి పార్టీ నాయకత్వంతో పాటు స్వీయశక్తుల్ని కాపాడుకోలేకపోతే విప్లవ విజయం సాధ్యం కాదు. నష్టాలను నివారించుకోవాలంటే, ప్రజాయుద్ధాన్ని సరైన ఎత్తుగడలతో సమర్థవంతంగా నడపాలంటే మనం తప్పనిసరిగా శత్రువు అమలు చేస్తున్న ఎల్.ఐ.సి. వ్యూహం-ఎత్తుగడలను అధ్యయనం చేయాలి. వాటిని ఎదుర్కోవడానికి దీర్ఘకాలిక ప్రజాయుద్ధ వ్యూహం-ఎత్తుగడలను మారే పరిస్థితులకు అనుగుణంగా అమలుచేయాలి. అన్ని రంగాల్లో మన పనిని కొనసాగించే విషయంలో రహస్యాన్ని పాటించడానికి సంబంధించిన మన అవగాహనను నిరంతరం పెంపొందించుకోవాలి. పార్టీ అండర్‌గ్రౌండ్ (యు.జి.) విధానాన్ని, పనిని, పద్ధతులను మెరుగుపర్చుకోవాలి. అన్ని రంగాల్లో పనిచేస్తున్న అన్ని స్థాయిల పార్టీ కేడర్లు, సభ్యులు యు.జి. నియమాలను, పద్ధతులను ఖచ్చితంగా పాటించాలి. పార్టీలోకి శత్రు చొరబాటును తప్పనిసరిగా అరికట్టాలి. గూఢచారులు, ఇన్‌ఫార్మర్లు, కోవర్టుల పట్ల పార్టీలో అప్రమత్తత పెంపొందించాలి. ఈ విషయంలో యథాలాప ధోరణులు, సెక్టేరియన్ పద్ధతులు పార్టీకి తీవ్రమైన నష్టం కలిగిస్తాయి. వీరి పట్ల నిర్లక్ష్యం, నిరాసక్తత, యథాలాపత, ప్రేక్షక పాత్ర అత్యంత హాని కలిగిస్తాయి. పార్టీలోకి వీరి చొరబాటును అరికట్టడానికీ, వీరిని మన శక్తుల నుండి బయటికి గెంటివేయటానికి పార్టీ, పి.ఎల్.జి.ఏ., ప్రజానిర్మాణాలు, ప్రజల్లో బోధనను మెరుగుపర్చాలి.

కఠిన పరిస్థితులను ఎదుర్కొనే విధంగా విప్లవాశయం పట్ల చెదరని విశ్వాసంతో పార్టీ, పి.ఎల్.జి.ఏ. విప్లవోద్యమానికి నాయకత్వం వహించాలి. విప్లవోద్యమాన్ని పురోగమింపజేయడానికి సమర్థవంతమైన కమాండ్‌గా పనిచేస్తూ శత్రువును ఎదుర్కొంటూ కంట్రోల్ చేయడం అనేది నాయకత్వానికి అత్యంత ఆవశ్యకమైన కర్తవ్యంగా ఉంటుంది. కఠిన పరిస్థితులలో రాటుదేలి సమర్థవంతంగా పని చేయగలగడమనేది పార్టీ నాయకత్వానికి గీటురాయిగా ఉంటుంది. "మీకు మీ విధులపై అంకిత భావం, కఠోర క్రమశిక్షణ, మిన్ను విరిగి మీద పడినా నిశ్చలంగా, నిబ్బరంగా ఉండగలగడమే కాదు-మెరుపువేగంతో స్పందించే చురుకుదనం, సామర్థ్యం అవసరం." - మావో

కామ్రేడ్ కిషన్‌జీని పాలకవర్గాలు క్రూరంగా హత్యగావించి పార్టీకి ఎనలేని నష్టం కలిగించిన నేపథ్యంలో ఈ నష్టాన్ని పూడ్చుకోవడానికి అసంఖ్యాకమైన కామ్రేడ్స్‌ని ఆయన వారసులుగా తయారు చేసుకోవడానికి మనం తీవ్రంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఆ గొప్ప అమరుని స్మృతిలో ఈ సంవత్సరం పార్టీ స్థాపనాదినాన్ని పురస్కరించుకొని ఒక ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టి ఇందుకనుగుణంగా పార్టీని

సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా సంఘటితపరచుకోవడానికీ, నూతన సభ్యులను పార్టీలో చేర్చుకోవడానికీ తగిన కార్యక్రమం రూపొందించుకోవాలనీ, ఈ క్యాంపెయిన్‌ని ప్రభావవంతంగా నడపాలనీ అన్ని రీజినల్ బ్యూరోలకు, రాష్ట్ర కమిటీలకు కేంద్రకమిటీ పిలుపునిస్తున్నది.

దేశంలో విప్లవ భౌతిక పరిస్థితులు దినదినం అనుకూలంగా మారుతుండడం వల్లా, మన పార్టీ నాయకత్వాన ప్రజాయుద్ధం కొనసాగుతూ ప్రజలను విస్తృతంగా ప్రభావితం చేస్తుండడం వల్లా అనేక మంది కార్మికులు, కర్షకులు, విద్యార్థి, మేధావులు, యువజనులు వివిధ పీడిత సామాజిక సెక్షన్ల యాక్టివిస్టులు పార్టీలో చేరటానికి ముందుకు వస్తారు. విశాలమైన మన దేశంలో పార్టీ లక్షలాది-కోట్లాది మంది ప్రజల్లోకి మరింతగా చొచ్చుకొని పోతూ వారిని రాజకీయంగా సమీకరించడం ద్వారా, వారికి మరింత సన్నిహితం అవుతూ సంఘటితపరచడం ద్వారా పార్టీ సభ్యులను అసంఖ్యాకంగా పెంచుకోవటానికి కృషి చేయాలి. ఎప్పటికప్పుడు పార్టీని విస్తృతం చేయటానికి తగిన అర్హతలు గల మరింతమందిని భర్తీ చేసుకోవాలి. పార్టీ ప్రజల్లోకి చొచ్చుకొనిపోతూ వారికి మరింతగా సన్నిహితం అవుతూ సమర్థవంతంగా నాయకత్వం వహించకపోతే, ఎప్పటికప్పుడు పార్టీని సంఘటితపరుస్తూ నూతన శక్తులను చేర్చుకొని విస్తరించకపోతే విప్లవ ప్రతీఘాతుక శక్తులు చేసే దాడులను ఎదుర్కోలేము, ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోలేము.

పార్టీ రాజకీయ పంథాను కాపాడుకోవడానికీ, పార్టీ పాలసీలను సృజనాత్మకంగా అమలు చేయటానికీ, పనిశైలిని, పోరాట శైలిని మెరుగుపర్చుకోవటానికీ, పార్టీలో, ఉద్యమంలో తలెత్తే చెడు ధోరణుల్ని తొలగించుకోవటానికీ తోడ్పడే విధంగా నియమబద్ధంగా పార్టీ కమిటీలలో విమర్శ, ఆత్మవిమర్శ కొనసాగించి పార్టీని శక్తివంతం చేసుకోవాలి. తప్పులను, లోపాలను సరిదిద్దుకోవడానికీ, బలహీనతలు తొలగించుకోవడానికీ మనం కొనసాగించిన రెక్టిఫికేషన్ క్యాంపెయిన్లు పాక్షికంగానే సఫలం అయినాయి. అందువల్ల మనం ఆచరణలో పొరపాట్లు చేసి నష్టాలు కూడా పొందాం. విమర్శ-ఆత్మవిమర్శనూ, రెక్టిఫికేషన్ క్యాంపెయిన్‌నూ ప్రభావవంతంగా నిర్వహించి తగిన ఫలితాలు సాధించటానికి ప్రత్యేక కృషి చేయాల్సిన అవసరం ఉంది.

2. **విప్లవోద్యమంపై ఫాసిస్టు పాలకవర్గాలు కొనసాగిస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌నీ-సైనికదాడినీ దృఢసంకల్పంతో ధైర్యంగా తిప్పికొట్టాలి :** నూతన ప్రజాస్వామిక విప్లవాల రాజకీయ పంథాకూ, దీర్ఘకాలిక ప్రజాయుద్ధానికీ, పాలసీలకూ, వ్యూహం-ఎత్తుగడలకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులచే రూపొందించబడిన విప్లవ ప్రతీఘాతుక ఎల్.ఐ.సి. విధానాన్నీ, దాని వ్యూహం-ఎత్తుగడలనూ, దాని అత్యంత మోసపూరిత స్వభావాన్నీ, భారత పాలకవర్గాలు దాన్ని మనకు వ్యతిరేకంగా అమలుచేస్తున్న తీరునూ లోతుగా అధ్యయనం చేయాలి. ఈ ప్రతీఘాతుక విధానాన్ననుసరించి శత్రువు ప్రజాయుద్ధాన్ని అణచివేయటానికి కొనసాగిస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌నీ, సైన్యం మోహరింపు వల్ల యుద్ధ స్వభావంలో కలిగే మార్పుని నిర్దిష్టంగా అధ్యయనం చేయాలి. ప్రజాయుద్ధాన్ని అణచివేయటానికి శత్రువు వ్యూహాత్మక దృష్టితో నిర్మించిన ప్రత్యేక బలగాలను, ఇంటెల్ యంత్రాంగాన్నీ, కార్పెట్ సెక్యూరిటీనీ, అన్ని రంగాలను కేంద్రీకరించి దాడిచేసే పద్ధతినీ, ప్రజలను

తప్పుదారి పట్టించడానికి అమలుచేస్తున్న బూటకపు సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలనూ, సైకలాజికల్ ఆపరేషన్స్‌నూ, ప్రజల్లో-పార్టీలో చీలికలు సృష్టించటానికి చేసే దుష్ట పన్నాగాలను మనం అర్థం చేసుకోవాలి.

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కూ, సైన్యం మోహరింపుకూ వ్యతిరేకంగా మన యావత్తు పార్టీనీ, పి.ఎల్.జి.ఏ.నీ, ప్రజా నిర్మాణాల్నీ, ప్రజల్నీ రాజకీయంగా సమీకరించి ప్రతిఘటనను పెంపొందించటానికి మన ప్రతిఘటనా యుద్ధంలో మొదటి ప్రాధాన్యత నివ్వాలి. యుద్ధం యొక్క డైనమిజాన్ని అర్థం చేసుకొని పార్టీ, పి.ఎల్.జి.ఏ. ప్రతిఘటనా యుద్ధాన్ని అత్యంత ధైర్య సాహసాలతో కొనసాగించాలి. శత్రు బలహీనతలపై గట్టి దెబ్బలు కొడుతూ చొరవను నిలబెట్టుకోవాలి. శత్రువు గ్రామీణ ప్రాంతంలో నిర్మిస్తున్న ఇంటెల్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడానికీ, వాడు కొనసాగిస్తున్న కోవర్టు ఆపరేషన్లను, హత్యాకాండను, అత్యాచారాలను, విధ్వంసాలను నిరోధించడానికీ, పుకార్లను బహిర్గతపర్చడానికి ప్రజలను క్రియాశీలంగా కదిలించాలి.

వివిధ స్థాయిల్లో గల సైనిక కమాండ్లను, కమిషన్లను సంఘటితం చేసుకొని సమర్థవంతమైనవిగా అభివృద్ధి చేసుకోవాలి. శత్రు ప్రత్యేక బలగాలను, సైన్యాన్ని ఎదుర్కొనే ఎత్తుగడలపై పి.ఎల్.జి.ఏ.ను సుశిక్షితం చేయాలి. పి.ఎల్.జి.ఏ.ను శక్తివంతం చేయడానికి దానిలో క్రమశిక్షణను పెంపొందించాలి. గట్టి క్రమశిక్షణ లేని సైన్యం శత్రువుతో కొనసాగించే యుద్ధంలో విజయం సాధించలేదు. పి.ఎల్.జి.ఏ.లో చొరవలేమి, నిష్క్రియాపరత్వాన్ని తొలగించడానికి శిక్షణనందించడంతో పాటు నాయకత్వం నిరంతరం దానిని చురుగ్గా కదిలించేలా కార్యాచరణను రూపొందించి ప్రత్యక్షంగా నేతృత్వాన్ని అందించాలి. ప్రజామిలీషియాను విస్తృతంగా క్రియాశీలంగా కదిలిస్తూ, దీని నుండి అర్హులైన వారిని పి.ఎల్.జి.ఏ.లోకి భర్తీ చేసుకొని ప్రజాసైన్యాన్ని విస్తృతపరచాలి- ఉన్నత ఫార్మేషన్స్ నిర్మించాలి. పి.ఎల్.జి.ఏ. సమర్థవంతంగా పోరాడడానికి నిర్మించుకున్న అనుబంధ విభాగాలను పటిష్టం చేసుకోవడానికి కృషి చేయాలి. పి.ఎల్.జి.ఏ.లో తలెత్తుతున్న కార్మికవర్గేతర ధోరణులను సరిదిద్ది దాని పోరాటశక్తిని పెంపొందించడానికి తోడ్పడేలా సమావేశాలలో నియమబద్ధంగా విమర్శ-ఆత్మవిమర్శను కొనసాగించడంతో పాటు రెక్టిఫికేషన్ క్యాంపెయిన్లను ప్రభావవంతంగా నిర్వహించాలి.

మన శక్తులను, ఉద్యమాన్ని కాపాడుకొని నూతన విజయాలు సాధించడానికీ, సైన్యాన్ని ఎదురుదెబ్బ తీయడానికీ ఎత్తుగడల ఎదురుదాడులు, ఎత్తుగడల ఎదురుదాడుల క్యాంపెయిన్లు నిర్వహించాలి. ప్రతీ ప్రతిదాడికీ, ప్రతిదాడి క్యాంపెయిన్లకూ ముందస్తు తగిన సన్నాహాలు చేసుకోవడంతో పాటు సరైన ప్లానింగ్ చేసి ఆపరేషన్లు నిర్వహించడం ద్వారానే గెరిల్లా యుద్ధంలో విజయాలను చేజిక్కించుకోగలుగుతాం. పి.ఎల్.జి.ఏ. దైనందిన జీవితంలోనూ, యుద్ధచర్యలలోనూ గెరిల్లా కార్యాచరణ సూత్రాలను అమలుచేయాలి. వివిధ గెరిల్లా ప్రాంతాల మధ్య గల అంతః సంబంధాన్ని గమనంలో ఉంచుకొని కమాండ్, $C^4I$లో సాపేక్షికంగా కంట్రోలు సాధించటానికి కృషి చేయాలి.

పి.ఎల్.జి.ఏ. ప్రజలతో అత్యంత సన్నిహిత సంబంధాలను కొనసాగించాలి. ప్రజలను

రాజకీయంగా సమీకరించి సంఘటితపరచడం, ప్రజాయుద్ధంలో వారి క్రియాశీల పాత్ర పెంపొందించడం, వారికి విప్లవ ప్రజా కమిటీల నిర్మాణంలో, ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో తోడ్పడడం, అభివృద్ధి, విద్య, వైద్య, సంక్షేమ సేవలు అందించడం, ప్రజాస్వామిక సోషలిస్టు సంస్కృతిని పెంపొందించడం చేయాలి. పార్టీ, పి.ఎల్.జి.ఏ. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కి వ్యతిరేకంగా ప్రజలను రాజకీయంగా ఎంత విస్తృతంగా-క్రియాశీలంగా సమీకరించగలుగుతాయనే దానిపై ఆధారపడీ, సాయుధ ప్రతిఘటనా యుద్ధాన్ని ఎంత సమర్థవంతంగా నిర్వహిస్తాయనే దానిపై ఆధారపడీ, ఈ యుద్ధక్రమంలో స్వీయ శక్తులను రక్షించుకుంటూ, నూతన అనుభవాలను సంపాదిస్తూ, నూతన శక్తులను పెంపొందించగలుగుతామనే దానిపై ఆధారపడే ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కూ, భారత సైన్యానికీ వ్యతిరేకంగా మనం కొనసాగిస్తోన్న ప్రతిఘటనా యుద్ధంలో విజయం సాధించడం అనేది ఉంటుంది.

3. **అద్భుత భౌతిక పరిస్థితిని వినియోగించుకొని విప్లవోద్యమంలో విశాల ప్రజారాశులను విస్తృతంగా కదిలించాలి :** నేడు దేశంలోనూ, ప్రపంచంలోనూ అద్భుతమైన విప్లవ భౌతిక పరిస్థితి నెలకొని ఉంది. ఇది దినదినం మరింత ప్రజానుకూలంగా పెంపొందుతున్నది. ప్రపంచంలో విప్లవ స్వీయశక్తులు క్రమంగా పెంపొందించుకున్నప్పటికీ, అవి ఇంకా బలహీనంగానే ఉన్నాయి. పార్టీ ఐక్యతా కాంగ్రెస్ నాటికి మన దేశంలో సాపేక్షికంగా బలంగా ఉండిన పార్టీ, ప్రజాపునాది క్రమంగా కొన్ని ప్రాంతాల్లో బలహీనపడుతూ 2010 చివరి నాటికి చాలా ప్రాంతాల్లో గణనీయంగానే బలహీనపడిందని 2010 నవంబర్‌లో జరిగిన మూడవ సమావేశంలో సి.సి. అంచనా వేసింది. అందువల్ల ఆపరేషన్ గ్రీన్‌హంట్‌నూ-సైన్యాన్నీ ఎదిరించి ఓడించి ప్రజాయుద్ధాన్ని విజయవంతంగా ముందుకు తీసుకుపోవడానికైనా, విప్లవ ప్రజా కమిటీలను నిర్మించి ప్రజారాజకీయాధికారాన్ని నెరపుతూ విముక్తి ప్రాంతాలు స్థాపించడానికైనా, పార్టీని పటిష్టం చేయడానికైనా ప్రజాపునాదిని బలోపేతం, విస్తృతం చేసుకోవడం అనేది మౌలికమైన కర్తవ్యంగా ఉంటుందని కూడా ఆ సమావేశంలో సి.సి. నిర్ణయించింది.

ప్రజాయుద్ధంలో ప్రజల క్రియాశీల పాత్రను పెంపొందించడానికి వారు మన సాధారణ రాజకీయ పంథాను లోతుగా అర్థం చేసుకునేలాగా పార్టీ రాజకీయ కృషిని పెంపొందించాలి. ప్రజలను దైనందిన సమస్యలపైననే గాకుండా రాజకీయ ఉద్యమాలలో విస్తృతంగా, సమరశీలంగా కదిలించాలి. నేటి నిర్దిష్ట పరిస్థితులలో నిర్వాసితులుగా చేయబడడం, రాజ్య నిర్బంధం, రైతుకూలీల, కార్మికుల సమస్యలపై, విద్యార్థి యువజనుల సమస్యలపై, వివిధ పీడిత సామాజిక సెక్షన్ల సమస్యలపై, పౌరహక్కులు, అధిక ధరలు, అవినీతి తదితర సమస్యలపై ప్రజలను విస్తృతంగా కదిలించాలి. వీటిలో సమీకరించబడే ప్రజలను సైద్ధాంతికంగా, రాజకీయంగా విద్యావంతుల్ని చేస్తూ వివిధ ప్రజాసంఘాలలో, ఐక్యసంఘటనా వేదికలలో సంఘటితం చేయాలి.

వ్యూహాత్మక ప్రాంతాలన్నింటా విముక్తి ప్రాంతాల స్థాపనా లక్ష్యంతో ప్రజాపునాది పెంపొందించుకుంటూ విప్లవ ప్రజా కమిటీలను నిర్మించి సంఘటితపరచి విస్తరిస్తూ

గెరిల్లా బేస్‌లుగా అభివృద్ధి చేయాలి. గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేసే, విప్లవ ప్రజా కమిటీలను నిర్మించి విస్తరింపజేసే, వీటికి తోడ్పడే రాజకీయ లక్ష్యం లేని ప్రజా సమీకరణ సంస్కరణవాదమే అవుతుంది. ప్రధాన శత్రువుకు వ్యతిరేకంగా విశాల ప్రజలను సమైక్యపర్చడంలో, తగిన ఐక్యసంఘటన నిర్మాణాలను ఏర్పర్చి వాటిపై పార్టీ నాయకత్వాన్ని నెలకొల్పుతూ సంఘటితపర్చడంలో జరుగుతున్న లోపాలను సరిదిద్దుకోవాలి. పార్టీ ప్రజలతో బలంగా సమైక్యం కావడంలో, ప్రజాపంథాను అమలుజరపడంలో వివిధ రూపాల్లో జరుగుతున్న లోపాలను సరిదిద్దుకోవాలి. ప్రజలు విప్లవోద్యమానికి దూరం కావడానికి తోడ్పడుతున్న మన సెక్టేరియన్, పెత్తందారీ వైఖరులను విడనాడడంతో పాటు ప్రజా ప్రయోజనాలకు హాని కలిగించే ఎలాంటి తప్పుడు చర్యలకూ పాల్పడరాదు. ఇలాంటి తప్పులను సరిదిద్దుకోవడానికి పార్టీలోనే గాకుండా మన నాయకత్వాన గల ప్రజాసంఘాలలో సైతం విమర్శ-ఆత్మవిమర్శలు కొనసాగించడంతో పాటు రెక్టిఫికేషన్ క్యాంపెయిన్లు నిర్వహించాలి. ప్రజలు విప్లవోద్యమానికి దూరం కావడానికి శత్రువు నిరంతరం ముందుకు తెస్తున్న బూటకపు సంస్కరణల బండారాన్ని బట్టబయలు చేయాలి. వాడు సాగిస్తున్న సైకలాజికల్ ఆపరేషన్స్‌ను బలంగా తిప్పికొట్టాలి. ప్రజల్లో గందరగోళం కలిగించి విప్లవోద్యమానికి దూరం చేసే దుష్టపథకంతో శత్రువు వ్యాపింపజేస్తున్న వివిధ రకాల తప్పుడు సిద్ధాంతాలను ప్రజల్లో సృజనాత్మక పద్ధతుల్లో ఎండగట్టాలి.

చాలా అనుకూలంగా ఉన్న విప్లవ భౌతిక పరిస్థితిని సద్వినియోగం చేసుకొని ప్రజాపునాది బలోపేతం-విస్తృతం చేసుకోవడానికీ, వర్గపోరాటాలలో ప్రజలను సమరశీలంగా, విస్తృతంగా కదిలించి సంఘటితపర్చడానికీ, ప్రజాయుద్ధంలో వారి క్రియాశీల పాత్ర పెంపొందడానికీ, స్వీయ శక్తులు పెంపొందించుకోవడానికీ, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను-సైన్యాన్ని ఎదిరించి ఓడించటానికి గల పరస్పర సంబంధాన్ని లోతుగా అర్థం చేసుకొని ప్రజల మధ్య మన కార్యాచరణను మెరుగుపర్చుకోవాలి. ప్రజాపునాదిని పెంపొందించుకోవడంపై "భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు", "కేంద్ర రాజకీయ నిర్మాణ సమీక్ష" డాక్యుమెంట్లను లోతుగా అధ్యయనం చేయాలి.

**4. వివిధ ప్రాంతాల భౌతిక, స్వీయ పరిస్థితులను బట్టి తగిన ఎత్తుగడలు రూపొందించుకోవాలి:** వివిధ రాష్ట్రాల్లో సామాజిక పరిస్థితుల్లోనూ, స్వీయ పరిస్థితుల్లోనూ (పార్టీ, గెరిల్లా బలగాలు, ప్రజాపునాది, ఉద్యమ ప్రాంత విస్తృతిలో) చాలా తేడాలున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని వివిధ రాష్ట్రాల్లో మన కర్తవ్యాలుండాలి. ఇందుకు అనుగుణంగా మనం చేపట్టే ఎత్తుగడలు-పని పద్ధతులు కూడా ఉండాలి. వీటిని సృజనాత్మకంగా అమలుచేయాలి. ఉద్యమ క్రమంలో, పరిస్థితుల్లో వచ్చే మార్పులను గమనంలో ఉంచుకొని సకాలంలో వీటిలో అవసరమైన మార్పులు చేసుకోవాలి. స్వీయ పరిస్థితి ఎలా ఉన్నా పార్టీ బోల్షివిక్ స్పిరిట్‌తో, రాజకీయంగా చొరవ ప్రదర్శించి పనిచేయడం అనేది అనుకూల భౌతిక పరిస్థితులను సద్వినియోగం చేసుకోవడానికి షరతుగానే ఉంటుంది. స్వీయశక్తుల రక్షణకైనా, వాటిని పెంపొందించుకోవడానికైనా, ప్రజలతో

సన్నిహిత సంబంధాలు పెట్టుకొని ఉద్యమాలు నిర్మిస్తూ ప్రజాపునాది పెంపొందించుకోవడానికైనా, శత్రు బలగాలను ఎదుర్కోవడానికైనా, విముక్తి ప్రాంతాల స్థాపనా లక్ష్యంతో గెరిల్లా బేస్‌లను ఏర్పాటు చేయడానికైనా బోల్షివిక్ స్పిరిట్, విప్లవకర చొరవ అత్యంతావశ్యకం. బోల్షివిక్ స్పిరిట్-విప్లవకర చొరవ లేమి ఉద్యమం నీరుగారిపోవడానికీ, పెటీబూర్జువా ఇంపెచ్యువాసిటీ ఉద్యమం నష్టాలపాలు కావడానికీ దోహదపడతాయి. అందువల్ల అన్ని రాష్ట్రాల్లోనూ, ప్రాంతాల్లోనూ మన పార్టీ కమిటీలు వాస్తవిక భౌతిక, స్వీయ పరిస్థితులను సరిగా అంచనా వేసుకొని కర్తవ్యాలు రూపొందించుకోవాలి. వాటి సాధనకు పార్టీని, ప్రజాసంఘాలను, గెరిల్లా బలగాలను, ప్రజలను క్రియాశీలంగా కదిలించడానికి తగిన పని పద్ధతులు రూపొందించుకొని సృజనాత్మకంగా అమలుచేయాలి. ప్రతి పనినీ ఆరంభం నుంచి చివరి వరకూ కొనసాగించి సఫలం చేయడానికి యావత్తు కార్యాచరణను దృఢసంకల్పంతో చొరవగా కొనసాగించాలి. ఈ విధంగానే అన్ని రాష్ట్రాలలో-ప్రాంతాలలో నేటి ఉద్యమాన్ని విజయవంతంగా మరో అడుగు ముందుకు తీసుకెళ్లగలుగుతాం. ఈ విధంగానే దేశవ్యాప్తంగా ఉన్నత విజయాల సాధనకు కావలసిన పరిస్థితులను సృష్టించుకోగలుగుతాం.

**5. కార్మికవర్గ అంతర్జాతీయతా జెండాను సమున్నతంగా ఎత్తిపట్టాలి :** మన విప్లవం, పార్టీ, పి.ఎల్.జి.ఏ., విప్లవ ప్రజా కమిటీలు, ప్రజాసంఘాలు అన్నీ ప్రపంచ సోషలిస్టు మహావిప్లవంలో, అంతర్జాతీయ విశాల విప్లవకర-ప్రజాస్వామిక నిర్మాణాల మహాసముదాయంలో విడదీయరాని భాగం, డిటాచ్‌మెంట్లు. మన పార్టీ ప్రపంచంలోని అన్ని మార్క్సిస్టు-లెనినిస్టు/మావోయిస్టు పార్టీలతో సోదర సంబంధాలు కొనసాగిస్తూ పరస్పరం వీలైన అన్ని రకాల సహాయ సహకారాలందించుకోవాలి; ప్రపంచ సోషలిస్టు విప్లవానికి ఆటంకంగా ఉన్న అతివాద మితవాద అవకాశవాదాలకూ, ప్రత్యేకంగా రివిజనిజానికీ వ్యతిరేకంగా ఎం.ఎల్.ఎం. వెలుగులో సమైక్యంగా దృఢంగా పోరాడాలి; సామ్రాజ్యవాద దోపిడీ, పీడన, దురాక్రమణలకు వ్యతిరేకంగా విప్లవ, ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులన్నింటినీ సమైక్యం చేసే లక్ష్యంతో అందులో ఒక భాగంగా ముందుపీఠిన నిలబడి పనిచేయాలి. శత్రువు దేశవ్యాపితంగా కొనసాగిస్తున్న ఫాసిస్టు దాడి మధ్య కూడా ఈ అంతర్జాతీయ కర్తవ్యాల నిర్వహణ కోసం మన పార్టీ శాయశక్తులా కృషి చేయాలి. ఇందుకు ప్రతికూలతలు ఎన్ని ఉన్నా క్రమంగా వీటిని అధిగమించడానికి కృషి చేయాలి. మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికీ, ప్రపంచ విప్లవానికి తోడ్పడేందుకూ మన పార్టీ శాయశక్తులా పనిచేస్తుంది. భారత విప్లవోద్యమానికి అండగా వివిధ దేశాల్లోని మావోయిస్టు పార్టీలు, ప్రజాస్వామిక శక్తులు నిలబడడం అనేది ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను, భారత సైనిక దాడిని విఫలం చేసేందుకూ, అంతిమంగా వీటిని ఓడించేందుకు చాలా ఉపయోగపడుతుంది.

కేంద్రకమిటీ

**5-9-2012** సి.పి.ఐ.(మావోయిస్టు)

# పార్టీ 9వ వార్షికోత్సవాలకు విప్లవ జేజేలు!

**విప్లవ విజయం వైపు పురోగమించడానికి ప్రజాసైన్యం, ఐక్యసంఘటన అనే రెండు మౌలిక ఆయుధాలను సమర్థవంతంగా వినియోగించే విధంగా పార్టీని బోల్షివీకరించుదాం!**

**వర్గపంథాకూ, ప్రజాపంథాకూ దృఢంగా అంటిపెట్టుకోవడం ద్వారా మన ప్రజాపునాదిని బలోపేతం, విస్తృతం చేద్దాం!**

**'విప్లవ పార్టీ లేకుండా విప్లవం లేదు' 'ప్రజలే చరిత్ర నిర్మాతలు' అనే రెండు మార్క్సిస్టు సూత్రాలను లోతుగా గ్రహిద్దాం!**

*పార్టీ తొమ్మిదవ వార్షికోత్సవాల్ని 2013 సెప్టెంబర్ 21 నుండి 27 వరకూ విప్లవోత్సాహంతో జరుపుకోవాలని పార్టీ కార్యకర్తలందరికీ సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ పిలుపు*

**కేంద్రకమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

## విప్లవ విజయం వైపు పురోగమించడానికి ప్రజాసైన్యం, ఐక్యసంఘటన అనే రెండు మౌలిక ఆయుధాలను సమర్థవంతంగా వినియోగించే విధంగా పార్టీని బోల్షివీకరించుదాం!
## వర్గపంథాకూ, ప్రజాపంథాకూ దృఢంగా అంటిపెట్టుకోవడం ద్వారా మన ప్రజాపునాదిని బలోపేతం, విస్తృతం చేద్దాం!
## 'విప్లవ పార్టీ లేకుండా విప్లవం లేదు' 'ప్రజలే చరిత్ర నిర్మాతలు' అనే రెండు మార్క్సిస్టు సూత్రాలను లోతుగా గ్రహిద్దాం!

*పార్టీ తొమ్మిదవ వార్షికోత్సవాల్ని 2013 సెప్టెంబర్ 21 నుండి 27 వరకూ విప్లవోత్సాహంతో జరుపుకోవాలని పార్టీ కార్యకర్తలందరికీ సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ పిలుపు*

***ప్రియమైన కామ్రేడ్స్,***

మనం మన మహత్తర నూతన పార్టీ తొమ్మిదవ వార్షికోత్సవాలను ఈ సంవత్సరం సెప్టెంబర్ 21న జరుపుకోబోతున్నాం. ఈ సంవత్సరం ఈ వార్షికోత్సవాలు మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. ఎందుకంటే మన నూతన పార్టీ పదవ మహత్తర వార్షికోత్సవాలను జరుపుకోవడానికి సన్నాహాలు కూడా దీనితో మొదలవుతాయి. 2004 సెప్టెంబర్ 21 భారతదేశంలోని నూతన ప్రజాస్వామిక విప్లవానికే కాక ప్రపంచ సోషలిస్టు విప్లవానికి కూడా ఎంతో ప్రాముఖ్యత గల దినం. ఎందుకంటే భారతదేశంలోని విప్లవోద్యమానికి మార్గదర్శకత్వం వహించడానికి ఏకైక కేంద్రాన్ని ఆ రోజు ఆవిష్కరించింది. మూడు దశాబ్దాలకు పైగా ఆ క్రమంలో అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ మనం దీన్ని సాధించాం.

ఈ సందర్భంగా మన మహత్తర పార్టీ నిర్మాతలు, భారత విప్లవ గొప్ప నాయకులు, మన ప్రియతమ కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హయ్ చటర్జీలకు, నక్సల్బరీ వారసత్వాన్ని కొనసాగిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలో తమ అసువులు బాసిన వేలాది వీరయోధులకు తల వంచి గొప్ప వినమ్రతతో నివాళులు అర్పిద్దాం. మన పార్టీ ఎనిమిదవ వార్షికోత్సవాల తర్వాత, ఈ సంవత్సరకాలం అంతా 'ఆపరేషన్ గ్రీన్‌హంట్ - రెండవ దశ' (ప్రజలపై యుద్ధం) మన ఉద్యమ ప్రాంతాలంతటా ఆగకుండా కొనసాగుతూ ఎంతో వినాశనాన్ని కలిగించింది. భారత పాలకవర్గాల ఈ దాడిని తిప్పికొడుతూ, ప్రజలను రక్షిస్తూ ఈ ఏడాదికాలంలో దాదాపు 150 మంది మన ప్రియతమ కామ్రేడ్స్ తమ ప్రాణాలను అర్పించారు. ప్రజాయుద్ధాన్ని పరిరక్షించి దాన్ని ముందుకు తీసుకుపోవడానికి వారు ధైర్యంగా, గొప్ప సాహసంతో, నిస్వార్థంగా తమ ప్రాణాలను పణంగా పెట్టారు. వారిలో ఎక్కువమంది సాయుధ బలగాల, రాజ్య ప్రాయోజిత నల్లదండు ముఠాల దాడులను భీకరంగా ఎదిరించి

పోరాడుతూ తమ అసువులు బాసారు. అమరుల్లో కామ్రేడ్స్ గంటి ప్రసాదం, మహిత, జువ్వాజి వెంకటసుబ్బయ్య, ఆలూరి భుజంగరావుగారలు మన పార్టీ సీనియర్ కామ్రేడ్స్. గంటి ప్రసాదంగారిది రాజ్య ప్రాయోజిత హత్య కాగా, మిగతా ముగ్గురు కామ్రేడ్స్ వృద్ధాప్యం, ఇతర సమస్యల రీత్యా మరణించారు. ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ సుధాకర్ శత్రు ప్రత్యేక బలగాలతో జరిగిన భీకర సంగ్రామంలో నేలకొరిగాడు. బీహార్-ఝార్ఖండ్-ఉత్తర ఛత్తీస్‌గఢ్ రీజనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ ప్రశాంత్ కోబ్రా-టిపిసి సంయుక్త దాడిలో మరణించాడు. దండకారణ్యంలో టెక్నికల్ డిపార్ట్‌మెంట్ సీనియర్ కామ్రేడ్ (జిల్లా కమిటీ స్థాయి) కామ్రేడ్ అమన్ అనారోగ్యంతో మరణించగా, మరో డివిజన్ కమిటీ సభ్యురాలు ఇందిర పాముకాటుతో మరణించారు. డివిసి/జెడ్‌సి స్థాయి కామ్రేడ్స్ - బీహార్‌కు చెందిన ధర్మేంద్ర యాదవ్, ప్రఫుల్ల యాదవ్, మిథిలేష్ యాదవ్ లు, దండకారణ్యానికి చెందిన శంకర్, ఉత్తర తెలంగాణకు చెందిన పుష్ప శత్రు దాడులను తిప్పికొడుతూ మరణించారు. మన ఉద్యమ ప్రాంతాలన్నిటా పదుల సంఖ్యలో విప్లవ ప్రజానీకం, విప్లవ ప్రజాసంఘాల, ఆర్పీసీల, ప్రజామిలీషియా సభ్యులు డికెలోని ఎడెన్‌మెట్టలోవలే శత్రుబలగాల విచక్షణారహిత కాల్పుల్లోనో లేదా బూటకపు ఎన్‌కౌంటర్లలోనో ఊచకోతకు గురయ్యారు. ప్రజాయుద్ధాన్ని పరిరక్షిస్తూ, విస్తరిస్తూ, తీవ్రతరం చేయడం ద్వారా ఈ నిస్వార్థ అమరుల ఆశయాలను ముందుకు తీసుకుపోతామనీ, వారి కలలను సాకారం చేస్తామనీ శపథం చేద్దాం. మన గొప్ప అమరుల ఆదర్శాలను వంటబట్టించుకుని వాటిని అంతటా వెదజల్లుదాం. తద్వారా మానవజాతి విముక్తి కొరకు వారి బాటలో పయనించేలా ప్రజలను ఉత్తేజపరుద్దాం.

ఈ ఏడాదికాలంలో ఫిలిప్పీన్స్, టర్కీ, బంగ్లాదేశ్ మొదలైన దేశాల్లో నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలో అనేకమంది సాహసయోధులు శత్రు బలగాలతో పోరాడుతూ నేలకొరిగారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో వందలాది ఆందోళనకారులూ, ప్రజలూ, సామ్రాజ్యవాద దేశాల్లోని కార్మికులూ వర్గదోపిడీ నుండీ, అణచివేత నుండీ విముక్తి కోసం, జాతి విముక్తి కోసం, ప్రజాస్వామ్యం కోసం జరిగిన పోరాటాల్లో ప్రాణాలు కోల్పోయారు. మన కేంద్రకమిటీ మన పార్టీ తొమ్మిదవ వార్షికోత్సవాల సందర్భంగా ఈ అమరులందరికీ వినమ్రంగా నివాళులు అర్పిస్తోంది. మన లక్ష్యాలను సాధించడానికి దృఢంగా పోరాడడం ద్వారా ఈ ప్రపంచ సోషలిస్టు విప్లవ అమరులందరి ఆకాంక్షలనూ నెరవేరుస్తానని ప్రతిన పూనుతోంది.

పార్టీ తొమ్మిదవ వార్షికోత్సవాల సందర్భంగా మన కేంద్రకమిటీ పార్టీ కార్యకర్తలందరికీ, పిఎల్‌జిఎ కమాండర్లు-సైనికులకు, విప్లవ ప్రజా కమిటీల (ఆర్పీసీ)-ప్రజాసంఘాల కామ్రేడ్స్‌కూ, జైళ్లలో మరో పోరాటరంగాన్ని ఆరంభించిన వేలాది కామ్రేడ్స్-విప్లవ ప్రజానీకానికీ, మన పోరాట ప్రాంతాల్లో-దేశవ్యాప్తంగా గల విప్లవ ప్రజానీకానికీ, విప్లవ శ్రేయోభిలాషులకు, శ్రామికవర్గ అంతర్జాతీయతా పతాకాన్ని సమున్నతంగా నిలబెడుతూ భారత దేశ

విప్లవోద్యమానికి, ప్రత్యేకించి గత ఏడాదికాలంగా గొప్ప అండగా నిలిచిన వివిధ దేశాల్లోని మార్క్సిస్టు-లెనినిస్టు/మావోయిస్టు పార్టీలకూ తన హృదయపూర్వక విప్లవవాభినందనలు తెలుపుతోంది.

మన తర్వాతి పార్టీ వార్షికోత్సవాల వరకూ మన తక్షణ కర్తవ్యాలను నిర్దిష్టంగా రూపొందించుకోవడానికి ప్రపంచంలోనూ, మన దేశంలోనూ వస్తుగత పరిస్థితుల్లో వచ్చిన ముఖ్యమైన మార్పులనూ, అలాగే మన స్వీయాత్మక పరిస్థితిలో వచ్చిన మార్పునూ మనం ఇప్పుడు క్లుప్తంగా చూద్దాం.

**అంతర్జాతీయ స్థితి**

ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఇప్పటికీ పెట్టుబడిదారీ ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తూనే వుంది. అది దాన్నుండి బయటపడే సూచనలు ఏమీ కనిపించడం లేదు. అది యూరోప్ ఖండంలో కేంద్రీకృతమై వుంది. ఎటువంటి పొదుపు చర్యలూ, బెయిల్ అవుట్‌లూ కూడా ఇయు దేశాలను అందులో మరింతగా కూరుకుపోకుండా కాపాడలేకపోతున్నాయి. జి-8, జి-20, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, డబ్ల్యుటివో, అనేక ప్రాంతీయ ఆర్థిక కూటములు మొదలైనవన్నీ ఎన్ని కసరత్తులు చేసినా ఈ ఏడాది కూడా సామ్రాజ్యవాదులను సంక్షోభం నుండి బయటపడవేయలేకపోయాయి. ఉద్యోగాల్లో కోతలు, రిట్రెంచిమెంట్లకు వ్యతిరేకంగా కార్మికుల చేస్తున్న పోరాటాలు అనేక ఇయు దేశాలను కుదిపివేస్తున్నాయి. నిరుద్యోగం, సబ్సిడీల్లో, సామాజిక సేవలకై నిధుల్లో నిర్దాక్షిణ్యంగా చేస్తున్న కోతలు లక్షలాది ప్రజానీకాన్ని మరింత దుర్భరమైన పరిస్థితుల్లోకి నెట్టివేస్తూ వారి ఆందోళనలకు దారి తీస్తున్నాయి.

ఈ సంక్షోభం నుండి బయటపడడం కోసం సామ్రాజ్యవాద దేశాలు పొదుపు చర్యలు, ఉద్యోగితను పెంచడం కోసం ప్రభుత్వ వ్యయం, పన్నుల పెంపుదల, ప్రభుత్వ ఖర్చుల్లో చెప్పుకోదగిన తరుగుదల, పెట్టుబడిదారులకు నిధుల పెంపు వంటివి చేపట్టడంతో పాటు వెనుకబడిన దేశాల సహజ సంపదల లూటీ, అక్కడి ప్రజలపై దోపిడీ పెంచడం వంటివి చేస్తున్నాయి.

సామ్రాజ్యవాద దేశాల్లోని ప్రజలు నిరుద్యోగం, ఉద్యోగితలో తీవ్రమైన కొరత, ఉద్యోగభద్రత లేమి, రక్షిత మంచినీటి కొరత, ద్రవ్యోల్బణం, ఇండ్ల కొరత, విద్యా, వైద్యంపై ప్రభుత్వ ఖర్చులో కోత, వలసలు, ప్రజాస్వామిక హక్కుల హననం వంటి సమస్యలను మరింతగా ఎదుర్కొంటున్నారు. 2008 నాటి ఆర్థిక సంక్షోభం నుండి ఈ పరిస్థితలు మరింతగా దిగజారాయి.

వెనుకబడిన దేశాల్లో కూడా ఇటువంటి పరిస్థితులే నెలకొని వున్నాయి. లేదా మరింత ఘోరంగా నెలకొని వున్నాయి అని చెప్పవచ్చు. ఇక్కడి ప్రజలు కటిక దారిద్ర్యాన్నీ, ఆకలినీ ఎదుర్కొంటున్నారు. ధనికులకూ, పేదలకూ మధ్య అంతరం మునుపెన్నడూ లేనంతటి స్థాయికి వేగంగా పెరిగిపోతోంది. ప్రజలు వేరే దేశాలకు వలస వెళ్లే సమస్యనే కాక అంతర్గత

వలసల సమస్యను కూడా ఈ దేశాలు ఎదుర్కొంటున్నాయి.

ద్రవ్య పెట్టుబడి, బహుళజాతి కంపెనీల ప్రవేశానికి 1991 తర్వాత నుండి మిగిలిపోయిన అడ్డంకులను కూడా వెనుకబడిన దేశాల దళారులు ఎత్తివేస్తూ అత్యంత తీవ్రమైన నయావలస దోపిడీ, అదుపులకు దారిని సుగమం చేస్తున్నారు. దళారీ పాలకవర్గాలు నిస్సిగ్గుగా ఎఫ్‌డిఐ (ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు) లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు అనే నినాదాన్ని తీసుకున్నారు. దళారుల కుమ్మక్కు వల్ల ద్రవ్య పెట్టుబడి రథచక్రాలను ఆపడానికి ఎటువంటి అడ్డంకులూ లేకపోవడంతో మూడవ ప్రపంచ దేశాల ప్రజలు వాటి పదఘట్టనల కింద నలిగిపోతున్నారు.

భారతదేశం, టర్కీ, బంగ్లాదేశ్, బ్రెజిల్ ఇంకా అనేక వెనుకబడిన దేశాల కరెన్సీ విలువ ఇటీవల పడిపోవడంతో వాటి ఆర్థిక వ్యవస్థలు అల్లకల్లోలం అవుతున్నాయి. ఎంతో ఊదరగొట్టిన భారతదేశ పెరుగుదల రేటు వెనక్కుపోయింది. భారత పాలకవర్గాలు ప్రజలను మోసం చేయడానికి పెద్దెత్తున గాలి కొడ్తూ ముందుకు తెచ్చిన 'డీకప్లింగ్ థియరీ' (ప్రపంచ ఆర్థిక సంక్షోభం ప్రభావం మన దేశంపై పడదు, దీని ఆర్థిక వ్యవస్థ దానితో విడివడిపోయి వుంది అనే సిద్ధాంతం) తుస్సుమంది. ఇప్పుడు ప్రభుత్వంలోని ప్రతి ఒక్కరూ 'భారత ఆర్థిక వ్యవస్థ దారుణ స్థితి' గురించి మాట్లాడక తప్పడం లేదు.

బ్రిక్స్ కూటమిలోని బ్రెజిల్, దక్షిణ ఆఫ్రికాల పరిస్థితి కూడా ఏమంత మెరుగ్గా లేదు. భారతదేశంలోనూ, ఈ దేశాల్లోనూ ఎగుమతులు పడిపోయాయి, ద్రవ్యోల్బణం పెరిగింది, కరెన్సీల విలువలు పడిపోయాయి, వృద్ధి రేట్లు పడిపోయాయి, పారిశ్రామిక రంగం అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. ఇక రోజువారీగా ఊదరగొడ్తున్న (ముఖ్యంగా భారతదేశంలో) కరెంట్ ఖాతా లోటు సమస్య గురించి చెప్పనే అక్కరలేదు. ప్రత్యేకించి రూపాయి విలువ పాతాళం వైపుగా దూసుకుపోతుండగా, ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటుతోంది. సామ్రాజ్యవాదులు డాలర్‌తో పోల్చినపుడు ఈ కరెన్సీల విలువ పడిపోవడాన్ని డాలర్ వికాసంగా తప్పుడుగా చిత్రీకరిస్తున్నారు. గత రెండు త్రైమాసికాల్లో అమెరికా ఆర్థిక వ్యవస్థ తేరుకుందనీ, దానికి ఇదో నిదర్శనమనీ చెప్పుకుంటున్నారు.

ఈ సంక్షోభం నుండి బయటపడడానికి సామ్రాజ్యవాదులు చేపడ్తున్న ఇతర పరిష్కారాలు - తమ దేశాల్లో ప్రజాస్వామిక హక్కుల హననం, మితవాద ప్రతీఘాతుక శక్తులకు ప్రోత్సాహం, దురాక్రమణ యుద్ధాలకు పాల్పడడం. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లపై దురాక్రమణ యుద్ధాలు, లిబియాపై దాడి, మాలిపై ఫ్రాన్స్ దురాక్రమణ దాడి, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, యెమెన్ మొదలైన దేశాలపై డ్రోన్ దాడులు, పాలస్తీనాపై ఇజ్రాయెల్ అంతం లేని దాడులు, ఇరాన్, ఉత్తర కొరియాలపై దాడి చేస్తామనే బెదిరింపులు, ఇటీవల ఒబామా, ఫ్రాన్స్వా హోలాండ్ (ఫ్రాన్స్) సిరియాపై దాడికి చూపిన 'అసహనం' ఇందుకు కొట్టొచ్చినట్టు కనిపించే ఉదాహరణలు. వెనుకబడిన దేశాల్లో అంతర్యుద్ధాలకూ, వివిధ సమూహాల మధ్య యుద్ధాలకూ దారి తీసిన సామ్రాజ్యవాద జోక్యాలు కోకొల్లలుగా ఉన్నాయి. వెనుకబడిన

దేశాల్లో సామ్రాజ్యవాద దేశాల నయా వలస దోపిడీ, అదుపు, అణచివేత, జోక్యం, దురాక్రమణ ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలను, ఆ ప్రజల జీవితాలను అనేక రూపాల్లో విధ్వంసం చేస్తున్నాయి. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో ఏ ఒక్క పార్శ్యం కూడా వీరి బారిన పడకుండా, ప్రభావితం కాకుండా మిగిలిలేదు.

గత సంవత్సర కాలంలో ప్రపంచంలోని మౌలిక వైరుధ్యాలన్నీ తీవ్రతరమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు నయా ఉదారవాద ఆర్థిక విధానాల వినాశకర ఫలితాలకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలు సహా వివిధ రకాల సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు చేయడం వల్ల సామ్రాజ్యవాదానికీ, పీడిత జాతులు, ప్రజలకూ మధ్య ప్రధాన వైరుధ్యం తీవ్రతరమైంది. ఈ పోరాటాలు ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, పర్యావరణ రంగాలకు చెందిన వివిధ పార్శ్వాలకు సంబంధించినవిగా వుండినాయి. కార్మికులూ, మధ్యతరగతి ప్రజలూ మరింతగా రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేపడుతుండడంతో పెట్టుబడిదారులకూ, కార్మిక వర్గానికీ మధ్య వైరుధ్యం మరింత తీవ్రతరమైంది. సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యం నయా ఉదారవాద విధానాలు చేపట్టినప్పటి నుండి ఎన్నడూ ఎరుగని స్థాయిలో ఆర్థికంగా, రాజకీయంగా, వ్యూహాత్మకంగా ముందుకు వచ్చింది. ఇటీవలి 'సిరియా సంక్షోభం' సందర్భంగా పశ్చిమాసియాపై పెత్తనం కోసం జరిగిన పోటీలో ఇది స్పష్టంగా కనిపించింది. అమెరికా నేతృత్వంలో పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు సిరియాపై చేయాలనుకున్న దురాక్రమణను ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదని చైనా మద్దతుతో రష్యా తెగేసి చెప్పింది.

2014 ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌నూ, 2016 రియో ఒలింపిక్ గేమ్స్‌నూ తమ దేశం నిర్వహించడానికి వ్యతిరేకంగా బ్రెజిల్ ప్రజలు 2013 జూన్‌లో అపూర్వమైన రీతిలో వెల్లువెత్తారు. దశాబ్దాలుగా తమ ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల, సంపన్నులకు అనుకూలమైన నయా ఉదారవాద ఆర్థిక విధానాల దుష్ఫలితాల కింద నలిగిపోతున్న ప్రజలు వీధులను ముంచెత్తారు.

ఫిబ్రవరిలో పదుల వేల సంఖ్యలో గ్రీసు ప్రజలు సాధారణ సమ్మెలో పాల్గొన్నారు. అంతర్జాతీయ రుణదాతలు తర్వాతి విడుత బెయిల్ అవుట్ ప్యాకేజి గురించి చర్చించడానికి దేశ రాజధానిలో సమావేశం కానుండడంతో నలభై లక్షల పైచిలుకు కార్మికులు పెన్షన్లకు సంబంధించిన పొదుపు చర్యలకూ, ఎమర్జెన్సీ పన్నులకూ, పెరుగుతున్న జీవన వ్యయానికీ వ్యతిరేకంగానూ, బెయిల్ అవుట్ల నుండి విముక్తి పొందడానికీ తమ నిరసనను పునరుద్ధరిస్తూ సమ్మెలో పాల్గొన్నారు. యూరోపు అంతటా సాధారణ సమ్మెలు జరిగాయి. అక్కడ సమరశీల నిరసనలు రోజువారీ దృశ్యాలైనాయి. ప్రభుత్వాలు ఎమర్జెన్సీ చట్టాల ప్రయోగం వంటి అణచివేత చర్యలు చేపడుతున్నప్పటికీ సమ్మెలు పుంజుకుంటూనే వున్నాయి.

ఈజిప్టులో మోర్సీ రాజీపడే శక్తి అయినప్పటికీ అమెరికా, హోస్నీ ముబారక్ మద్దతుదారుల అండతో మిలటరీ అతన్ని ఎటువంటి మర్యాదలూ పాటించకుండా పదవి నుండి తొలగించి జైల్లోకి తోసింది. ఈ తొలగింపునూ, మిలటరీ పాలననూ నిరసిస్తున్న ప్రజలను అక్కడ రోజువారీగా ఊచకోత కోస్తున్నారు. ఇటీవలి ప్రజాస్వామిక వెల్లువల్లో నిరంకుశ పాలకుల్ని కూలదోసిన ఇతర అరబ్ దేశాలన్నిటా కూడా దాదాపుగా సామ్రాజ్యవాద తొత్తు పాలకులో లేక రాజీపడే శక్తులో అధికారంలోకి రావడంతో ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలు నెరవేరకుండానే వుండిపోయాయి. అందుకని ప్రజలు సిసలైన ప్రజాస్వామ్యం కోసం పోరాడడానికి తిరిగి రోడ్ల మీదకు రాక తప్పని స్థితి నెలకొంది. ఈ పరిణామాలు అరబ్ ప్రజలకు కనువిప్పుగా ఉంటున్నాయి. ఏ రూపంలోనైనా గానీ సామ్రాజ్యవాద దేశాల మద్దతును తీసుకోవడం తమ ప్రయోజనాలకు అంతిమంగా ముప్పుగా పరిణమిస్తాయనే విషయాన్ని మరింతమంది ప్రజలు రోజురోజుకూ గ్రహిస్తున్నారు.

ప్రపంచంలోనూ, మన దేశంలోనూ సంస్కరణవాదం అనేది అత్యంత ప్రమాదకరమైన సైద్ధాంతిక, రాజకీయ ధోరణిగా మారింది. ఆర్థిక సంక్షోభం తీవ్రతరం కావడం, ప్రజల్లో అసంతృప్తి అనేక రెట్లు పెరిగడం, పోరాటాలు పెల్లుబుకడం, బూటకపు ప్రజాస్వామ్యం దినదినం మరింతగా బహిర్గతమైపోవడం జరగుతుండడంతో సామ్రాజ్యవాదులూ, దళారులూ దీన్ని పెద్దెత్తున ముందుకు తీసుకువస్తున్నారు. దీన్ని పాలకవర్గాలూ, వారి ఫండెడ్ సంస్థలూ, సోషల్ డెమోక్రటిక్, రివిజనిస్టు శక్తులు సిఫారసు చేస్తూ అమలు చేస్తున్నాయి. మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోకొల్లలుగా ముందుకు తెస్తున్న పథకాలు ఈ ధోరణికి కొట్టొచ్చినట్టు కనిపించే ఉదాహరణలు. ఈ పథకాలను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ అమలు పరుస్తుండగా, మన ఉద్యమం బలంగా వున్న రాష్ట్రాల్లో వీటికి తోడుగా ప్రభుత్వ సాయుధ బలగాల ద్వారా సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలను అమలు చేస్తున్నారు. మావోయిస్టు ఉద్యమాలు వున్న దేశాలన్నిటా కూడా ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇటీవల పార్లమెంటు ఆమోదించిన వివిధ చట్టాలను (ఆహార భద్రత, భూసేకరణ, హాకర్ల సంబంధిత చట్టాల వంటివి) కూడా మనం ఈ ధోరణిలో భాగంగా చూడాలి. వివిధ ఫండెడ్ సంస్థలు అంటే ప్రభుత్వ నిధులు తీసుకునేవీ, బహుళ జాతి సంస్థల నిధులతో నడిచేవీ కూడా ప్రపంచమంతటా తమ నెట్‌వర్క్‌ను విస్తరించేశాయి. వీటిలో కొన్ని సామ్రాజ్యవాద తలకిందులు అభివృద్ధి నమూనాను అమలు చేస్తుండగా, కొన్ని పోరాటాల్లో పాల్గొంటూ వాటిని సంస్కరణవాద ఎజెండాకు పరిమితం చేయడానికి కృషి చేస్తున్నాయి. అన్ని రకాల సంస్కరణవాద శక్తులూ నిస్సిగ్గుగా పాలకపార్టీలు తెస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు మద్దతునిస్తున్నాయి. ప్రజలు వాటికి వ్యతిరేకంగా తిరగబడుతున్న చోట ప్రభుత్వాలు చేపడుతున్న అణచివేత చర్యలకు అవి మద్దతునిస్తున్నాయి. ఈ శక్తులు అధికారంలో వున్న చోట అవి ప్రజలను అణచడంలో నయా-ఫాసిస్టులుగా వ్యవహరిస్తున్నాయి.

సామ్రాజ్యవాదులు, పాలక పార్టీలు, రాజ్యం ముందుకు తెస్తున్న సంస్కరణల డొల్లనూ, వాటి మోసకారితనాన్నీ మనం సైద్ధాంతికంగా, రాజకీయంగా బహిర్గతపరచాలి. ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించడంలో సంస్కరణవాద వైఫల్యాన్ని మనం బహిర్గతపరుస్తూ, ప్రజల ముందు విప్లవాన్ని ప్రత్యామ్నాయంగా ఉంచాలి. దీనితో పాటు సంస్కరణవాద సంస్థల్లో పాలక వర్గాలతో కుమ్మక్కై ప్రజా ఉద్యమాలను వ్యతిరేకించే ఒక సెక్షన్ నాయకులను మనం బహిర్గతపరచి ఒంటరివారిని చేయాలి. మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా మనం తమ సమస్యలపై పోరాడే విధంగా అత్యంత విశాలమైన వేదికల్లోకి ప్రజల్ని సమీకరించడానికి ప్రాధాన్యతను యిస్తూనే సంస్కరణవాద సంస్థలతో ఐక్యతా-పోరాటం అనే విధానాన్ని చేపట్టాలి. ప్రజలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ సంస్థలలోకి సమీకరించబడతారు కనుక, ఆ సంస్థలు సంస్కరణవాద పరిమితుల్లో అయినా కొంతమేరకు పోరాడుతాయి కనుక మనం ఇటువంటి సంస్కరణవాద సంస్థలను బహిర్గతపరచేటప్పుడు జాగ్రత్తగా వుండాలి. అంతర్జాతీయంగా కూడా విశాల సామ్రాజ్యవాద, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్రంట్‌లోకి వివిధ సంస్కరణవాద సంస్థలను సమీకరించే విషయంలో మనం ఇదే వైఖరిని కలిగి ఉండాలి. ఇటువంటి విశాల ఫ్రంటుల కేంద్రంలో మావోయిస్టు శక్తులు నిలిచినప్పుడు మాత్రమే అవి తమ లక్ష్యం వైపుగా పురోగమించగల్గుతాయి.

**దేశీయ పరిస్థితి**

అంతర్జాతీయ పరిస్థితిలో మార్పుల కొనసాగింపుగా దేశీయ పరిస్థితిలో కూడా మార్పులు సంభవించాయి. భారత పార్లమెంటు చరిత్రలో మునుపెన్నడూ లేనంత సంఖ్యలో ఆహార భద్రత, భూసేకరణ, కంపెనీ బిల్లు వంటి వాటితో సహా అనేక చట్టాలను ప్రతిపక్షం నుండి దాదాపుగా ఎటువంటి అభ్యంతరం లేకుండా ఈ సంవత్సరం ఒకే ఒక సెషన్‌లో ఆమోదించారు. అనేక దశాబ్దాలుగా అనేక ప్రభుత్వాలు మారినా ఆమోదించకుండా మిగిలిపోయిన బిల్లులను కూడా ఇప్పుడు ఎటువంటి హంగామా లేకుండా ఆమోదించేశారు. మన దేశంలో సామ్రాజ్యవాద జోక్యాన్ని అడ్డుకునే మెజారిటీ అడ్డంకులను, 90లలో ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను ఆమోదించాక కూడా మిగిలిపోయిన వాటిని ఇప్పుడు శరవేగంతో ఎత్తివేశారు. ఈ బిల్లులను ప్రతిపక్షం అని చెప్పుకునే పార్టీల పూర్తి కుమ్మక్కుతో శరవేగంతో ఆమోదించిన తీరు సామ్రాజ్యవాద యజమానులు, ఇక్కడి వారి ఏజెంట్లు తమను ఆవహించిన ఆర్థిక సంక్షోభం నుండి బయటపడడానికి ఎన్ని పాట్లు పడుతున్నారనేదాన్నే సూచిస్తోంది. ఈ చట్టాలన్నిటికీ ఉన్న ఏకైక లక్ష్యం ప్రజలకు జల్, జంగల్, జమీన్, ఆత్మగౌరవం, హక్కులూ లేకుండా చేసే సామ్రాజ్యవాదుల నయా ఉదారవాద విధానాలను ముందుకు తీసుకుపోవడమే.

భూసేరణ చట్టం మన వ్యవసాయ విప్లవ కార్యక్రమం మీద ఒక వ్యూహాత్మక దాడి.

భూసేకరణ చట్టం సామ్రాజ్యవాదులకూ, దళారీ నిరంకుశ బూర్జువాజీకీ సంపూర్ణంగా అమ్ముడుపోయిన ఫలితమే. ఎందుకంటే అది కార్పొరేట్ కంపెనీలు విచ్చలవిడిగా భూమిని సేకరించడానికి వెసులుబాటును కలిగిస్తుంది. అటవీ హక్కుల చట్టం, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుండి అనుమతులు, 5వ, 6వ షెడ్యూళ్లు, పెసా చట్టం మొదలైన నామమాత్రపరమైన అడ్డంకులను కూడా తోసిరాజంటూ బహుళజాతి కంపెనీలకు భూములను అప్పగించడానికి అది కేంద్ర ప్రభుత్వం చేతుల్లో అన్ని అధికారాలనూ కేంద్రీకరిస్తుంది.

ఇతర చట్టాలకు పరిపూరకంగా నూతన కంపెనీ చట్టాన్ని ఆమోదించారు. ఎందుకంటే గతంలో అనుమతించని సెక్టార్లలో అదిప్పుడు విదేశీ పెట్టుబడులను అనుమతిస్తున్నది. అలాగే మరికొన్ని సెక్టార్లలో గతంలో అనుమతించిన దానికంటే ఎక్కువ పెట్టుబడులను పెట్టడానికి అది అవకాశం కల్పిస్తున్నది. బహుళజాతి కంపెనీలు భారతదేశ కంపెనీలను కొనడానికి అది మరిన్ని అవకాశాలను కల్పిస్తున్నది. ఇది విదేశీ, దేశీయ కార్పొరేట్ కంపెనీలు మరింతగా మధ్య, చిన్న తరహా పరిశ్రమలను కొనివేయడానికి అవకాశం కల్పించడం ద్వారా వాటి ఉనికికి ప్రమాదకరంగా ఉన్నది. ఆహార భద్రతా చట్టం పైకి పేదలకు ఆహారాన్ని అందించి, వారి పోషకాహారలేమిని తగ్గించడం కోసం ఉద్దేశించబడినట్టు కనిపిస్తుంది. కానీ అది తన లక్ష్యాల్లో ఒక చిన్నశాతాన్ని కూడా చేరడంలో విఫలమవుతుంది. ఇటీవల మన దేశంలో దారిద్ర్యం పెద్దెత్తున తగ్గిపోయినట్టుగా చూపడానికి అత్యంత దారుణమైన రీతిలో చేసిన అంకెల గారడీ పేదల ఆహార భద్రతకు తూట్లు పొడవడానికి ముందే దారిని సుగమం చేసిపెట్టింది. ఒకవైపు లక్షలాది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ వుంటే మరోవైపు పని చేయగల జనాభాలో నిరుద్యోగం ఆకాశాన్నంటుతోంది. ఇందువల్ల సిసలైన ఆహార భద్రతకు గల అవకాశాలు వేగంగా తగ్గిపోతున్నాయి. మరోవైపు వివిధ ప్రభుత్వాలు అనేక దశాబ్దాలుగా ప్రజాపంపిణీ వ్యవస్థకు క్రమంగా, క్రమం తప్పకుండా తూట్లు పొడుస్తూ వచ్చాయి. ఇప్పుడీ చట్టంతో స్వేచ్ఛామార్కెట్ కు మరింత స్వేచ్ఛని ఇచ్చేశారు. ఈ అసలు వాస్తవాన్ని కప్పిపుచ్చడానికే ఈ చట్టాన్ని ఒక ఎన్నికల స్టంట్ గా తీసుకువచ్చారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు తలుపులు బార్లా తెరవడం వల్ల లక్షలాది తోపుడు బళ్ల వ్యాపారస్తుల (హాకర్లు) జీవనాధారం తీవ్రంగా దెబ్బతిన్నది. ఇప్పుడు పార్లమెంటు వారి జీవికకు రక్షణ కల్పిస్తున్నట్టుగా పైకి కనిపించే ఒక చట్టాన్ని ఆమోదించింది. వాస్తవానికి అతి కొద్దమందికి లైసెన్సులు ఇవ్వడం ద్వారా అంతకంటే ఎన్నో రెట్ల సంఖ్యలో హాకర్లు కోల్పోతున్న జీవనాధారాన్ని కప్పిపుచ్చడానికి చేసిన ఒక చట్టపరమైన చర్య ఇది. నూతన పెన్షన్ చట్టం ద్వారా పెన్షన్ డబ్బును స్టాక్ మార్కెట్ లలోకి మళ్లించడానికి దారి పడింది. దీనితో వృద్ధులు అనుభవిస్తున్న కొద్దిపాటి భద్రత కూడా ప్రమాదంలో పడింది. పెట్టుబడుల ఉపసంహరణ, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు మరిన్ని సెక్టార్లను బార్లా తెరవడం, వాటిలో మరింత శాతం పెట్టుబడి పెట్టే అవకాశాలను పెంచడం వంటివి, వాటిని ఆమోదింపజేయడానికి ఎటువంటి

పార్లమెంటరీ సెషన్లు నిర్వహించకుండానే జరిగిపోతున్నాయి. ఈ మార్పులన్నిటితో పాటు కార్మిక చట్టాల్లో చేసిన మార్పులు, ఉద్యమాలను అణచివేయడానికి నిరంకుశ చట్టాలను ఆమోదించడం వంటివి గత ఏడాది కాలంలో చెప్పుకోదగిన మార్పుకు దారి తీశాయి.

ప్రపంచంలోని మౌలిక వైరుధ్యాలన్నిటితో పాటు మన దేశంలోని ప్రముఖ వైరుధ్యాలన్నీ కూడా తీవ్రతరమౌతున్నాయి. వాస్తవానికి, అన్ని వైరుధ్యాలూ తీవ్రతరమవుతూ అన్ని రంగాల్లో పీడిత వర్గాలు, సెక్షన్లు అన్నీ పాల్గొనే అనేక పోరాటాలకు దారి తీస్తున్నాయి.

బహుళజాతి కంపెనీలు భారత పాలకవర్గాల మీద తాము సంతకం చేసిన ఎంఓయూలను అమలు చేయాలని తీవ్రమైన ఒత్తిడిని తెస్తున్నాయి. మరోవైపు ప్రజలు అన్ని రకాల ఇక్కట్లనూ సాహసంగా ఎదుర్కొంటూ వాటి అమలును వ్యతిరేకిస్తున్నారు. కేంద్రంతో కుమ్మక్కయ్యి తమిళనాడులోని ప్రతీఘాతుక జయలలిత ప్రభుత్వం కుడంకుళం అణు కేంద్రాన్ని వ్యతిరేకిస్తున్న ఉద్యమాన్ని అణచివేసి అక్కడ పనిని ప్రారంభించింది. ప్రజలు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. మహారాష్ట్రలోని జైతాపూర్‌లో ప్రభుత్వం పరిహారంగా ఇచ్చే సొమ్మును పెంచుతామనే హామీని ఇవ్వడంతో కొన్ని ఎన్‌జివోలు అక్కడి అణు కర్మాగార నిర్మాణానికి వ్యతిరేకంగా చేస్తున్న తమ ఆందోళనను విరమించాయి. అయితే ప్రజలు మాత్రం ఆందోళనను కొనసాగిస్తున్నారు. నియంగిరిలో ఒకదాని తర్వాత ఒకటిగా గ్రామసభలు వేదాంత కంపెనీ తమ ప్రాంతంలో బాక్సైట్ మైనింగ్ చేయడానికి అనుమతిని నిరాకరిస్తూ వస్తున్నాయి. ఒడిశాలో పోస్కో వ్యతిరేక ఆందోళనను భారత రాజ్యం తుపాకులను ఎక్కుపెట్టి, ఆందోళనకారులపై లెక్కలేనన్ని అత్యాచారాలను చేసి నిర్దాక్షిణ్యంగా అణచివేసినప్పటికీ వారు తల వంచకుండా తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. దండకారణ్యంలో బస్తర్ ప్రజలు, గడ్చిరోలి ప్రజలు మైనింగ్ నూ, పెద్ద ఆనకట్టల నిర్మాణాన్నీ ఇప్పటికీ ఆపగల్గుతున్నారు. అయితే అందుకు వారు ఎన్నో త్యాగాలు చేయవలసి వస్తున్నది. అనేకమంది మైనింగ్ వ్యతిరేక, పెద్ద ఆనకట్టల వ్యతిరేక కార్యకర్తలను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపివేశారు; అనేకమందిని అరెస్టు చేసి తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో తోశారు. 'మావోయిస్టులను తరిమివేయడానికి' 'క్లియర్, హోల్డ్, బిల్డ్' విధానాలను చేపట్టి పెద్దెత్తున కొనసాగించిన మిలటరీ ఆపరేషన్ల తదనంతరం ఝార్ఖండ్‌లోని సరండాలో మైనింగ్ మొదలైంది. దీని అర్థం సరండా ప్రజల మీద అనేక దఫాలుగా అన్ని రకాల క్రూరమైన అత్యాచారాలూ కొనసాగాయని తప్ప మరొకటి కాదు.

మన్‌రేగా, పనికి ఆహార పథకం, విద్యా, వైద్య హక్కు, సమాచార హక్కు, స్త్రీలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా తీసుకుంటున్నామని చెప్తున్న చర్యలూ, చిన్న అటవీ ఉత్పత్తులకిచ్చే రేట్లలో పెరుగుదల, అటవీ హక్కుల చట్టం వంటి సామాజిక-ఆర్థిక, రాజకీయ చర్యలన్నీ ఎంత డొల్ల అనేది యుపిఎ-1, 2 ల పాలనలో రుజువైపోయింది. దాంతో ఈ

సమస్యలన్నిటిపై ప్రజలు మరింతగా పోరాటాల్లోకి వస్తున్నారు.

2012 డిసెంబర్ 16న జరిగిన ఢిల్లీ సామూహిక అత్యాచారం కేసు విషయంలో మన దేశంలో పెద్దెత్తున ప్రజా నిరసనలు పెల్లుబుకాయి. అది మరొకసారి మన దేశంలో స్త్రీల భద్రత ఎంత దుస్థితిలో వున్నదనే విషయంపై, స్త్రీలపై రాజ్యహింస సహా వివిధ రూపాల్లో పెరుగుతున్న హింస విషయంపై, అందుకు కారణాలపై, పరిష్కారాలపై విస్తృతమైన చర్చకు దారి తీసింది.

జులై చివరిలో యుపిఎ సమన్వయ కమిటి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలు త్వరలోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరుగుతుందని ప్రకటించాయి. గత 60 ఏండ్లుగా తీవ్రమైన అణచివేతనూ, వివిధ బూర్జువా పార్టీల విద్రోహాన్నీ ఎదుర్కొంటూ ప్రత్యేక రాష్ట్రం కొరకు ఆందోళనను నడుపుతున్న తెలంగాణ పోరాట ప్రజల చారిత్రక విజయం ఇది. పదేండ్ల వరకు హైదరాబాదు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని పేర్కొనడం, వివిధ సాకులను చూపిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును తాత్సారం చేయడానికి ఎత్తుగడలు వేయడం ఒకవైపు చేస్తూ మరోవైపు సమైక్యాంధ్ర కోసం సీమాంధ్ర ప్రాంతంలో ఉద్యమాలను రెచ్చగొట్టడం వంటివన్నీ తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం డిమాండును నెరవేర్చుకోవడానికి మరో విడత గట్టి సమరానికి  సిద్ధం కావాలనే విషయాన్ని సూచిస్తున్నాయి.

తెలంగాణను ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రకటన అసోంలో ప్రత్యేక రాష్ట్రాల కోసం జరుగుతున్న ఆందోళనలకు, పశ్చిమ బెంగాల్ లో గోర్ఖాల్యాండ్ ఏర్పాటుకై జరుగుతున్న ఆందోళనకు ఊపునిచ్చింది. అంత బలంగా కాకపోయినా ఉత్తరప్రదేశ్ ను నాలుగు రాష్ట్రాలుగా విభజించాలనే డిమాండ్, ప్రత్యేక విదర్భ రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ కూడా వినిపించాయి. ఈ ఆందోళనల నూతన వెల్లువ ఆయా ప్రాంతాలను కొన్ని నెలలపాటు ఊపేశాయి. కేంద్ర, అసోం ప్రభుత్వాలు ఈ ఆందోళనల విషయంలో సామ, దండోపాయాలను ప్రయోగిస్తున్నాయి. ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటును కోరుతూ ఆందోళన చేస్తున్న కొన్ని సంస్థలతో చర్చలను నడుపుతూనే మరోవైపు ఆ ఆందోళనలను అణచివేస్తున్నాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్ ను ఎట్టి పరిస్థితిలో విభజించేది లేదంటూ కఠినమైన వైఖరిని తీసుకుని ప్రత్యేక గోర్ఖాల్యాండ్, కామతాపుర్ ఆందోళనలను అణచివేయడానికి అన్ని చర్యలనూ తీసుకుంటోంది. ప్రాంతీయ అసమానతలు, అసంతులనాలు, జాతుల అణచివేత కొనసాగినంతకాలం ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ సహా జాతి విముక్తి ఆకాంక్షలతో న్యాయమైన ఆందోళనలు పైకి లేవడం, అవి భారత రాజ్య తీవ్రమైన నిర్బంధాన్ని ఎదుర్కొంటూ పురోగమించడం అనివార్యం. మనం ఇటువంటి ప్రతి ఒక్క ఆందోళననూ నిర్దిష్టంగా విశ్లేషించి మన నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమంలో భాగంగా వాటికి మద్దతుగా నిలవాలి, వాటిలో పాల్గొనాలి, వాటికి

నాయకత్వం వహించాలి.

తమ పార్టీలో అధికారం కోసం తీవ్రంగా జరిగిన కుక్కల కొట్లాటను అధిగమించి ఆర్ఎస్ఎస్ మద్దతుతో, దాని ప్రోద్బలంతో చివరికి నరహంతకుడు మోడీని తన ప్రధానమంత్రి అభ్యర్థిగా బిజెపి ప్రకటించింది. అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించాలనే హిందుత్వ ఎజెండాతో, ముస్లింలపై విద్వేషాన్ని వెళ్లగక్కుతూ గతంలో అధికారాన్ని చవి చూసిన బిజెపి ఇప్పుడు మోడీ నేతృత్వంలో తిరిగి అదే కార్డును ఉధృతంగా ఉపయోగించాలని ప్రయత్నిస్తోంది. ఇది రాబోయే సాధారణ ఎన్నికలకు మరింతగా మతతత్వ రంగును పులుపుతాయి. ఇప్పటికే వేర్వేరు పరిక్రమల కార్యక్రమాలతో, ఉత్తరప్రదేశ్ లోని ముజఫర్‌నగర్ లో ముస్లింల మీద దాడుల వంటి వాటితో హిందుత్వ గుండాలు మతతత్వ హింసను ఉసిగొల్పుతున్నారు. వారు ఇప్పటికే హైదారాబాద్ లో మతపరమైన హింసను ప్రేరేపించడానికి ప్రయత్నించి విఫలమయ్యారు - కనీసం ఇప్పటికి. బిజెపి, కాషాయ టెర్రరిస్టులూ బహిరంగంగా హిందూ కార్డును ఉపయోగించినప్పటికీ, కాంగ్రెస్ కు కూడా 1984లో సిక్కులకు వ్యతిరేకంగా ఊచకోతను ప్రేరేపించిన సిగ్గుమాలిన చరిత్ర ఉందనీ, దేశవ్యాప్తంగా ముస్లింల మీద జరిగిన అనేక దాడుల వెనుక దాని హస్తం ఉందనే విషయాన్ని ప్రజలు మరవకోడదు.

ముజఫర్‌నగర్ లో జాట్ లకూ, ముస్లింలకూ మధ్య జరిగిన మత ఘర్షణలు పశ్చిమ యుపి లోని మరికొన్ని జిల్లాలకు పాకాయి. ఎప్పటివలెనే పేద ముస్లింలు బాధితులయ్యారు. సుదీర్ఘకాలం కొనసాగిన ఈ ఘర్షణలు మరొకసారి అన్ని పార్లమెంటరీ పార్టీల హిందూ పక్షపాతాన్ని బహిరంగంగా బైటపెట్టాయి. అప్పటివరకు ముస్లింల సంరక్షకురాలిలా పోజు కొట్టిన సమాజ్‌వాదీ పార్టీ, కల్లోలాలకు పాల్పడుతున్న హిందువులపై కఠినమైన వైఖరిని తీసుకోకపోవడం ద్వారా ప్రజల్లో బహిర్గతమయ్యింది. బిజెపి, కాంగ్రెస్, ఎస్‌పి, బిఎస్‌పి పార్టీల ఎంఎల్ఏలు, నాయకులు కల్లోలాలకు కారకులుగా ఆరోపణలు ఎదుర్కొంటూ వుండడంతో ముజఫర్‌నగర్ ఘర్షణలు అన్ని పార్లమెంటరీ పార్టీల అసలు రంగును బయటపెట్టినాయి. అన్ని పార్లమెంటరీ పార్టీలు ఈ ఘర్షణలకు కారకులుగా ఒకరినొకరు నిందించుకున్నాయి గానీ అసలు వాస్తవం ఏమిటంటే ఈ పరిస్థితి తలెత్తడానికి వారందరూ కూడా బాధ్యులే. ఎందుకంటే వారందరూ కూడా 2014లో జరగబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకుని పచ్చి అవకాశవాదంతో ప్రవర్తించారు.

### ప్రజల మీద యుద్ధం, ప్రతిఘటన

ఆపరేషన్ గ్రీన్‌హంట్ - ప్రజల మీద యుద్ధం - గత ఏడాది కాలం అంతటా విప్లవ ప్రజానీకాన్నీ, మన కామ్రేడ్స్ నూ ఊచకోతలు కోస్తూ మన ఉద్యమ ప్రాంతాల్లో ఎంతో క్రూరంగా కొనసాగింది. మరొకసారి రాజ్యం బహిరంగ కార్యకలాపాల్లో పని చేస్తున్న మన నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేసింది. వీటి వెనుక దాని ఉద్దేశం ఎటువంటి

ప్రజా కార్యక్రమాలనైనా మూసివేయడం, మనం చేస్తున్న ప్రజాయుద్ధానికి సంఘీభావ నిర్మాణాన్ని అడ్డుకోవడం. సామ్రాజ్యవాదులు మన సహజ వనరులను లూటీ చేసి కొల్లగొట్టడానికని చేసుకున్న ఎంవోయులను అమలు చేయాలని భారత పాలకవర్గాలపై తీవ్రమైన వత్తిడిని పెంచారు. దళారులు వారి వత్తిడికి తలొగ్గి, అలాగే యిప్పుడు వారందరూ కూడా బహిరంగంగా ఒప్పుకుంటున్న 'భారత ఆర్థిక వ్యవస్థ దుస్థితి'ని అధిగమించడానికి 'మరింత అణచివేత, మరింత లూటీ' అనే విధానాన్ని చేపట్టారు.

మన ఉద్యమంపై ఉన్నత స్థాయి దాడులకు జీరంఘాటీ దాడిని ఒక సాకుగా వారు చూపుతున్నారు కానీ వాస్తవం ఏమిటంటే ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ కోసం ఈ దాడికంటే ముందే వారు సన్నాహాల్లో వున్నారు. బలవంతంగా గనులు తెరవడం కోసం, మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం పారామిలటరీని మోహరించడం అనేక రెట్లు పెరిగింది. మావోయిస్టు ప్రాంతాల్లో పారామిలటరీ బెటాలియన్ల పెంపుదల, కార్పెట్ సెక్యూరిటీ ప్రాంత విస్తరణలో పెరుగుదల, మరిన్ని డ్రోన్ లు, హెలికాప్టర్ల కేటాయింపు, మోర్టార్ లు, రాకెట్ లు వంటి ఫీల్డు ఆయుధాల వాడకం, కమ్యూనికేషన్ టవర్ల పెంపుదల, మానసిక యుద్ధాన్ని తీవ్రతరం చేయడం, సివిక్ యాక్షన్ ప్రోగ్రాం, 'నైపుణ్యాల అభివృద్ధి' సహా సంస్కరణల కోసం వేల కోట్ల రూపాయల విడుదల, రోడ్ల నిర్మాణాన్ని, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని వేగవంతం చేయడం మొదలైనవన్నీ యుద్ధ ప్రాతిపదికన జరిగిపోతున్నాయి. పైన పేర్కొన్న చర్యలన్నీ ప్రధానంగా మన ఉద్యమ వ్యూహాత్మక ప్రాంతాలైన రాష్ట్రాల సరిహద్దుల్లో (మూడు లేదా నాలుగు రాష్ట్రాల కూడళ్లలో) కేంద్రీకరించి చేపట్టారు. ప్రజలపై చేస్తున్న యుద్ధంలో భారత సైన్యం వ్యూహాత్మక పాత్ర పెరుగుతోంది. పార్లమెంటరీ ఎన్నికల సందర్భంగానూ, అవి పూర్తయిన వెంటనే కూడా పెద్దెత్తున పోలీసు, పారామిలటరీ బలగాలనూ, సైన్యాన్నీ మోహరించే అవకాశం వుంది.

ప్రభుత్వం సిఆర్‌పిఎఫ్ కు అధిక సామర్థ్యం గల డ్రోన్ లను ఇస్తోంది. వీటిని ఇప్పటివరకు సైన్యం దేశ సరిహద్దుల్లో మాత్రమే వుపయోగిస్తూ వచ్చింది. దీంతో పాటు, దేశంలో దీన్ని ప్రధాన కౌంటర్-ఇన్‌సర్జన్సీ బలగంగా రూపుదిద్దడం కోసం కోబ్రా బెటాలియన్ లను ఏర్పాటు చేస్తున్నారు. ఉద్యమ ప్రాంతాలపై డ్రోన్ దాడులు జరపడం కోసం సన్నాహాలు వేగంగా కొనసాగుతున్నాయి. నాన్-కంబాట్ ఆపరేషన్ల కోసం (లాజిస్టిక్స్, బలగాల తరలింపు), గ్రామాలపై దాడుల సందర్భంగానూ ఇప్పటికే హెలికాప్టర్ గన్‌షిప్ లను విస్తృతంగా వాడడం మొదలైపోయింది. నాగ్‌పూర్ లోని నూతన హెలికాప్టర్ యూనిట్ ను లాజిస్టికల్ మద్దతు ఇవ్వడం కోసం అనే పేరుతో పెట్టారు గానీ నిజానికి వాటిని దాడుల్లో ఉపయోగిస్తారు. ఇంటలిజెన్స్ సేకరణ కోసమూ, దాడుల కోసమూ కూడా డ్రోన్ లను విస్తృతంగా ఉపయోగించబోతున్నారు.

2009 మధ్యలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిని ఎక్కుపెట్టినప్పటి నుండి ఇప్పటి వరకు

మన పార్టీ నేతృత్వంలో పిఎల్‌జిఎ, విప్లవ ప్రజానీకం దానిని తిప్పికొడుతూ సాహసంగా పోరాడి లెక్కకు మించిన త్యాగాలు చేశారు. అందువల్లనే అది మన దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ కూడా 'ప్రజలపై యుద్ధం'గా గుర్తించబడింది. మన పార్టీ వ్యవసాయ విప్లవ కార్యక్రమం ఇరుసుగా, విస్థాపన వ్యతిరేక పోరాటాలు ఒక విడదీయరాని భాగంగా చేసిన రాజీలేని భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు మావోయిజాన్ని పరిష్కారంగా, దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని పంథాగా ఆమోదించే వైపుగా దేశప్రజల దృష్టిని ఆకర్షించాయి. కశ్మీరులో, ఈశాన్య ప్రాంతంలో జాతి పోరాటాల సాయుధ ప్రతిఘటన బాగానే తగ్గినప్పటికీ, రాజ్య అత్యాచారాలకు వ్యతిరేకంగా అనేక ప్రజా ఆందోళనలూ, జాతి విముక్తి ఆకాంక్షలతో రాజకీయ ఉద్యమాలూ కొనసాగుతూనే ఉన్నాయి.

మన పార్టీ ఎనిమిదవ వార్షికోత్సవం తర్వాత మనం సాధించిన ప్రధాన విజయాలు ఈ కింది విధంగా ఉన్నాయి :

పాలకవర్గాల దాడి తీవ్రతరం, విస్తృతం అయినప్పటికీ కూడా, మొత్తంగా చూసినప్పుడు మనం సాపేక్షికంగా బలంగా ఉన్న గెరిల్లా జోన్లలో మన పిఎల్‌జిఎ బలంపై, ప్రజాపునాదిపై ఆధారపడి కొనసాగించిన ప్రతిఘటన ఫలితంగా మన ఉద్యమాన్ని నిలబెట్టుకోగలిగాం. మనం వివిధ ఎత్తుగడల ఎదురుదాడులను కొనసాగించి శత్రువుకు నష్టాలు కలిగించాం. గత ఏడాది సెప్టెంబర్ చివరి నుండి 2013 ఆగస్టు వరకు పిఎల్‌జిఎ చేపట్టిన వివిధ పెద్ద, మధ్యరకం, చిన్న చర్యలలో 110 మంది పోలీసులు చనిపోగా, 185 మంది గాయపడ్డారు. గతంలో స్వాధీనం చేసుకున్న స్థాయిలో కానప్పటికీ మనం ప్రభుత్వ సాయుధ బలగాల నుండి ఆయుధాలను (దాదాపు 70), మందుగుండును స్వాధీనం చేసుకున్నాం. మనం ఐదు పెద్ద చర్యలనూ, దాదాపు ఒక డజను మధ్యరకం చర్యలనూ, డజన్ల కొద్దీ చిన్న రకం చర్యలనూ గత ఏడాది కాలంలో నిర్వహించాం. పార్లమెంటరీ వ్యవస్థ డొల్లతనం, దివాళాకోరుతనం ఒకవైపూ, సామ్రాజ్యవాద అనుకూల దళారీ పాలకులు చేపట్టిన తలకిందులు అభివృద్ధి నమూనాకు వ్యతిరేకంగా మన పార్టీ నేతృత్వంలో పిఎల్‌జిఎ, పోరాడే ప్రజలు సాగించిన సాహసిక ప్రతిఘటన మరోవైపూ ఈ నమూనా వల్ల బాధితులవుతున్న వివిధ సెక్షన్ల ప్రజలను మరింతగా మావోయిజం వైపుకు ఆకర్షిస్తున్నాయి. ఇది సైద్ధాంతికంగానూ, రాజకీయంగానూ కూడా మనం సాధించిన ఒక విజయం. ప్రజలు అనేక సమస్యలపై, ప్రత్యేకించి భవిష్యత్తు తరాలపై, పర్యావరణంపై దీర్ఘకాలిక దుష్ప్రభావాన్ని కలిగించగల పెద్ద ఆనకట్టలకు, మైనింగ్ కు, విస్థాపనకు వ్యతిరేకంగా మన పార్టీ నాయకత్వంలో కదులుతున్నారు. కొన్ని కొత్త ప్రాంతాలకు విస్తరించే కృషి, ఉన్న జోన్లలోనే అంతర్గతంగా విస్తరించే కృషి, వివిధ గెరిల్లా జోన్లను జోడించి వుంచే కృషి కొనసాగుతున్నాయి. స్థానికంగానే అయినప్పటికీ వివిధ రకాల ప్రజా పోరాటాలకు మన పార్టీ ఏరియా, డివిజన్/జోనల్, రాష్ట్ర స్థాయిల్లో నాయకత్వం వహించింది.

తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల మధ్య ఉన్న వ్యూహాత్మక ట్రైజంక్షన్ ప్రాంతంలో మన కామ్రేడ్స్, మన ఉద్యమం నూతన విస్తరణ ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఎదుర్కోనంతటి అత్యంత కఠినమైన పరిస్థితులను ఎదుర్కొంటూ దృఢమైన, అలుపెరుగని కృషి చేస్తున్నారు. కర్ణాటకలోని మల్నాడులోనూ, ట్రైజంక్షన్ లోనూ రాజ్యం తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తూ మన ఉద్యమ విస్తరణను మొగ్గలోనే తుంచేసే ప్రయత్నం చేస్తోంది. మన పార్టీ ఒడిశాలో సవ్యసాచి పండా, ఎవోబిలో శ్రీరాములు శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహించిన మితవాద అవకాశవాద ధోరణులను సైద్ధాంతికంగా, రాజకీయంగా తిప్పికొడుతూ బహిర్గతపరిచింది. ఇటువంటి ధోరణులు తలెత్తడానికి గల కారణాలను గురించీ, వాటిని తిప్పికొట్టాల్సిన ఆవశ్యకత గురించీ మన పార్టీని విద్యావంతం చేసుకున్నాం. వారు మన కార్యకర్తలలోని గణనీయమైన భాగాన్ని ఏమాత్రం ప్రభావితం చేయలేకపోయారు. కేవలం అతికొద్దిమంది కార్యకర్తలు పండా వెంబడి వెళ్లారు. మితవాద అవకాశవాద ప్రమాదాన్ని వారు గుర్తించేలా చేయడానికి మన రాజకీయ కృషి కొనసాగుతోంది. ఎవోబిలో డివిజన్, రాష్ట్రస్థాయి ప్లీనాలను, ఇతర రాష్ట్రాల్లో డివిజనల్ ప్లీనాలను, కొన్ని ఉన్నతస్థాయి మిలటరీ నిర్మాణాల ప్లీనాలను నిర్వహించాం. ఇవి వాటి రాజకీయ, నిర్మాణ సంఘటితీకరణకు ఉపయోగపడ్డాయి. రాజకీయ, నిర్మాణ సంఘటితీకరణకు మరికొంత కృషి కూడా చేశాం. మన ఉద్యమ ప్రాంతాలంతటా విప్లవ ప్రచారం ఒక మేరకు కొనసాగింది.

మన శ్రామికవర్గ అంతర్జాతీయ కర్తవ్యాల నిర్వహణలో భాగంగా మనం ఫిలిప్పీన్స్ నూతన ప్రజాస్వామిక విప్లవానికి సంఘీభావ క్యాంపెయిన్ ను చేపట్టి 2013 ఏప్రిల్ 22 నుండి 28 వరకు ఒక వారంపాటు వారి మహత్తర ప్రజాయుద్ధం గురించి అనేక కార్యక్రమాల ద్వారా ప్రచారం చేశాం. 2012 నవంబర్ లో జరిగిన హాంబర్గ్ కాన్ఫరెన్స్ ద్వారా మన ప్రజాయుద్ధానికి మద్దతుగానూ, ఆపరేషన్ గ్రీన్‌హంట్ కు వ్యతిరేకంగానూ వివిధ దేశాల్లో (సామ్రాజ్యవాద దేశాలూ, వెనుకబడిన దేశాల్లోనూ కూడా) చేపట్టిన వివిధ అంతర్జాతీయ క్యాంపెయిన్ లూ, మన ఉద్యమానికి సంఘీభావాన్ని నిర్మించడానికి జరుగుతున్న అంతర్జాతీయ కృషీ మరింతగా సంఘటితం అయ్యాయి. మన ప్రియతమ అమరుల నిస్వార్థమైన త్యాగాలూ, మునుపెన్నడూ ఎరుగనంతటి స్థాయిలో జరుగుతున్న శత్రుదాడి మధ్యన కూడా సాగుతున్న మన సాహసవంతమైన ప్రతిఘటన, ప్రజాపోరాటాలకు మనం నేతృత్వం వహించడం, కొన్ని విజయాలు సాధించడం అనేవి ప్రపంచంలోని మెజారిటీ విప్లవ, ప్రజాస్వామిక శక్తులు మన నూతన ప్రజాస్వామిక విప్లవానికి మన దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ ఇటువంటి విశాలమైన సంఘీభావాన్నీ, మద్దతునూ నిర్మించడానికై మరింతగా ఒక దగ్గరకు రావడంలో కీలకమైన పాత్ర వహించాయి.

## తక్షణ కర్తవ్యాలు

2013 మొదట్లో మన కేంద్రకమిటీ స్వీయాత్మక పరిస్థితి దృష్ట్యా మన దేశవ్యాప్త ఉద్యమ

స్థితి గడ్డుగా ఉందని అంచనా వేసింది. ప్రస్తుతం ప్రపంచంలో, దేశంలో ప్రముఖ వైరుధ్యాలన్నీ తీవ్రతరమవుతున్నాయనీ, వస్తుగత పరిస్థితులు విప్లవానికి మరింత అనుకూలంగా మారుతున్నాయనీ, కానీ స్వీయాత్మక పరిస్థితి దృష్ట్యా ఉద్యమం గడ్డు పరిస్థితిని ఎదుర్కుంటోందనీ అది పేర్కొంది. ఈ నేపథ్యంలో మన పార్టీ 9వ వార్షికోత్సవాల సందర్భంగా మనం ఈ కింది తక్షణ కర్తవ్యాలను చేపడదాం. భారత విప్లవోద్యమం ఎదుర్కొంటున్న ప్రస్తుత గడ్డు పరిస్థితిని అధిగమించి ఉద్యమాన్ని విజయవంతంగా పురోగమింపజేయడానికి మన పార్టీని సన్నద్ధం చేయడానికి మనం ఈ కర్తవ్యాలను చేపట్టాలి.

### 1. పార్టీని బోల్షివీకరించడానికి మొదటి ప్రాధాన్యతను ఇవ్వండి

వస్తుగత, స్వీయాత్మక పరిస్థితులపై మొత్తంగా వచ్చిన అంచనానూ, ఉద్యమ అవసరాలనూ దృష్టిలో వుంచుకుని మన కేంద్రకమిటీ మన పార్టీని బోల్షివీకరించడానికి ఒక క్యాంపెయిన్ ను చేపట్టాలని నిర్ణయించింది. పార్టీని బోల్షివీకరించడం అంటే - 1. మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్నీ, మన పార్టీ సాధారణ రాజకీయ పంథానూ లోతుగా అర్థం చేసుకుని దానికి దృఢంగా కట్టుబడి ఉండడం; మన నిర్దిష్ట ఆచరణకు మా-లె-మా ను సృజనాత్మకంగా అన్వయించడం, మన పంథాను దృఢంగా అమలు పరచడం; మన సైద్ధాంతిక, రాజకీయ పంథా పట్ల ఊగిసలాట లేకుండా వుండడం, అది సరైనదనే విషయాన్ని ప్రతిష్ఠించడం, వివిధ బూర్జువా సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరాడుతూ దాన్ని మరింతగా సంపద్వంతం చేయడం. 2. సరైన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపర, మిలటరీ పంథాను కలిగిన ఒక బలమైన సంస్థగా, కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని సరి అయిన పద్ధతిలో పాటించే సంస్థగా, క్రమశిక్షణను కచ్చితంగా అమలు చేసే సంస్థగా, ప్రజాస్వభావం గల సంస్థగా, దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో తనను తాను రాటుదేల్చుకునే సంస్థగా, వ్యూహం విషయంలో దృఢంగానూ ఎత్తుగడల విషయంలో పట్టువిడుపులతోనూ వ్యవహరించే సంస్థగా మన పార్టీని అభివృద్ధి చేసకోవడం. 3. పార్టీలోనూ, బయటా అన్ని రకాల మితవాద, అతివాద అవకాశవాద ధోరణులకు వ్యతిరేకంగా పోరాడడం. 4. నిజాయితీగా మన తప్పులను, లోపాలను, బలహీనతలను ఆమోదించడం, వాటిని సరి చేసుకోవడం, ఆచరణ నుండి నేర్చుకోవడం ద్వారా వాటిని మళ్లీ జరగకుండా చూసుకోవడం. 5. వర్గపంథా, ప్రజాపంథాలను అనుసరిస్తూ, ప్రజలతో సన్నిహితంగా సమైక్యం కావడం ద్వారా, వారికి మార్గదర్శకత్వం వహించడం ద్వారా 'ప్రజలే చరిత్ర నిర్మాతలు' అనే మార్క్సిస్టు సూత్రాన్ని ఆచరణలో సాకారం చేయడం.

మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మన పార్టీ సిద్ధాంతం. మన పార్టీ తనను తాను సైద్ధాంతికంగా మలుచుకుంటూ, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని తక్షణంగా విజయవంతం చేయడానికీ, సోషలిజం ద్వారా కమ్యూనిజాన్ని అంతిమంగా సాధించడానికీ కార్యకర్తలనూ, ప్రజలనూ కూడా ఇదే సిద్ధాంతంతో, మన సాధారణ రాజకీయ పంథాతో, విప్లవ బాటతో

విద్యావంతం చేస్తున్నది. అది ఒక ప్రజాసైన్యాన్ని (ప్రస్తుత మన ఉద్యమం వున్న దశలో పిఎల్‌జిఎ రూపంలో ఉంది), బీజ దశలో ఒక ఐక్య సంఘటననూ నిర్మించి వ్యూహాత్మక దృష్టితో మన దేశాన్ని విముక్తి చేయడానికి ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకుపోతోంది. అది ప్రజాసైన్య, ఐక్య సంఘటన కార్యకలాపాలను సమన్వయంతో నడుపుతూ విప్లవానికి సమర్థవంతమైన నాయకత్వాన్ని ఇవ్వడానికి ప్రయత్నిస్తుంది. కానీ మన ఉద్యమ పురోగమన క్రమంలో మన పార్టీ వివిధ కార్మికవర్గేతర ధోరణులకు గురయ్యి, మారుతున్న వస్తుగత, స్వీయాత్మక పరిస్థితులకు అనుగుణంగా పార్టీనీ, ప్రజాసైన్యాన్నీ, ప్రజలనూ తగినంతగా సన్నద్ధం చేయడంలో సమస్యలను ఎదుర్కొంటోంది. ఇవి దాని పురోగమనాన్ని అడ్డుకుంటున్నాయి. అందువల్ల మనం - మన స్వీయాత్మక శక్తులను పరిరక్షించుకుని వాటిని మరింతగా సంఘటితం చేయలేకపోతున్నాం; మన ప్రజాపునాదిని కాపాడుకుని దాన్ని మరింతగా విస్తరించి సంఘటితం చేసుకోలేకపోతున్నాం; పిఎల్‌జిఎ ను సంఘటితం చేసుకుని, దాన్ని మరింత విస్తరించి, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయలేకపోతున్నాం; విప్లవానికి అనుకూలంగా రోజురోజుకూ ప్రపంచంలోనూ, దేశంలోనూ పెంపొందుతున్న పరిస్థితులను సంపూర్ణంగా వినియోగించుకోలేకపోతున్నాం.

కాబట్టి, పార్టీలోని కార్మికవర్గేతర ధోరణులను పోగొట్టుకుని, ఈ బలహీనతలను అధిగమించడం కోసం మన సైద్ధాంతిక, రాజకీయ స్థాయిని పెంచే విధంగా మా-లె-మా అనే శాస్త్రీయమైన సిద్ధాంతంతో మన పార్టీని మరింతగా సాయుధం చేయడం మన ముందున్న అత్యంత ప్రముఖమైన కర్తవ్యం. గతితార్కిక చారిత్రక భౌతికవాద సిద్ధాంతాన్ని ఉపయోగించుకోవడం ద్వారానూ, దాన్ని ఒక పద్ధతిగా అమలు చేయడం ద్వారానూ ప్రపంచంలోనూ, దేశంలోనూ గల వస్తుగత పరిస్థితులనూ, మన ఉద్యమ స్వీయాత్మక పరిస్థితినీ  సరిగా అర్థం చేసుకుని విశ్లేషించడానికి ఇది మన పార్టీకి దోహదపడుతుంది. మనం మా-లె-మా సిద్ధాంతాన్ని మన దేశంలోని నిర్దిష్ట వస్తుగత పరిస్థితులకూ, మన నిర్దిష్ట విప్లవాచరణకూ అన్వయించాలి. ఈ వెలుగులో మాత్రమే మనం దేన్నైనా సరిగా అర్థం చేసుకుని, సరైన నిర్ణయాలు తీసుకుని, వాటిని సరిగా అమలు చేసి, పార్టీని ప్రజలతో సమైక్యం చేసి, ప్రజలను సమీకరించి, వర్గపోరాటాన్ని నిర్మించి, మన నాయకత్వ పద్ధతులనూ, పని శైలినీ మెరుగుపర్చుకుని, శాస్త్రీయంగా మన ఆచరణను విశ్లేషించి, సంశ్లేషించి, మన ఆచరణలో జరిగిన తప్పులను, పొరపాట్లను సరిదిద్దుకుంటూ మన స్వీయ అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుని, పార్టీని బలోపేతం చేసి ఉద్యమాన్ని మరింతగా  పురోగమింపజేయగల్గుతాం.

దీన్ని సాధించడానికి పార్టీని బోల్షవీకరించడం కీలకంగా వుంటుంది. మన పార్టీ కార్యకర్తల వర్గ పొందిక చాలా ఎక్కువగా రైతాంగ, పెటీబూర్జువా సామాజిక వర్గ నేపథ్యం నుండి వచ్చినదే. వారిపై బూర్జువా, పెటీబూర్జువా, భూస్వామ్య దృక్పథం, భావాలు, సంస్కృతి,

పని పద్ధతులు, పనిశైలి ప్రతికూల ప్రభావాన్ని వేస్తున్నాయి. అందువల్ల ఈ బోల్షివీకరణ అనేది నిరంతరంగా జరగాల్సిన ప్రక్రియగా ఉండాలి. ప్రస్తుతం, మనం ఈ బోల్షివీకరణను ఒక క్యాంపెయిన్ రూపంలో తీసుకోవాలి. మన ఉద్యమం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని అధిగమించడం కోసం, మన నష్టాలను తగ్గించుకోవడం కోసం, మన స్వీయాత్మక శక్తులను పెంచుకోవడం కోసం, ప్రజలను క్రియాశీలంగానూ, విస్తృతంగానూ సమీకరించడం కోసం, మన ఉద్యమం సెట్‌బ్యాక్ కు గురైన దగ్గరా లేదా మన ఉద్యమం బలహీనపడిన దగ్గరా దాన్ని పునరుద్ధరించడం కోసం, నూతన ప్రాంతాలకు విస్తరించడం కోసం, మన పిఎల్‌జిఎ నూ, ఐక్య సంఘటననూ బలోపేతం చేసుకుని ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడం కోసం, మన పార్టీ పట్ల, మన నూతన ప్రజాస్వామిక విప్లవం పట్ల మన దేశ ప్రజలకే కాక, ప్రపంచంలోని  విప్లవ క్యాంపుకంతటికీ ఉన్న ఆకాంక్షలను నేరవేర్చడం కోసం మనం ఈ బోల్షివీకరణ క్యాంపెయిన్ ను చేపట్టాలి.

మన విప్లవ బహుముఖ కర్తవ్యాలను విజయవంతంగా నెరవేర్చడం కోసం మనం ప్రజలను రాజకీయంగా, సమరశీలంగా విస్తృతంగా ప్రజాయుద్ధంలోకి సమీకరించి, నిర్మాణయుతం చేయాలి. ఇది సాధించడానికి మనం నెరవేర్చాల్సిన అత్యంత ప్రముఖమైన సైద్ధాంతిక కర్తవ్యం ఏమిటంటే ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకూ మూల కారణం ఈ అర్ధ-వలస, అర్ధ-భూస్వామ్య దోపిడీ వ్యవస్థలో కొనసాగుతున్న సామాజిక స్థితిగతుల్లోనూ, పాలకవర్గాలు అమలు చేస్తున్న విప్లవ ప్రతీఘాతుక సామ్రాజ్యవాద అనుకూల, దళారీ నిరంకుశ బూర్జువాజీ అనుకూల, భూస్వామ్య అనుకూల విధానాల్లోనూ ఉన్నాయనీ, కార్మికవర్గ అగ్రగామి పార్టీ అయిన సిపిఐ (మావోయిస్టు) నేతృత్వంలో అన్ని ప్రజాస్వామిక వర్గాలనూ, సామాజిక సెక్షన్లనూ ఐక్యం చేసి ఈ వ్యవస్థను ధ్వంసం చేయనిదే వారికి విముక్తి లేదనీ ప్రజలను నిర్ద్వంద్వంగా ఒప్పించడం. అప్పుడు ప్రజలు సామాజిక, ఆర్థిక, రాజకీయ ఉద్యమాల్లోకి సమీకరించబడుతారు. సంఘటితం అయిన ప్రజల మధ్య పార్టీ తన కార్యకర్తలను తయారు చేసుకుని దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఒక్కొక్క మెట్టుగా విస్తరించి ప్రజాయుద్ధాన్ని విజయం వైపుగా పురోగమింపజేయాలి.

మన పార్టీ కార్యకర్తలకు మన ప్రాపంచిక దృక్పథం పట్ల మరింత స్పష్టతనూ, శాస్త్రీయమైన అవగాహననూ పెంపొందించడానికి మనం సైద్ధాంతిక, రాజకీయ అధ్యయనాన్నీ, శిక్షణనూ మొత్తం పార్టీలో ఒక క్యాంపెయిన్ గా చేపట్టాలి. అధ్యయనానికీ, శిక్షణకూ అవసరమైన విప్లవ సాహిత్యాన్ని ఆయా స్థాయిలకు అనుగుణంగా ఏమేమి ఇవ్వాలి అనేది మనం నిర్ణయించాలి. మా-లె-మా, పార్టీ కార్యక్రమం, పార్టీ నిబంధనావళి, భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు, పార్టీ చరిత్రల పట్ల మన అవగాహనను లోతుగా పెంపొందింపజేసుకోవడం కోసం మనం వీటిని చేపట్టాలి. ఉన్నత స్థాయి నాయకత్వం (కేంద్రకమిటీ, రాష్ట్ర స్థాయి) మా-లె-మా అధ్యయనాన్నీ, గత-ప్రస్తుత ప్రపంచ విప్లవ

అనుభవాల, మారుతున్న నిర్దిష్ట సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితుల అధ్యయనాన్నీ చేపట్టాలి. పార్టీ, పిఎల్‌జిఎ, ఐక్య సంఘటనల సైద్ధాంతిక, రాజకీయ అవగాహనా స్థాయిని పెంచడం ద్వారా మనం ఏకీకృత ఆలోచనా విధానాన్నీ, ఆచరణనూ, పోరాట చేవనూ పెంపొందించాలి.

కార్మికవర్గ క్రమశిక్షణ పార్టీలో సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపరమైన ఐక్యతకు హామీగా నిలుస్తుంది. అది అన్ని స్థాయిల్లోనూ మన సాధారణ రాజకీయ పంథానూ, విధానాలనూ, పైనుండి వచ్చే నిర్ణయాలనూ దృఢంగా అమలు పరచడానికి ముందు షరతుగా వుంటుంది. అందుకని మన పార్టీలో, పిఎల్‌జిఎలో, పార్టీ ఫ్రాక్షన్లలో కార్మికవర్గ క్రమశిక్షణా స్థాయిలను మెరుగుపర్చడానికి క్రమశిక్షణా సూత్రాలూ, స్టాండింగ్ ఆర్డర్లూ అమలు జరిగేలా మనం చూడాలి. రోజువారీ జీవితంలో క్రమశిక్షణకు సంబంధించిన అంశాల్లో చెప్పుకోదగిన మార్పును తీసుకురావడంలో నాయకత్వం ముందుండి నేతృత్వం వహించాలి. విప్లవ చేవతో కూడిన క్రమశిక్షణ అమలును ప్రోత్సహించడానికి మనం కమ్యూనిస్టు ఆదర్శాలు, విలువలు, సంస్కృతి గురించిన విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

మన పార్టీలో వివిధ స్థాయిల్లో, వివిధ మోతాదుల్లో, వివిధ రూపాల్లో కొనసాగుతున్న స్వీయాత్మకత, యాదృచ్ఛికత, ఉదారవాదం, ఒంటెత్తుపోకడ, పెత్తందారీతనం, పితృస్వామ్యం మొదలైన కార్మికవర్గేతర ధోరణులను పోగొట్టుకునేందుకు అవసరమైన చోట, అవసరమైన సమయంలో నిర్దిష్ట దిద్దుబాటు క్యాంపెయిన్ లను చేపట్టడం, మన ఆచరణనూ, నిర్ణయాలనూ ప్రతి సమావేశంలోనూ సమీక్షించడం, లోతైన విమర్శ-ఆత్మవిమర్శ చేసుకోవడం అనే మార్గాలను ఎంచుకోవాలి. ఈ క్యాంపెయిన్ లలో విజయవంతం కావడానికి మనం సైద్ధాంతిక, రాజకీయ, మిలటరీ, నిర్మాణపర విద్య/శిక్షణ లపైనా, వ్యక్తిగత స్థాయి సహా ప్రతి స్థాయిలోనూ నిర్దిష్ట ఆచరణను సమీక్షించడం పైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

కామ్రేడ్స్ తమ ఫంక్షనింగ్ (పని) శైలిలోనూ, జీవనశైలిలోనూ విప్లవాత్మక మార్పును తేవడానికి పాటుపడాలి. అంటే దీనర్థం ఆచరణలో మనం ఎదుర్కొనే అసంఖ్యాక గడ్డు పరిస్థితుల మధ్యనే మనం ప్రతి ఒక్క కర్తవ్యాన్నీ బోల్షవిక్ స్పిరిట్ తోనూ, సామర్థ్యంతోనూ పరిపూర్తి చేయాలి అని. ఇటువంటి పని శైలిని సాధించడం ప్రతి ఒక్క కామ్రేడ్ లక్ష్యంగా ఉండాలి.

మన పార్టీలో కొన్ని చోట్ల మితవాద అవకాశవాద, పోస్ట్-మాడర్నిస్టు (ఆధునికానంతరవాద) ధోరణులు తలెత్తుతున్నాయి. మన ఉద్యమంపై పాలకవర్గాల దాడి పెరుగుతూ, మన ఉద్యమం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్న నేటి స్థితిలో ప్రత్యేకించి ఇటువంటి ధోరణులు తలెత్తే ప్రమాదం ఉంటుంది. పైనుండి కింది వరకూ మన మొత్తం పార్టీ ఇటువంటి ధోరణుల విషయంలో అత్యంత అప్రమత్తంగా వుంటూ వాటిని తిప్పికొట్టాలి. మరోవైపు,

ప్రజల మధ్య చేసే కృషిలోనూ, పార్టీకీ ప్రజలకూ మధ్య సంబంధాల్లోనూ, మన పార్టీలోని అంతర్గత సంబంధాల్లోనూ ఒంటెత్తు పోకడ, పెత్తందారీ ధోరణులు ప్రబలినప్పుడు మన ప్రజాపునాది బలహీనపడుతోంది, మన పార్టీ ఐక్యత వేర్వేరు మోతాదుల్లో దెబ్బతింటోంది. మనం ఒంటెత్తు పోకడ, పెత్తందారీ ధోరణులకు వ్యతిరేకంగా కూడా పోరాడి వాటిని సరిచేసుకోవాలి. ఇందుకోసం అంతర్గత పోరాటాల్లో/రెండు పంథాల మధ్య పోరాటాల్లో, దిద్దుబాటు ఉద్యమాల్లో మన పార్టీ గడించిన అనుభవాలను మనం అధ్యయనం చేయాలి.

మన ఉద్యమ క్రమంలో ఎదుర్కొనే నిర్దిష్ట సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించడంలో మార్గదర్శకత్వం వహించడం కోసం నాయకత్వం ఫీల్డులో కింది స్థాయి కార్యకర్తలతో పాటు తిరగడానికి ప్లాన్ చేసుకోవాలి. దీనర్థం మారుతున్న నిర్దిష్ట సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను, మారుతున్న మన ఉద్యమ నిర్దిష్ట స్థితిగతులను, సామ్రాజ్యవాదుల, ప్రపంచవ్యాప్తంగా గల అభివృద్ధి నిరోధకుల విప్లవ ప్రతీఘాతుక ఎల్ఐసీ విధానాన్ని అమలు పరచడంలో భాగంగా శత్రువు అమలు చేస్తున్న బహుముఖ దాడి వ్యూహం-ఎత్తుగడలు మొదలైనవాటిని అర్థం చేసుకోవడం అని. ఈ ఫీల్డు ట్రెయినింగ్ కాలంలో బోల్షివీకరణ క్రమాన్ని నిర్దిష్టంగా అన్వయించడం పట్ల నాయకత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

మనం వివిధ క్యాంపెయిన్ లను చేపట్టినప్పుడు మన పురోగమనాన్ని అడ్డుకుంటున్న వివిధ బలహీనతలనూ, వాటి సైద్ధాంతిక మూలాలనూ నాయకత్వం గుర్తించాలి. వాటిని అధిగమించడం కోసం వారు కింది స్థాయి కార్యకర్తలను విద్యావంతం చేయాలి. వారు ముందుండి నాయకత్వం వహిస్తూ, మార్గదర్శకత్వం యిస్తూ, మోటివేట్ చేస్తూ (ప్రేరణనందిస్తూ) తమ కర్తవ్యాలను విజయవంతంగా పరిపూర్తి చేయడంలో కార్యకర్తలకు సహాయాన్ని అందించాలి. అటువంటి నాయకత్వ కృషి ద్వారా మనం వివిధ క్యాంపెయిన్ లను విజయవంతంగా పూర్తి చేయాలి.

మనం అన్ని స్థాయిల్లోనూ నాయకత్వ, స్వీయాత్మక శక్తుల అనవసర నష్టాలను నివారించాలి. మన స్వీయాత్మక శక్తులను, ప్రత్యేకించి నాయకత్వ శక్తులను పరిరక్షించుకోవడం అనేది మన ముందున్న అత్యంత ప్రముఖమైన కర్తవ్యాల్లో ఒకటి. పైనుండి కింది దాకా ఇంత పెద్ద సంఖ్యలో మన శక్తుల తీవ్రమైన నష్టాలకు దారి తీసిన మన గత పొరపాట్లనూ, ప్రస్తుతం కొనసాగుతున్న బలహీనతలనూ మనం సమీక్షించాలి. మన ఉద్యమ ప్రస్తుత స్థితికి ఒక ప్రముఖ కారణం మన స్వీయాత్మక శక్తులను, ప్రత్యేకించి మన నాయకత్వాన్నీ పరిరక్షించుకోవడంలోని మన వైఫల్యమే. ప్రస్తుతమున్న శక్తులను పరిరక్షించుకోకుండా పార్టీని విజయవంతంగా బోల్షివీకరించడం అనే కర్తవ్యాన్నే కాదు, మరే ఇతర కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడమైనా ఎంతో కష్టంగా ఉంటుంది. మనం అన్ని

స్థాయిల్లోనూ ఒక పథకం ప్రకారం రెండవ స్థాయి (సెకండరీ) నాయకత్వాన్ని అభివృద్ధి పరచడానికి అన్ని విధాలా కృషి చేయాలి. అదే సమయంలో మనం పార్టీని నూతన సభ్యులను చేర్చుకుని విస్తరించాలి.

మన దేశంలో కుల, మత, సామ్రాజ్యవాద సంస్కృతులు మన ప్రజల పోరాటచేవను దెబ్బ తీస్తున్నాయి. అవి మన ప్రజలపై ప్రతికూల ప్రభావాన్ని వేయడమే కాక మన స్వీయాత్మక శక్తులలోకి కూడా వివిధ మోతాదుల్లో ప్రవేశించి వారి విప్లవ చైతన్యాన్ని మొద్దుబారుస్తున్నాయి. మన పార్టీలోనూ, పిఎల్‌జిఎ లోనూ నూతన ప్రజాస్వామిక, కమ్యూనిస్టు విలువలు దిగజారడానికి ఇవి ఒకానొక కారణం. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి మనం ప్రత్యేకించి పార్టీలో, పిఎల్‌జిఎ లో, అన్ని విప్లవ ప్రజాసంఘాల్లో, ఆర్పీసీల్లో, సాధారణ ప్రజల్లోనూ నూతన ప్రజాస్వామిక సంస్కృతి, విలువలనూ, సోషలిస్టు సంస్కృతి, విలువలనూ పెంపొందించాలి. పతనమైన భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతులను తిప్పికొట్టడానికి విప్లవ సాంస్కృతిక రంగాన్ని మనం బలోపేతం చేయాలి. మన సాంస్కృతిక సంఘాలు తగిన రూపాలను ఎంచుకుని విప్లవ సంస్కృతిని అభివృద్ధి చేయడంలో కీలకమైన పాత్రను పోషించాలి. మన పార్టీని బోల్షివీకరించడంలో భాగంగా సంస్కృతికి సంబంధించిన అంశాల విషయంలో అధ్యయనం, రాజకీయ తరగతులు, ఉపన్యాసాలు మొదలైనవి విస్తృతంగా చేపట్టాలి. అందుబాటులో ఉన్న విప్లవ సాహిత్యాన్ని కార్యకర్తల మధ్య పంచే విషయంలో కమిటీలు శ్రద్ధ పెట్టాలి. ప్రతి కమిటీ చేపట్టే సైద్ధాంతిక, రాజకీయ, సాంస్కృతిక కృషిలో ఈ సాంస్కృతిక, సాహిత్య కృషి విడదీయరాని భాగంగా మారాలి.

మన బలగాలు కలిసినప్పుడూ, విడిపోయేటప్పుడూ, వివిధ శిక్షణా క్యాంపులు, సమావేశాల సందర్భంగానూ నాయకత్వ కామ్రేడ్స్ కార్యకర్తలను మోటివేట్ చేయడానికి చిన్న, ఉత్తేజకరమైన ఉపన్యాసాలను ఇవ్వాలి. అన్ని రంగాల్లోని మన కార్యకర్తలు ఎల్లవేళలా విప్లవోత్సాహంతో, చేవతో తొణికిసలాడేలా వారు చూడాలి.

నాయకత్వంపై కార్యకర్తలకూ, ప్రజలకూ, మొత్తం పార్టీ పైన ప్రజలకూ విశ్వాసం పెంపొందించే విధంగా మనం మన పార్టీని బోల్షివీకరించాలి. మన ఉద్యమ ప్రస్తుత గడ్డు పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోవడంలో, కార్మికవర్గేతర ధోరణులను సరిదిద్దుకోవడంలో, సమస్యలను పరిష్కరించడంలో, విజయం వైపు పురోగమనంలో ఎన్ని అడ్డంకులనైనా ఎదుర్కోవడంలో మొత్తం పార్టీ, ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ఇది పెంపొందించాలి.

మొత్తం పార్టీ బోల్షివీకరించబడినప్పుడు - మన అవగాహనలో, ఆచరణలో దొర్లిన పొరపాట్లను సరిచేసుకోవడం ద్వారా, ఎంతో రక్తం చిందించి మనం పొందిన అమూల్యమైన స్వీయ అనుభవాల నుండి నేర్చుకోవడం ద్వారా మన పార్టీ, పిఎల్‌జిఎ విస్తరించి, బలోపేతం అయ్యి, సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించగలవు, మన ఉద్యమం దేశవ్యాప్తంగా

విస్తరించగలదు, మనం స్థావర ప్రాంతాలను నిర్మించి, విప్లవాన్ని విజయవంతం చేయగల్గుతాం అనే ఆత్మవిశ్వాసాన్ని అది ప్రజల్లో కూడా పెంపొందించగల్గుతుంది.

**2. వర్గపంథాకూ, ప్రజాపంథాకూ దృఢంగా అంటిపెట్టుకోవడం ద్వారా మన ప్రజాపునాదిని బలోపేతం, విస్తృతం చేసుకుందాం**

మన మొత్తం పార్టీని బోల్షివీకరించడంలో భాగంగా, ప్రజాసంఘాల్లో, ఆర్పీసీల్లో, ఐక్య సంఘటనా వేదికల్లో ఉన్న పార్టీని బోల్షివీకరించే కర్తవ్యాన్ని చేపట్టాలి. దీని లక్ష్యం అక్కడి పార్టీ సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపర స్థాయిలను పెంపొందించడంగా ఉండాలి. ఆ విధంగా మనం దాని అవగాహననూ, ప్రజలకు నాయకత్వం వహించడంలో దాని సామర్థ్యాన్నీ మెరుగుపర్చగల్గుతాం.

మన దేశవ్యాప్త విప్లవోద్యమం ఎదుర్కొంటున్న ప్రస్తుత గడ్డు పరిస్థితికి ఒకానొక ముఖ్యకారణం ప్రజాపునాది బలహీనపడడం. ఉద్యమం దేశంలోని వివిధ భాగాల్లో వివిధ స్థాయిల్లో కొనసాగుతుండడం వల్ల ప్రజాపునాది విస్తృతిలో కూడా దానికనుగుణంగా తేడాలు ఉన్నాయి.

ఆర్పీసీలపై, దేశవ్యాప్తంగా గల వివిధ ప్రజాసంఘాలపై శత్రుదాడి తీవ్రతరమవుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంఘాలపై నిషేధం విధించి మూడు దశాబ్దాలు దాటుతోంది. పదుల వేల విప్లవ, ప్రజాస్వామిక ప్రజాసంఘాల నాయకులూ, సభ్యులూ హత్య గావించబడ్డారు, చిత్రహింసలకు గురిచేయబడ్డారు, జైళ్లపాలయ్యారు. తప్పుడు కేసుల్లో ఇరికించబడి వారిలో చాలామంది కఠిన శిక్షలను ఎదుర్కొంటున్నారు. ఊచకోతలూ, సామూహిక అత్యాచారాలు, సాయుధ బలగాలచే లూటీ, విధ్వంసం అనేవి రోజువారీ విషయాలుగా మారిపోయాయి.

ఇటువంటి నిర్బంధ చర్యల వెనుక పాలకవర్గాల లక్ష్యం ప్రజల నుండి మనల్ని వేరుపరిచి మన ప్రజాపునాదికి తూట్లు పొడవడం. అందువల్ల మన ఎత్తుగడలు శత్రువుకు వ్యతిరేకంగా విశాల ప్రజానీకాన్ని ఐక్యం చేసేవిగా, ప్రధాన శత్రువును ఒంటరిని చేసేవిగా, శత్రువుల మధ్య వైరుధ్యాలను ఉపయోగించుకునేవిగా వుండాలి. ఈ ఎత్తుగడలు ప్రజలను విస్తృత స్థాయిలో రాజకీయంగా సమీకరించేందుకూ, వారిని సంఘటితం చేసేందుకూ దోహదపడేవిగా ఉండాలి. మనం కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రజాసంఘాలలోని, ఆర్పీసీలలోని నాయకత్వ శక్తులను పరిరక్షించుకోవడానికి పాటుపడాలి.

మన సాధారణ రాజకీయ పంథాను అనుసరించి మనం కార్మికవర్గాన్నీ, భూమిలేని, పేద రైతులనూ రాజకీయంగా సమీకరించడానికి ప్రాధాన్యతను ఇవ్వాలి. మనం మధ్యతరగతి రైతాంగాన్నీ, పట్టణ పెటీబూర్జువాజీనీ సమీకరించడానికి అన్ని విధాలా కృషి చేయాలి. ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభం నాలుగు వర్గాల కూటమిలో భాగమైన ధనిక రైతాంగం

పైనా, జాతీయ బూర్జువాజీ పైనా ప్రతికూల ప్రభావాన్ని వేస్తోంది. అందుకని వారి డిమాండ్లను ముందుకు తేవడానికి కూడా సమయం మరింత అనుకూలంగా ఉంది. ప్రజల పట్ల, ప్రజాయుద్ధం పట్ల వారి వైఖరిని అనుసరించి ఈ వర్గాలలోని ఒక సెక్షన్ ను గెలుచుకునే, ఒక సెక్షన్ ను కనీసం తటస్థంగా ఉంచే, మిగిలిన సెక్షన్ ను ఒంటరిని చేసేలాంటి ఎత్తుగడలను మనం తీసుకోవాలి. విప్లవ, ప్రజాస్వామిక సంస్థలనూ, శక్తులనూ, వ్యక్తులనూ ఒక దగ్గరకు చేర్చగల తగిన ఐక్య సంఘటనా వేదికలను వివిధ సమస్యలపై ఏర్పరచడంపై మనం ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మనల్ని ప్రజల నుండీ, మిత్ర సంస్థలు, శక్తుల నుండీ వేరు చేసి ఒంటరిని చేయడానికి పాలకవర్గాలు అన్ని రకాల కుట్రలకూ, ఫాసిస్టు దాడులకూ పూనుకుంటున్నప్పుడు, మన ఆచరణ వారితో మరింతగా సమైక్యం అవ్వడం చుట్టూ కేంద్రీకృతం కావాలి.

మన వ్యూహాత్మక ప్రాంతాలన్నిటా మనం ప్రజాపునాదిని విస్తరించి విముక్తి ప్రాంతాలను స్థాపించే లక్ష్యంతో ఆర్పీసీలను నిర్మించి, సంఘటితం చేసి విస్తరించాలి. పతనమైన పాలక వ్యవస్థకు వ్యతిరేకంగా విశాల ప్రజారాశులను ఐక్యం చేయడంలో, తగిన ఐక్య సంఘటనా వేదికలను నిర్మించడంలో, వాటిలో పార్టీ నాయకత్వాన్ని స్థాపించడంలో, వాటిని విస్తరించడంలో జరుగుతున్న లోపాలను మనం అధిగమించాలి. ప్రజలతో సమైక్యం కావడంలోనూ, వర్గపంథానూ, ప్రజాపంథానూ అమలు చేయడంలోనూ మనం చేస్తున్న వివిధ రకాల పొరపాట్లను మనం సరిచేసుకోవాలి. ప్రజల్లో పని చేసే సమయంలో మనం ఒంటెత్తు పోకడ, పెత్తందారీ ధోరణులను విడనాడాలి. ఈ ధోరణులు మనల్ని వారి నుండి వేరుపరచడమే కాక వారి చొరవను కూడా అడ్డుకుంటున్నాయి. ప్రజల ప్రయోజనాలకు హాని చేసే ఎటువంటి తప్పుడు రాజకీయ, మిలటరీ చర్యలనైనా మనం కచ్చితంగా చేపట్టకోడదు. మనం విమర్శ-ఆత్మవిమర్శ సెషన్లనూ, విద్యా-దిద్దుబాటు క్యాంపెయిన్లనూ పార్టీలోపలే కాక ఒంటెత్తు పోకడ, పెత్తందారీతనం, ఇతర తప్పుడు ధోరణులను సరిచేసుకోవడానికి గాను వాటిని ప్రజాసంఘాల్లోనూ చేపట్టాలి.

ప్రస్తుత సమయంలో మన ప్రచారంలోని ప్రధానాంశం ఆపరేషన్ గ్రీన్‌హంట్ అన్యాయ స్వభావం పైనా, మన ప్రజాయుద్ధ న్యాయబద్ధత పైనా కేంద్రీకరించి ఉండాలి. ప్రజాస్వామ్యానికీ, ప్రగతికీ, శాంతికీ, అన్ని పీడిత వర్గాల, సామాజిక సెక్షన్ల ప్రయోజనాలకూ ఈ శత్రుదాడి వ్యతిరేకమైనదనే అంశంపైనా, సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువాల, భూస్వాముల ప్రయోజనాలను నెరవేర్చడానికే ఆపరేషన్ గ్రీన్‌హంట్ కొనసాగుతోందనే అంశం పైనా అది ఆధారపడి సాగాలి.

మన ఆందోళనల ప్రధాన దిశ ప్రజలను భూమి, విస్థాపన సమస్యల మీద కదిలించడంగా ఉండాలి. తీవ్రతరమౌతున్న ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభం ఫలితంగా ముందుకు వస్తున్న అసంఖ్యాక సమస్యల చుట్టూ మన ప్రచారాందోళనల్ని కొనసాగించడానికి మనం కృషి

చేయాలి. ఈ సమస్యలపై ప్రజలు ఆందోళన చేస్తున్నప్పుడు మనం వారికి మద్దతునివ్వడానికీ, వాటిలో జోక్యం చేసుకోవడానికీ, వాటికి నాయకత్వం వహించడానికీ ప్రయత్నించాలి.

మనం వివిధ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ సమస్యలపై ప్రచారాందోళనలను చేపట్టాలి. మావోయిస్టు రాజకీయ ఖైదీల సంఖ్యే పదివేలకు పైగా ఉండగా, కశ్మీరు, ఈశాన్య ప్రాంతాలు, ఇతర ప్రజాస్వామిక ఉద్యమాల రాజకీయ ఖైదీల సంఖ్య మరెన్నో వేలుగా ఉంటుంది. వీరిలో తొంభై శాతం పైగా సామాన్య ప్రజానీకమే ఉంటారు. వారు మన దేశంలోని వివిధ జైళ్లలో మగ్గిపోతూ, ఎటువంటి హక్కులూ లేకుండా అత్యంత అమానుషమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. అందుకని వారి బేషరతు విడుదలను డిమాండ్ చేస్తూ ఉద్యమాలను నిర్మించడానికీ, జైళ్లలో వారు చేస్తున్న పోరాటాలకు మద్దతుగా ఉద్యమాలను నిర్మించడానికీ మనం అత్యంత ప్రాధాన్యతను యివ్వాలి. అదే సమయంలో, వారిని త్వరగా విడుదల చేయించడానికి అవసరమైన లీగల్ సహాయాన్నంతా అందించడానికి అన్ని విధాలా మనం కృషి చేయాలి. పౌరహక్కుల కోసం, ప్రజాఉద్యమాలపై రాజ్యహింసకు వ్యతిరేకంగా, నిరంకుశ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను పెద్దెత్తున చేపట్టాలి. పౌరహక్కుల ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి మనం అదనంగా మరింత కృషి చేయాలి. ఇవన్నీ చేస్తూనే సిసలైన ప్రజాస్వామ్యం గురించీ, పౌరహక్కులకు నూతన ప్రజాస్వామిక విప్లవం మాత్రమే హామీగా నిలవగలదనే వాస్తవం గురించీ విస్తృతంగా ప్రచారం చేయాలి.

మనల్ని ప్రజల నుండి వేరుపర్చడానికి ఉద్దేశింపబడిన బూటకపు సంస్కరణల కార్యక్రమాలను మనం నిరంతరంగా బహిర్గతపరుస్తూ ఉండాలి. మనం ప్రజలను వర్గపోరాటాల్లోకి సమీకరించాలి, విప్లవకర భూసంస్కరణలను చేపట్టాలి, ప్రజల్లో నిరంతరం రాజకీయ కృషిని చేపట్టి వారిని సంఘటితం చేయాలి. ఈ క్రమం లేకుండా ఈ సంస్కరణల బూటకపు స్వభావాన్ని ప్రజలు గ్రహించడం కష్టం అవుతుంది. మనం పాలకవర్గాల బూటకపు అభివృద్ధి నమూనానూ, మనం సిఫారసు చేస్తున్న సిసలైన ప్రజానుకూల అభివృద్ధి నమూనానూ సైద్ధాంతికంగా, రాజకీయంగా ఎదురెదురుగా నిలిపి వాదించాలి. కర్ర-కంద విధానానికి నిర్బంధం-సంస్కరణలు రెండు పార్శ్వాలు అని మనం ప్రజల్ని ఒప్పించాలి. ఆచరణలో మనం ప్రజలతో ప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ వారి సంక్షేమాన్నీ, విముక్తినీ దృఢంగా సమర్థించేదీ, వాటి కోసం పోరాడేదీ మనమే అనీ, మనం వారి సంక్షేమానికి వ్యతిరేకులం కామనీ వారిని ఒప్పించాలి. అదే సమయంలో ప్రజలను పట్టుబట్టి బూటకపు సంస్కరణల వైపు మళ్లించడానికి ప్రయత్నించే వర్గ శత్రువులతోనూ, పాలకవర్గ ఏజెంట్లుగా వ్యవహరించే వారితోనూ వర్గపోరాటంలో ఒక విడదీయరాని భాగంగా మనం ఎటువంటి ఉదారవాదం లేకుండా వ్యవహరించాలి.

ప్రభుత్వ సంస్కరణల విషయంలో మన ఎత్తుగడలు ప్రజల చైతన్యాన్ని బట్టీ, ఆ ప్రాంతంలో మన ఉద్యమ బలాబలాలను బట్టీ మారవచ్చు. అయితే మన విధానమూ, దిశా మారవు. మన ప్రతిఎత్తుగడల లక్ష్యం ప్రజలను ఐక్యం చేయడంగా, పాలకవర్గాల పార్టీలకు ఒక సామాజిక పునాది ఏర్పడకుండా అడ్డుకోవడంగా, ప్రజల విప్లవ చైతన్యాన్ని జాగృతం చేయడంగా, సిసలైన సంస్కరణలను సాధించడానికి ఏకైక మార్గమైన ప్రజాయుద్ధంలోకి వారిని సమీకరించడంగా ఉండాలి.

ప్రజల మధ్య సైద్ధాంతిక, రాజకీయ గందరగోళాన్ని వ్యాపింపజేసి, వారిని మన ఉద్యమం నుండి దూరం చేయడానికి ఉద్దేశించబడిన శత్రు సైకలాజికల్ ఆపరేషన్స్ ను మనం బలంగా తిప్పికొట్టాలి. శత్రు తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టే విప్లవ ప్రచారం విస్తృతంగా, సృజనాత్మకంగా, వివిధ రూపాల్లో కొనసాగాలి.

పార్లమెంటరీ వ్యవస్థ బూటకత్వాన్ని బహిర్గతపర్చడానికి గల ప్రతి ఒక్క అవకాశాన్నీ మనం వినియోగించుకోవాలి. మనం ఏ స్థాయిలోనైనా గానీ, ఏ సాకుతోనైనా గానీ ఎన్నికల బాటను ఒక పరిష్కారంగా ఎన్నడూ సూచించకోడదు. ప్రజలను సమీకరించి, వారి బలంపై ఆధారపడి సమస్యలను పరిష్కరించడానికి బదులుగా లాబీయింగ్ కోసం చేసే ఎటువంటి ప్రయత్నాలనైనా మనం దృఢంగా వ్యతిరేకించాలి.

మనం పట్టణ ప్రాంతాల్లో మిగిలి ఉన్న శక్తులను మన అర్బన్ పాలసీ (పట్టణాల పనివిధానం) డాక్యుమెంటులో రూపొందించుకున్న ఎత్తుగడల సూత్రాలనూ, ఫంక్షనింగ్ పద్ధతులనూ పాటించడం ద్వారా పరిరక్షించుకోవాలి. మనం ఓపికతోనూ, వ్యూహాత్మక దృష్టితోనూ పని చేస్తే పట్టణ ఉద్యమాన్ని నిర్మించాలి.

ప్రజల్లో చేసే కృషి (మాస్‌వర్క్) లో భాగంగా మనం అన్ని స్థాయిల్లోని ప్రజాసంఘాలనూ క్రియాశీలం చేసి, అవి క్రమం తప్పకుండా పని చేసేలా వాటికి మార్గదర్శకత్వం అందించాలి. ప్రజల్లో కృషీ, సాయుధ ప్రతిఘటనా ఏకకాలంలో కొనసాగాలి. ఆపరేషన్ గ్రీన్‌హంట్ ను ఓడించి, ఉద్యమాన్ని పురోగమింపజేయడం అనే ఏకైక లక్ష్యంతో అన్ని రాజకీయ, నిర్మాణపర, మిలటరీ కర్తవ్యాలనూ సమన్వయంతో పరిపూర్తి చేయాలి.

కార్పెట్ సెక్యూరిటీ ప్రాంతాల్లో మనం తగిన పార్టీ, గెరిల్లా ఫార్మేషన్ల రూపాలను చేపట్టడానికీ, తగిన పోరాటరూపాలను చేపట్టడానికీ అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలి. కార్యకర్తల ఎంపిక పట్లా, వారి రాజకీయ-మిలటరీ శిక్షణ పట్లా మనం ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కచ్చితమైన రహస్య ఫంక్షనింగ్ పద్ధతులను అమలు చేయడం ద్వారా ఈ కార్పెట్ సెక్యూరిటీ ప్రాంతాల్లో మన ఫంక్షనింగ్ పద్ధతుల్లో జరుగుతున్న లోపాలను మనం సరిచేసుకోవాలి. రహస్య ప్రజాసంఘాలకు ప్రాధాన్యతను ఇస్తూనే, మనం ఆ ప్రాంత, ఉద్యమ నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా విశాల ప్రాతిపదికన వివిధ ఐక్య సంఘటనా వేదికలను

నిర్మించి విశాల ప్రజారాశులను సమీకరించాలి.

ఉద్యమ ప్రాంతాలన్నిటా మనం వ్యవసాయ విప్లవ కార్యక్రమం ఆధారంగా భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను తీవ్రతరం చేయలి. మనం పోరాటాలను చేపడుతున్నప్పటికీ వాటిని నిరంతరాయంగా కొనసాగించడంలో మననుండి సుదీర్ఘకాలంగా తీవ్రమైన లోపాలు కొనసాగుతూ వస్తున్నాయి. ఇతర ముఖ్యమైన లోపాలు - ఈ పోరాటాల నుండి ముందుకొచ్చే శక్తులను సంఘటితం చేయకపోవడం, ఐక్య సంఘటన వేదికల్లో మన నాయకత్వాన్ని స్థాపించకపోవడం, లీగల్-ఇల్లీగల్ (చట్టబద్ధ-చట్టవ్యతిరేక) కార్యకలాపాల సమన్వయం కోసం తగిన పద్ధతులను అభివృద్ధి చేయకపోవడం. ఈ లోపాలను సరిచేసుకోవాలి. ఈ వర్గపోరాటంలో మనం కేవలం రహస్య, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పరిమితం కాకోడదు. మనం వివిధ పీడిత వర్గాలనూ, సామాజిక సెక్షన్లనూ సమీకరించగల ఐక్య సంఘటన కార్యకలాపాలను విశాల ప్రాతిపదికన కొనసాగించాలి. ఐక్య సంఘటన కార్యకలాపాల్లో మన నాయకత్వాన్ని స్థాపించడానికీ, మన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికీ, మన స్వీయశక్తి మీద ఆధారపడి పురోగమించడానికీ ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. మనం బహిరంగ, రహస్య నిర్మాణ, పోరాట రూపాలను రెండింటినీ వినియోగించుకోవాలి. ఐక్య సంఘటనా వేదికల్లో మనం ఎల్లప్పుడూ ప్రజాస్వామిక పద్ధతులకు కట్టుబడి ఉంటూ ఎటువంటి ఒంటెత్తు పోకడా, పెత్తందారీతనమూ లేకుండా చూసుకోవాలి. మనం ఈ వేదికల్లో ఇతర సంస్థల నుండీ, శక్తుల నుండీ తలెత్తగల అటువంటి ధోరణులను బహిర్గతపరిచి వాటికి వ్యతిరేకంగా పోరాడాలి. విశాల ప్రజానీకం, ప్రత్యేకించి మేధావుల, ప్రజాస్వామిక శక్తుల మద్దతునూ, సంఘీభావాన్నీ కూడగట్టడం పట్ల మనం శ్రద్ధ వహించాలి. ఎందుకంటే పోరాడే ప్రజలకూ, సంస్థలకూ అవి ఎంతో కీలకంగా ఉంటాయి.

మనం పోరాటాలను రాజ్య వ్యతిరేక పోరాటాలుగా మలచడానికి కృషి చేయాలి. ప్రజా ఉద్యమాల్లో ముందుకొచ్చే పురోగామి శక్తులను సంఘటితం చేసి, వాటి నాయకత్వంగా అభివృద్ధి పరచి తద్వారా మన ప్రజాపునాదిని బలోపేతం, విస్తృతం చేసుకోవాలి. ఎంపిక చేసిన సమర్థులైన వ్యక్తులను గ్రామీణ ప్రాంతాల్లోనూ, ప్రజాసైన్యంలోనూ పని చేయడానికి తయారు చేసి పంపాలి. విప్లవ ప్రజాసంఘాల నాయకత్వమూ, ప్రజాసంఘాల్లోని మన పార్టీ ఫ్రాక్షన్లూ ఈ అవగాహనతో పని చేయాలి.

### 3. పిఎల్‌జిఎ ని సంఘటితపరచి, శత్రుదాడిని తిప్పికొట్టడం ద్వారా సాయుధ వ్యవసాయక విప్లవ యుద్ధాన్ని పురోగమింపజేయండి

మన మొత్తం పార్టీని బోల్షివీకరించడంలో భాగంగా, పిఎల్‌జిఎ లో పార్టీ బోల్షివీకరణను చేపట్టాలి. దీని లక్ష్యం దాని సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపర, మిలటరీ స్థాయిలను పెంపొందించడంగా ఉండాలి. ఆ విధంగా మనం పిఎల్‌జిఎ అవగాహననూ, దాని పోరాట

సామర్థ్యాన్నీ మెరుగుపర్చగల్గుతాం. తమ పోరాట సామర్థ్యాన్ని పెంచుకోవడానికి మనం పిఎల్‌జిఎ శక్తులకూ, తమ కమాండింగ్ సామర్థ్యాన్ని మెరుగుపర్చుకోవడానికి కమిషన్లు, కమాండ్లకూ మనం సహాయం చేయాలి. అంటే మనం కౌంటర్-ఇన్‌సర్జన్సీ, కౌంటర్-గెరిల్లా యుద్ధంలో జరుగుతున్న మార్పులను నిరంతరం అధ్యయనం చేయడంలో, శత్రు బలహీనతలను కనిపెట్టడంలో, వీటిపై ఆధారపడి శత్రుదాడిని తిప్పికొట్టడంలో వారికి సహాయం చేయాలి.

పిఎల్‌జిఎ లో పై నుండి కింది వరకు అన్ని పార్టీ కమిటీల సైద్ధాంతిక, రాజకీయ స్థాయిలను మనం పెంపొందించాలి. వారికి ఆటుకాలాల్లోనూ, పోటుకాలాల్లోనూ అనుసరించాల్సిన రాజకీయ, మిలటరీ ఎత్తుగడల విషయంలో ప్రత్యేక విద్య గరపాలి.

ప్రాంతీయ, రాష్ట్ర స్థాయి, ఇంకా కింది స్థాయి బలగాల్లో సంఘటితీకరణ కార్యక్రమాన్ని అమలు చేయడం ద్వారా పిఎల్‌జిఎ పోరాట సామర్థ్యాన్ని పెంపొందించాలి. పిఎల్‌జిఎ లోని పార్టీ కమిటీలు మారుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, మిలటరీ రంగాల పరిస్థితులను అధ్యయనం చేసి ప్రస్తుత ఎత్తుగడలలో మార్పులు చేయడం లేదా కొత్తవాటిని రూపొందించడం చేస్తూ తమ యూనిట్లను స్వతంత్రంగా నడుపుకునేలా, శత్రువు మిలటరీ ఎత్తుగడలను తమంత తాముగా తిప్పికొట్టేలా ఎదగాలి.

మిలటరీ కమిషన్ల, కమాండ్ల సమావేశాలు సరైన సమయానికి జరుపుకోవాలి. మారుతున్న పరిస్థితికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడానికీ, శత్రువును ప్రతిఘటించడానికి గెరిల్లా బలగాలను క్రియాశీలంగా సమీకరించడానికీ ఇది అవసరమవుతుంది.

మన శక్తికీ, ఉద్యమ అవసరాలకూ అనుగుణంగా మన గెరిల్లా శక్తులు ఉన్న ప్రాంతాలన్నిటా మనం గెరిల్లా యుద్ధాన్ని కొనసాగించాలి. మన గెరిల్లాలు శత్రు బలగాలను దెబ్బ కొట్టడానికి గల ప్రతి ఒక్క అవకాశాన్నీ వినియోగించుకుని వారి నుండి ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలి. ఈ విషయంలో చొరవను ప్రదర్శించడం ద్వారా మాత్రమే మనం శత్రు బలగాల చొరవను దెబ్బ తీసి, పరిస్థితిలో క్రమంగా మార్పును తేగల్గుతాం. అన్ని స్థాయిల మిలటరీ కమిషన్లూ ఆయా రాష్ట్రాల నిర్దిష్ట పరిస్థితుల ఆధారంగా ఫార్మేషన్లు, ఆపరేషన్ల స్థాయిల విషయంలో చేసే నిర్ణయాలను అమలు చేసే విధంగా కమాండ్లను గైడ్ చేయాలి.

మనం మన ఎత్తుగడల ఎదురుదాడుల క్యాంపెయిన్లలోనూ (టిసిఓసి), ప్రతిదాడుల్లోనూ మెరుగుదలను తేవడానికి పాటుపడాలి. మనం శత్రు బలహీనతల్ని లోతుగా అధ్యయనం చేయాలి. నాయకత్వం టిసిఓసిల్లో, ప్రతిఘటనా చర్యల్లో బలగాలకు నేతృత్వం వహించాలి. మిలటరీ చర్యల్లో ప్రజామిలీషియా, ప్రజల పాత్రను పెంచాలి. సాయుధ సంఘర్షణల సందర్భంగా మన నష్టాలను నివారించాలి. పిఎల్‌జిఎ కార్యకలాపాలన్నిటిలో గెరిల్లా

సూత్రాలకూ, క్రమశిక్షణకూ కచ్చితంగా అంటిపెట్టుకుని ఉండాలి.

శత్రువును ప్రతిఘటించడంలో ప్రజామిలీషియా పాత్రను పెంచడానికి మనం దానికి శిక్షణ ఇవ్వాలి. ప్రజామిలీషియా యూనిట్ల సంఖ్యను పెంచడానికి మనం పాటుపడాలి. ప్రజామిలీషియాను అందుబాటులో ఉన్న ఆయుధాలతో సాయుధం చేయాలి. దాదాపు అన్ని కంబాట్ యూనిట్లలోని సభ్యుల సంఖ్య పడిపోయింది కనుక మనం క్రమంగా రిక్రూట్‌మెంట్ ను పెంచుకుంటూ ఖాళీలను పూరించడానికి ప్రయత్నించాలి.

మన గెరిల్లా యుద్ధం లక్ష్యం మన వ్యూహాత్మక ప్రాంతాల మీద కేంద్రీకృతమై ఉన్న శత్రు దాడిని ఓడించడంగా ఉండాలి. ప్రజామిలీషియానూ, ప్రజలనూ పెద్ద సంఖ్యలో భాగం చేయడం ద్వారా మైన్ యుద్ధతంత్రాన్ని తీవ్రతరం, విస్తృతం చేయాలి. శత్రువు నుండి ఆయుధాలూ, మందుగుండూ స్వాధీనం చేసుకుంటూ, ఇతర వనరులన్నిటినీ సంపూర్ణంగా వినియోగించుకుంటూ మనం గెరిల్లా యుద్ధాన్ని నడపాలి. అన్ని రకాల యుద్ధ సామగ్రినీ మనం ఎంతో జాగ్రత్తగా శ్రద్ధతో కాపాడాలి. ఈ సామగ్రిని రవాణా చేయడంలో, డంప్ చేయడంలో, వాడడంలో జరుగుతున్న అన్ని లోపాలనూ మనం తక్షణం సరిచేసుకోవాలి. అన్ని కమిషన్లూ, కమాండ్లూ ఈ విషయం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

పథకం ప్రకారం వివిధ రాష్ట్రాల్లో మన స్వీయాత్మక శక్తులను పెంచుకోవడం ద్వారా గెరిల్లా జోన్లలో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లోకీ, నూతన ప్రాంతాల్లోకీ కూడా మన ఉద్యమాన్ని మనం విస్తరించాలి. ఈ విస్తరణ శత్రువు బలగాలు ఒకేదగ్గర కేంద్రీకరించబడకుండా వెదజల్లబడడానికి దోహదపడుతుంది.

శత్రు బలగాలు తమ ఇన్ఫార్మర్ నెట్‌వర్క్ పై ఆధారపడి సమాచార ఆధారిత దాడులు చేస్తున్నాయి. ఇటువంటి దాడుల్లో మనం నష్టపోకుండానూ, కార్పెట్ సెక్యూరిటీ నేపథ్యంలోనూ మనం మన పని పద్ధతుల్లో మార్పులను చేసుకోవాలి.

బ్రిగేడ్, బెటాలియన్ లేదా అంతకంటే కొద్ది తక్కువ సంఖ్య బలగాలతో శత్రువు చేపడుతున్న ఈ దాడుల్లో, క్యాంపెయిన్లలో మనం చిక్కుబడిపోకుండా చూసుకోవాలి, ఆ ప్రాంతం నుండి బయటపడడానికి ప్రయత్నించాలి. అక్కడి నుండి మనం శత్రు బలహీన పొజిషన్ ను గుర్తించి సాధ్యమైన మేరకు వాడిని దెబ్బ కొట్టడానికి ప్రయత్నించాలి. తన బలానికీ, స్థాయికీ అనుగుణంగా ప్రతి యూనిట్ ప్రతిఘటించడానికి ప్రయత్నించాలి. ఇటువంటి క్యాంపెయిన్ లలో మన యూనిట్ ఏదైనా చిక్కుకుపోతే/చుట్టుముట్టబడితే అది ఒకటే యూనిట్ గా ఐక్యంగా పోరాడి, శత్రు శ్రేణుల్లో గండికొట్టి బయటపడే ప్రయత్నం చేయాలి.

శత్రువు చేపట్టే కౌన్సిలింగ్, సరెండర్ విధానాలను బహిర్గతం చేయడానికి మనం క్యాంపెయిన్లను చేపట్టాలి. లొంగుబాటు అనేది ప్రజల, పార్టీ ప్రయోజనాలకు హానికరమే కాదు ద్రోహం కూడా అనే ప్రచారాన్ని మనం నిరంతరాయంగా కొనసాగించాలి. ఒకటే

రాష్ట్రంలో లేదా ఇతర రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో పని చేస్తున్న అందరు పార్టీ కార్యకర్తల, పిఎల్‌జిఎ యోధుల కుటుంబాలను మనం కలవాలి. వారి సమస్యల గురించి తెలుసుకుని, ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా సాధ్యమైన మేరకు వారికి నైతిక, ఆర్థిక, భౌతిక మద్దతును అందజేయాలి. శత్రు కౌన్సిలింగ్, సరెండర్ విధానాల మోసపూరిత స్వభావాన్ని గురించి వారికి విద్య గరపాలి. లొంగిపోయిన విప్లవ ప్రతీఘాతుకుల వల్ల కలుగగల ప్రమాదాల గురించీ, శత్రు కౌన్సిలింగ్ కార్యక్రమాల దుష్ఫలితాల గురించీ బహిర్గతపరచడానికి మనం గ్రామాల్లో సభలు నిర్వహించాలి. ఈ సభల్లో ఇటువంటి ద్రోహుల పట్ల ప్రజల నిఘాకున్న ప్రాముఖ్యతను వారితో గుర్తింపజేయాలి. పోలీసు/రాజ్య ఇన్ఫార్మర్ నెట్‌వర్క్ లను అదుపు చేయాలి.

గెరిల్లా యుద్ధంలో అప్రమత్తత, మొబిలిటీ (చలనంలో ఉండడం), వేగం, రహస్యం ఎంతో కీలకంగా ఉంటాయి. అప్రమత్తత, మొబిలిటీ, వేగం లేకుండా ఏ గెరిల్లా యూనిట్ కైనా రహస్యాన్ని పాటించడం అసాధ్యం. గెరిల్లా యూనిట్లు ఎల్లప్పుడూ అప్రమత్తంగా వుండాలి, వేగంగా కదలాలి, రహస్యాన్ని పాటించాలి. ఆత్మరక్షణకూ, దాడికీ కూడా రహస్యం అత్యంత ఆవశ్యకం. శత్రువుకు మన సమాచారం పోకుండా (లీక్ కాకుండా) నివారించడానికి గెరిల్లా బలగాలు తమ కదలికల్ని రాత్రిపూట/చీకటిలో కొనసాగించాలి. రోజువారీ పనుల్లో - ప్రయాణాల్లో, రోడ్లు, నదులు, వంతెనలు దాటేటప్పుడు, తాత్కాలికంగా క్యాంపు వేసినప్పుడు, ప్రజల మధ్య రాజకీయ, నిర్మాణ, ఉత్పత్తి, పోరాట కర్తవ్యాలను నెరవేర్చేటప్పుడు, సెంట్రీ చేసేటప్పుడు, కమ్యూనికేషన్ సెట్లను ఉపయోగించేటప్పుడు, కాంటాక్టులు-సమన్వయం నెరిపేటప్పుడు, చర్యలకు సన్నాహాలు చేసేటప్పుడు, వాటిని నిర్వహించేటప్పుడు - రహస్య ఫంక్షనింగ్ పద్ధతులకు కచ్చితంగా కట్టుబడి ఉండాలి. మన ఉద్యమం సెట్‌బ్యాక్ కు గురైన ప్రాంతాల్లో, మనం కార్పెట్ సెక్యూరిటీ మధ్య పని చేసే ప్రాంతాల్లో, మన గెరిల్లా బలగాలు ప్రజల మధ్య చిన్న యూనిట్లుగా పని చేసే చోట్ల, శత్రువు బ్రిగేడ్/బెటాలియన్/కంపెనీ స్థాయిలో దాడులను కొనసాగిస్తున్న చోట్ల - రహస్యాన్ని పాటించడంలో మనం చేసే ఒక చిన్న పొరపాటు కూడా భారీ నష్టాలకు దారి తీయవచ్చు. కాబట్టి మనం మన లక్ష్యాలను సాధించాలి అనుకుంటే ఉక్కు క్రమశిక్షణ, దృఢసంకల్పం, సాహసం, అప్రమత్తత, మొబిలిటీ, వేగం అనేవి కీలకంగా ఉంటాయి.

### 4. పార్టీ పదవ వార్షికోత్సవాల నిర్వహణకు సన్నద్ధం కండి

2014 సెప్టెంబర్ 21 నాటికి సిపిఐ (మావోయిస్టు) ఏర్పడి పదేళ్లు పూర్తవుతాయి. మన కేంద్రకమిటీ దేశవ్యాప్తంగా ఈ సందర్భంగా గొప్పగా సంబరాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా, మనం పీపుల్స్‌వార్, అవామీ జంగ్, మావోయిస్టు ఇన్ఫర్మేషన్ బులెటిన్ ప్రత్యేక సంచికలను ప్రచురించాలి. అలాగే అన్ని రీజనల్, రాష్ట్ర స్థాయి, డివిజనల్

స్థాయి పార్టీ, మిలటరీ, విప్లవ ప్రజాసంఘాల, ఆర్పీసీల పత్రికలు ప్రత్యేక సంచికలనూ, సాధ్యమైన దగ్గర సోవనీర్లనూ ప్రచురించాలి. పార్టీని విస్తరించడానికి ఒక ఏడాది పాటు నూతన భర్తీ క్యాంపెయిన్ ను చేపట్టాలి. ఈ కర్తవ్యాలను నెరవేర్చడానికి మన సన్నాహాలు ఇప్పటి నుండి మొదలు కావాలి.

పార్టీ, పిఎల్‌జిఏ, ప్రజాసంఘాలు, ఆర్పీసీలు, ప్రజల ముందు వివిధ రంగాల్లో నూతన పార్టీ సాధించిన విజయాలను, పొందిన అనుకూల, ప్రతికూల అనుభవాలను, ఉద్యమాన్ని పురోగమింపజేయడానికి మనం రూపొందించుకున్న కర్తవ్యాలను ఉంచి వారిని విద్యావంతం చేయడానికి మనం ఈ సందర్భాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవాలి.

***కామ్రేడ్స్,***

మన దేశవ్యాప్త విప్లవోద్యమం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికీ, వివిధ రాష్ట్రాల సామాజిక పరిస్థితుల్లోనూ, వాటిలోని మన స్వీయాత్మక పరిస్థితుల్లోనూ అనేక తేడాలున్నాయి. కాబట్టి ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వివిధ రాష్ట్రాల్లో మన కర్తవ్యాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. మన ఎత్తుగడలనూ, పని పద్ధతులనూ, పని శైలినీ కూడా ఇందుకనుగుణంగానే రూపొందించాల్సి ఉంటుంది. వాటిని సృజనాత్మకంగా అమలు చేయాలి. ఉద్యమ క్రమంలో జరిగే మార్పులనూ, అంతర్జాతీయ, దేశీయ పరిస్థితుల్లో సంభవించే మార్పులనూ దృష్టిలో ఉంచుకుని మనం వాటిలో అవసరమైన మార్పులను సకాలంలో చేపట్టాలి. బోల్షవిక్ స్పిరిట్ తోనూ, రాజకీయ చొరవతోనూ పని చేయడం ద్వారా అనుకూల వస్తుగత పరిస్థితులను మనం సద్వినియోగం చేసుకోగల్గుతాం. స్వీయాత్మక శక్తుల పరిరక్షణకూ, శత్రు బలగాలను తిప్పి కొట్టడానికీ, విముక్తి ప్రాంతాల స్థాపనా లక్ష్యంతో గెరిల్లా బేసుల నిర్మాణానికీ ఇవి అత్యంత ఆవశ్యకం. బోల్షవిక్ స్పిరిట్, రాజకీయ చొరవల లేమి ఉద్యమం బలహీనపడ్డానికి దారి తీస్తుంది. పెటీబూర్జువా తొందరపాటు నష్టాలకు దారి తీస్తుంది. అందుకని అన్ని రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో మన పార్టీ కమిటీలు వాస్తవంగా నెలకొన్న వస్తుగత, స్వీయాత్మక పరిస్థితుల గురించి సరైన అంచనాలకు వచ్చి కర్తవ్యాలను రూపొందించుకోవాలి. ఈ కర్తవ్యాలను పరిపూర్తి చేయడానికి పార్టీని, పిఎల్‌జిఏ నీ, ప్రజాసంఘాలనూ, ప్రజలనూ పథకం ప్రకారం క్రియాశీలంగా కదిలించడానికి తగిన పని పద్ధతులను రూపొందించుకుని వాటిని సృజనాత్మకంగా అన్వయించాల్సి ఉంటుంది. ప్రతి ఒక్క కర్తవ్యాన్నీ ఆరంభం నుండి అంతం వరకూ దృఢసంకల్పంతో, చొరవతో అమలు చేయాల్సి ఉంటుంది. ఆ విధంగా మాత్రమే మనం అన్ని రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో, అలాగే దేశవ్యాప్తంగానూ నెలకొన్న గడ్డు పరిస్థితిని అధిగమించి మరింత ఉన్నతమైన, నూతన విజయాలను సాధించడానికి తగిన పరిస్థితులను సృష్టించగల్గుతాం.

మన పార్టీ 9వ వార్షికోత్సవాల సందర్భంగా మన కేంద్రకమిటీ మొత్తం పార్టీ, పిఎల్‌జిఏ,

ప్రజాసంఘాలు, ఆర్పీసీలకు దృఢదీక్షతో పై కర్తవ్యాలను పరిపూర్తి చేసి మన ప్రియతమ అమరులు కన్న కలలను సాకారం చేయడానికి కృషి చేయాలని పిలుపునిస్తోంది.

విప్లవ విజయం వైపు పురోగమించడానికి ప్రజాసైన్యం, ఐక్యసంఘటన అనే రెండు మౌలిక ఆయుధాలను సమర్థవంతంగా వినియోగించే విధంగా పార్టీని బోల్షివీకరించుదాం. వర్గపంథాకూ, ప్రజాపంథాకూ దృఢంగా అంటిపెట్టుకుని ఉండడం ద్వారా మన ప్రజాపునాదిని బలోపేతం, విస్తృతం చేద్దాం. 'విప్లవ పార్టీ లేకుండా విప్లవం లేదు' 'ప్రజలే చరిత్ర నిర్మాతలు' అనే రెండు మార్క్సిస్టు సూత్రాలను లోతుగా గ్రహిద్దాం. ఈ మార్గదర్శక సూత్రాల అసలు అర్థాన్ని గ్రహించి, ఆచరణలో వాటిని అమలు చేయడం అనేది మనం ప్రస్తుతం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని అధిగమించడానికి దోహదపడుతుంది. విశాల ప్రజానీకం సైద్ధాంతిక, రాజకీయ చైతన్య స్థాయిలను పెంచి, విస్తృతమైన ఉద్యమాలను నిర్మించి, సంఘటితం చేసి మన విప్లవోద్యమంలో ఒక చెప్పుకోదగిన మలుపును తేవడానికి దృఢసంకల్పంతో పోరాడుదాం. ఈ విధంగా మన వంతు శ్రామికవర్గ అంతర్జాతీయ కర్తవ్యాలను పరిపూర్తి చేసే దిశగా పురోగమిద్దాం.

***కామ్రేడ్స్,***

మన గెరిల్లా జోన్లు అన్నిటిలోనూ, మన పార్టీ యూనిట్లు పని చేస్తున్న ప్రాంతాలన్నిటా మన పార్టీ 9వ వార్షికోత్సవాలను విప్లవోత్సాహంతో నిర్వహించండి. మనం అత్యంత ప్రముఖమైన కర్తవ్యంగా చేపడుతున్న బోల్షివీకరణ క్యాంపెయిన్ లో ఉత్తేజంతో పాల్గొనాలనే సంకల్పాన్ని కార్యకర్తల్లో, ప్రజల్లో నింపడానికి ఈ సందర్భాన్ని వినియోగించుకోండి. ప్రజల నుండి నేర్చుకుంటూ మన ఇతర కర్తవ్యాలన్నిటినీ పరిపూర్తి చేయడానికి కదం తొక్కుదాం. మనం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని అధిగమించడానికి మార్గదర్శకంగా నిలిచే మన గొప్ప అమరుల ఆదర్శాలను మదిలో నిలుపుకోవడానికి నిస్వార్థమైన వారి త్యాగాలను మరోసారి గుర్తు చేసుకుందాం.

*సెప్టెంబర్ 1, 2013*

**విప్లవాభినందనలతో,**
**కేంద్రకమిటీ**
**సిపిఐ (మావోయిస్టు)**

# శత్రువు విసురుతున్న సవాళ్లను దీటుగా ఎదుర్కొందాం!
# విప్లవం పెంపొందడానికి గల అవకాశాలను
# చొరవతో వినియోగించుకుందాం!
# దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో దృఢంగా పురోగమిద్దాం!

*మన మహత్తర పార్టీ పదవ స్థాపనా వార్షికోత్సవాల సందర్భంగా*

*కేంద్రకమిటీ పిలుపు*

## కేంద్ర కమిటీ

## భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# శత్రువు విసురుతున్న సవాళ్లను దీటుగా ఎదుర్కొందాం!
# విప్లవం పెంపొందడానికి గల అవకాశాలను
# చొరవతో వినియోగించుకుందాం!
# దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో దృఢంగా పురోగమిద్దాం!

## *మన మహత్తర పార్టీ పదవ స్థాపనా వార్షికోత్సవాల సందర్భంగా కేంద్రకమిటీ పిలుపు*

అంతర్జాతీయ కార్మికవర్గ అగ్రగామి డిటాచ్‌మెంట్లలో ఒకటి అయిన మన పార్టీ సిపిఐ (మావోయిస్టు) ఈ సంవత్సరం తన పదేళ్ల స్థాపనా వార్షికోత్సవాలను జరుపుకుంటోంది. మన మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ మనకు విప్లవ పార్టీ లేకుండా విప్లవం లేదని బోధించాడు. ఈ పదేళ్ల కాలం అంతా ఈ సూత్రాన్ని మనం ఆచరణలో ఎలా అన్వయించాం, పరీక్షించాం, సంపద్వంతం చేశాం, తిరిగి ఎలా రుజువు చేశాం అనేదానికి సాక్ష్యంగా నిలుస్తుంది. ప్రజాసైన్యం, ఐక్యసంఘటన అనే ఆయుధాలను ప్రయోగించే యోధురాలిగా పార్టీ ఎటువంటి ప్రగతిని సాధించింది, ఎటువంటి పాఠాలను నేర్చుకున్నది, అలాగే ఈ మావోయిస్టు సూత్రాన్ని ఆచరణలో ఎలా అన్వయించాలి అనేదానికి సంబంధించిన చారిత్రక కథనమే ఈ పదేళ్ల కాలం.

ఈ సంతోషకరమైన సందర్భంగా, కేంద్ర కమిటీ తన మొత్తం పార్టీ శ్రేణులకూ, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి చెందిన కమాండర్లూ, యోధులకూ, విప్లవ ప్రజా ప్రభుత్వాలకు (ఆర్పీసీలు), ప్రజాసంఘాలకు చెందిన కామ్రేడ్స్‌కూ, కారాగారాల్లో మరో యుద్ధరంగాన్ని ఆవిష్కరించిన వేలాది కామ్రేడ్స్‌కూ, విప్లవ ప్రజానీకానికీ, దేశవ్యాప్తంగా గల మన పోరాట ప్రాంతాలలోని లక్షలాది విప్లవ ప్రజానీకానికీ - గత పదేళ్ల కాలాన్ని గొప్ప పోరాటాల, విజయాల దశాబ్దంగా మలచిన మీ అందరికీ హార్దిక విప్లవాభినందనలను తెలుపుతోంది. భారతదేశ విప్లవానికి మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా ముందుకొచ్చిన అన్ని మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు పార్టీలకూ, సంస్థలకూ అది అభినందనలు తెలుపుతోంది. భారతదేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ 'ఆపరేషన్ గ్రీన్ హంట్' పేరిట భారత రాజ్యం ఎక్కుపెట్టిన క్రూరమైన 'ప్రజలపై యుద్ధా'నికి వ్యతిరేకంగా దృఢంగా నిలిచిన

ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీలురందరి పట్ల అది తన గౌరవాభిమానాల్ని ప్రకటిస్తున్నది.

మన ఐక్యపార్టీ ఏర్పాటు తర్వాత గత పదేళ్ల కాలంలో పదిమంది కేంద్రకమిటీ సభ్యులు సహా మొత్తం 2332 మంది కామ్రేడ్స్ విప్లవాశయం కోసం తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించారు. వీరిలో పోలిట్‌బ్యూరో సభ్యులు కామ్రేడ్స్ షంషేర్ సింగ్ షేరి (కరమ్ సింగ్-కె.ఎస్.), రాజ్‌కుమార్ (ఆజాద్), కోటేశ్వర్లు (కిషన్‌జీ), సుశీల్ రాయ్ (అశోక్, బరున్); సిసి సభ్యులు కామ్రేడ్స్ చంద్రమౌళి (నవీన్), అనురాధ గాంధీ, పరిమళ్ సేన్ (అజయ్), రాజమౌళి (ప్రసాద్), పటేల్ సుధాకర్ (వికాస్), సిపిఐ (ఎంఎల్) నక్సల్బరీ మునుపటి కార్యదర్శి, మన పార్టీ సీనియర్ నేత కామ్రేడ్ రవూఫ్‌తోపాటు 34 రాష్ట్ర స్థాయి, 9 రీజనల్ స్థాయి, 132 జిల్లా స్థాయి, 246 సబ్-జోన్, ఏరియా స్థాయి పార్టీ కమిటీ సభ్యులూ, వందలాదిగా ప్రాథమిక పార్టీ సభ్యులూ, మరెంతోమంది పిఎల్‌జిఎ, ఐక్యసంఘటన కామ్రేడ్లూ ఉన్నారు. గత ఏడాదికాలంలోనే పార్టీ, పిఎల్‌జిఎ, ఐక్యసంఘటనలకు చెందిన 120 మంది నాయకత్వ కామ్రేడ్స్, విప్లవ ప్రజానీకం అసువులు బాసారు. ఈ నష్టాలన్నీ, ప్రత్యేకించి మన గొప్ప నాయకులను కోల్పోవడం, మనకు ఎంతో దుఃఖాన్ని కలిగించాయి. అయినప్పటికీ మన ప్రియతమ అమరుల రక్తంతో తడిసిన బాటలో పయనిస్తూ, వారి కమ్యూనిస్టు కలలను సాకారం చేసేందుకు ప్రజలకు మరింతగా సేవ చేసేలా ఆ అమరులే మనల్ని దృఢంగా తయారు చేశారు. ఈ గొప్ప అమరులందరికీ మన కేంద్రకమిటీ తలవంచి వినమ్రంగా నివాళి అర్పిస్తోంది. వారి బలిదానాలు మన పార్టీనీ, పిఎల్‌జిఎనూ, ఐక్యసంఘటననూ, మన పార్టీ నాయకత్వాన జరిగే నూతన ప్రజాస్వామిక విప్లవాన్నీ బలోపేతం చేశాయి. మన పార్టీ వ్యవస్థాపక నాయకులు కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హయ్ చటర్జీలు సహా వేలాదిగా వున్న మన అమరుల సరసనే వీరంతా త్యాగపూరితమైన, ప్రజలకు సేవ చేసే మహత్తర కమ్యూనిస్టు సంప్రదాయాన్ని కొనసాగించారు. పార్టీతో, విప్లవంతో సమైక్యంగా నిలిచే క్రమంలో చెప్పనలవి కాని కష్టాలనూ, పాశవిక నిర్బంధాన్నీ ఎదుర్కొంటూ చైతన్యయుతంగా ప్రాణత్యాగాలను చేసిన విప్లవ ప్రజానీకానికి కూడా కేంద్రకమిటీ తన అరుణారుణ జోహార్లను అర్పిస్తోంది. వారి త్యాగాల నుండి, నూతన రాజ్యాధికారాన్నీ, సమాజాన్నీ నిర్మించడంలో వారి సృజనాత్మక పాత్ర నుండి అది ఉత్తేజం పొందుతోంది.

ఈ సందర్భంగా, ప్రపంచ సోషలిస్టు విప్లవ అమరులందరికీ, ఫిలిప్పీన్స్, నేపాల్, టర్కీ, బంగ్లాదేశ్, పెరూ, ఇతర దేశాల మావోయిస్టు పార్టీల అమరులకూ, జాతి విముక్తి యుద్ధాల అమరులకూ, ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాల్లో అసువులు బాసిన

వారందరికీ కేంద్రకమిటీ వినమ్రంగా అరుణారుణ నివాళిని అర్పిస్తోంది.

**కామ్రేడ్స్,**

పదేళ్ల క్రితం మన దేశంలో రెండు ప్రధాన విప్లవ స్రవంతుల ఏకీకరణ ఫలితంగా మన పార్టీ ఏర్పడిన సందర్భంగా, మనం మన ఆశయాలనూ, కర్తవ్యాలనూ ప్రజల ముందు ఇలా ప్రకటించాం:

“నూతన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భారత శ్రామిక వర్గపు సంఘటిత రాజకీయ అగ్రగామి దళంగా కొనసాగుతోంది. దాని ఆలోచనను, అన్ని రంగాల కార్యాచరణను నిర్దేశించే సైద్ధాంతిక పునాదిగా మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వుంటుంది. ఈ పార్టీ మొత్తంగా కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రధాన శత్రువుగా రివిజనిజాన్ని గుర్తించి మితవాద, అతివాద పెడధోరణులన్నింటికీ వ్యతిరేకంగా పోరాడుతుంది. ఈ ఏకీకృత పార్టీ బయట వున్న అన్ని నిజమైన మావోయిస్టు బృందాలను ఐక్యం చేయడానికి కృషి చేస్తుంది.

ఈ మావోయిస్టు పార్టీ తక్షణ లక్ష్యం, కార్యక్రమం ఇప్పటికే సాగుతున్న, పురోగమిస్తున్న భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకుపోవడం, పరిపూర్తి చేయడం. ఈ నూతన ప్రజాస్వామిక విప్లవం ప్రపంచ శ్రామిక వర్గ విప్లవంలో ఒక భాగం. ఈ విప్లవ విజయానికి నయా వలసవాదపు రూపపు పరోక్షపాలన, దోపిడీ, ఆధిపత్యం కింద కొనసాగుతున్న అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను కూలదోయవలసి వుంది. ఈ విప్లవం సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని తన లక్ష్యాలుగా పెట్టుకుంటుంది. ఈ విప్లవం సాయుధ వ్యవసాయ విప్లవ యుద్ధం అంటే దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా సాగి పరిపూర్తి అవుతుంది. సాయుధంగా అధికారాన్ని హస్తగతం చేసుకోవడం కేంద్ర, ప్రధాన కర్తవ్యంగా ఉంటుంది. పల్లెల నుంచి పట్టణాలను చుట్టుముట్టి అంతిమంగా స్వాధీనం చేసుకోవడంగా అది వుంటుంది. అందువల్ల గ్రామీణ ప్రాంతాలు దీర్ఘకాలిక ప్రజాయుద్ధం పార్టీ కార్యాచరణకంతటికీ కేంద్ర స్థానంలో ఉంటాయి. పట్టణాల పని విధానం దానికి పరిపూరకంగా వుంటుంది.

ఈ విప్లవానికి అత్యున్నత, ప్రధాన పోరాట రూపంగా సాయుధ పోరాటం, ప్రధాన నిర్మాణరూపంగా సైన్యం వుండడం వల్ల సాయుధ పోరాటమే నిర్ణయాత్మక పాత్ర వహించడం కొనసాగుతుంది. అదే సమయంలో సాయుధ పోరాట క్రమంలోనూ, సాయుధ పోరాటం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకోవడం కోసమూ ఐక్యసంఘటనను నిర్మించడం

జరుగుతుంది. ప్రజాసంఘాలు, ప్రజాపోరాటాలు అత్యవసరమే. అవిభాజ్యమైనవే. కాని వాటి ఉద్దేశ్యం యుద్ధ ప్రయోజనాలను నెరవేర్చడమే.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)జపీపుల్స్‌వార్ట్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్‌లకు చెందిన రెండు గెరిల్లా సైనిక విభాగాలు - పీపుల్స్ గెరిల్లా ఆర్మీ, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ - కూడా విలీనం అవుతున్నాయని, ఇక నుంచి అవి రెండు ఏకీకృత పిఎల్‌జిఎలో భాగమవుతాయని కూడా ప్రకటిస్తున్నాం. ఇక ముందు అత్యంత తక్షణ కర్తవ్యం పార్టీ ముందున్న ప్రధాన కర్తవ్యం ఏమంటే ఏకీకృత పిఎల్‌జిఎను పూర్తి స్థాయి ప్రజావిముక్తి సైన్యం (పిఎల్‌ఎ)గా అభివృద్ధి చేయడం. ప్రస్తుతం వున్న గెరిల్లా జోన్లను స్థావర ప్రాంతాలుగా తీర్చిదిద్దడం. తద్వారా అలలు, అలలుగా పురోగమిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం. ముగ్గురు కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యాం, మహేశ్, మురలి అమరత్వపు మొదటి సంస్మరణ దినం సందర్భంగా 2000 సంవత్సరంలో ఏ రోజునైతే దేశంలో మొట్టమొదటిసారిగా ప్రజాసైన్యం ఆవిర్భవించిందో ఆ డిసెంబర్ 2ను పిఎల్‌జిఎ ఆవిర్భావ దినంగా గుర్తిస్తున్నాం.

దీనితో పాటుగా ప్రజానీకానికి సంబంధించి అనేక రాజకీయ తదితర సమస్యలపై ఒక కొత్త విప్లవ ప్రజా ఉద్యమ కెరటాన్ని అభివృద్ధి చేయడానికి పార్టీ అత్యధిక శ్రద్ధ వహిస్తుంది. సామ్రాజ్యవాదానికి, భూస్వామ్య విధానానికి, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడే ఆ పోరాటాలలో పార్టీ సువిశాల ప్రజారాశులను అన్నిటినీ భాగస్వాములను చేస్తుంది. మన దేశంపై జరుగుతున్న దుర్మార్గమైన సామ్రాజ్యవాద దాడి ఇప్పటికే పేదరికంలో మగ్గుతున్న ప్రజలను మరింత విస్తృత నైరాశ్యంలోకి నెట్టింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వేలాదిమంది ఆత్మహత్యలకు పాల్పడడానికి కారణమైంది. దేశం మీద పెరిగిపోతున్న సామ్రాజ్యవాద దాడులను ఎదుర్కొనేందుకు, రాజ్యహింసను ఎదుర్కొనేందుకు, సామ్రాజ్యవాద, భూస్వామ్య విధానాల వ్యతిరేక ఉద్యమాలకు మద్దతు కూడగట్టేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) విశాల ప్రజారాశులను సమీకరిస్తుంది.

వివిధ జాతులు విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికారం కోసం సాగిస్తున్న పోరాటాలను కొత్త పార్టీ సమర్థిస్తుంది. ఆ ఉద్యమాలపై సాగుతున్న దుర్మార్గ రాజ్య అణచివేతను ఖండిస్తుంది. విప్లవంలో మహోద్భుత శక్తిగా మహిళలను గుర్తించి వారిని సమీకరించడానికి సంఘటితం చేయడానికి పార్టీ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. అన్ని రకాల సాంఘిక అణచివేతలకు, ముఖ్యంగా అస్పృశ్యతకు, కులతత్వానికి వ్యతిరేకంగా పార్టీ

పోరాడుతుంది. అతి ఎక్కువ ప్రమాదకారులైన హిందూ ఫాసిస్టు శక్తులను బహిర్గతపర్చడానికి, ఒంటరులను చేసి ఓడించడానికి పార్టీ కృషి చేస్తుంది. ఇతర మత ఛాందసవాద శక్తులన్నిటినీ పార్టీ బహిర్గత పరుస్తుంది. ప్రజా పోరాటాల ప్రధాన దిశను ఢిల్లీలోని కొత్త కాంగ్రెస్ పాలకులకు, సిపిఐ, సిపిఎంలకు, వారి సామ్రాజ్యవాద పెత్తందారులకు వ్యతిరేకంగా నిలిపి వుంచుతూనే పై కర్తవ్యాన్ని కొనసాగిస్తుంది.

తమ సామ్రాజ్యవాద యజమానుల, మరీ ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదులతో పాటుగా భారత పాలకవర్గాలు సాగిస్తున్న విస్తరణవాద చర్యలను పార్టీ బహిర్గతం చేస్తుంది. ప్రతిఘటిస్తుంది. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు) నేతృత్వంలో పోరాడుతున్న నేపాలీ ప్రజలతో పార్టీ భుజం కలుపుతుంది. తమ సైనిక శక్తితో నేపాల్‌లో జోక్యం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న భారత విస్తరణవాదులను, అమెరికన్ సామ్రాజ్యవాదులను పార్టీ అతి తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. పెరూ, ఫిలిప్పీన్స్, టర్కీ తదితర ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీల నాయకత్వంలో సాగుతున్న ప్రజాయుద్ధాన్ని పార్టీ సమర్థిస్తుంది. సామ్రాజ్యవాదానికి, విప్లవ ప్రతిఘాతుకత్వానికి వ్యతిరేకంగా సాగే ప్రజా ఉద్యమాలన్నింటికి పార్టీ తన మద్దతును తెలుపుతుంది. ప్రపంచవ్యాపితంగా కార్మికవర్గ ఉద్యమాలను, ఇతర ప్రజా ఉద్యమాలను పార్టీ సమర్థిస్తుంది. అమెరికన్ సామ్రాజ్యవాదుల నాయకత్వంలో దురాక్రమణకు, దౌర్జన్యానికి వ్యతిరేకంగా ఇరాకీ, ఆఫ్ఘన్ ప్రజలు సాగిస్తున్న వీరోచిత పోరాటాలను పార్టీ సంపూర్ణంగా సమర్థిస్తుంది.

ఏకీకృత పార్టీ, శ్రామిక వర్గ అంతర్జాతీయ పతాకాన్ని సమున్నతంగా ఎత్తిపడుతుంది. అంతర్జాతీయ స్థాయిలో నిజమైన మావోయిస్టు శక్తుల ఐక్యత కొరకు శాయశక్తులా ప్రయత్నం చేస్తుంది. సామ్రాజ్యవాదానికి, దాని తొత్తులకు వ్యతిరేకంగా ప్రపంచ శ్రామిక వర్గ విప్లవాన్ని పురోగమింపజేసేందుకు మొత్తం ప్రపంచంలోని అణగారిన ప్రజలతో, జాతులతో ఐక్యత పెంపొందించుకుని వారితో భుజం కలిపి పోరాడుతుంది. తద్వారా అంతర్జాతీయ స్థాయిలో సోషలిజాన్ని స్థాపించేందుకు దాన్ని కమ్యూనిజం దిశగా నడిపేందుకు మార్గం సుగమం చేస్తుంది.''

పదేళ్ల క్రితం మనం నిర్దేశించుకున్న కర్తవ్యాలను నెరవేర్చే క్రమంలో దేశవ్యాప్త పాశవిక నిర్బంధాన్ని ఎదుర్కొంటూ, భారీ నష్టాలను పొందుతూ, పెద్ద పెద్ద సవాళ్లతో తలపడుతూనే మనం స్థిరమైన, ప్రముఖమైన పురోగమనాలను సాధించాం. ఈ పదేళ్లలో మన పురోగమనాలనూ, మనం ఎదుర్కొన్న నష్టాలనూ, సవాళ్లనూ మనం మూడు దశలుగా చూడవచ్చు. 1. పార్టీ విలీనం తర్వాత నుండి ఐక్యతా కాంగ్రెస్ వరకూ, 2. ఐక్యతా కాంగ్రెస్

నుండి 2012 వరకూ, 3. 2013 నుండి ఇప్పటి వరకూ.

ఐక్య పార్టీ ఏర్పాటు ప్రకటన ప్రజలను ఎంతగానో ఉత్సాహపరచగా, పాలకవర్గాల ప్రతిస్పందన ప్రధానమంత్రి చేసిన ఈ ప్రకటన సారంలో మనం చూడవచ్చు - ''ఇది జమ్ము-కశ్మీర్, ఈశాన్య భారతంలోని మిలిటెన్సీ కంటే పెద్ద ప్రమాదం.'' శత్రువు ప్రత్యేకించి మన నాయకత్వం మీద దాడిని కేంద్రీకరించి మనకు తీవ్ర నష్టాలను కలిగించాడు. అయినప్పటికీ చాలా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూనే పిఎల్‌జిఎ శత్రువును గట్టి దెబ్బలు కొట్టింది. మిలిటెంట్ ప్రజాపోరాటాల్లో పదుల వేల సంఖ్యలో ప్రజలు కదిలారు. అవి వివిధ సెక్షన్ల ప్రజలను ఐక్యం చేసి పాలకుల విధ్వంసకర విధానాలకు వ్యతిరేకంగా గట్టి ప్రతిఘటనను నిలబెట్టాయి.

బీహార్‌లో చారిత్రక జహానాబాద్ జైలుబ్రేక్-మల్టిపుల్ రెయిడ్‌లో పిఎల్‌జిఎ ప్రజా మిలీషియా మద్దతుతో పట్టణాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకుని ఇద్దరు రీజనల్ కమిటీ సభ్యులూ, కొందరు కింది స్థాయి కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో స్థానిక కార్యకర్తలు సహా 341 మంది ఖైదీలను విడిపించడమే కాక, భూస్వామ్య అగ్రకుల ప్రైవేటు సైన్యం రణవీర్ సేన కుఖ్యాత నాయకులను పట్టుకుని ఖతం చేసింది. ఇది ఒక ప్రముఖమైన విజయం. ఝార్ఖండ్ లోని గిరిడీలో హోంగార్డ్ ఆయుధాగారంపై చేసిన రెయిడ్, బస్తర్ (దండకారణ్యం-డికె)లో పదేడలో మైన్‌ప్రూఫ్ వాహనాన్ని పేల్చేసి 24 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లను మట్టిగరిపించిన ఆంబుష్, బస్తర్‌లోని ముర్కినార్‌లో 11 మంది నాగా జవాన్లనూ, 11 మంది పోలీసులనూ తుడిచిపెట్టిన దాడి లాంటివి ఇతర మరికొన్ని పెద్ద సమరాలు. డికె, బీహార్-ఝార్ఖండ్ (బిజె)లలో గత పాతికేళ్లుగా మనం సాగిస్తున్న గెరిల్లా యుద్ధం పురోగమించింది. ప్లటూన్లనూ, కంపెనీలనూ బలగాలను కేంద్రీకరించే కేంద్రాలుగా వినియోగిస్తూ మనం పెద్ద ఎత్తుగడల ఎదురుదాడులను చేపట్టగలిగాం. వికేంద్రీకృత కంబాట్ యూనిట్లు చిన్న, మధ్యరకం సాయుధ చర్యలను కొనసాగిస్తూ వచ్చాయి.

అన్నిటికంటే ముఖ్యంగా, ఐక్యపార్టీ స్థాపన తర్వాత పథకం ప్రకారం చేపట్టిన కార్యాచరణ ద్వారా మనం విముక్తి ప్రాంతాల స్థాపనలో ఒక పరిణామ దశగా గెరిల్లా బేసులను విస్తరించగలిగాం. ఈ బేసుల్లోని అనేక గ్రామాల్లో మనం ఆర్పీసీలను సంఘటితం చేయడంలో విజయవంతం అయ్యాం. డికెలో గ్రామ స్థాయిలో పార్టీ యూనిట్లను పెంపొందించడం ద్వారా, గ్రామ పార్టీ కమిటీలను ఏర్పర్చడం ద్వారా, మన మిలటరీ ఫార్మేషన్లను పెంపొందించడం ద్వారా, వాటిని బలోపేతం చేసి కంపెనీ స్థాయి ఫార్మేషన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా, మిలీషియాలోకి మరింత పెద్దెత్తున ప్రజలను చేర్చడం ద్వారా,

ప్రజలను రాజకీయ, మిలటరీ, నిర్మాణపర, సాంస్కృతిక క్యాంపెయిన్లలోకి సమీకరించడం ద్వారా, విశాల ప్రాతిపదికన రైతు, మహిళా, సాంస్కృతిక ప్రజాసంఘాలను విస్తరించడం ద్వారా, వాటిని డివిజన్, జోన్ స్థాయిల్లోకీ విస్తరించడం ద్వారా, డివిజనల్ స్థాయిలో కూడా ఆర్పీసీల రూపంలో ప్రజల అధికారాన్ని స్థాపించడం, సంఘటితం చేయడం, విస్తరించడం ద్వారా మనం మన గెరిల్లా బేసులను మరింతగా సంఘటితపరచాం. విప్లవ యుద్ధాన్ని పురోగమింపజేయడానికి గెరిల్లా బేసులను మరింత సంఘటితం చేసి, విస్తరించే ఉద్దేశ్యంతో మనం చేపట్టే వ్యూహాత్మక కర్తవ్యాలను నెరవేర్చడానికి గెరిల్లా బేసులు మనకు ఉపయోగపడ్డాయి.

ప్రజారంగంలో కూడా, మన పార్టీ నాయకత్వంలోని శక్తులు రాజకీయ ఖైదీల బేషరతు విడుదలను డిమాండ్ చేయడం, సల్వాజుడుం వ్యతిరేక క్యాంపెయిన్‌ను విజయవంతం చేయడం, రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా, ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమంపై రాజ్యప్రాయోజిత దాడులకు వ్యతిరేకంగా పోరాడడం వంటి రాజకీయ పిలుపులను అమలు చేశాయి. పార్టీ స్థాపనా దినం, పిఎల్‌జిఎ స్థాపనా దినం, మేడే, అంతర్జాతీయ మహిళా దినం, అమరుల సంస్మరణ వారం వంటి విప్లవ దినాలను పాటించాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా, అమెరికా సామ్రాజ్యవాదులూ, దాని మిత్రదేశాలూ ఇరాక్‌పై చేసిన సామ్రాజ్యవాద దురాక్రమణ, ఇతర యుద్ధోన్మాద చర్యలకు వ్యతిరేకంగా, ఆదివాసులనూ, రైతాంగాన్నీ వారి అడవి నుండీ, సాగుభూముల నుండీ విస్థాపితులను చేస్తున్న పెద్ద మైనింగ్, బహుళార్థ సాధక మౌలిక సదుపాయాల, ఇతర ప్రాజెక్టులకు వ్యతిరేకంగా, దళితులు, మత మైనారిటీల (ముస్లింలు, క్రిష్టియన్లు)పై అత్యాచారాలు, దాడులకు వ్యతిరేకంగా అవి మిత్ర సంస్థలతో, శక్తులతో కలిసి ఉమ్మడి కార్యక్రమాల్లోకి ప్రజలను సమీకరించి పాల్గొన్నాయి.

దోపిడీ ప్రభుత్వాలు విప్లవోద్యమాన్ని తుడిచిపెట్టే ఉద్దేశ్యంతో నాగరిక్ సురక్షా సమితి, సేంద్ర, శాంతి కమిటీ, హర్మద్ బాహిని, టిపిసి/పిఎల్‌ఎఫ్ఐ/జెపిసి, స్పెషల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్పీవో) వ్యవస్థ వంటి విప్లవ ప్రతీఘాతుక హంతక ముఠాలను ఏర్పర్చి 'లో ఇంటెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్' (ఎల్ఐసీ)/కౌంటర్-ఇన్‌సర్జన్సీ వ్యూహం-ఎత్తుగడల్లో భాగంగా సల్వాజుడుం వంటి క్యాంపెయిన్లను చేపట్టాయి. పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఎ వర్గపంథానూ, ప్రజాపంథానూ దృఢంగా అమలు చేస్తూ, ప్రజలను సమీకరించి వారి చైతన్యాన్ని పెంపొందిస్తూ ఈ ప్రతీఘాతుక ముఠాలను ఎదిరించి పోరాడింది. ప్రజలు, ప్రత్యేకించి మహిళలు ముందుపీఠీన నిలిచి సల్వాజుడుం గూండాలను ప్రతిఘటించారు. కొన్ని వరుస సాహసదాడులు హంతక

సల్వాజుడుం క్యాంపెయిన్‌ను అంతమొందించాయి.

ఈ కాలవ్యవధిలో భారత విప్లవం సాధించిన అత్యంత గొప్ప విజయాల్లో ఒకటి, శత్రువు దాన్ని విఫలం చేయడానికి చేసిన ప్రయత్నాలన్నిటినీ అధిగమిస్తూ, మన పార్టీ ఐక్యతా కాంగ్రెస్-తొమ్మిదవ కాంగ్రెస్‌ను విజయవంతంగా నిర్వహించుకున్నది. అక్కడ జరిగిన చర్చల ద్వారా, నాలుగు దశాబ్దాల దీర్ఘకాలిక ప్రజాయుద్ధ అనుభవాల నుండి పాఠాలను గ్రహిస్తూ రెండు విప్లవ స్రవంతుల సంశ్లేషణను మనం నూతన ఎత్తులకు కొనిపోయాం. ఇవన్నిటినీ ప్రపంచంలోనూ, భారతదేశంలోనూ జరిగిన ప్రముఖమైన రాజకీయ, ఆర్థిక మార్పుల నేపథ్యంలోనే సంశ్లేషించాం. లోతైన, విస్తృతమైన వాదోపవాదాల ద్వారా పార్టీ సైద్ధాంతిక, రాజకీయ, మిలటరీ వైఖరులను మరింతగా మెరుగుపర్చుకుని సంఘటితపర్చుకున్నాం. కొన్ని అతివాద వైఖరులు సహా కొన్ని అభిప్రాయభేదాలపై వాదోపవాదాలు జరిపి వాటిని కేంద్రీకృత ప్రజాస్వామ్యం ద్వారా పరిష్కరించుకున్నాం. విలీనం తర్వాతి రెండున్నర సంవత్సరాల్లో మనం సాధించినవాటినీ, మన లోపాలనూ, మన విజయాలనూ, వైఫల్యాలనూ సమగ్రంగా సమీక్షించుకున్నాం. కేంద్ర, ప్రధాన కర్తవ్యంతో పాటు ఇతర ముఖ్యమైన కర్తవ్యాలను రూపొందించుకున్నాం. నాయకత్వాన్ని మరింత పరిపుష్టం చేసుకున్నాం. ఆ విధంగా కాంగ్రెస్ ఫలితంగా మన పార్టీ నూతన ప్రజాస్వామిక విప్లవానికి అగ్రగామిగా తన కర్తవ్యాలను నెరవేర్చడానికి సైద్ధాంతిక-రాజకీయ వైఖరుల విషయంలో మరింత పదునుదేరింది, తన ఐక్యతను మరింత పటిష్టపరుచుకుంది, దాని సంకల్పం, పోరాటచేవ మరింత గట్టిపడ్డాయి.

తర్వాతి సంవత్సరాలు దీనిని తగినంతగా రుజువు చేశాయి. కాంగ్రెస్ పిలుపునకు స్పందిస్తూ, అన్ని స్థాయిల్లో పార్టీ నాయత్వాన కదులుతూ, మొబైల్ యుద్ధతంత్రాన్ని సూచించే మొదటి రెయిడ్‌ను పిఎల్‌జిఎ 2007లో రాణిబోదిలిలో నిర్వహించింది. అక్కడ శత్రుబలగాలను అది తుడిచిపెట్టి పెద్ద సంఖ్యలో ఆయుధాలను, మందుగుండును స్వాధీనం చేసుకుంది. 2008లో మరో ఉజ్వలమైన దాడిలో, పిఎల్‌జిఎ సెంట్రల్, ఈస్టన్ రీజనల్ కమాండ్‌ల నుండి బలగాలను సుదూర ప్రాంతాలలో మోహరించి, ఒడిషాలోని నయాగఢ్ పట్టణాన్ని తన అదుపులోకి తెచ్చుకుని అక్కడి ఆయుధాగారాన్ని స్వాధీనం చేసుకుంది. బీహార్‌లోని ఖాస్ మహల్, రాజ్‌పూర్-బఘైలా, ఝూర్ఝూ రెయిడ్‌లలో పిఎల్‌జిఎ బలగాలు శత్రువు మీద పైచేయి సాధించి, వాటిని అదుపు చేసి, నిర్మూలించి పెద్దెత్తున ఆయుధాలను, మందుగుండును స్వాధీనం చేసుకున్నాయి. పశ్చిమ బంగలోని సిల్దాలో, పిఎల్‌జిఎ పట్టపగలు వాహనాల్లోనూ, మోటర్‌సైకిళ్ల పైనా వచ్చి బహిరంగ మార్కెట్‌లో వున్న ఈస్టన్ ఫ్రాంటియర్

రైఫిల్స్ క్యాంపును స్వాధీనం చేసుకుని, అక్కడ 24 మంది శత్రు జవాన్లను ఖతం చేసి దాన్ని ధ్వంసం చేసింది. ఈ అన్ని సాహసిక దాడుల్లో మనం పొందిన విజయాలన్నీ దాదాపుగా అనేకమంది పిఎల్‌జిఎ కమాండర్లూ, యోధులూ చేసిన అత్యున్నత త్యాగాల ఫలితంగానే పొందాం.

2007లో, డికెలోని దంతేవాడ జైలులోని మొత్తం 377 ఖైదీలలో 299 మంది అతి దారుణమైన జైలు పరిస్థితుల నుండి విముక్తిని పొందుతూ తప్పించుకుని పారిపోయారు. వారు జైలు నుండి కొన్ని ఆయుధాలనూ, మందుగుండునూ కూడా ఎత్తుకుపోయారు. ఇటీవల డికెలో ఒక బూటకపు ఎన్‌కౌంటర్‌లో అసువుల బాసిన కామ్రేడ్ నవీన్ 2007లో ఒక జువెనైల్ జైలు నుండి తప్పించుకున్నాడు. 2009లో బీహార్‌లోని లఖిసరాయ్ జిల్లా కోర్టుపై పిఎల్‌జిఎ ఒక సునిశితమైన పథకంతో సర్‌ప్రైజ్ దాడి నిర్వహించి పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ మిసిర్ బెస్రాను విడిపించుకుని పోయింది. 2011 జనవరి 11న ఒక రాష్ట్ర స్థాయి, ఇద్దరు రీజనల్ స్థాయి కామ్రేడ్స్ ఝార్ఖండ్‌లోని చైబాసా జైలుబ్రేక్ చేసి తిరిగి రహస్య విప్లవోద్యమంలో చేరిపోయారు. జూన్ 21న బాలల సంఘానికి చెందిన ఏడుగురు పిల్లలు ఒడిషాలోని రూర్‌కేలాలోని పాన్‌పోస్ వద్దగల జువెనైల్ హోం నుండి తప్పించుకుని పారిపోయి తమ సంఘాన్ని చేరుకున్నారు. 2012లో గిరిడీ పట్టణం వద్ద ప్రజా గెరిల్లాలు ఒక పోలీసు ఎస్కార్ట్ వాహనంపై సాహసోపేతంగా దాడి చేసి ఒక రాష్ట్రస్థాయి సభ్యుడు, ఇద్దరు రీజనల్ కమిటీ స్థాయి సభ్యుడు సహా ఎనిమిది మంది కామ్రేడ్స్‌ను విడిపించుకుని పోయారు.

శత్రువు 2009 మధ్య నుండి దేశవ్యాప్త సంపూర్ణ యుద్ధాన్ని ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరిట చాలా అట్టహాసంగా మొదలుపెట్టాడు. మనల్ని తుడిచిపెట్టడానికి పెద్ద పథకాన్ని తయారు చేశారు. పెద్దెత్తున బలగాలను కేంద్రీకరించారు. వందల కోట్ల రూపాయలను ఖర్చు పెట్టారు. మనల్ని టెర్రరిస్టు గుంపుగా చిత్రీకరిస్తూ పెద్దెత్తున ప్రచారం చేపట్టారు. తీవ్రమైన కూంబింగ్ ఆపరేషన్లు, మన బలగాలపై సర్‌ప్రైజ్ దాడులూ, మన యుద్ధజోన్లలోని ప్రజాపునాదిపై దాడులూ, పెద్దెత్తున అరెస్టులూ, మన పట్టణ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడం, ప్రజలు తమ సమిష్టి శ్రమ ద్వారా నిర్మించుకున్న మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం మొదలైనవి చేస్తూనే, వీటన్నిటినీ ప్రజలను పక్కదారి పట్టించే ఉద్దేశ్యంతో చేపట్టే సంస్కరణ కార్యక్రమాలతో అనుసంధానించారు. ఈ దాడిలో భాగంగా మనం తీవ్రమైన నష్టాలను పొందాం. కేంద్రకమిటీ నాయకత్వంలో మన మొత్తం పార్టీ, పిఎల్‌జిఎ, ప్రజా మిలీషియా, ఆర్పీసీల నాయకత్వంలో విప్లవ ప్రజానీకం, ప్రజాసంఘాలూ దృఢంగా నిలుస్తూ, తప్పుల

నుండి నేర్చుకుని రెట్టింపు ప్రయత్నాలను చేపట్టి దాడిని తిప్పికొట్టాయి. అదే సమయంలో మనం ఒక రాజకీయ పోరాటాన్ని కూడా చేపట్టాం. మనం శత్రువు ప్రచారాన్ని బహిర్గతం చేస్తూ దాన్ని తిప్పికొట్టాం. అది దేశంలోనూ, అంతర్జాతీయంగానూ అనుకూల రాజకీయ ధృవీకరణకు మార్గాన్ని సుగమం చేసింది. ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులు విప్లవకారులతో కలిసి వచ్చి ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను 'ప్రజలపై యుద్ధం'గా అభివర్ణిస్తూ దాన్ని ఖండించాయి. శత్రు మానసిక యుద్ధాన్ని తిప్పికొట్టడంలో మన సిద్ధాంతానికి వున్న సత్తాను ఇది మరోసారి చాటిచెప్పి మనకు విలువైన పాఠాలను అందించింది.

వీటన్నిటి మధ్యలో, 2010 ఏప్రిల్ 6న దక్షిణ బస్తర్‌లోని ముకరం వద్ద జరిగిన చారిత్రాత్మక ఆంబుష్ శత్రుబలగాలకు చెందిన ఒక మొత్తం కంపెనీని తుడిచిపెట్టింది. 75 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు, ఒక జిల్లా పోలీసు జవాను చావగా, ఏడుగురు గాయపడ్డారు. ఈ ఆంబుష్‌ను కామ్రేడ్స్ అసమాన ధైర్యసాహసాలతో, త్యాగాలతో నిర్వహించారు. ఈ ఆంబుష్‌ను గెరిల్లా బెటాలియన్ కేంద్రంగా నిర్వహించారు. గెరిల్లా బెటాలియన్‌లో స్థానిక కామ్రేడ్స్ నాయకత్వం వుండడం, ఫలితంగా ఈ నాయకత్వానికి టెర్రయిన్‌పై గల పట్టు, స్థానిక ప్రజానీకంతో వారికి గల బలమైన సంబంధాలు, బలమైన ప్రజాపునాదీ ఒకదానికొకటి పూరకంగా నిలుస్తూ ఈ ఆంబుష్ విజయానికి దారి తీశాయి. పాశవిక ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు ప్రతిస్పందనగా, విముక్తి ప్రాంతాల స్థాపనలో విడదీయరాని భాగంగా జరిగిన ఈ సాహసోపేతమైన ఆపరేషన్ పిఎల్‌జిఎ బలగాలకూ, దేశవ్యాప్తంగా ఉన్న విప్లవ ప్రజానీకానికీ గొప్ప ఉత్తేజంగా నిలిచింది.

ఈ కాలవ్యవధిలో పిఎల్‌జిఎ శత్రు 'కార్డన్ అండ్ సర్చ్' క్యాంపెయిన్లను ఎదిరించి పోరాడుతూ దాని నుండి తప్పుకోవడంలో కూడా విలువైన అనుభవాలను పొందింది. ఏడు వేల శత్రుబలగాలు (స్పాట్‌లో రెండు వేలమంది, బాహిర వలయంలో ఐదువేలు) మన నాయకత్వ కామ్రేడ్స్‌ను మట్టుబెట్టాలనే ఉద్దేశ్యంతో బిజెలోని మమాయిల్‌లోని మన క్యాంపుపై దాడి చేసినప్పుడు పిఎల్‌జిఎ 30 గంటల పాటు సాహసోపేతంగా పోరాడుతూ దాన్ని తిప్పికొట్టి దాడిని విఫలం చేసి చక్రబంధంలోంచి తప్పుకుని పోయింది. బిజెలోని ఆపరేషన్ సరండా సందర్భంగా కూడా శత్రువు అంతర్గత, బాహిర వలయాల్లో పదివేల మంది బలగాలను సమీకరించినప్పుడు పిఎల్‌జిఎ బలగాలు ప్రజల పూర్తి మద్దతుతోనూ, బ్రహ్మాండమైన చొరవతోనూ 72 గంటలపాటు సాహసోపేతంగా పోరాడి చక్రబంధం నుండి తప్పుకున్నాయి. పిఎల్‌జిఎ బలగాలు హెలికాప్టర్ల ద్వారా పోలీసు, పారామిలటరీ బలగాలను మోహరించే శత్రు ఎత్తుగడలను కూడా తిప్పికొడ్తూ పశ్చిమ బస్తర్‌లోని పిడియా వద్ద హెలికాప్టర్‌పై

కాల్పులు జరిపాయి. ఒక ఎయిర్‌ఫోర్సు ఆఫీసర్ చావగా, ముగ్గురు గాయపడ్డారు. ఝార్ఖండ్‌లోని పోరాహాట్‌లో పిఎల్‌జిఎ బలగాలు హెలికాప్టర్‌పై కాల్పులు జరిపి, దాన్ని డామేజి చేయడం ద్వారా శత్రు పథకాన్ని వమ్ముచేశాయి.

ఈ కాలంలో జరిగిన నందిగ్రాం, లాల్‌గఢ్, నారాయణపట్నా పోరాటాల ద్వారా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం ద్వారా, అనేక రాష్ట్రాల్లో జరిగిన విస్థాపన వ్యతిరేక పోరాటాల ద్వారా విప్లవకర ప్రజాపోరాటాల విషయంలోనూ, సాయుధ, ప్రజాపోరాటాల మధ్య సమన్వయం విషయంలోనూ కూడా మనం విలువైన పాఠాలను పొందాం. ఈ పోరాటాలు ప్రజావెల్లువల రూపాన్ని తీసుకున్నాయి. కొత్త పోరాట, నిర్మాణ రూపాలు ముందుకొచ్చాయి. ప్రజాసంఘాల సంఘటితీకరణకూ, ఒక భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్రంట్ నిర్మాణానికీ అనుకూలమైన పునాదిని ఇవి ఏర్పర్చాయి. దేశంలోని ఇతర అనేక ప్రాంతాల్లో తమ భూములను కాపాడుకోవడం కోసం ప్రజలు పెద్దెత్తున పోరాటాలను ఎక్కుపెట్టారు. వారు పెద్ద గనులు, ఆనకట్టలు, ఇతర సామ్రాజ్యవాద అనుకూల, పాలకవర్గ అనుకూల ప్రాజెక్టుల కోసం తమను విస్థాపితులను చేయడానికి జరుగుతున్న పథకాలకు వ్యతిరేకంగా పోరాడారు. మనం ఈ పోరాటాల్లో కొన్నిటికి మద్దతు పలకగా కొన్నిటికి నాయకత్వం వహించాం. ఇవి మనకు ప్రజాపోరాటాలను నడపడంలో, చాలా విభిన్నమైన శక్తులను సమైక్యం చేయడంలో విలువైన అనుభవాలను అందించాయి. ఈ పోరాటాలు మన పార్టీ, దాని నాయకత్వంలో నడుస్తున్న ప్రజాయుద్ధానికి గల అగ్రగామి పాత్రను ముందుకు తెచ్చాయి. యుద్ధజోన్లను విస్తరించడంలో, నూతన శక్తులను గెలుచుకోవడం ద్వారా పార్టీనీ, పిఎల్‌జిఎనూ విస్తరించడంలో ఇవి మనకు ఎంతగానో ఉపకరించాయి.

ఈ కాలంలో పార్టీ వివిధ రంగాల్లో తన సమర్థతలను మరింతగా పెంపొందించుకుంది. అది దేశంలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ వివిధ పెడధోరణులకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటంలో క్రియాశీలంగా పాల్గొన్నది. దక్షిణాసియా మావోయిస్టు పార్టీల, సంస్థల కో-ఆర్డినేషన్ సెంటర్ (సికంపోసా)ను నడపడంలో అది కీలకమైన పాత్రను పోషించింది.

ప్రణాళికాబద్ధంగా అధ్యయన తరగతులను నిర్వహించడం ద్వారా పార్టీ తన సైద్ధాంతిక స్థాయిని పెంచుకోవడంపై తన దృష్టిని కేంద్రీకరించింది. వివిధ భాషల్లో అధ్యయన సామగ్రినీ, పత్రికలనూ ప్రచురించింది. ఆదివాసీ భాషల్లో అధ్యయనాన్నీ/ప్రచార సామగ్రినీ అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కృషిని చేపట్టింది. ప్రాథమిక విద్య కోసం తయారు చేసిన సిలబస్‌నూ, పుస్తకాలనూ మరింత సంపద్వంతం చేసింది. ఆర్పీసీలు నడిపే పాఠశాలల్లోనూ, పిఎల్‌జిఎ

సైనికుల విద్య కోసమూ, ప్రజాసంఘాల సభ్యుల విద్య కోసమూ వీటిని ఉపయోగిస్తున్నారు.

పార్టీ కమిటీలూ, కమిషన్లూ, కమాండ్లూ పీడిత వర్గాలకూ, సెక్షన్లకూ చెందిన యువతీ యువకులను ప్రజాయుద్ధాన్ని విస్తరించడానికి పెద్దెత్తున పిఎల్‌జిఎలో చేరమని అనేకసార్లు పిలుపులనివ్వడం ద్వారా భర్తీ క్యాంపెయిన్లను నిర్వహించాయి. కొన్ని గెరిల్లా జోన్లలో విప్లవ ప్రజాసంఘాలూ, ప్రజామిలీషియా, ఆర్పీసీలు గ్రామ బహిరంగ సభల ద్వారా పిఎల్‌జిఎలోకి యువతీ యువకులను భర్తీ చేసుకోవడంలో కీలక పాత్రను పోషిస్తున్నాయి. ఇందులో భాగంగా, ఐక్యతా కాంగ్రెస్-తొమ్మిదవ కాంగ్రెస్ నాటి నుండి అనేక గెరిల్లా జోన్లలో వందలాదిగా రైతాంగ, ఆదివాసీ యువతీ యువకులు పిఎల్‌జిఎలో చేరారు. వేలాదిమంది ప్రజామిలీషియాలో సంఘటితమయ్యారు.

నిరంతరంగా విప్లవ ప్రచారం చేపట్టడం, ప్రజలను వేర్వేరు నిర్మాణాల్లో (పార్టీ-ప్రజామిలీషియా-ప్రజాసంఘాలు-ఆర్పీసీలు) సంఘటితం చేయడం, ప్రజలను సాయుధం చేయడం, వారికి శిక్షణనివ్వడం, ప్రజలను వేర్వేరు ప్రజాపోరాటాలలోకి సమీకరించడం, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడం కోసం వ్యవసాయ ఉత్పత్తిలో, విద్య, ఆరోగ్య, తదితర సంక్షేమ కార్యకాలాపాల్లో పాల్గొనడం, ప్రజలకు ఆరోగ్య సేవలను అందించడం వంటి అనేక కార్యకలాపాలను చేపట్టడం ద్వారా పార్టీ, పిఎల్‌జిఎ వివిధ గెరిల్లా బేసుల్లో, గెరిల్లా జోన్లలో, ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాల్లో, ఇతర ప్రాంతాల్లో ప్రజల హృదయాల్లో స్థానాన్ని సంపాదించుకున్నాయి.

పార్టీ, పిఎల్‌జిఎ విప్లవోద్యమానికి బలమైన ప్రజాపునాదిని నిర్మించడానికి ఎంతో ప్రయాసకోర్చాయి. లక్షలాది ప్రజానీకం విప్లవ రైతాంగ, మహిళా, యువజన, సాంస్కృతిక, బాలల సంఘాల్లో సమీకృతులయ్యారు. అవి ప్రజారంగంలో పనికి బాధ్యత వహించే కేంద్ర విభాగాల ఆధ్వర్యంలో పని చేశాయి. అవి ప్రజాయుద్ధానికి ప్రజాపునాదిగా ప్రముఖమైన పాత్రను వహిస్తాయి. ఆర్పీసీల మార్గదర్శకత్వంలో ప్రజామిలీషియా, రైతాంగ, మహిళా సంఘాల కార్యకర్తలు, విప్లవ కళాకారులు శత్రుబలగాలను ప్రతిఘటించడంలో పాల్గొంటారు. వారు పిఎల్‌జిఎ కోసం సప్లై పనిలో పాల్గొంటారు, శత్రువును గురించిన సమాచారాన్ని పార్టీ, పిఎల్‌జిఎ, ప్రజారక్షణ విభాగాలకు ఎప్పటికప్పుడు చేరవేస్తారు, గ్రామాల్లో సెంట్రీ పని చేస్తారు.

ఆకాశంలో సగం అయిన మహిళలను జాగృతం చేయడం, పోరాటంలో తమ వంతు భాగాన్ని తాము గెలుచుకునేలా రాజకీయ, నిర్మాణ, మిలటరీ, సాంస్కృతిక, ఇతర రంగాల్లో

వారి సమర్థతలను అభివృద్ధి చేయడం పార్టీ సాధించిన అపురూపమైన విజయాల్లో ఒకటి. నేడు పిఎల్‌జిఎలోని పోరాటశక్తిలో దాదాపు 40 శాతం మహిళలే. అయితే వేర్వేరు గెరిల్లా జోన్లలో ఈ శాతం వేర్వేరుగా వున్నది. మహిళలు ప్లటూన్ స్థాయిలో కమాండర్లుగా, కంపెనీ స్థాయి పార్టీ కమిటీల్లో సభ్యులుగా పని చేస్తున్నారు.

పార్టీ విప్లవ సాంస్కృతిక కార్యకలాపాలను అభివృద్ధి చేయడానికి ఎంతగానో శ్రద్ధ వహించింది. అనేక రాష్ట్రాలలో సాంస్కృతిక ప్రజాసంఘాలు గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకూ పని చేస్తున్నాయి. ఈ సంస్థలు జాతీయ, ఎథ్నిక్ సాంస్కృతిక సంప్రదాయాలు, శైలుల నుండి నేర్చుకునే, వాటిని అభివృద్ధి చేసే బహుళమైన సాంస్కృతిక రూపాల ద్వారా విప్లవ సందేశాన్ని ప్రచారం చేస్తాయి, ప్రజాస్వామిక, శాస్త్రీయ విలువలను ప్రోత్సహిస్తాయి. ఇవి ప్రజలను మౌలిక మార్పు కొరకు పోరాడేలా ప్రేరేపిస్తాయి. వీటి సాంస్కృతిక సందేశాలు ప్రజల మెదళ్లపై స్వారీ చేసే పాత సమాజపు అభివృద్ధి నిరోధక విలువలపై దాడి చేసే దిద్దుబాటు పరికరాల పాత్రను నిర్వహిస్తాయి. ఈ సంఘాలు పార్టీని విశాల ప్రజానీకంతో కలిపే శక్తివంతమైన ఆయుధాలు. ఈ ప్రజాసంఘాలే కాకుండా, పిఎల్‌జిఎలో కూడా కంపెనీ, బెటాలియన్ స్థాయి నిర్మాణాల్లో సాయుధ సాంస్కృతిక బృందాలను ఏర్పరుస్తున్నాం.

డికె స్పెషల్ జోన్, బిజె స్పెషల్ ఏరియా, ఆంధ్ర-ఒడిషా బార్డర్ (ఏవోబి) ప్రాంతాల్లో మరిన్ని ప్రజా రాజ్యాధికార అంగాలు ఆర్పీసీల రూపంలో ముందుకొచ్చాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ (ఏపి)లలో గతంలో అనేక ఆర్పీసీలను ఏర్పరచాం. ఆ రాష్ట్రాల్లో మన ఉద్యమం సెట్‌బ్యాక్‌కు గురైనప్పటికీ రాజ్యాధికారాన్ని చవి చూసిన ప్రజానీకం ఆ స్ఫూర్తితో ఈ పరిస్థితిని అధిగమించడానికి పోరాడుతున్నారు. డికెలో అనేక ఏరియా స్థాయి ఆర్పీసీలు ఏర్పడ్డాయి. కొన్ని డివిజన్ (జిల్లా) స్థాయి ప్రజా ప్రభుత్వాలు కూడా పని చేయనారంభించాయి. మన దేశ విప్లవోద్యమ చరిత్రలో ఇది ఒక నూతన అనుభవం. ఈ ప్రజాప్రభుత్వాలు ప్రజల ఆర్థికాభివృద్ధికై స్వయం సమృద్ధిని సాధించే వైపుగా పురోగమించడానికీ, పార్టీకీ, పిఎల్‌జిఏకీ అండగా నిలవడానికీ ప్రజల సహకార, సమిష్టి శ్రమ ద్వారా వ్యవసాయ ఉత్పత్తిని పెంపొందించడానికి ఎంతో కష్టించి కృషి చేస్తున్నాయి. దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడంలో, విముక్తి ప్రాంతాల నిర్మాణంలో ఈ కృషి విడదీయరాని భాగం.

కారాగారాల్లో మరో పోరాటరంగం క్రమంగా విస్తరిస్తోంది. వేలాదిమంది జైళ్లలో వున్నారు. దాదాపు 20 రాష్ట్రాలకు చెందిన అనేక కేంద్ర, జిల్లా కారాగారాలు, సబ్‌జైళ్లు రాజకీయ ఖైదీల డిమాండ్లపై చేసే నిరాహారదీక్షల (ఒకోసారి నిరవధికంగా కూడా) నినాదాలతో ప్రతిధ్వనించాయి. తమ కార్యకలాపాల ద్వారా జైళ్లలోని మన కామ్రేడ్స్ సాధారణ ఖైదీలను

తమ హక్కుల కోసం పోరాడేలా సమీకరించడంలో విజయవంతమయ్యారు. దేశవ్యాప్తమైన తీవ్ర నిర్బంధం మధ్యనే ప్రజాస్వామిక సంస్థలూ, శక్తులూ కూడా ఇందులో కీలకపాత్రను నిర్వహిస్తున్నాయి. కోర్టు ఖర్చుల కోసం, ఖైదీ కామ్రేడ్లను విడుదల చేయించడానికీ, వారి కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించడానికీ పార్టీ, అనేక ప్రజాసంఘాలూ ప్రజల నుండి నిధులను వసూలు చేసి అందించాయి. రాజకీయ ఖైదీలందరి విడుదలను డిమాండ్ చేస్తూ మద్దతు కార్యకలాపాలూ, పోరాటాలూ దేశమంతా వ్యాపించాయి.

శత్రువు విప్లవ ప్రతీఘాతుక పథకాలలో ఒక విశిష్టమైన, కీలకమైన అంశం మన నాయకత్వంపై దాడి చేయడం. ఇందుకోసం వారు కుఖ్యాత పోలీసు సిబ్బందితో ప్రత్యేకమైన బృందాలను 'స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' (ఎస్ఐబి)లో భాగంగా తయారు చేశారు. మన నాయకత్వాన్ని కనిపెట్టడానికీ, వారిని హత్య చేయడానికీ చాలా రాష్ట్రాల్లోనూ, కేంద్ర ప్రభుత్వ 'నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ'లోనూ ఏపి గ్రేహౌండ్స్ తరహాలో స్పెషల్ ఫోర్సెస్‌ను ఏర్పర్చడమో, వున్నవాటిని బలోపేతం చేయడమో జరిగింది. వారు మన పార్టీకీ, విప్లవోద్యమానికీ అనేక భారీ నష్టాలను, ప్రత్యేకించి పొలిటికల్ ఇంటలిజెన్స్ ఇన్‌ఛార్జి, కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ పటేల్ సుధాకర్‌ను, పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ ఆజాద్‌ను పట్టుకుని హత్య చేయడం ద్వారా, కలిగించగలిగారు. భారత విప్లవ మరో గొప్ప నాయకుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ కిషన్‌జీని కూడా లాల్‌గఢ్ ప్రాంతంలోని ఒక గ్రామంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పట్టుకుని, క్రూరంగా చిత్రహింసలు పెట్టి చంపేశారు. అయినప్పటికీ మనం దీన్నంతటినీ తట్టుకుని నిలబడ్డాం. మనం మన పనిలో కొన్ని అవరోధాలను ఎదుర్కొన్నప్పటికీ, 2010 వరకూ మనం పురోగమించగలిగాం. అప్పటి నుండి శత్రువు మరింత పెద్ద బలగాలను ఉపయోగించి తన దాడులను మరింత తీవ్రతరం చేశాడు. నష్టాలకు మన బలహీనతలు తోడై మనం నష్టాలను పొందిన దగ్గర లేక బలహీనపడ్డ దగ్గర ఇదంతా మనకు ఒక గడ్డు పరిస్థితిని కల్పించింది. మనం కొన్ని ప్రాంతాల నుండి రిట్రీట్ కావల్సి వచ్చింది. మనం పట్టణ ప్రాంతాల్లో కూడా గణనీయంగా బలహీనపడ్డాం.

ముకరం, సరండా, లోహర్‌దగ్గా, అనేక ఇతర ఎత్తుగడల ఎదురుదాడుల్లో పిఎల్‌జిఎ చేతుల్లో తాము పొందిన ఘోర అపజయాల నేపథ్యంలో శత్రువు మరింత పెద్ద బలగాలతో ఆపరేషన్లను చేపట్టసాగాడు. పట్టణ ప్రాంతాల్లో, మైదాన ప్రాంతాల్లో నాయకత్వాన్నీ, కార్యకర్తలనూ దెబ్బ తీయడంలో సఫలీకృతమైన శత్రువు ప్రస్తుతం అటవీ ప్రాంతంలోని నాయకత్వాన్ని టార్గెట్ చేస్తున్నాడు. వారు తమ ఇంటలిజెన్స్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకుంటున్నారు. వారు వేలాది జవాన్లతో కూడిన కేంద్ర, రాష్ట్ర భారీ బలగాలతో పార్టీ/

పిఎల్‌జిఎ నడిపే సమావేశ/రాజకీయ, మిలటరీ శిక్షణా క్యాంపులనూ, వేర్వేరు డిపార్ట్‌మెంట్ల క్యాంపులనూ టార్గెట్ చేస్తున్నారు. వారు కిరాయి హంతక ముఠాల ద్వారా విద్రోహకర (సాబొటేజి) ఆపరేషన్లను కూడా చేపడుతున్నారు. వారు మన రాజకీయ, నిర్మాణపర, మిలటరీ, ఉత్పత్తి, ప్రచార కార్యకలాపాలను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తూ ప్రజల నైతిక స్థైర్యాన్నీ, మన ప్రజాపునాదినీ తగ్గించాలని చూస్తున్నారు. వందల/వేల సంఖ్యలో శత్రు బలగాలను మోహరించి ఏరియా డామినేషన్లనూ, రోడ్ పెట్రోలింగ్‌లనూ చేపడుతున్నారు. రోడ్ ఓపెనింగ్ పార్టీల సంఖ్యనూ, వాటిలోని సభ్యుల సంఖ్యనూ పెంచారు. వారికి నిర్దిష్టమైన సమాచారం వున్నా లేక నాయకత్వం వుందనే సమాచారం వున్నా దాదాపు 800 నుండి 4000 లేదా అంతకంటే ఎక్కువ బలగాలను మోహరిస్తున్నారు. కశ్మీర్ వంటి పోరాటప్రాంతాల్లో ఉపయోగించే కార్పెట్ సెక్యూరిటీని రోజురోజుకూ విస్తరిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, ఝార్ఖండ్, తెలంగాణ, ఏపీ, ఏఓబీ, బెంగాల్, ఒడిషాలలో, ఈ రాష్ట్రాల సరిహద్దులలో నూతనంగా డజన్లకొద్దీ పోలీసు క్యాంపులను ఏర్పర్చారు. నూతనంగా విస్తరించిన ఉద్యమాన్ని మొగ్గలోనే తుంచేయడానికి మూడు సౌత్-వెస్ట్ రాష్ట్రాల ట్రైజంక్షన్ ఏరియాలోనూ, మల్నాడు ప్రాంతంలోనూ అనేక పోలీసు క్యాంపులను ఏర్పరుస్తున్నారు. సరిహద్దులలోని పోలీసు స్టేషన్లలో మరిన్ని భద్రతా చర్యలను చేపట్టాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. క్యాంపుల్లోనూ, పోలీసు స్టేషన్లలోనూ రెండు నుండి మూడు కంపెనీ స్థాయి బలగాలు ఉంటున్నాయి. పారామిలటరీ బెటాలియన్ల మోహరింపుతోపాటు పోలీసు, హోంగార్డు, ఎస్పీవో/రాష్ట్ర ఆగ్జిలరీ పోలీసు బలగాలను వేలాదిగా ఇటీవలి సంవత్సరాలలో భర్తీ చేసుకుంటున్నారు. ఈ బలగాలనూ, ఆపరేషన్లనూ సమన్వయించడానికి డజన్లకొద్దీ ఐపిఎస్ ఆఫీసర్లను ఉద్యమ ప్రాంతాల్లో మోహరిస్తున్నారు. వారు తొమ్మిది రాష్ట్రాల్లో కార్పెట్ సెక్యూరిటీని బలోపేతం చేయడంలో భాగంగా 400 ఫోర్టిఫైడ్ పోలీస్ స్టేషన్లనూ, క్యాంపులనూ నిర్మిస్తున్నారు. వారు డ్రోన్ దాడులకై సన్నాహాలను వేగవంతం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 2200 కమ్యూనికేషన్ టవర్లను, ముఖ్యంగా తొమ్మిది రాష్ట్రాల్లోని మన ప్రభావిత ప్రాంతాల్లోని శత్రు బలగాల క్యాంపుల్లో నిర్మించాలని నిర్ణయించింది. దట్టమైన అడవుల్లోని గెరిల్లాల కదలికలపై నిఘాను ఉంచే ఉద్దేశ్యంతో వాళ్లు 2012లో రిసాట్-1 శాటిలైట్‌ను ప్రయోగించారు.

భారత ప్రభుత్వం బస్తర్ రేంజిలో, ప్రత్యేకించి మొదటగా మాడ్‌లోనూ, తదుపరి మధ్య, తూర్పు భారతదేశంలోని ప్రజాయుద్ధ వ్యూహాత్మక ప్రాంతాల్లోనూ దీర్ఘకాల వ్యూహంతో సైన్యాన్ని మోహరించడానికి సన్నాహాలను వేగవంతం చేసింది. సైన్యం నేరుగా 'ప్రజలపై

యుద్ధం'లోకి దిగడానికి వెనకాడుతోంది ఎందుకంటే అందులో దిగబడిపోతామనీ, అది సుదీర్ఘకాలం లాగబడుతుందనీ అది భయపడుతోంది. కశ్మీర్‌లోని రాష్ట్రీయ రైఫిల్స్ తరహాలో ఒక స్పెషల్ ఫోర్సును నిర్మించాలని వారి పథకం. అదంటూ ఒకసారి శిక్షణను పూర్తి చేసుకుని మోహరించబడితే అదిక విప్లవ శక్తులకు భారీ నష్టాలను కలిగించడానికీ, మొత్తం స్థానిక నాయకత్వాన్ని నిర్మూలించడానికీ విశాలమైన అటవీ ప్రాంతాలను చుట్టుముట్టడంలో పాత్ర వహిస్తుంది. ఇప్పటికే మాడ్‌లో మూడవ వంతు భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం సైనిక క్యాంపులకు అప్పగించింది. అదనపు భద్రతా వలయం వల్ల 50 శాతం భూభాగం నేరుగా సైనిక అదుపులోకి వెళిపోతుంది. ఒకసారంటూ లాంఛనంగా సైన్యాన్ని మోహరించాక, ఇప్పటికే అనధికారికంగా అమలులో వున్న నిరంకుశ 'సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం' (ఎఎఫ్ఎస్‌పిఎ) లోని అంశాలను ప్రజలపై రుద్దుతారు. ఎయిర్ ఫోర్సు (వైమానిక బలగం) పెద్దెత్తున బలగాలను దింపడంలో, సప్లై పనుల్లో సంపూర్ణంగా పాల్గొంటున్నది. కేంద్ర పారామిలటరీ, రాష్ట్ర బలగాలకు మద్దతుగా నిలవడానికీ, భవిష్యత్తు సైనిక దాడులకూ, అలాగే ఎయిర్ ఫోర్సు దాడులను ఎక్కుపెట్టడానికీ కూడా పెద్ద సంఖ్యలో హెలిపాడ్లను, అనేక ఎయిర్ బేసులను ఛత్తీస్‌గఢ్, విదర్భ (మహారాష్ట్ర), ఏపీ, తెలంగాణ, బీహార్, ఝార్ఖండ్, బెంగాల్, ఒడిషా రాష్ట్రాల్లో నిర్మించి ఒక విస్తారమైన నెట్‌వర్క్‌ను తయారు చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం ఏపీ గ్రేహౌండ్స్ నమూనాలో (కౌంటర్ ఇన్‌సర్జన్సీ యుద్ధతంత్రం కోసం శిక్షణ పొందిన స్పెషల్ కమాండో బలగం) వేలాది ప్రత్యేక రాష్ట్ర, కేంద్ర బలగాలను తయారు చేస్తోంది. అది మన ఉద్యమ ప్రాంతాలున్న రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులను కమాండర్-ఇన్-చీఫ్‌లుగా నియమించి యూనిఫైడ్ కమాండ్స్‌ను ఏర్పరుస్తోంది. వాటిలో ఒక రిటైర్డ్ సైనిక బ్రిగేడియర్, కేంద్ర, రాష్ట్ర బలగాల ఉన్నత స్థాయి అధికారులూ సభ్యులుగా ఉంటారు. ఈ యూనిఫైడ్ కమాండ్లు కేంద్రంతో సమన్వయంతో పని చేస్తాయి. వారు రాష్ట్రాల సరిహద్దుల్లో జాయింట్ ఆపరేషనల్ కమాండ్లను కూడా ఏర్పరచి ప్రత్యేకించి బలమైన ఉద్యమ ప్రాంతాలున్న మూడు రాష్ట్రాల కూడళ్లపై కేంద్రీకరించి దాడులను కొనసాగిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ఇంటలిజెన్స్ విభాగాలను మెరుగుపరిచారు. బహుముఖ, కేంద్రీకృత, సమన్వయంతో, మేళవింపుతో కూడిన 'ప్రజలపై యుద్ధాన్ని' కొనసాగించి కార్పొరేట్ ఎజెండాను అమలు చేయడానికి సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల ప్రోద్బలంతో మొత్తం పరిపాలనా యంత్రాంగాన్ని పున:సంఘటితం చేశారు. ఈ అన్ని విప్లవ ప్రతీఘాతుక చర్యలలో వారికి అమెరికా, ఇతర సామ్రాజ్యవాద శక్తులు మార్గదర్శకత్వాన్నీ, మద్దతునూ అందిస్తున్నాయి.

నూతన పార్టీ స్థాపన తర్వాత మన ప్రజాపునాదిని నాశనం చేయడానికై విప్లవ ప్రతీఘాతుక గ్యాంగులూ, శత్రు బలగాలూ ప్రజలపై దాడులు, హత్యలు, మహిళలపై లైంగిక అత్యాచారాలు, ఇళ్లను తగులబెట్టడం, లూటీ, పంటల, ధాన్యాగారాల విధ్వంసం, కోళ్లను, పశువులను దోచుకోవడం, కోసుకుని తినడం లాంటి దుశ్చర్యలను పెంచేశాయి. చింతల్‌నార్ ప్రాంతంలో నాలుగు గ్రామాలను తగులబెట్టి, హత్యలూ, లైంగిక అత్యాచారాలూ జరిపిన ఘటన ఇందుకొక దారుణమైన ఉదాహరణ. ప్రజాస్వామిక సంస్థలు శత్రువు సాగించిన విధ్వంసాన్ని బహిర్గతపరిచాయి. అయితే పిఎల్‌జిఎ బలగాలు ఈ హంతక ముఠాపై అక్కడే విజయవంతంగా ఎత్తుగడల ఎదురుదాడిని నిర్వహించి నలుగురు కోయ కమాండోలను హతమార్చి ఎనిమిదిమందిని గాయపరిచారు.

మరోవైపు, ఎల్ఐసీలో భాగంగా వారు లెక్కలేనన్ని పేర్లతో పరిస్థితులకు అనుగుణంగా విప్లవ క్యాంపును చీలదీసే లక్ష్యంతో, పార్టీనీ, పిఎల్‌జిఏనూ ప్రజల నుండి వేరుపరిచి, దోపిడీ వర్గాల సామాజిక పునాదిని విస్తరించే లక్ష్యంతో సంస్కరణలను తీవ్రతరం చేస్తున్నారు. అందుకోసం వారు వ్యూహాత్మకంగా మొత్తం ప్రతీఘాతుక చట్టసభలనూ, పరిపాలనా వ్యవస్థనూ, న్యాయవ్యవస్థనూ, మీడియానూ సమీకరించి, కేంద్రీకరించి సమన్వయించడమే కాక ప్రభుత్వ బలగాలను ఇందులో కేంద్రంలో వుంచుతూ ఎత్తుగడలపరంగా కూడా అందుకనుగుణంగా వ్యవహరిస్తున్నారు. 'సివిక్ యాక్షన్ ప్రోగ్రాం'ల పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అనేక సంస్కరణ పథకాలను శత్రు బలగాల ద్వారా అమలు చేయిస్తున్నారు. ఇంతే కాక, ఈ బలగాలకు పెద్దెత్తున ఇందుకోసం నిధులను కేటాయిస్తున్నారు. వంటపాత్రలు, బట్టలు, రేడియోలు, సైకిళ్లు మొదలైనవాటిని భారత ప్రభుత్వం దశాబ్దాలుగా ఎటువంటి మౌలిక సౌకర్యాలూ కల్పించని సుదూర గ్రామాల్లో గుప్పిస్తున్నది. మన పార్టీ, పిఎల్‌జిఎల ద్వారా తమ జీవితాల్లో మొదటిసారి విద్యాసౌకర్యాలను పొందిన పేద ఆదివాసీ పిల్లల్లోని ఒక సెక్షన్‌కు ఇప్పుడు భారత ప్రభుత్వం ఉచిత బోర్డింగ్, ట్యూషన్ కల్పించడానికి 'ఉవ్విళ్లూరుతోంది'. ఇటువంటి పద్ధతుల ద్వారా ప్రజలకు దగ్గరవ్వడానికి ప్రయత్నించడం ద్వారా వారు తమ స్వంత ఇంటలిజెన్స్ నెట్‌వర్క్‌ను ఏర్పర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. వారు రాజకీయ నాయకులు, అధికారులు, కాంట్రాక్టర్లు, ఆదివాసీ పెద్దలు/పెత్తందార్లు, ధనిక రైతులు, మధ్యతరగతి రైతులలోనే కాక పేదరైతులు, రైతుకూలీలలోని ఒక సెక్షన్‌కు ఆర్థిక లబ్ధిని కలిగిస్తూ వారిని తమ సామాజిక పునాదిగా ఉపయోగించుకుంటున్నారు. శత్రు ఇంటలిజెన్స్ నెట్‌వర్క్ చాలా ప్రాంతాల్లో పెరిగింది. లొంగుబాటు విధానంలో భాగంగా వారు పునరావాస పథకాలను

అమలు చేస్తూ లొంగిపోయినవారిలో అనేకులను ద్రోహులుగా మారుస్తున్నారు. అలాగే గ్రామస్థాయి నాయకత్వంపై సీరియస్‌గా ఒత్తిడిని పెంచుతూ వారిని ప్రజావ్యతిరేకులుగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. పిఎల్‌జిఎలో, పార్టీలో పని చేసే వారిలో బలహీనమైన శక్తులను కోవర్టులుగా మార్చడానికి తీవ్రమైన ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

శత్రువు మానసిక యుద్ధంలో భాగంగా మన ఉద్యమం మీద, అన్ని స్థాయిల నాయకత్వం మీద దుష్ప్రచారం చేస్తున్నాడు. సిపిఐ, సిపిఎం వంటి రివిజనిస్టు పార్టీలు, కొన్ని ఎంఎల్ గ్రూపులకు చెందిన కొందరు మితవాద అవకాశవాద నాయకులు మన పార్టీ పంథాపై దాడి చేస్తూ పాలకవర్గాలకు మద్దతునిస్తున్నారు. వారు సిపిఐ (మావోయిస్టు)లోని నాయకత్వ కామ్రేడ్స్ మధ్య మునుపటి పార్టీల (ఎంసిసిఐ, పిడబ్ల్యు)ను అనుసరించి గొడవలు మొదలయ్యాయని ఒక మోసపూరిత ప్రచార క్యాంపెయిన్‌ను మొదలుపెట్టారు. వారు తమకున్న సామాజిక-సాంస్కృతిక ఆధిపత్యాన్ని వేల రకాలుగా వినియోగించుకుని ఎడతెరిపి లేకుండా అన్ని రకాల మీడియా ద్వారా, తమ వర్గ శక్తుల ద్వారా మనల్ని అభివృద్ధికి వ్యతిరేకులుగా, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకులుగా, హింసావాదులుగా చిత్రీకరిస్తూ సైకలాజికల్ ఆపరేషన్స్‌ను చేపడుతున్నారు. ఒకవైపు వారు సోషలిజానికీ, కమ్యూనిజానికీ కాలం చెల్లిందనీ, మనం ఎప్పటికీ గెలువబోమనీ, అందుకని పార్టీ ఎన్నికల రాజకీయాలలోకి ప్రవేశించాలనీ ప్రచారం చేస్తున్నారు. మరోవైపు వారు విప్లవోద్యమాన్ని 5 లేదా పది ఏండ్లలో తుడిచిపెట్టేస్తారు కనుక, మనం ఎన్నటికీ గెలువలేం కనుక విప్లవ క్యాంపులోని వారిని పోలీసుల్లో చేరమనీ లేదా విప్లవోద్యమాన్ని విడిచి ఇన్ఫార్మర్‌లుగా మారమనీ ప్రోద్బలం ఇస్తున్నారు. వారు సవ్యసాచి పండా లాంటి పచ్చి అవకాశవాదులను ప్రోత్సహించి ఉద్యమాన్ని నీరుగార్చాలని చూస్తున్నారు.

మొత్తంగా, గత కొద్ది సంవత్సరాలుగా మనం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. 2010 మధ్యకల్లా మూడు, మూడున్నర లక్షల పోలీసు, పారామిలటరీ, రాష్ట్ర, కేంద్ర కమాండో బలగాలను మోహరించి వున్నారు. ప్రస్తుతం ఆ సంఖ్య దాదాపు 5 లక్షలకు పెరిగింది. భారత ప్రభుత్వం తన 'ప్రజలపై యుద్ధా'నికి ఇస్తున్న ప్రాధాన్యతను ఈ వాస్తవం ద్వారా మనం చూడవచ్చు. ఈశాన్యం నుండీ, కశ్మీరు నుండీ తీసి అనేక కేంద్ర బెటాలియన్లను మన యుద్ధ జోన్లలో మోహరించారు. బిఎస్ఎఫ్, ఐటిబిపి, సిఆర్‌పిఎఫ్ వంటి పారామిలటరీ బలగాలు ఇప్పటికే భారీ స్థాయిలో సాయుధమై వున్నాయి. ఇప్పుడు సిఆర్‌పిఎఫ్‌కు డ్రోన్లు, ఇతర హైటెక్ పరికరాలను అందించి దాన్ని మరింతగా పెంచుతున్నారు. ఇప్పటికే డ్రోన్లు చేసే ఏరియా నిఘా (సర్వేలెన్స్) ద్వారా రియల్ టైం ఇన్‌పుట్స్ (జరుగుతున్న సమయంలోనే

సమాచారం అందివ్వడం)ను దాని కూంబింగ్ ఆపరేషన్లలో భాగం చేసుకుని ఉపయోగించడం మొదలైంది.

చుట్టివేతలను మరింత పకడ్బందీ గావించడం, కూంబింగ్‌లు, దాడులు మన శ్రేణులలోని అత్యధిక మెజారిటీలో ఉక్కు సంకల్పాన్ని వెలికి తీశాయి. అయితే మరోవైపు అవి మన మధ్యలోనే ఇన్నాళ్లూ దాగొని వున్న చెడు శక్తులను కొన్నిటిని కూడా బహిర్గతం చేశాయి. ప్రజాయుద్ధం మన దేశ పరిస్థితులకు తగదని నమ్మబలికే కొందరు లిక్విడేషనిస్టులు, తమ ఓటమివాదాన్ని కప్పిపుచ్చుకునే విఫలయత్నం చేస్తూ వివిధ సాకులు చూపి పారిపోయే పిరికిపందలు, శత్రువు విసిరే రొట్టెముక్కలకు ఆశపడి ప్రజలను అమ్మివేసే ద్రోహులు - ఈ కష్టకాలాలు అటువంటి వారందరినీ ఒకరి తర్వాత ఒకరిగా బహిర్గతం చేశాయి. ప్రజలలో కొందరు శత్రు పాశవిక బలం ముందు "లొంగిపోయారు." పదే పదే భారీగా జరిగే దాడులు గ్రామాల్లోని పార్టీ నిర్మాణాలకు, దాని ఫలితంగా ఆర్పీసీలకు, ప్రజాసంఘాలకూ కూడా భారీగా హాని కలిగించాయి. ప్రజల్లోని ఒక సెక్షన్ మునుపటిలా క్రియాశీలంగా లేదు (పాసివ్‌గా మారింది).

వీటన్నిటి నేపథ్యంలో కొంతమంది కామ్రేడ్స్ తమ విప్లవ కర్తవ్యాలను కొనసాగిస్తున్నప్పటికీ వారి నైతిక స్థయిర్యం తగ్గింది. కానీ మా-లె-మా తో పదునుదేరి, స్పష్టమైన చూపుతో కూడిన దృఢత్వంగా వారి కార్యాచరణ పరిణామం చెందకపోతే, మనం ఎదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితులలో దాగి వున్న అవకాశాలను గ్రహించటం గానీ, వాటిని అందుకోవడం గానీ జరగదు. ప్రతి విప్లవమూ అలలు అలలుగా పురోగమిస్తుందనే విషయాన్ని మనం మరువకూడదు. ఇది చరిత్ర నియమం. మనం మన సైద్ధాంతిక స్థాయిని పెంచుకోవాలి, రాజకీయాలను ఆధిపత్యంలో వుంచాలి, ప్రజల్లోకి విప్లవ సందేశాన్ని మరింత లోతుగా, విస్తృతంగా కొనిపోవాలి, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను సృజనాత్మకంగా అన్వయిస్తూ మన ఎత్తుగడలను అభివృద్ధిపరచాలి, మన రాజకీయ, మిలటరీ, నిర్మాణ, ప్రచార, శిక్షణ, సాంస్కృతిక, ఉత్పత్తి, టెక్నికల్, ఇతర కర్తవ్యాల నిర్వహణలో 'రెడ్ ఎండ్ ఎక్స్‌పర్ట్' (కమ్యూనిస్టులుగా, నిపుణులుగా) ఉండాలి. ఆ విధంగా మాత్రమే మనం ఈ పరిస్థితి నుండి మరింత ఐక్యంగా, క్రమశిక్షణగా, బలంగా, సంఘటితంగా, గతిశీలంగా పైకి రాగల్గుతాం. విప్లవ యుద్ధం ప్రతి మలుపులోనూ ప్రజలతో మన సంబంధాలను మరింత లోతుగా, ఉన్నతంగా తిరిగి పెంపొందించుకోవాల్సిన అవసరం ముందుకొస్తుంది. ప్రతి కీలకమైన మలుపులోనూ మన రాజకీయ స్థాయినే కాదు ఏకకాలంలో ప్రజల రాజకీయ స్థాయిని కూడా లోతుగా పెంచుకోవాల్సిన కర్తవ్యం మళ్లొకసారి కొత్తగా ముందుకొస్తుంది. ప్రజల శక్తినీ, చొరవనూ మరింత శక్తివంతంగా వెలికి తీయడం కోసం మనం ఈ కర్తవ్యాన్ని

ధైర్యంగా చేపట్టాలి.

2013 ఆరంభంలో మనం ఎదుర్కొంటున్న పరిస్థితిని వస్తుగతంగా అంచనా వేస్తూ కేంద్రకమిటీ మన దేశవ్యాప్త ఉద్యమం గడ్డు పరిస్థితిని ఎదుర్కుంటోందని చెబుతూ, దాన్ని అధిగమించడానికి అవసరమైన మౌలిక ఎత్తుగడలను కూడా రూపొందించింది. ఈ గడ్డు పరిస్థితి తలెత్తడానికి కారణాలు రెండు: ఒకటి, సామ్రాజ్యవాదుల సంపూర్ణ మద్దతు, మార్గదర్శకత్వాలతో భారత పాలకవర్గాలు అభివృద్ధి చెందుతున్న మన ఉద్యమాన్ని అణచివేయడానికి మున్నెన్నడూ లేని స్థాయిలో దేశవ్యాప్త బహుముఖ వ్యూహాత్మక దాడిని ఎక్కుపెట్టారు; రెండవ కారణం మన స్వీయాత్మక బలహీనతలు. అయితే ఇవి అంతటా ఒకేలా లేవనే పరిశీలనను కూడా చేసింది. మన స్వీయాత్మక బలహీనతలు ఈ కింది విధంగా వున్నాయి:

మన ఉద్యమ ప్రాంతాలంతటా వేర్వేరు స్థాయిల్లో, వివిధ దామాషాల్లో వ్యవసాయ విప్లవ కార్యక్రమంపై ఆధారపడిన వర్గపోరాటాన్ని కొనసాగించడంలో, మారుతున్న దేశీయ, అంతర్జాతీయ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను దృష్టిలో వుంచుకుని సరైన ఎత్తుగడలను రూపొందించుకోవడంలో, రూపొందించుకున్న ఎత్తుగడలను అమలు చేయడానికి పార్టీనీ, ప్రజలనూ సమీకరించడంలో, మన లక్ష్యాన్ని పరిపూర్తి చేయడం కోసం దృఢమైన కృషి చేయడంలో, మన పార్టీలో, పిఎల్‌జిఎలో, విప్లవోద్యమంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న కార్మికవర్గేతర ధోరణులను సరిచేసుకోవడంలో, సాయుధ ప్రతిఘటనలోకీ, ఎదురుదాడులలోకీ ప్రభావవంతంగా పిఎల్‌జిఎనూ, ప్రజలనూ విస్తృతంగా సమీకరించడంలో, రహస్య పని విధానాన్నీ, గెరిల్లా యుద్ధ సూత్రాలనూ అమలు చేయడంలో, లీగల్-ఇల్లీగల్ లింక్ యంత్రాంగంలో, పార్టీకీ, పిఎల్‌జిఎకూ, ఆర్పీసీలకూ, ప్రజాసంఘాలకూ సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా, మిలటరీపరంగా పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ గరపడంలో, పట్టణ ఉద్యమాలను సంఘటితపర్చడంలో, అభివృద్ధి చేయడంలో, అలాగే మన ఉద్యమ ప్రాంతాలలోనూ, బయటా రైతాంగేతర విశాల ప్రజలను సమీకరించడంలో బలహీనతలూ, లోపాలు, మన పంథాకూ, విధానాలకూ అనుగుణంగా అన్ని స్థాయిల్లో రాజకీయ, నిర్మాణపర కృషి చేయడం ద్వారా విశాల ప్రజానీకాన్ని విప్లవోద్యమంలోకి సమీకరించడంలో పరిమితులు ఉన్నాయి. ప్రజాపునాది, భర్తీ, పోరాటశక్తి తగ్గిపోవడం - స్వీయాత్మక పరిస్థితుల్లో వచ్చిన ఈ సమస్యల వల్ల, దేశంలోనూ, ప్రపంచంలోనూ విప్లవ వస్తుగత స్థితి అద్భుతంగా పెంపొందుతున్నప్పటికీ, వాటిని బాగా ఉపయోగించుకోవడంలో మనం పరిమితులను ఎదుర్కొంటున్నాం.

మనం కొన్ని రాష్ట్రాల్లో బలహీనపడి, కొన్ని గెరిల్లా జోన్లలో సెట్‌బ్యాకులను ఎదుర్కోగా, కొన్నిటిలో మనం నిలదొక్కుకున్నాం. మనం కొన్ని భాగాలలో ఉన్నత స్థాయి అనుభవాలను పొంది కొన్ని నూతన వ్యూహాత్మక ప్రాంతాలకు విస్తరించగలిగాం కూడా. ఎంతో కఠినమైన పరిస్థితులను ఎదుర్కొంటూ, నష్టాలనూ పొందుతూనే మనం పశ్చిమ కనుమలలోని కర్ణాటక-కేరళం-తమిళనాడుల సరిహద్దు ప్రాంతంలో ఒక నూతన యుద్ధప్రంటును ఆరంభిస్తున్నాం. ఇది మన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా వ్యూహం-ఎత్తుగడల గొప్ప బలాన్ని సూచిస్తున్నది. మనం సైద్ధాంతికంగా, వ్యూహాత్మకంగా దృఢంగా ఉంటూ, ఎత్తుగడల్లో పట్టువిడుపులతో వ్యవహరిస్తూ, మన రాజకీయ-మిలటరీ పంథాను అమలు చేస్తూ, శత్రువును ధైర్యసాహసాలతో ఎదుర్కోవడంలో దృఢత్వాన్ని ప్రదర్శిస్తూ, ప్రజలలోకి విప్లవ రాజకీయాలను తీసుకుని వెళుతూ వారిపై సంపూర్ణంగా ఆధారపడినంత కాలం ఈ యుద్ధాన్ని ఎలా నిలబెట్టుకుని విజయం వైపు పురోగమించగలం అనేదాన్ని ఇది సూచిస్తున్నది.

మనం రిట్రీట్ కావల్సి వచ్చిన కొన్ని ప్రాంతాలలో ఉద్యమాన్ని పునరుద్ధరించడానికి అవసరమైన పునాదిని ఏర్పర్చుకోగలిగాం. మనం బలహీనపడిన ప్రాంతాలలో పార్టీ బోల్షివిక్ స్పిరిట్‌తో పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రయత్నిస్తున్నది. అంతేకాక, వస్తుగత పరిస్థితి మరింత అనుకూలంగా వున్నది. వాస్తవానికి 2011 వరకు వున్న కాలంలో మనం ప్రజలను సమీకరించి గెరిల్లా యుద్ధాన్ని విస్తరించి శత్రువు పథకాలను వమ్ము చేయగలిగాం. అందువల్ల అది ఎంత సవాళ్లతో కూడుకున్నదైనప్పటికీ, అనుకూల అంశాలపై ఆధారపడుతూ, మారుతున్న నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా ఎత్తుగడలను చేపడుతూ, వాటిని దృఢంగా అమలు చేస్తూ ప్రస్తుతం మన ఉద్యమం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని ఎదుర్కోవడం సాధ్యమే.

మనం చేసిన చైతన్యయుతమైన కృషి మూలంగా గత ఏడాదిన్నర కాలంలో మనం మన ఉద్యమాన్నీ, నాయకత్వాన్నీ తీవ్రతరమైన శత్రుదాడి మధ్యనే కాపాడుకోగలిగాం. డికె, బిజె, ఏవోబి, ఒడిషాలలో పార్టీ నాయకత్వంలోని పిఎల్‌జిఎ బలగాలు ప్రజల మద్దతుతో ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్లను (టిసిఓసి), అనేక సాయుధ చర్యలను విజయవంతంగా అమలు చేసి, శత్రు బలగాలను అంతమొందించి, ఆయుధాలను, మందుగుండును స్వాధీనపర్చుకున్నాయి. పిఎల్‌జిఎ నాయకత్వంలో ప్రజలూ, ప్రజా మిలీషియా వేలాదిగా కదిలి రోడ్డు నిర్మాణ పరికరాలనూ, వాహనాలనూ, ప్రభుత్వ, పెద్ద నిర్మాణ, మైనింగ్ కంపెనీలకు చెందిన గెస్ట్ హౌస్‌లనూ, క్యాంపు ఆఫీసులనూ ధ్వంసం చేశారు. ప్రజలు వేలాదిగా కదిలి కేంద్ర, రాష్ట్ర బలగాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. వారు బూటకపు ఎన్‌కౌంటర్లనూ, హత్యాకాండలనూ,

అక్రమ అరెస్టులను, మహిళలపై అత్యాచారాలనూ, గ్రామాలపై దాడులనూ, ప్రజల ఆస్తుల లూటీనీ-విధ్వంసాన్నీ నిరసించారు, రాజకీయ ఖైదీల విడుదలను డిమాండ్ చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పాలకవర్గాల ప్రయోజనాలను నెరవేర్చే సామ్రాజ్యవాద అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ రహస్య, బహిరంగ రూపాల్లో విశాల ప్రజానీకాన్ని సమీకరించడానికి పార్టీ చేస్తున్న కృషి కొనసాగింది. పెద్ద ఆనకట్టలూ, గనులూ, పరిశ్రమల ఫలితంగా జరుగుతున్న విస్థాపనకూ, కాలుష్యానికీ వ్యతిరేకంగా, అలాగే ప్రజల రోజువారీ, సీజనల్ సమస్యల పైనా (తునికాకు, వెదురు నరకడం-రవాణా, అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు మొదలైనవి), అలాగే భూస్వాములకూ, పెత్తందార్లకూ వ్యతిరేకంగా కూడా అనేక ఆర్థిక, రాజకీయ పోరాటాలను మనం చేపట్టాం. విప్లవకర భూసంస్కరణలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించాం.

మన ఉద్యమ ప్రాంతాలన్నిటా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించే లక్ష్యంతో పిఎల్‌జిఎ బలగాలు సాహసోపేతంగా శత్రువును ప్రతిఘటించాయి. వారు శాయశక్తులా శత్రువు బలహీనతలను కనిపెట్టి, అనేక మధ్యరకం, చిన్న, కొన్ని పెద్ద మిలటరీ చర్యల ద్వారా శత్రువును చెప్పుకోదగిన దెబ్బలు కొడుతూ, మరోవైపు శత్రు లక్ష్యాలు పరిపూర్తి కాకుండా అవరోధాలు కలుగజేస్తూ దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడానికి పాటుపడ్డారు. మనం ఏవోబిలోని రాళ్లగడ్డలో డిమాలిషన్ ఎత్తుగడలను వుపయోగించి దూకుడుగా ముందుకు వస్తున్న బిఎస్‌ఎఫ్ బలగాలకు నష్టాలను కలిగించాం. తెలంగాణలోని కుర్నపల్లిలో సుదీర్ఘకాలం తర్వాత గ్రేహౌండ్స్ పోలీసులపై దాడి చేశాం.

పార్టీ పిలుపునకు ప్రతిస్పందిస్తూ డికె ప్రజానీకం విజయవంతంగా ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించారు. పాశవిక సల్వాజుడుం అత్యాచారాలకు ప్రధాన కారకుడైన, ప్రజల తీవ్ర అసహ్యాన్ని మూటగట్టుకున్న మహేంద్ర కర్మను పట్టుకుని చంపడం ఒక పెద్ద విజయం. డికె, బిజె, ఏవోబి, ఒడిషాలలో మన ఉద్యమం బలంగా వున్న ప్రాంతాల్లో, అలాగే నియంగిరి, మాలి-దేవమాలి, విశాఖల్లో మైనింగ్‌కూ, విస్థాపనకూ వ్యతిరేకంగా ఆదివాసీల ఉద్యమాలు కొనసాగుతున్న ప్రాంతాల్లో మెజారిటీ ప్రజలు లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించి ఈ విధ్వంసకర ప్రాజెక్టుల పట్ల తమ నిరసనను వ్యక్తపరిచారు. ప్రజలతో బలవంతంగా ఓట్లు వేయించడానికి వచ్చిన శత్రు బలగాలపై పిఎల్‌జిఎ బలగాలు ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌లో భాగంగా ఎత్తుగడల ఎదురుదాడులను విజయవంతంగా కొనసాగించాయి.

లోక్‌సభ ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్ సందర్భంగా ప్రజలతో బలవంతంగా

ఓట్లు వేయించడానికి వారి మీద రాబందుల్లా వాలిన శత్రు బలగాలను బిజె, డికె (మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్), ఏవోబి, ఒడిషాలలో మన పిఎల్‌జిఎ బలగాలు దెబ్బ కొట్టాయి. వీటిలో కొన్ని శత్రువు 'క్లియర్' చేశానని, తన అదుపులోకి తెచ్చుకున్నానని చెప్పుకున్న ప్రాంతాల్లో జరిగాయి. 2014 మొదటి ఐదు నెలల్లోని ఎన్నికల జోరు నడుస్తున్న కాలంలో 31 చర్యలలో 63 శత్రు జవాన్లను ఖతం చేసి, 122 మందిని గాయపరిచాం. ఒక పిఎల్‌జిఎ యోధుడు ఈ దాడుల సందర్భంగా అమరుడయ్యాడు. మనం 36 ఆయుధాలనూ, 3366 రౌండ్ల మందుగుండునూ స్వాధీనం చేసుకోగలిగాం. శత్రువు చేపట్టిన రెండు భారీ దేశవ్యాప్త 'కార్డన్ అండ్ సర్చ్ క్యాంపెయిన్ల' ఆరంభంలో, వాటి మధ్యనే ఈ యాక్షన్లన్నీ జరిగాయనేది గమనార్హం. ఈ క్యాంపెయిన్లలో మొదటిది 2013 డిసెంబర్ 26 నుండి 2014 జనవరి 1 వరకూ తొమ్మిది రాష్ట్రాల్లో 40,000 అదనపు పారామిలటరీ, రాష్ట్ర పోలీసు బలగాలతో కొనసాగింది. రెండవది, 2014 మార్చి 19 నుండి 27 వరకూ మావోయిస్టు ఉద్యమం క్రియాశీలంగా వున్న ఆరు రాష్ట్రాల్లో 70 మంది పోలీసు ఇనస్పెక్టర్ జనరళ్ల నాయకత్వం కింద దాదాపు ఒక లక్ష పారామిలటరీ బలగాలు, ఆరు వేల కమాండో బలగాలు, నాలుగు ఇజ్రాయిల్ ఏరాన్ సర్వేలెన్స్ విమానాలు, అనేక రాడార్ కలిగిన మైన్ ప్రూఫ్ వాహనాలతో కొనసాగింది. వివిధ గెరిల్లా జోన్లలో పిఎల్‌జిఎ నిరంతరంగా కొనసాగించిన గెరిల్లా చర్యల వల్ల శత్రు బలగాలు తమ బలగాలను విశాల ప్రాంతాల్లో మోహరించాల్సిన స్థితికి నెట్టబడ్డాయి. దాంతో మన కీలకమైన ప్రాంతాల్లో అవి ఇష్టానుసారం తమ బలగాలను మోహరించలేని ఒక స్థితికి నెట్టబడ్డాయి. అదనపు బలగాలు లేని కారణంగా శత్రువు బీజాపుర్, మరికొన్ని ప్రాంతాల్లో తప్ప ఏకకాలంలో ఈ క్యాంపెయిన్లన్నిటినీ మరింత తీవ్రతరంగా కొనసాగించలేకపోయాడు. దాంతో వారు తమ బలగాలను పెంచుకోవాలని పథకాలు వేస్తున్నారు. ఈ క్యాంపెయిన్ల ముఖ్యమైన లక్ష్యాలు కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లోని వేర్వేరు బలగాల కమాండ్, కంట్రోల్ లలో అనుభవాన్ని సంపాదించడం, టెర్రయిన్‌పై పట్టు సంపాదించడం.

డికె స్పెషల్ జోన్‌లో ప్రజలు, మిలీషియా, మెయిన్ ఫోర్సు, సెకండరీ బలగాలు వందలాదిగా కదిలి అక్కడి మొత్తం ప్రజల మద్దతుతో కొత్తగా ఏర్పర్చిన మినప (దక్షిణ బస్తర్) పారామిలటరీ, పోలీసు క్యాంపును చుట్టుముట్టి అక్కడ దాదాపు ఒక వెయ్యి సంఖ్యలో వున్న సాయుధ బలగాలను సాయుధంగా చికాకుపర్చి, దాదాపు ఒక వారంపాటు శత్రువు సప్లై లైన్లు అన్నింటినీ బందుపెట్టి ఆ క్యాంపును మూసుకుని పోయేలా చేశారు. డికెలోనే హర్రాకోడేరు (తూర్పు బస్తర్) గ్రామంలో ఆ చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలందరూ పెద్ద సంఖ్యలో ముందుకొచ్చి ఆరు రోజుల పాటు శాంతియుతంగా పోరాడి ఒక ఆనకట్ట నిర్మాణాన్ని సుగమం చేయడానికై నూతనంగా ఏర్పర్చిన సిఆర్‌పిఎఫ్ క్యాంపును

ఎత్తివేసుకునేలా చేశారు. ఈ పోరాటంలో మహిళల పాత్ర గొప్పగా వుండింది. సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలలో భాగంగా శత్రు కిరాయి మూకలు ఉచితంగా పంచిపెట్టిన సరుకులను నిరాకరించడం లేదా వాటిని కుప్పేసి తగులబెట్టడం వంటి ఘటనలు కూడా కొన్ని జరిగాయి.

ఈ ఏడాది మనం సాధించిన ముఖ్యమైన విజయం మన దేశంలోని సిసలైన విప్లవకారుల ఐక్యతను సాధించే కృషిలో మరో మలుపుగా సిపిఐ (మావోయిస్టు), సిపిఐ (ఎంఎల్) నక్సల్బరీ పార్టీలు ఒకటే పార్టీగా విలీనం కావడం. విలీనం ప్రకటనలో పేర్కొన్నట్టుగా, భారత విప్లవ అగ్రగామిగా తన పాత్రను మరింత మెరుగ్గా నెరవేర్చే సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఇది దోహదపడుతుంది. శత్రు తీవ్ర దాడుల మధ్యనే జరిగిన మావోయిస్టుల ఈ ఐక్యత విప్లవ ప్రజానీకానికి గొప్ప ప్రోత్సాహకరంగా వుండింది. అంతర్జాతీయ స్థాయిలో దీన్ని ఉత్సాహంగా స్వాగతించారు.

**కామ్రేడ్స్,**

ఇక్కడ గత పదేళ్ల కాలంలో జరిగిన అంతర్జాతీయ, దేశీయ పరిణామాలను క్లుప్తంగా పేర్కొంటూ వాటి నేపథ్యంలో మన పార్టీ సాధించిన ప్రధాన అనుకూల విజయాలను (పాజిటివ్ అచీవ్‌మెంట్స్) క్లుప్తంగా రాస్తున్నాం. ఈ అనుకూల విజయాలే మన ఉద్యమాన్ని మున్నెన్నడూ లేని ఉన్నతస్థాయికి పురోగమింపజేయడానికి దోహదపడ్డాయి.

మన పార్టీ పదవ వార్షికోత్సవాల సందర్భంగా మనం ముందుగా ఈ అనుకూల విజయాలను గ్రహిద్దాం, తర్వాత వాటిని పార్టీలోనూ, ప్రజల్లోనూ విస్తృతంగా ప్రచారం చేద్దాం. మరోవైపు, మనం ప్రతికూల అంశాలను అధిగమించి, శత్రుదాడిని తిప్పికొట్టి ఓడించే స్థాయిని అందుకునేలా పార్టీనీ, పిఎల్‌జిఎనూ, ఐక్య సంఘటననూ బలోపేతం చేసి, మన కేంద్రకమిటీ రూపొందించిన మౌలిక ఎత్తుగడలను వినియోగిస్తూ ప్రస్తుత గడ్డు పరిస్థితిని అధిగమించి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని మరింతగా పురోగమింపజేద్దాం. 2013 నుండి మన పార్టీ, ఉద్యమం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితుల దృష్ట్యా, మన అనుకూల విజయాలను గ్రహించడం, ప్రచారం చేయడం మరింత అవసరమౌతుంది. ఎందుకంటే అవి మనం ఈ స్థితిని అధిగమించడానికి సోపానాలుగా పని చేస్తాయి, అవి మనం పాత తప్పులనే మళ్లీ చేయకుండా ఉండడంలో దోహదం చేస్తాయి. అలాగే అవి పార్టీ శ్రేణుల్లోనూ, ప్రజల్లోనూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలోనూ దోహదం చేస్తాయి.

అమెరికా దూకుడుగా చేపట్టిన 'టెర్రర్ పై యుద్ధం' తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కొంటూ వుండడంతో పదేళ్ల క్రితమే అంతర్జాతీయ స్థాయిలో ఒక అనుకూలమైన

మలుపు మనకు అగుపడింది. దాంతో దాని పథకాలు తలకిందులైపోయి, అందులో దిగబడిపోకుండా వుండేలా అది తన ఎత్తుగడలను మార్చుకోవడానికి నెట్టబడింది. బుష్ స్థానంలోకి 'మానవ ముఖం' తగిలించుకున్న ఒబామా వచ్చాడు! దాని గడ్డు పరిస్థితిని వినియోగించుకుని రష్యా సామ్రాజ్యవాదం లాభపడింది. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్, బ్రిక్స్ కూటమి వంటి సంస్థలు బలోపేతం అయ్యాయి. అమెరికా సామ్రాజ్యవాదం ఇలా సాపేక్షికంగా బలహీనపడ్డం అనేది ఒకవైపు సామ్రాజ్యవాద శక్తుల మధ్య మరింత పోటీకి దారి తీయగా, మరోవైపు ప్రజాపోరాటాలు బలోపేతం కావడానికీ దారి తీసింది. కానీ అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం నయా రివిజనిజం ద్రోహం మూలంగా, అత్యంత ప్రముఖంగా సిపిఎన్ (మావోయిస్టు) నేపాల్ విప్లవానికి చేసిన ద్రోహం మూలంగా దీన్ని సంపూర్ణంగా వినియోగించుకోలేకపోయింది. భారతదేశంలో యుపిఎ బాజాప్తుగా ఎల్‌పిజి (ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ) విధానాలను అమలు చేస్తూ అణు ఒప్పందం అంశంలో అమెరికా ఆదేశాలకు తలవంచింది.

అప్పటి నుండి, దేశీయ, అంతర్జాతీయ వస్తుగత పరిస్థితులు మునుపెన్నటికంటే విప్లవానికి మరింత అనుకూలంగా మారాయి. 2008లో ప్రపంచ సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభంలో కూరుకుని పోయాక, ప్రపంచ రాజకీయాల్లో మార్పులు వేగవంతంగా జరిగిపోతున్నాయి. ముఖ్యంగా ప్రపంచంలోని మౌలిక వైరుధ్యాలు పదునెక్కుతున్నాయి. సామ్రాజ్యవాదులకూ, ప్రపంచ పీడిత జాతులు, పీడిత ప్రజలకూ మధ్య వైరుధ్యం రోజురోజుకూ తీవ్రతరమౌతున్నది. నయా వలసల్లో, అర్ధ వలస-అర్ధభూస్వామ్య దేశాల్లో సామ్రాజ్యవాదులకూ, వారి దళారీ/తైనాతీ పాలకవర్గాలకూ వ్యతిరేకంగా ఉద్యమాలు అభివృద్ధి చెందుతున్నాయి. పెట్టుబడిదారీ దేశాల్లో కార్మికవర్గం తమ దేశాల్లోని పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పెద్దెత్తున ఆందోళనలు కొనసాగిస్తోంది. ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ లలో అమెరికా నేతృత్వంలోని నాటో బలగాలు, అమెరికా తైనాతీ ప్రభుత్వ బలగాలకు వ్యతిరేకంగా జాతి ప్రతిఘటనా పోరాటాలు తీవ్రతరమైనాయి. ఇరాక్‌లో ప్రతిఘటనా బలగాలు అమెరికా తొత్తులైన కీలుబొమ్మ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూ బలపడుతున్నాయి, దేశ ఉత్తర ప్రాంతంపై తమ పట్టును బిగిస్తున్నాయి. లిబియాలో ప్రతిఘటనా శక్తులు తిరిగి బలం పుంజుకుంటున్నాయి. ఈజిప్టులో అంతర్యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. పాలస్తీనా జాతి విముక్తి ఉద్యమం ఇజ్రాయిల్ ఫాసిస్టు దాడులను ప్రతిఘటించడం కొనసాగుతోంది. సిరియా, యుక్రెయిన్‌లు సామ్రాజ్యవాదుల మధ్య తీవ్రతరమౌతున్న వైరుధ్యాలకు కేంద్రాలుగా మారాయి. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో జపాన్,

అమెరికా సామ్రాజ్యవాదుల మధ్య, వాటికి చైనాతోనూ వైరుధ్యాలు మరింత తీవ్రతరమౌతున్నాయి.

ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభం మన ఆర్థిక వ్యవస్థను కుదిపేసింది. గత కొద్ది సంవత్సరాల్లో బడ్జెట్ లోటు పెరిగింది, పెరుగుదల రేటు పడిపోయింది, కరెంట్ ఖాతా లోటు పెరిగింది, ద్రవ్యోల్బణం పెరిగింది. దేశ ప్రజల జీవన స్థితిగతులు మరింత దిగజారిపోతున్నాయి. మన దేశంలోని మౌలిక వైరుధ్యాలు తీవ్రతరమౌతున్నాయి. పాలకవర్గాల మధ్య కుక్కల కొట్లాటలు తీవ్రతరమవుతున్నాయి. అన్ని పీడిత వర్గాల, సెక్షన్ల ప్రజలు నిరంతరంగా వివిధ సమస్యలపై పోరాటాల్లోకి సమీకృతులవుతున్నారు. కశ్మీర్, ఈశాన్య ప్రాంత జాతి విముక్తి ఆకాంక్షలు వివిధ పోరాటరూపాల్లో వ్యక్తమవ్వడం కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రత్యేక రాష్ట్రాలకై జరుగుతున్న వివిధ ఉద్యమాలపై అనుకూల ప్రభావాన్ని వేసింది. బిజెపి 'వికాస్' అనే నూతన నినాదంతో అధికారంలోకి వచ్చినప్పటికీ, అది కొద్ది రోజుల్లోనే తన అసలు ఎజెండాను బహిర్గతపరచుకున్నది. ఇది పెరగబోయే బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు దాడిని సూచిస్తున్నది. అన్ని పీడిత వర్గాలు, సెక్షన్లు, మత మైనారిటీలు, జాతులు తప్పనిసరిగా దీనికి బాధితులుగా మారతాయి. దీనికి వ్యతిరేకంగా వీరంతా ఐక్యమై కొట్లాడాల్సిన అవసరం మునుపెన్నటికంటే మరింతగా పెరిగింది. వారంతా అందుకు సిద్ధం కావాలి. మన పార్టీ ఈ అతి ముఖ్యమైన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి పాటుపడాలి.

మరోవైపు, కార్మికవర్గ విప్లవకర, జాతి విముక్తి, ప్రజాస్వామిక శక్తులు క్రమంగా బలోపేతం అవుతూ ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. ప్రత్యేకించి, భారత ప్రజాయుద్ధానికి మద్దతుగా అంతర్జాతీయ ఉద్యమం మరింతగా విస్తరిస్తున్నది. మన పార్టీ అంతర్జాతీయ స్థాయిలో వాదోపవాదాల్లో పాల్గొన్నది. సిపిఎన్ (ఎం) రివిజనిస్టుగా మారుతున్న తరుణంలో అది ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. అది వివిధ మావోయిస్టు పార్టీల, సంస్థల చొరవతో ఏర్పడిన అన్ని అంతర్జాతీయ వేదికల్లో క్రియాశీలంగా పాల్గొని తన రాజకీయ వైఖరుల ద్వారా, ఆచరణ ద్వారా ఆ పార్టీల, సంస్థల రాజకీయ విశ్వాసాన్ని చూరగొన్నది. అది ఇతర దేశాల విప్లవాలకు, ప్రత్యేకించి ఫిలిప్పీన్స్ దేశ నూతన ప్రజాస్వామిక విప్లవానికి సంఘీభావాన్ని నిర్మించింది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాల్లో కూడా మనం పాల్గొంటున్నాం. ఈ అన్నిటి వల్లా భారతదేశంలో ప్రజాయుద్ధం అభివృద్ధి ప్రపంచ సోషలిస్టు విప్లవానికి ఒక బలమైన అండగా పని చేయగలదనే ఒక బలమైన ఆకాంక్ష వ్యక్తమవుతున్నది. దీన్ని వాస్తవం చేయాల్సిన ఒక బృహత్తర బాధ్యత మన మీద ఉన్నది.

**కామ్రేడ్స్,**

వివిధ రంగాల్లో, గెరిల్లా యుద్ధంలో, సైన్యం, ఐక్యసంఘటన (ఆర్పీసీలు, ఎత్తుగడలపరమైన ఐక్యసంఘటన) కార్యకలాపాల్లో మన పార్టీ సాగించిన ఈ బహుముఖమైన, అన్నిటినీ ప్రభావితం చేసే సైద్ధాంతిక, రాజకీయ కృషి ద్వారా అది గత పదేళ్ల కాలంలో శత్రుదాడిని తట్టుకుని నిలువగలిగింది. ప్రత్యేకించి 2009 మధ్య నుండి ఎక్కుపెట్టిన బహుముఖ దేశవ్యాప్త దాడిలో వివిధ స్థాయిల్లో నాయకత్వానికి, ప్రత్యేకించి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లోని నాయకత్వానికి జరిగిన నష్టాలు, కొన్ని ప్రాంతాలను కోల్పోవడం, కొన్ని కీలకమైన విభాగాలకు జరిగిన నష్టాలు ఉన్నప్పటికీ అది ఆ దాడిని తట్టుకుని నిలిచింది. గత పదేళ్లలో మన పార్టీ ఆచరణ దేశ, ప్రపంచ ప్రజలలో దాన్ని ఒక ఆశాకిరణంగా నిలపడంలో విజయవంతమయ్యింది. ఈ పదేండ్ల కాలం మరోసారి 'విప్లవ పార్టీ లేకుండా విప్లవం లేదు' అనే లెనినిస్టు సూత్రాన్ని ప్రధానంగా అనుకూల అనుభవాల ద్వారా, కొన్ని ప్రతికూల అనుభవాల ద్వారా మరోసారి రుజువు చేసింది. గత పదేండ్ల కాలం పార్టీ నిర్మాణంలో, సైన్యం, ఐక్యసంఘటన అనే రెండు ఆయుధాలను ప్రయోగించడంలో సంపద్వంతమైన అనుభవాలను సంపాదించిన కాలంగా నిలుస్తుంది.

విలీనం తర్వాతా, మన ఐక్యతా కాంగ్రెస్ అనంతరం మనం నిర్దేశించుకున్న కేంద్ర కర్తవ్యాన్ని పరిపూర్తి చేసే దిశగా పురోగమించే క్రమంలో మనం నూతన పరిస్థితులు ఎదురైనప్పుడల్లా నూతన ఎత్తుగడలను రూపొందించాం. మనం ఎప్పటికప్పుడు మన అనుభవాలను క్రోడీకరించుకున్నాం. మనం దీర్ఘకాలిక ప్రజాయుద్ధ క్రమంలో పోరాట, నిర్మాణ రూపాల్లో సంపద్వంతమైన అనుభవాలను పొందాం. గెరిల్లా యుద్ధం, ప్రజాసైన్యం, ప్రజల విప్లవ రాజకీయాధికారం, గెరిల్లా జోన్లు, గెరిల్లా బేసులు, విముక్తి ప్రాంతాల గురించిన మన అవగాహన ఈ పదేండ్ల కఠోర విప్లవాచరణ క్రమంలో మెరుగుదలను సాధించింది.

ఈ పదేండ్లలో ఎంఎల్ఎంను మన దేశ పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించడం ద్వారా దాన్ని దృఢంగా ఎత్తిపట్టి, పరిరక్షించి, ప్రచారం చేయడం ద్వారా; దేశంలోనూ, ప్రపంచంలోనూ రివిజనిజాన్నీ, మితవాద, అతివాద అవకాశవాదాలను, కార్మికవర్గేతర ధోరణులను ఎదిరించి పోరాడ్డం ద్వారా; ప్రపంచ సోషలిస్టు విప్లవ అమరుల బాటలో మన పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసిన అపారమైన త్యాగాలతో ప్రపంచంలోని ఈ భూభాగంలో మనం ప్రపంచ సోషలిస్టు విప్లవ పతాకాన్ని ఎత్తిపట్టి ఉంచడం ద్వారా; మన స్వీయ అనుభవాల నుండి, ప్రపంచంలోని ఇతర విప్లవాల నుండి నేర్చుకోవడం ద్వారా;

ప్రపంచంలో పోరాడుతున్న ఇతర పోరాట ప్రజలకు సంఘీభావాన్ని నిర్మించడం ద్వారా; ప్రపంచ సోషలిస్టు విప్లవంలో అంతర్భాగంగా అంతర్జాతీయ కార్యకలాపాలు చేపట్టడానికి చొరవ చేయడం ద్వారా, వాటిలో పాల్గొనడం ద్వారా మన పార్టీ ప్రపంచ సోషలిస్టు విప్లవంలో తన వంతు బాధ్యతను నెరవేర్చడానికి పాటుపడింది.

మన పార్టీ సభ్యులు, అగ్రనాయకత్వం మొదలుకొని గ్రామస్థాయి పార్టీ సభ్యుల వరకూ, ప్రపంచ, భారత విప్లవ గొప్ప అమరుల వారసత్వాన్ని, ప్రత్యేకించి నక్సల్బరీ కాలం నుండి, కొనసాగించి, మరోసారి మహత్తర విప్లవకర త్యాగ సంప్రదాయాలను నెలకొల్పారు. వారు యుద్ధరంగంలో గానీ, శత్రువు అదుపులో వున్నప్పుడు గానీ శత్రువు ముందు తలవంచలేదు.

పాలకవర్గాల, రివిజనిస్టుల కుట్రలను భగ్నం చేస్తూ మన దేశ నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఏకైక మార్గదర్శక కేంద్రంగా మన పార్టీని అభివృద్ధి చేయడంలో మనం విజయం సాధించాం. భారతదేశంలోని సిసలైన విప్లవకారులను ఐక్యం చేసే మిగిలిపోయిన కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడంలో భాగంగా మనం సిపిఐ (ఎంఎల్) నక్సల్బరీతో విలీనాన్ని విజయవంతంగా పూర్తి చేశాం.

కర్ణాటకలోని పచ్చి మితవాద అవకాశవాద లిక్విడేషనిస్టు ముఠా, ఒడిషాలోని పండా వంటివారు మన పార్టీలో లేవనెత్తిన వివిధ మితవాద, అతివాద అవకాశవాద ధోరణులను మన పార్టీ విజయవంతంగా ఓడించి వారిని ఒంటరి చేయగలిగింది. వేళ్ల మీద లెక్కబెట్ట గలిగినంతమంది కేంద్ర, రాష్ట్ర నాయకులు పార్టీని వదిలిపెట్టి, శత్రువు ముందు మోకరిల్లి పాలకవర్గాలతో గొంతు కలిపి మన పార్టీ పైనా, మన పంథా పైనా, మన ఉద్యమం పైనా దుష్ప్రచారాన్ని ఎక్కుపెట్టారు. మన పార్టీ అటువంటి ప్రతీఘాతుక దాడులన్నిటినీ విజయవంతంగా తిప్పికొట్టి వారందరినీ చరిత్ర పెంటకుప్పల మీదికి విసిరేసింది.

నూతన పార్టీ ఆవిర్భావం తర్వాత, మన పార్టీ కొన్ని నూతన ప్రాంతాలకు విస్తరించింది. నూతన శక్తులు పార్టీలో చేరాయి. వారికి మనం సైద్ధాంతిక, రాజకీయ, మిలటరీ, నిర్మాణపర విషయాల్లో శిక్షణనిచ్చి విద్య గరిపాం. దిద్దుబాటు క్యాంపెయిన్లు, బోల్షివీకరణ క్యాంపెయిన్ వంటివి చేపట్టడమే కాక, మన పార్టీ శ్రేణుల సైద్ధాంతిక, రాజకీయ, సాంస్కృతిక, విద్యా స్థాయిలను పెంపొందించడానికి మన పార్టీ నియమిత విద్య ద్వారా, పార్టీ వివిధ స్థాయిల్లో ప్రాథమిక విద్యను, రాజకీయ విద్యను గరపడానికి ప్రత్యేక నిర్మాణాలను, పాఠశాలలను ఏర్పర్చడం ద్వారా కృషి చేసింది. అది పార్టీ, పిఎల్‌జిఏ, ఆర్పీసీలు, వివిధ ప్రజాసంఘాల ద్వారా విస్తృత ప్రాతిపదికన రాజకీయ ప్రచార, ఆందోళనలు కొనసాగిస్తూ, పత్రికలు,

ప్రచురణలు, పాఠశాలలు, ప్రచార క్యాంపెయిన్‌లు, విప్లవ దినాలను పాటించడం, పార్టీ ప్రకటనలు, రాజకీయ అంశాల మీద, పాఠ్యాంశాల మీద నోట్సులు తయారీ, సభలు, సెమినార్ల ద్వారా కార్యకర్తల, విప్లవ ప్రజానీకపు విద్యాపరమైన, రాజకీయపరమైన స్థాయిలను పెంపొందించడానికి అది కృషి చేసింది.

దేశవ్యాప్తంగా జైళ్లలోని మన పార్టీ కామ్రేడ్స్ శత్రు నిర్బంధంలో దృఢంగా నిలిచి, అమానవీయ పరిస్థితులు, చిత్రహింసలు, ఉద్యమాన్ని వదిలివేయాలనే శత్రు మానసిక ఒత్తిళ్ల మధ్యనే చీకటి కొట్లలో కూడా ఎర్రజెండాను విజయవంతంగా ఎత్తిపట్టి ఉంచారు. జైళ్లలో రాజీలేని పోరాటాలు, త్యాగాల ద్వారా అపారమైన దృఢత్వాన్నీ, ధైర్యసాహసాలనూ ప్రదర్శించడంలో అక్కడ పార్టీ గొప్ప నమూనాలను మన ముందుంచింది. ఈ అన్నిటిలో అత్యంత ఉజ్వలమైన నమూనా ఇటీవలే 2014 జూన్ 18న అమరుడైన కామ్రేడ్ సుశీల్ రాయ్. జైళ్లలోని మన పార్టీ జైలులోని కామ్రేడ్స్, సాధారణ ఖైదీల రాజకీయ స్థాయిని పెంపొందించడంతో పాటు పీడిత వర్గాలకు చెందిన జైలు సిబ్బందిని కూడా రాజకీయంగా ప్రభావితం చేస్తున్నది. జైళ్ల బయటి పార్టీ కూడా రాజకీయ ఖైదీల పోరాటాలకు, సమస్యలకు సంఘీభావాన్ని నిర్మించడంలో ఒకమేరకు సఫలీకృతమయ్యింది. జైళ్లలోని మహిళా కామ్రేడ్స్ స్థితిగతులు ఇంకా అధ్వాన్నంగా వున్నాయి. అయితే వారు ప్రతికూల పరిస్థితులను దృఢచిత్తంతో ఎదుర్కొనడంలో అద్భుతమైన నమూనాను దేశవాసుల ముందే కాక ప్రపంచ పోరాట ప్రజల ముందు ఉంచారు. అనేకమంది కామ్రేడ్సూ, సాధారణ ప్రజలూ జైళ్లలో, జైళ్లలో వున్నప్పుడు అధికారులు చూపిన నిర్లక్ష్యం ఫలితంగా విడుదలయ్యాకా కూడా ప్రాణాలను కోల్పోయారు. అయితే వారు ఎవ్వరూ శత్రువు ముందు తల వంచలేదు. కొందరు కామ్రేడ్స్ జైలులోని మన పార్టీ నాయకత్వంలో జైలుగోడలను బద్దలు కొట్టుకుని స్వేచ్ఛను పొందారు. బయట వున్న పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఎ కొన్ని సాహసోపేతమైన దాడులు చేసి బందీ కామ్రేడ్స్‌ను విడిపించుకుంది. నిరంకుశ చట్టాలు, కఠినమైన జైలు పరిస్థితులు, తీవ్ర నిర్బంధం మధ్య కూడా శత్రు సంకెళ్లను ఎలా బద్దలు కొట్టి పోరాడే ప్రజలతో కలవాలి అనే విషయంలో పార్టీ ఒక ఉదాహరణను ముందుంచింది. ఈ విధంగా పార్టీ జైళ్లను పోరాటాలకు, రాజకీయ విద్యకు, మిలటరీ చర్యలకు, నిర్మాణ కార్యకలాపాలకు కేంద్రంగా మలిచి విడుదల అయ్యాక తిరిగి ఉద్యమంలో చేరే విధంగా అనేకమంది కామ్రేడ్స్‌నూ, ప్రజలనూ ఉత్తేజపరిచింది.

శత్రు ఫాసిస్టు నిర్బంధం తీవ్రతరమైన కొద్దీ, అందులో భాగంగా మానసిక యుద్ధతంత్రం కూడా విస్తరించింది. గత పదేండ్లలో మనం విప్లవ రాజకీయ ప్రచారాన్ని సృజనాత్మకంగా

వేర్వేరు రూపాల్లో కొనసాగించడం ద్వారా దాన్ని తిప్పికొట్టాం. మనం అలుపెరగకుండా, నిరంతరంగా ఎంఎల్ఎంనూ, మన రాజకీయ, మిలటరీ పంథానూ, ప్రజలు సాధించిన విజయాలనూ, నూతన ప్రజాస్వామిక సంస్కృతినీ ఎత్తిపట్టి, ప్రచారం చేయడం ద్వారా శత్రు దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి ఓడించడానికి కృషి చేశాం. మనం మొత్తం ప్రజల్లోనూ, పార్టీలోనూ దీర్ఘకాలిక ప్రజాయుద్ధం అంటే విప్లవ ప్రతీఘాతుక ఎల్ఐసీ వ్యూహం-ఎత్తుగడలకు వ్యతిరేకంగా అన్ని రంగాల్లో ఎక్కుపెట్టిన ఒక సంపూర్ణ యుద్ధం అనే అవగాహనను పెంపొందించే ప్రయత్నం చేశాం. మనం రాజకీయ ప్రచార రంగంలో ప్రజల సామూహిక భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి కూడా పాటుపడ్డాం.

మన పార్టీ నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఇరుసైన వ్యవసాయ విప్లవ కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించింది. భూముల స్వాధీనం, జల్-జంగల్-జమీన్ లకై పోరాటాల రూపంలో భూమి సమస్యను మన ఎజెండాలో మొదటి అంశంగా నిలబెట్టి వుంచాం. ఈ ఆచరణ ద్వారానూ, అలాగే సైద్ధాంతికంగా, రాజకీయంగా కూడా మన దేశ అర్ధ వలస-అర్ధ భూస్వామ్య స్వభావాన్ని తక్కువ చేసి చూపే వాదనలను మనం తిప్పికొట్టాం. అది భూస్వామ్యం నుండి, దళారీ నిరంకుశ బూర్జువాల నుండి, సామ్రాజ్యవాదం నుండి మన దేశాన్ని విముక్తి చేసే బాటగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని గత పదేండ్లలో మరోసారి ఎత్తిపట్టింది. అది బూటకపు ఎన్నికలను బహిష్కరించమనీ, మన పార్టీ నాయకత్వంలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధ బాటలో పురోగమిస్తూ తమ స్వంత రాజకీయాధికారాన్ని నిర్మించుకోమనీ ప్రజలకు పిలుపునిచ్చింది.

నందిగ్రాం నుండి మొదలై లాల్‌గఢ్ ప్రజా తిరుగబాటుగా ఉన్నత శిఖరాలనందుకుని పశ్చిమ బంగలో సోషల్-ఫాసిస్టు సిపిఎంను చావుదెబ్బ కొట్టిన వైనం మన పార్టీ గత దశాబ్దంలో సాధించిన అతి పెద్ద విజయాల్లో ఒకటిగా నమోదు అవుతుంది. మూడు దశాబ్దాలకు పైగా కొనసాగిన సిపిఎం సోషల్ ఫాసిస్టు పరిపాలన మట్టిగరిచి నూతన ప్రజాస్వామిక విప్లవ ప్రత్యామ్నాయాన్ని మరోసారి నక్సల్బరీ తర్వాత లాల్‌గఢ్ తిరుగుబాటు శక్తివంతంగా ముందుకు తెచ్చింది. అది విజయవంతంగా దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను అమలు చేయడం ద్వారా దాన్ని మరోసారి బలంగా ప్రతిష్టించింది. మన పార్టీ ఈ కాలంలో ప్రజల ముందుంచిన మరో విజయవంతమైన నమూనా ఒడిషాలోని నారాయణపట్నా భూపోరాటం. వివిధ రాష్ట్రాల్లో జల్, జంగల్, జమీన్‌ల కోసం పోరాటాలు కొనసాగుతున్నాయి. ఇవన్నీ మరోసారి వ్యవసాయ విప్లవ రాజకీయాలను బలంగా ప్రజల్లో నాటుకునేలా చేశాయి.

మనం పార్టీయే సైన్యాన్ని కమాండ్ చేస్తుంది అనే సూత్రాన్ని అనుసరిస్తాం. పిఎల్‌జిఎకి

అన్ని స్థాయిల్లో, అన్ని కార్యకలాపాల్లో పార్టీ నాయకత్వం వహిస్తుంది. దాని నాయకత్వంలో పిఎల్‌జిఎ భారతదేశ విశాల గ్రామీణ ప్రాంతాల్లో, ప్రత్యేకించి మధ్య, తూర్పు భారతాల్లో గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేస్తూ,సంఘటితపరుస్తూ విస్తరిస్తోంది. ఐక్యతా కాంగ్రెస్ నిర్దేశించిన కేంద్ర కర్తవ్యాన్ని నెరవేర్చే దిశలో పురోగమించడంలో భాగంగా పిఎల్‌జిఎ గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చెందించడంలో తొలి అడుగుల్ని వేసింది. బలగాలను కేంద్రీకృతం, వికేంద్రీకృతం చేయడంలో, అన్ని స్థాయిల్లో వివిధ విన్యాసాలను చేపట్టడంలో పిఎల్‌జిఎ విస్తారమైన అనుభవాలను సంపాదించింది. పార్టీ వివిధ స్థాయిల కమిషన్లను, కమాండ్లను ఏర్పర్చి వాటికి మార్గదర్శత్వం వహించింది. ప్లటూన్లు, కంపెనీలు, బెటాలియన్లు వంటి ఉన్నత స్థాయి ఫార్మేషన్లను ఏర్పర్చడంలో మార్గదర్శకత్వం ఇచ్చింది. తద్వారా వాటిని నడపడంలో, ఈ ఉన్నత స్థాయి ఫార్మేషన్లను ఉపయోగించి శత్రువుపై దాడులను కొనసాగించడంలో అనుభవాన్ని సంపాదించింది. పిఎల్‌జిఎ అనేక ఎత్తుగడల ఎదురుదాడులనూ, ఎత్తుగడల ఎదురుదాడుల క్యాంపెయిన్లనూ విజయవంతంగా నడిపి తద్వారా తననూ, విప్లవ ప్రజానీకాన్నీ సాయుధం చేసుకున్నది.

పిఎల్‌జిఎ సైన్యానికి అవసరమైన వివిధ విభాగాలను నిర్మించి, వాటిని నడపడంలో విలువైన అనుభవాలను సంపాదించింది. పిఎల్‌జిఎ ద్వారా పార్టీ నూతన సంస్కృతిని ప్రచారం చేసి దానిని నెలకొల్పింది. పిఎల్‌జిఎ ప్రజలతో మమేకం అవుతూ వ్యవసాయ ఉత్పత్తి, రాజకీయ ప్రచార కార్యకలాపాల్లో భాగమైంది. శత్రు అధికారాన్ని ధ్వంసం చేసి ప్రజల అధికారాన్ని నిర్మించడంలో వారికి మద్దతుగా నిలవడమే కాక అది గెరిల్లా బేసుల్లో వ్యూహాత్మక కర్తవ్యాలను నెరవేర్చడంలో సాయుధ దన్నును అందించింది. అది శత్రు దాడుల నుండి ప్రజల రాజకీయాధికారాన్ని, విప్లవ ప్రజాసంఘాలనూ, ప్రజలనూ పరిరక్షించింది. వర్గపోరాటంలో పాల్గొంటున్న యువతను అది భర్తీ చేసుకుని వారికి శిక్షణనిచ్చింది.

రాజకీయ, మిలటరీ ఇంటలిజెన్స్ విషయంలో పార్టీ తన సైద్ధాంతిక, రాజకీయ అవగాహనను అభివృద్ధి పరుచుకుంది. దాని వెలుగులో అది శత్రు ఎల్ఐసీ వ్యూహం-ఎత్తుగడల గురించిన అధ్యయనాన్నీ, బోధననూ నడిపింది.

పిఎల్‌జిఎ గెరిల్లా జోన్లలో, ఇతర పోరాట ప్రాంతాలలో వివిధ ప్రజా మిలీషియాలను నిర్మించి ప్రజల ఆత్మరక్షణకు ప్రాథమిక నిర్మాణరూపాలుగా, పిఎల్‌జిఎ బేస్ ఫోర్సుగా వాటిని నెలకొల్పడంలో విజయం సాధించింది. ఈ దశాబ్దంలో పిఎల్‌జిఎ సాధించిన అతి పెద్ద విజయాల్లో ఒకటి మిలీషియాలోకి పెద్దెత్తున పేద రైతాంగాన్నీ (వీరిలో మెజారిటీ

ఆదివాసులే), మహిళలనూ సమీకరించడం. ఈ మిలీషియాల్లో ప్రజల సృజనాత్మకత మునుపెన్నడూ లేని విధంగా వెల్లివిరిసింది. వీటి నుండి అనేకమంది ప్రజా సైనిక నాయకులు ముందుకొచ్చారు.

శత్రు నిర్బంధాన్ని ఎదుర్కోవడానికి పార్టీ సాయుధ, నిరాయుధ ప్రజా ప్రతిఘటనను పెంపొందించడానికి పాటుపడింది. గత దశాబ్దం ఈ అంశంలో కూడా పార్టీకీ, ప్రజలకూ అపారమైన అనుభవాన్ని గడించిపెట్టింది. డికె, బిజె, లాల్‌గఢ్, నారాయణపట్నా, తెలంగాణ లు సాయుధ, నిరాయుధ ప్రజా ప్రతిఘటనలో విభిన్నమైన, అసంఖ్యాకమైన అద్భుతమైన నమూనాలను మనకందించాయి.

గత పదేండ్లలో అనేక శత్రు నిర్బంధ క్యాంపెయిన్లను ఓడించడంలో మన పార్టీ పిఎల్‌జిఎకూ, ఐక్యసంఘటనకూ సమర్థవంతంగా నాయకత్వాన్ని అందించింది. బెంగాల్-ఝార్ఖండ్‌లో, బీహార్-ఝార్ఖండ్-ఒడిషాలో, ఏవోబీలో సల్వాజుడుం, సేంద్ర, నాగరిక్ సురక్షా సమితి, శాంతి కమిటీ, హర్మద్ బాహిని మొదలైనవి నిరంతరాయంగా జరిగిన పిఎల్‌జిఎ దాడుల్లో ఓటమి పాలయ్యాయి. విప్లవ పార్టీపై పాలకవర్గాల దాడిలో భాగంగా అవి చేపట్టిన పై కుఖ్యాత విప్లవ ప్రతీఘాతుక క్యాంపెయిన్లను తిప్పికొట్టడంలో పార్టీ పిఎల్‌జిఎకీ, ఐక్యసంఘటనకూ నాయకత్వం వహించింది. బిజెలో భూస్వాముల ప్రైవేటు సైన్యాలను అదుపు చేశారు. గత దశాబ్దంలో కూడా పిఎల్‌జిఎ పేద రైతాంగానికి రక్షణగా నిలుస్తూ అటువంటి సైన్యాలు మళ్లీ తలెత్తకుండా చూసింది. ఈ విజయాలన్నిటిలోకీ ప్రముఖమైనది డికెలో సల్వాజుడుంను ఓడించడం. దీన్ని నిర్దాక్షిణ్యమైన నిర్బంధం ద్వారా, ప్రజలను నిర్బంధ శిబిరాలలోకి తోయడం ద్వారా వారిని బలప్రయోగంతో చీలదీయాలనే లక్ష్యంతో ఆరంభించారు. ఇది పిఎల్‌జిఎ చేతుల్లో చావుదెబ్బలు తిన్నది. దానికి వ్యతిరేకంగా జరిగిన సమరమంతా పెద్దెత్తున డికె ప్రజలను సమీకరించి వారిని అందులో భాగస్వాములను చేయడం ద్వారానే కొనసాగింది. ప్రజలు, ప్రత్యేకించి మహిళలు ముందుపీఠీన నిలిచి సల్వాజుడుం గూండాలను ప్రతిఘటించారు. సల్వాజుడుం ముసుగులో పాలకవర్గాలు కొనసాగించిన అత్యంత భీకరమైన దాడినొకదాన్ని ఎలా ఓడించాలనే విషయంలో డికె ప్రజలు మొత్తం దేశ ప్రజలందరి ముందు ఒక నమూనాను ఉంచారు. డికెలోని పార్టీనే కాక, దాన్ని ఓడించడానికి దేశవ్యాప్తంగా గల పార్టీ యంత్రాంగాన్నంతా వివిధ రూపాల్లో సమీకరించడం జరిగింది. దేశంలోని పార్టీ సభ్యులందరికీ దాన్ని బహిర్గతపరచడంలో, దాన్ని ఓడించడంలో, దానికి వ్యతిరేకంగా ప్రజల అభిప్రాయాన్ని కూడగట్టడంలో, దానికి మద్దతుగా సమాజంలోని ప్రజాస్వామిక శక్తుల మద్దతును సమీకరించడంలో, డికె పోరాట ప్రజలకు వివిధ సహాయాలను (వస్తురూపేణా కూడా) పంపించడంలో, అంతర్జాతీయ

మద్దతును కూడగట్టడంలోనూ కూడా పాత్ర వుండింది. ఈ విధంగా ప్రజల మీద ఆధారపడి చేసే గెరిల్లా యుద్ధాన్ని కేంద్రంగా చేసుకుని, అలాగే గెరిల్లా జోన్లలోనూ, వాటి బయటా విశాల ప్రజానీకాన్ని భాగస్వాములుగా చేసుకుని ఒక శత్రు నిర్బంధ క్యాంపెయిన్‌కు వ్యతిరేకంగా ఒక సమన్వయంతో కూడిన క్యాంపెయిన్‌ను ఎలా నడపాలనే విషయంలో మన పార్టీ ఒక అద్భుతమైన నమూనాను దేశ ప్రజల ముందుంచింది.

గత దశాబ్దంలో పిఎల్‌జిఎ (తన అన్ని రకాల బలగాలతో) విశాల ప్రజానీకంపై సంపూర్ణంగా ఆధారపడుతూ మొత్తంగా 990 చిన్న, మధ్యరకం, పెద్ద చర్యలను నిర్వహించింది, సమయబద్ధంగా టిసిఓసీలను నిర్వహించింది, అలాగే శత్రు బలగాలు మన బలగాలపై దాడి చేసినప్పుడు వాటిని ప్రతిఘటించి, శత్రు బలగాలను నిర్మూలించడం, గాయపర్చడం చేసింది. మొత్తంగా 2064 మంది శత్రు పోలీసు, పారామిలటరీ జవాన్లను హతమార్చి, 1993 మందిని గాయపర్చింది. ఇవి గాక, 169 మంది భూస్వాములనూ, పెత్తందార్లనూ, 369 మంది విప్లవ ప్రతీఘాతుక ముఠా సభ్యులనూ, అనేకమంది ఇన్ఫార్మర్‌లనూ కూడా హతమార్చింది. ఈ సాయుధ చర్యల ద్వారా పిఎల్‌జిఎ హైపవర్ రైఫిల్సు, మోర్టార్లు సహా 2109 ఆయుధాలనూ, 92,061 రౌండ్ల మందుగుండునూ, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, కమ్యూనికేషన్ సెట్లు, హెల్మెట్లు వంటి మిలటరీ పరికరాలను స్వాధీనం చేసుకుంది. ఈ చర్యలలో మనం కొందరు మిలీషియా కామ్రేడ్స్ సహా 165 మంది సాహసిక కమాండర్లనూ, యోధులనూ కోల్పోయాం. గెరిల్లా యుద్ధ సూత్రాలను సరిగ్గా, సృజనాత్మకంగా అన్వయించడం ద్వారా గెరిల్లా బలగాలు ఒక బలమైన శత్రువుపై యుద్ధం చేసి వాడికి తీవ్రమైన నష్టాలను కలిగించి పెద్దెత్తున ఆయుధాలను, మందుగుండునూ స్వాధీనం చేసుకోగలవని ఈ చర్యలు స్పష్టంగా రుజువు చేశాయి. ఆ విధంగా పార్టీ ప్రజలను సాయుధం చేసి, ప్రజాసైన్య సాయుధ శక్తిని పెంపొందిస్తుంది. ఈ విధంగా దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని కొనసాగించడం ద్వారా మనం విజయం వైపుగా పురోగమించగలం.

పార్టీ గత పదేండ్లలో డికె, బిజె, ఉత్తర తెలంగాణ, ఏవోబిల్లో ఆర్పీసీలను ఏర్పర్చడంలో, వాటిని నడపడంలో సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా నేతృత్వాన్ని అందించి పార్టీకీ, ప్రజలకూ వాటిని నడపడంలో స్వీయ అనుభవాన్ని కలుగజేసింది. తద్వారా పార్టీ దేశ ప్రజల ముందు పాలకవర్గాల భూస్వామ్య అనుకూల, దళారీ నిరంకుశ బూర్జువా అనుకూల, సామ్రాజ్యవాద అనుకూల అభివృద్ధి నమూనాకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను విజయవంతంగా నిలబెట్టింది. ఈ ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను ముందుంచడం ద్వారా అది మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం, వ్యవసాయ విప్లవ కార్యక్రమం ఆవశ్యకతను ముందుకు తెచ్చింది. మధ్య, తూర్పు భారతాల్లో పార్టీ

నాయకత్వాన, పిఎల్‌జిఎ సాయుధ దన్నుతో భారత రాజ్యాన్ని ఒక ముక్క తర్వాత ఒక ముక్కగా ధ్వంసం చేస్తూ పీడిత ప్రజలు నిర్మిస్తున్న ఈ నూతన రాజకీయాధికారం, నూతన సమాజం, నూతన అభివృద్ధి పథం ఒక ఉజ్వలమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తూ మన దేశంలోని విశాల సెక్షన్లను మరింతగా ఆకర్షిస్తూంది.

గత దశాబ్దంలో మన పార్టీ వివిధ పోరాటాల్లో ప్రజలకు విజయవంతంగా నాయకత్వం వహించి, ప్రజలకు వారి సమస్యలపై నాయకత్వం వహించడానికి అసంఖ్యాకంగా సంస్థలనూ, ఐక్యసంఘటనలనూ ఏర్పరిచింది. ఆ విధంగా పార్టీ, ప్రజలూ ఎత్తుగడలపరమైన ఐక్యసంఘటనను నిర్మించడంలో, దానిని నడపడంలో అపారమైన స్వీయ అనుభవాన్ని గడించారు. ఎత్తుగడలపరమైన ఐక్యసంఘటనా కార్యకలాపాల ద్వారా విప్లవ రాజకీయాలు విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఎత్తుగడలపరమైన ఐక్యసంఘటనలో మన పార్టీ కృషి, పోరాడే ప్రజలకు మన దేశంలో పెద్దెత్తున మద్దతు లభించడానికే కాక అంతర్జాతీయ మద్దతును కూడగట్టడానికి కూడా దారి తీసింది. అది నిరంకుశ చట్టాలకు, అమానవీయంగా, అనేక విధాలుగా ప్రజావ్యతిరేకంగా వ్యవహరిస్తున్న న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా మన దేశంలో పౌరహక్కుల ఉద్యమాన్ని నిర్మించడం ద్వారా, రాజకీయ, ఇతర ఖైదీల హక్కులకై ఉద్యమించడం ద్వారా పోరాడింది. అది మన దేశంలోని ప్రతి ఒక్క రంగం మీదా సామ్రాజ్యవాద (ప్రత్యేకించి అమెరికా) పట్టును బహిర్గతపరిచి, భారతదేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలను నిర్మించడంలో పాత్రను పోషించింది. ఈ దశాబ్దంలో మన పార్టీ భారతదేశంలోని జాతుల పోరాటాలకు, ప్రత్యేకించి కశ్మీర్, ఈశాన్య ప్రాంత జాతుల పోరాటాలకు తన మద్దతును పునరుద్ఘాటించింది.

మన పార్టీ సమాజంలోని అత్యంత పీడిత వర్గాలను, సెక్షన్లను అంటే పేద, భూమిలేని రైతాంగాన్ని, నూతన ప్రజాస్వామిక విప్లవంలోకి విజయవంతంగా సమీకరించింది. మన సైన్యంలోకి చేరిన వారిలో అత్యధిక మెజారిటీ ఈ వర్గాలకు చెందినవారే; సమాజంలో అట్టడుగు శ్రేణులకు చెందిన సెక్షన్లు అంటే ఆదివాసులు, మహిళలు, దళితులు పెద్దెత్తున పార్టీలోకి, సైన్యంలోకి, ఐక్యసంఘటనలోకి సమీకృతులయ్యారు. పార్టీలో పెద్దెత్తున మహిళలు, ఆదివాసులు వుండడం ప్రజలపై అనుకూల ప్రభావాన్ని వేసింది.

ఈ విజయాలన్నిటినీ మనం ప్రధానంగా 2012 వరకూ పొందాం. 2013 నుండి మన ఉద్యమం ఒక గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నది. మన పనికి అవరోధంగా వుంటున్న కారణాలను లోతుగా విశ్లేషిస్తూ మన పార్టీ 2013లో పార్టీని బోల్షివీకరించాలనే పిలుపునిచ్చింది. పరిస్థితులు ఎలాంటివైనాగానీ, వాటిని ఎదుర్కోవడానికి తగిన ఆయుధం మన వద్ద వున్నది. అదే మన సిద్ధాంతమైన మా-లె-మా. దానిని లోతుగా గ్రహించి ఆ

ఆయుధాన్ని మరింత దృఢంగా చేబూనుదాం; పార్టీని బోల్షివీకరించడంలోని కీలకమైన అంశం ఇదే. ఈ బోల్షివీకరణ లక్ష్యం పార్టీనీ, పిఎల్‌జిఎనీ, ప్రజాపునాదినీ బలోపేతం చేసి, ప్రజాయుద్ధాన్ని పెంపొందించడం ద్వారా ఉద్యమం ప్రస్తుతం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని అధిగమించే సామర్థ్యాన్ని అవి పొందేలా చేయడం. విప్లవాన్ని విజయం వైపుగా పురోగమింపజేయడానికి పార్టీ స్థిరమైన కృషి ద్వారా నిరంతరాయంగా తనను తాను మలుచుకోవాల్సి ఉంటుంది. ఈ క్యాంపెయిన్ ఈ దీర్ఘకాలిక క్రమంలో ఒక భాగమే. అందుకోసం ఈ కింది విధంగా చేయాల్సి ఉంటుంది.

- మా-లె-మా ను, మన పార్టీ సాధారణ రాజకీయ పంథాను లోతుగా అర్థం చేసుకుని దానికి దృఢంగా అంటిపెట్టుకుని వుండాలి; మా-లె-మా ను మన నిర్దిష్ట ఆచరణకు అన్వయించి, మన పంథాను దృఢంగా అమలు చేయాలి; మన సైద్ధాంతిక, రాజకీయ పంథా విషయంలో ఊగిసలాడకూడదు, దాన్ని బలంగా స్థాపించి, పార్టీలోనూ, బయటా వివిధ బూర్జువా సిద్ధాంతాలకూ, అవకాశవాద ధోరణులకూ వ్యతిరేకంగా పోరాడ్డం ద్వారా దానిని మరింతగా సంపద్వంతం చేయాలి;
- సరైన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపర, మిలటరీ పంథాను కలిగి ఉన్న బలమైన సంస్థగా, వ్యూహం విషయంలో దృఢంగానూ, ఎత్తుగడల విషయంలో పట్టువిడుపులతోనూ వుండే సంస్థగా, పకడ్బందీ నిర్మాణాలు గలదానిగా, సరైన పని శైలి కలిగినదిగా, కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్నీ, ఉక్కు క్రమశిక్షణనూ సరిగా అమలు చేసేదిగా, అత్యంత నిబద్ధతతో, ఉక్కు సంకల్పంతో, త్యాగనిరతితో పని చేస్తూ, సాహసోపేతంగా పోరాడేదిగా, ప్రజాస్వభావం కలదిగా, అన్ని రకాల శత్రు కుట్రలను, అతివాద, మితవాద ప్రమాదాలను విజయవంతంగా ఓడించడం ద్వారా తన నాయకత్వాన్నీ, శక్తులనూ కాపాడుకునేదిగా, అపారమైన కష్టాలను ఎదుర్కొంటూ, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ క్రమంలోని మలుపుల గుండా ప్రయాణిస్తూ కాకలు తీరే సంస్థగా మనం మన పార్టీని అభివృద్ధి చేయాలి;
- ప్రధాన నిర్మాణరూపంగా పిఎల్‌జిఎకి చెందిన మూడు బలగాలను మరింతగా నిర్మించడం; దాని పోరాట నైపుణ్యాల్ని, సామర్థ్యాల్ని మరింతగా పెంపొందించడం; ప్రధానంగా శత్రువు నుండి ఆయుధాలను స్వాధీనం చేసుకోవడం ద్వారా దాని ఫైర్‌పవర్‌ను పెంచడం; దానికి మరింత మెరుగ్గా శిక్షణ నివ్వడం; దాని కమాండ్‌ను, కంట్రోల్‌ను, కో-ఆర్డినేషన్, ఇంటలిజెన్స్ లను అభివృద్ధి చేయడం, తద్వారా దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని విజయవంతంగా పురోగమింపజేయడం కోసం దాన్ని

మరింత శక్తివంతమైన, బలమైన ప్రజాసైన్యంగా మార్చడం;

- రాజకీయ, మిలటరీ పంథాను సరిగా అమలు చేస్తూ విశాల ప్రజానీకాన్ని దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలోకి సమీకరిస్తూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సరైన ఎత్తుగడలను రూపొందించి అమలు చేయడం ద్వారా ప్రజలు దాని అగ్రగామి పాత్రను ఆమోదించి దాని కింద సమీకృతులయ్యేలా చేయాలి;
- కార్మికవర్గ నాయకత్వం కింద మన దృఢమైన మిత్రులైన రైతుకూలీ, పేద రైతాంగాన్ని, నమ్మదగిన మిత్రులైన పెటీ బూర్జువా వర్గాన్నీ, ఊగిసలాడే మిత్రులైన ధనిక రైతుల్నీ, జాతీయ బూర్జువాలనూ (వీరిలోని ఒక సెక్షన్‌ను గెలుచుకోవడం, ఒక సెక్షన్‌ను తటస్థం చేయడం, ఒక సెక్షన్‌ను వేరుపరచడం చేయాలి) సమీకృతం చేయడం ద్వారా మన ప్రజాపునాది బలాన్ని పెంచుకుని, మన శత్రువులను ఒకరి తర్వాత ఒకరిగా ఓడిస్తూ, శత్రువుల మధ్య వైరుధ్యాలను వినియోగించుకోవడం ద్వారా ప్రధాన శత్రువుపై కేంద్రీకరించడం అవసరం. వర్గపంథానూ, ప్రజాపంథానూ అమలు చేయడం ద్వారా, ప్రజలతో దగ్గరగా మమేకం అవుతూ 'ప్రజలే చరిత్ర నిర్మాతలు' అనే మార్క్సిస్టు సూత్రాన్ని ఆచరణలో సాధించడం ద్వారా ఈ అన్ని వర్గాల ప్రజలనూ సమీకృతం చేసే సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా మాత్రమే మనం దీన్ని సాధించగలం.
- పార్టీ నిజాయితీగా తన తప్పులనూ, లోపాలనూ, బలహీనతలనూ ఆమోదిస్తూ, వాటిని సరి చేసుకుంటూ, ఆచరణ నుండి నేర్చుకోవడం ద్వారా అవి మళ్లీ జరగకుండా చూసుకోవాలి.

మన ప్రస్తుత గడ్డు పరిస్థితిని అధిగమించి విప్లవాన్ని పురోగమింపజేయడానికి నిర్దిష్ట లక్ష్యాలను సాధించేలా మనం రెండేళ్లపాటు ఈ క్యాంపెయిన్‌ను ప్రణాళికాబద్ధంగా నడపాలి. మనం వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా అన్ని స్థాయిల్లో నిర్దిష్ట కార్యక్రమాన్ని అమలు జరపాలి. మనం దీని గురించి కమిటీ సమావేశాల్లో చర్చించి ఈ క్యాంపెయిన్‌ను సీరియస్‌గా నడపడానికి అవసరమైన నిర్ణయాలను తీసుకోవాలి. ఈ క్యాంపెయిన్‌ను విజయవంతంగా నడపడం అంటే -

- పార్టీ లోపల, ప్రత్యేకించి నూతన శక్తుల్లో కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథాన్ని మెరుగుపర్చడం కోసం మా-లె-మా సైద్ధాంతిక అధ్యయనాన్ని పెంచుకోవడం;
- మొత్తం పార్టీ, పార్టీలోని ప్రతి యూనిట్టూ నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యం విషయంలో, ప్రస్తుత తరుణంలో మనం సాధించాల్సిన నిర్దిష్ట టార్గెట్ల విషయంలో

అత్యంత స్పష్టమైన అవగాహనను కలిగి ఉండడం;

- మావో బోధించిన మూడు పాయింట్ల పని శైలిని లోతుగా అర్థం చేసుకుని మన పని శైలిని మెరుగుపర్చుకోవడం;
- ప్రజలతో దృఢంగా సమైక్యం కావడం ద్వారా పార్టీ తన ప్రజాపునాదిని బలోపేతం చేసుకుని రైతాంగాన్ని వ్యవసాయ విప్లవ యుద్ధంలోకి సమీకరించడానికి ప్రాధాన్యతను ఇవ్వడం, విశాల రైతాంగేతర ప్రజానీకంలో, పట్టణ ప్రజానీకంలో ప్రత్యేక కృషిని చేపట్టడంతో పాటు వివిధ ఆర్థిక, రాజకీయ, ఇతర పోరాటాలలోకి ప్రజలను సమీకరించడం;
- మారుతున్న సామాజికార్థిక, రాజకీయ, సాంస్కృతిక స్థితిగతుల అధ్యయనాన్ని పెంచుకుని వాటికనుగుణంగా ఎత్తుగడలను మార్చుకుంటూ తద్వారా ఉద్యమాన్ని విజయవంతంగా అభివృద్ధి చేయడం;
- రహస్య పార్టీ నిర్మాణం, పని విధానం విషయంలో మన అవగాహనను మెరుగుపర్చుకోవడంతో పాటు, ఈ పనిలోనూ, గెరిల్లా యుద్ధ కార్యాచరణ సూత్రాలను అమలు చేయడంలో జరుగుతున్న లోపాలను వెంటనే సరిచేసుకోవడం;
- పార్టీ, సైన్యం, ప్రజాసంఘాలు-ఐక్యసంఘటన ల సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపర, మిలటరీ స్థాయిలను పెంచుకోవడానికి తగిన శిక్షణను గరిపి వాటి గుణాన్ని (క్వాలిటీ) మెరుగుపర్చడం;
- పార్టీలో కొనసాగుతున్న కార్మికవర్గేతర ధోరణులను సరిచేసుకోవడంతో పాటు, వీటికి వ్యతిరేకంగా పోరాడ్డంలో పార్టీ చైతన్యాన్ని, జాగరూకతను పెంచడం, తద్వారా ఆలోచనలో, ఆచరణలో ఏకతను, క్రమశిక్షణను పెంపొందిస్తూ వాటిని బలోపేతం చేయడం;
- విప్లవ క్రమంలో ఎదురయ్యే గడ్డు పరిస్థితులను, ప్రమాదాలను ఎదుర్కొనే చైతన్యాన్ని ప్రదర్శించగలగడం;
- శత్రువుతో సాహసోపేతంగా పోరాడగల సంసిద్ధతను పెంచడం;
- శత్రువు సాగించే అత్యంత క్రూరమైన దాడుల నుండి మన స్వీయాత్మక శక్తులను, ప్రత్యేకించి ఉన్నతస్థాయి నాయకత్వాన్ని ఉద్యమాన్ని కాపాడుకోగలగడం.

ప్రస్తుత బోల్షివీకరణ క్యాంపెయిన్ ద్వారా వీటిని సాధిస్తూ మాత్రమే మనం

ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని అధిగమించి నూతన విజయాలకు పునాదిని ఏర్పర్చగల్గుతాం.

**కామ్రేడ్స్,**

ప్రపంచ స్థాయిలో ప్రధాన వైరుధ్యమైన సామ్రాజ్యవాదానికీ, పీడిత జాతులకూ, ప్రజలకూ మధ్య వైరుధ్యం, ఇతర రెండు మౌలిక వైరుధ్యాలూ రోజురోజుకూ పదునెక్కుతూ దేశంలోనూ, ప్రపంచంలోనూ వస్తుగత పరిస్థితి మరింత అనుకూలంగా మారుతోంది. అన్ని రకాల సామాజిక వైరుధ్యాలు పదునెక్కుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రజలు వాటిని పరిష్కరించుకోవడానికి విప్లవ మార్గానికి దగ్గరౌతున్నారు. ఈ అద్భుతమైన వస్తుగత పరిస్థితిని గ్రహించి, ప్రజలను క్రియాశీలంగా, విస్తృతంగా ప్రజాయుద్ధంలోకి సమీకరించి, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం, విస్తృతం చేయడం ద్వారా విప్లవాన్ని పురోగమింపజేయడమే నేటి అవసరం. మనం నష్టాలను పొంది బలహీనపడినప్పటికీ ఈ కింది అనుకూలతల గురించి మనం మరువగూడదు. ఏపి, తెలంగాణ సరిహద్దుల నుండి మొదలుకొని లాల్‌గఢ్ వరకు, గంగానది దక్షిణ భాగం వరకు గల లక్షలాది చదరపు కిలోమీటర్ల ఒక విశాల భూభాగంలో - కోట్లాది ప్రజలు నివసించే ఈ ప్రాంతంలో, మన నిర్మాణ కృషి సుదీర్ఘకాలంగా కొనసాగుతూ వస్తున్న ఈ ప్రాంతంలో, వర్గపోరాటంలో ప్రజలు విస్తృతమైన స్వీయ అనుభవాన్ని గడించిన ఈ ప్రాంతంలో, ప్రజలు కనీసం కొన్ని చోట్ల తమ స్వంత రాజకీయాధికారాన్ని చవి చూసిన ఈ ప్రాంతంలో - ప్రజాయుద్ధ అభివృద్ధికి గల అనుకూల వస్తుగత, స్వీయాత్మక పరిస్థితులను సంపూర్ణంగా వినియోగించుకోవడానికి మనం కృషి చేయాలి. ఇది మనకు గల ఒక బలమైన అంశం. మన ఉద్యమాన్ని పరిరక్షించుకుని దాన్ని అభివృద్ధి చేయడానికి మనం దీనిపై ఆధారపడుతూ దీనిలోని సంభావ్యతలన్నిటినీ (పొటెన్షియల్) సంపూర్ణంగా వినియోగించుకోవాలి. పశ్చిమ కనుమల్లో ఒక నూతన ఫ్రంటును మనం తెరిచాం. ఇది వ్యూహాత్మక ప్రాధాన్యతను, ఒక విశాల ప్రాంతంలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయగల గొప్ప అవకాశాన్ని కలిగి వున్నది. ఈ విధంగా మనం ఇటీవల ఎదుర్కొన్న ప్రతికూల పరిస్థితిని అధిగమించి మన ఐక్యతా కాంగ్రెస్ నిర్దేశించిన కర్తవ్యాలను నెరవేర్చే దిశగా పురోగమించగల్గుతాం.

మనం నేడు ఎదుర్కొంటున్న స్థితిని అధిగమించడానికి మనం మన స్వీయాత్మక శక్తులను పరిరక్షించుకోవాలి, వాటిని సంఘటితం చేయాలి, మన ప్రజాపునాదిని బలోపేతం చేయాలి, తద్వారా దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని మరింత శక్తివంతంగా పురోగమింపజేయాలి. మోడీ అధికారంలోకి వచ్చాక ఏర్పడిన నూతన పరిస్థితిని మనం ఈ దిశలో వినియోగించుకోవాలి. ప్రస్తుత పరిస్థితి సీరియస్ సవాళ్లను మన ముందుంచుతోంది,

అయితే అది అంతకంటే ఎక్కువ అవకాశాలను కూడా మన ముందుకు తెస్తున్నది. మనం ధైర్యంగా వివిధ పీడిత వర్గాలలోకీ, సెక్షన్లలోకీ మరింత లోతుగా, విస్తృతంగా వెళ్లాలి, వారిని రాజకీయంగా సమీకరించాలి, వారిని పోరాటంలో ఐక్యం చేయాలి. మోడీ ప్రభుత్వం చేపట్టే ప్రతి ఒక్క ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక విధానానికీ, చర్యకూ వ్యతిరేకంగా మనం ప్రతిస్పందించాలి, నిరంతరాయంగా వాటిని బహిర్గతపరచాలి, ప్రజలను వాటికి వ్యతిరేకంగా పోరాటాలలోకి సమీకరించాలి, వాటిని దేశంలో కొనసాగుతున్న దీర్ఘకాలిక ప్రజాయుద్ధంతో అనుసంధానించడానికి కృషి చేయాలి. గెరిల్లా యుద్ధ కార్యాచరణ సూత్రాలను సృజనాత్మకంగా అన్వయిద్దాం. ప్రజలతో లోతుగా మమేకం అవుతూ వారిని దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో విస్తృతంగా సమీకరిద్దాం. బోల్షవీకరణ క్యాంపెయిన్‌ను విజయవంతంగా కొనసాగించడం ద్వారా మన లోపాలను, బలహీనతలనూ పోగొట్టుకుని బలోపేతం అవుదాం. అవకాశాలను చొరవతో వినియోగించుకోవడానికి మన సర్వస్వాన్నీ ఒడ్డి కృషి చేద్దాం.

కాలం చెల్లిన అభివృద్ధి నిరోధక పాలకులు చావుకు దగ్గర పడ్డప్పుడు మరింత క్రూరంగా మారతారు అనేది చరిత్ర నేర్పిన ఒక పాఠం. సామ్రాజ్యవాద వ్యవస్థ ఇప్పటికీ యింకా ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభం పట్టులోనే గిలగిలలాడుతోంది. ఇది భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావాన్ని వేస్తోంది. ఈ సంక్షోభ స్థితి ప్రజాశత్రువులను, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలను, భారత దళారులను మన దేశ వనరులను దోచుకోవడానికీ, శ్రామిక ప్రజలను సంపూర్ణంగా దోచుకోవడానికీ మరింత బరితెగించి వ్యవహరించేలా చేస్తోంది. అయితే దేశాన్ని అమ్మివేసే ఈ విధానాల దుష్ప్రభావాలు రోజురోజుకూ మరింత ప్రస్ఫుటమవుతున్నాయి.

చరిత్ర అందించిన మరొక పాఠం కూడా వుంది. ఒక చిన్న శక్తి ఒక పెద్ద శక్తిని ఓడించగలదు. ఇది ప్రపంచవ్యాప్తంగా అనేక విప్లవ యుద్ధాల సందర్భంగా పదే పదే రుజువవుతూ వచ్చింది.

**కామ్రేడ్స్!**

మన కేంద్రకమిటీ అన్ని పార్టీ యూనిట్లకూ, కామ్రేడ్స్‌కూ మన పార్టీ పదవ స్థాపనా వార్షికోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిస్తోంది. నూతన పార్టీ వివిధ రంగాల్లో గడించిన విజయాలను, అనుకూల, ప్రతికూల అనుభవాలనూ, విప్లవాన్ని పురోగమింపజేయడానికి మన ముందున్న కర్తవ్యాలనూ పార్టీ, పిఎల్‌జిఎ, ప్రజాసంఘాలు, ఆర్పీసీలు, ప్రజల ముందు ఉంచి వారిని విద్యావంతం చేయడానికి ఈ సందర్భాన్ని

సంపూర్ణంగా వినియోగించుకోవాలి. మన ప్రియతమ అమరుల కలల్ని సాకారం చేసే లక్ష్యంతో మనం నిర్దేశించుకున్న కర్తవ్యాలను పరిపూర్తి చేయడానికి దృఢనిశ్చయంతో పని చేయాలని మన సిసి మీకు పిలుపునిస్తోంది. మన పార్టీ పదవ స్థాపనా వార్షికోత్సవాలను మన పార్టీ యూనిట్లు ఉన్న ప్రాంతాలన్నిటా ప్రజలను పెద్దెత్తున సమీకరిస్తూ, మనం నిర్ణయించుకున్న అన్ని కార్యక్రమాలనూ, ప్రచార కార్యకలాపాలనూ విప్లవోత్సాహంతో విజయవంతంగా అమలు చేస్తూ జరుపుకుందాం. బోల్షవీకరణ క్యాంపెయిన్‌లో విప్లవోత్తేజంతో పాల్గొనాలనే, మన ప్రజాపునాదిని పెంచుకోవాలనే, గెరిల్లా యుద్ధతంత్రం ద్వారా శత్రువును ప్రతిఘటించాలనే, మన స్వీయాత్మక శక్తులను సంరక్షించుకోవాలనే దృఢసంకల్పాన్ని కార్యకర్తలలో, ప్రజలలో నింపేందుకు ఈ సందర్భాన్ని వినియోగించుకుందాం. మనం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని అధిగమించి పురోగమించడానికి మన గొప్ప అమరుల ఆదర్శాలను గ్రహిద్దాం, ఆచరిద్దాం.

మన విప్లవాన్ని విజయం వైపుగా పురోగమింపజేయడానికి, ప్రపంచ సోషలిస్టు విప్లవంలో మన వంతు బాధ్యతను నెరవేర్చి సోషలిజం వైపుగా, అంతిమంగా కమ్యూనిజం వైపుగా పురోగమించడానికి గాను గత దశాబ్ద కాలంలోని మన అనేక అనుకూల అనుభవాల నుండి, కొన్ని ప్రతికూల అనుభవాల నుండి నేర్చుకుంటూ, ఒక బలమైన విప్లవ పార్టీని నిర్మించడానికి కృషి చేద్దాం. భారత విప్లవ అగ్రగామిగా మన పాత్రను పరిపూర్తి చేయడంలో మనల్ని మనం మరింత సమర్థవంతంగా రూపొందించుకోవడానికి "స్వార్థానికి వ్యతిరేకంగా పోరాడదాం, రివిజనిజాన్ని ఓడిద్దాం" అనే మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ పిలుపును అన్వయించుకుందాం.

మా-లె-మా తో సాయుధమై, ప్రజల అసహ్యాన్ని మూటగట్టుకున్న ఈ మానవ హనన వ్యవస్థను ధ్వంసం చేసే ఉక్కు సంకల్పాన్ని కలిగి వుండి, ప్రజలతో దృఢంగా, లోతుగా సంబంధాలను కలిగి వుంటే మనం అజేయులమే. పార్టీ నాయకత్వాన కదిలే ప్రజలు అద్భుతాలను సృష్టిస్తారని మావో మనకు బోధించి వున్నాడు. ఈ విషయాన్ని మనం మన ఆచరణలో కూడా చూశాం. ప్రజల విప్లవ సృజనాత్మకత, శక్తి ఎల్లలు లేనివి. శత్రు సాయుధ బలాన్ని చూసి ఏమాత్రం వెరవకుండా సృజనాత్మక ప్రతిఘటనా పద్ధతులను చేపడుతూ, శత్రువును వెనక్కి నెడుతున్న వారి ఆచరణలో ఇది మరోసారి రుజువు కావడం మనం చూస్తున్నాం. వారి సృజనాత్మకత నుండి, దృఢసంకల్పం నుండి పాఠాలను వెలికితీద్దాం. మన మహోపాధ్యాయుల నుండి మార్గదర్శకత్వాన్ని పొందుదాం. మన గొప్ప అమరుల నుండి స్ఫూర్తిని పొందుదాం.

మనం సైద్ధాంతిక-రాజకీయ-మిలటరీ-నిర్మాణపర-సాంస్కృతిక స్థాయిలను పెంపొందించుకుందాం. ప్రజలలోకి లోతుగా చొచ్చుకుని పోదాం. 'మరింత గొప్ప, మెరుగైన, వేగవంతమైన, పొదుపైన' ఫలితాలను పొందే లక్ష్యంతో మన పోరాటశక్తిని మెరుగుపరుచుకుందాం. విజయం మనదే, ఎందుకంటే మనం ప్రజలకు సేవ చేస్తున్నాం. విజయం మనదే, ఎందుకంటే మన విప్లవ యుద్ధం న్యాయమైనది.

**విప్లవాభినందనలతో,**

**కేంద్ర కమిటీ**

**సిపిఐ(మావోయిస్టు)**

***10-9-2014***

"ఆస్తిపర వర్గాలు గతంలో ఏర్పరచిన పాత పార్టీలను వ్యతిరేకించే, వాటికి పూర్తిగా భిన్నంగా ఉండే ఒక రాజకీయ పార్టీగా కార్మికవర్గం సంఘటితమైతే తప్ప అది ఒక వర్గంగా ఆస్తిపర వర్గాల ఈ సంయుక్త బలాన్ని ఎదుర్కోజాలదు."

- మార్క్స్, ఏంగెల్స్.

"స్వతంత్రమైన, రాజీతత్వంలేని విప్లవ కార్మికవర్గ మార్క్సిస్టు పార్టీలో మాత్రమే సోషలిజం విజయం చెందాలనే, ఎలాంటి ఊగిసలాటలు లేకుండా విజయం వైపు ముందడుగు వేయాలనే ఏకైక దృఢనిశ్చయాన్ని చూస్తాము."

"ఒక పార్టీ కార్మికుల నిజమైన రాజకీయ పార్టీ అవునా కాదా అనేది కేవలం ఆ పార్టీలో ఉన్న కార్మికుల సభ్యత్వ సంఖ్యపై మాత్రమే కాక, ఆ పార్టీకి నాయకత్వం వహించి నడిపే వ్యక్తుల పైనా, దాని చర్యల-రాజకీయ ఎత్తుగడల సారంపైనా ఆధారపడి ఉంటుంది. కేవలం ఈ వెనుక చెప్పింది మాత్రమే మన ముందు నిజంగా కార్మికవర్గ రాజకీయ పార్టీ ఉందా లేదా అనేది నిర్ణయిస్తుంది."

"అంతర్యుద్ధ కాలంలో పోరాడే పార్టీయే కార్మికవర్గానికి ఆదర్శం."

- లెనిన్

"ఈ నూతన దశ వర్గాలు బహిరంగ ఘర్షణలకు దిగే, కార్మికవర్గం విప్లవ చర్యలు చేపట్టే, కార్మికవర్గ విప్లవదశ. సామ్రాజ్యవాదాన్ని కూలదోసేందుకు, కార్మికవర్గం అధికారం గుంజుకునేందుకు బహిరంగంగానే శక్తులన్నీ సమకూడబడే దశ ఇది. ఈ దశలో కార్మికవర్గానికి నూతన కర్తవ్యాలు ఎదురౌతాయి........ అందువల్ల పోరాటచేవ, విప్లవతత్వం కలిగి, అధికారం గుంజుకునే పోరాటంలో కార్మికవర్గానికి నాయకత్వం వహించి నడిపే ధైర్యం కలిగిన, విప్లవ కాలపు సంక్లిష్ట పరిస్థితుల్లో తన దిశను గుర్తించే అనుభవశాలీ, తన లక్ష్యాన్ని చేరే దారిలో మునిగి ఉన్న బండరాళ్లను తప్పించుకొని నడపగలిగే ప్రావీణ్యం కలిగిన నూతన పార్టీ ఆవశ్యకత ఉంది." - స్టాలిన్

"విప్లవం జరగాలంటే, విప్లవ పార్టీ ఒకటి ఉండి తీరాలి. ఒక విప్లవ పార్టీ లేకుండా, మార్క్సిస్టు-లెనినిస్టు విప్లవ సిద్ధాంతంపైనా, మార్క్సిస్టు-లెనినిస్టు విప్లవశైలి పైనా నిర్మించబడ్డ ఒక పార్టీ లేకుండా, సామ్రాజ్యవాదాన్ని, దాని కావలికుక్కలను ఓడించేందుకై కార్మికవర్గానికి, విశాల ప్రజాబాహుళ్యానికి నాయకత్వం వహించటం సాధ్యం కాదు." - మావో